శుక్రవారం 19-1-2018

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20+20 వెల: ₹ 5.00
సంపుటి: 10
సంచిక: 298



'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'



కిరీటధారి కోహ్లి

- ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా ఎంపిక
- వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు కూడా
- కెప్టెన్‌గా అరుదైన గౌరవం
- టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా స్మిత్
- సర్ గార్‌ఫీల్డ్ సోబర్స్ అవార్డుకు ఎంపిక కావడం గొప్పగా అనిపిస్తోంది: కోహ్లి

– స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి స్పోర్ట్స్
శుక్రవారం 19-1-2018



సంయుక్త ఆధిక్యంలో విశ్వనాథన్ ఆనంద్

ప్రతిష్టాత్మక టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో ఐదు రౌండ్‌లు ముగిశాక భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ 3.5 పాయింట్లతో సంయుక్తంగా ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. నెదర్లాండ్స్‌లోని విక్ ఆన్ జీ పట్టణంలో జరుగుతున్న ఈ టోర్నీలో వీ యి (చైనా)తో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌ను ఆనంద్ 29 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ప్రస్తుతం ఆనంద్‌తోపాటు అనీశ్ గిరి (నెదర్లాండ్స్), మమెద్యరోవ్ (అజర్‌బైజాన్) 3.5 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉన్నారు.



కోహ్లికే కిరీటం

ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా ఎంపిక ● వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు కూడా

రెండు జట్లకూ కెప్టెన్‌గా అరుదైన గౌరవం ● టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా స్మిత్

దుబాయ్: గత రెండేళ్లుగా పరుగుల వరద పారిస్తూ ప్రపంచ క్రికెట్‌పై ఆధిపత్యం ప్రదర్శిస్తున్న భారత కెప్టెన్ విరాట్ కోహ్లికి సముచిత బహుమతి లభించింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించిన వార్షిక అవార్డుల్లో కోహ్లి 'ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపికయ్యాడు. దిగ్గజ ఆల్‌రౌండర్ సర్ గార్‌ఫీల్డ్ సోబర్స్ పేరిట ఇచ్చే ఈ అవార్డును తొలిసారి కోహ్లి అందుకోనున్నాడు. భారత్ తరఫున గతంలో ద్రవిడ్, సచిన్, అశ్విన్ దీనిని గెల్చుకున్నారు. ఇక 50 ఓవర్ల ఫార్మాట్‌లో తిరుగులేని ప్రదర్శన కనబర్చి ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచిన కోహ్లి 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు కూడా గెలుచుకున్నాడు. ఐసీసీ టెస్టు, వన్డే జట్లలో స్థానం లభించడంతోపాటు ఆ రెండు టీమ్‌లకు కూడా అతనే కెప్టెన్‌గా ఎంపిక కావడం కోహ్లికి లభించిన మరో అరుదైన గౌరవం. మరో ప్రధాన అవార్డు ఐసీసీ 'టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్‌కు లభించింది. ఇంగ్లండ్‌పై భారత యువ లెగ్‌స్పిన్నర్ యజువేంద్ర చహల్ బౌలింగ్ (6/25) 2017 టి20 అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది. ఎమర్జింగ్ క్రికెటర్ అవార్డు హసన్ అలీ (పాకిస్తాన్)కు దక్కగా... అఫ్ఘానిస్తాన్ సంచలనం రషీద్ ఖాన్ అసోసియేట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా ఎంపికయ్యాడు.

పరుగుల ప్రవాహం...

అవార్డు ఎంపికకు సెప్టెంబర్ 21, 2016 నుంచి డిసెంబర్ 31, 2017 మధ్య కాలాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. ఈ సమయంలో కోహ్లి 18 టెస్టుల్లో 77.80 సగటుతో 2,203 పరుగులు సాధించాడు. వీటిలో ఎనిమిది సెంచరీలు (ఆరు డబుల్ సెంచరీలు), మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 31 వన్డేల్లో 82.63 సగటుతో 1,818 పరుగులు సాధించాడు. ఏడు సెంచరీలు అతని ఖాతాలో ఉన్నాయి. వీటికి తోడు టి20ల్లో 153 స్ట్రయిక్‌రేట్‌తో 299 పరుగులు కూడా చేశాడు. మరోవైపు స్టీవ్ స్మిత్ ఇదే సమయంలో 16 టెస్టుల్లో 78.12 సగటుతో 1,875 పరుగులు చేసి టెస్టు క్రికెటర్ అవార్డును సొంతం చేసుకున్నాడు. స్మిత్ మొత్తం ఎనిమిది సెంచరీలు, ఐదు అర్ధ సెంచరీలు సాధించాడు. కోహ్లి గతంలో 2012లో 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును గెలుచుకున్నాడు.



స్మిత్

మరో నలుగురు...

ఐసీసీ టెస్టు ఎలెవన్, వన్డే ఎలెవన్ జట్లను కూడా ప్రకటించింది. టెస్టు జట్టులో భారత్ తరఫున చతేశ్వర్ పుజారా, రవిచంద్రన్ అశ్విన్‌లకు చోటు లభించింది. మూడో డబుల్ సెంచరీతో చెలరేగిన రోహిత్ శర్మ, పేస్ అస్త్రం జస్‌ప్రీత్ బుమ్రా వన్డే టీమ్‌లోకి ఎంపికయ్యారు. వార్నర్, స్టోక్స్, డి కాక్ రెండు జట్లలోనూ ఉన్నారు.

ఐసీసీ టెస్టు ఎలెవన్: కోహ్లి (కెప్టెన్), ఎల్గర్, వార్నర్, స్మిత్, పుజారా, స్టోక్స్, డి కాక్, అశ్విన్, స్టార్క్, రబడ, అండర్సన్.

ఐసీసీ వన్డే ఎలెవన్: కోహ్లి (కెప్టెన్), వార్నర్, రోహిత్ శర్మ, బాబర్ ఆజమ్, డివిలియర్స్, డి కాక్, స్టోక్స్, బౌల్ట్, హసన్ అలీ, రషీద్ ఖాన్, బుమ్రా.

తొలిసారి సర్ గార్‌ఫీల్డ్ సోబర్స్ అవార్డుకు ఎంపిక కావడం గొప్పగా అనిపిస్తోంది. ప్రపంచ క్రికెట్‌లో ఇది అతి పెద్ద అవార్డు. వరుసగా రెండేళ్లు దీనిని భారత ఆటగాళ్లే (గత ఏడాది అశ్విన్) గెలుచుకోవడం మరింత ప్రత్యేకంగా ఉంది. దీనిని సొంతం చేసుకోవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. 2016 సంవత్సరం నా కెరీర్‌లో కీలక మలుపు. ఆ జోరును తర్వాతి ఏడాది కూడా కొనసాగిస్తూ మరింత ఎక్కువగా కష్టపడ్డాను. కాబట్టి 2017కు నా మనసులో ప్రత్యేక స్థానం ఉంది. నా దృష్టిలో ఇది నా అత్యుత్తమ దశ. భవిష్యత్తులో కూడా ఇంత బాగా ఆడేందుకు మరింతగా కష్టపడతాను. మా జట్టు తరఫున మంచి ప్రదర్శన ఇచ్చేందుకు మేం పడిన శ్రమను గుర్తించినందుకు ఐసీసీకి నా కృతజ్ఞతలు. ఇతర విజేతలకు కూడా నా అభినందనలు.

- విరాట్ కోహ్లి స్పందన

గతంలో ఐసీసీ అవార్డులు గెలుచుకున్న భారత ఆటగాళ్లు...

- రాహుల్ ద్రవిడ్ (క్రికెటర్ ఆఫ్ ద ఇయర్, టెస్టు క్రికెటర్ – 2004)
- యువరాజ్ సింగ్ (టి20 పెర్ఫార్మెన్స్ ఆఫ్ ద ఇయర్ – 2008)
- మహేంద్ర సింగ్ ధోని (వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్– 2008, 2009; స్పిరిట్ ఆఫ్ క్రికెట్–2011, పీపుల్స్ చాయిస్ అవార్డ్ – 2013)
- గౌతం గంభీర్ (టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్– 2009)
- సచిన్ టెండూల్కర్ (క్రికెటర్ ఆఫ్ ద ఇయర్, పీపుల్స్ చాయిస్ అవార్డ్–2010)
- వీరేంద్ర సెహ్వాగ్ (టెస్టు క్రికెటర్ ఆఫ్ ఇయర్–2010)
- విరాట్ కోహ్లి (వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్–2012)
- చతేశ్వర్ పుజారా (ఎమర్జింగ్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్–2013)
- భువనేశ్వర్ కుమార్ (పీపుల్స్ చాయిస్ అవార్డ్–2014)
- రవిచంద్రన్ అశ్విన్ (క్రికెటర్ ఆఫ్ ద ఇయర్, టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్–2016)
- 2007లో జులన్ గోస్వామి ఐసీసీ ఉమెన్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు దక్కించుకోగా... 2010లో ఐసీసీ టెస్టు టీమ్ ఆఫ్ ద ఇయర్‌గా భారత్ ఎంపికైంది.







కోహ్లి @ 900

ఐసీసీ రేటింగ్ పాయింట్లలో అరుదైన ఘనత

దుబాయ్: ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా నిలిచిన రోజే విరాట్ కోహ్లి మరో అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. గురువారం ప్రకటించిన టెస్టు ర్యాంకింగ్స్‌లో అతను తొలిసారి 900 రేటింగ్ పాయింట్లు సాధించాడు. దిగ్గజ బ్యాట్స్‌మన్ సునీల్ గావస్కర్ (916 పాయింట్లు–1979లో) తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారత ఆటగాడిగా కోహ్లి నిలిచాడు. తాజా పాయింట్లతో అతను వరల్డ్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుతం 947 పాయింట్లతో స్మిత్ నంబర్‌వన్‌గా కొనసాగుతున్నాడు. గత వారం 880 పాయింట్లతో ఉన్న కోహ్లి సెంచూరియన్ టెస్టులో 153 పరుగులు సాధించడంతో అతని ఖాతాలో మరో 20 పాయింట్లు చేరాయి. ఇంగ్లండ్‌పై 1979 (ఓవల్)లో తన 50వ టెస్టులో 221 పరుగులు సాధించినప్పుడు గావస్కర్ 916 పాయింట్లకు చేరుకున్నాడు. గతంలో భారత ఆటగాళ్లు సచిన్ (898), ద్రవిడ్ (892) ఈ మార్క్‌కు చేరువగా వచ్చినా దానిని అందుకోలేకపోయారు. ఓవరాల్‌గా 900 రేటింగ్ పాయింట్ల మైలురాయిని అందుకున్న 31వ బ్యాట్స్‌మన్ కోహ్లి. డాన్ బ్రాడ్‌మన్ 961 పాయింట్లతో ఆల్‌టైమ్ టాప్‌గా నిలిచాడు. బ్యాటింగ్ టాప్–10లో భారత్ తరఫున పుజారా (ఆరో స్థానం), బౌలర్ల జాబితాలో జడేజా (3), అశ్విన్ (5) కొనసాగుతున్నారు. ఆల్‌రౌండర్ల జాబితాలో జడేజా 2, అశ్విన్ మూడో స్థానంలో ఉన్నారు.

మరో విజయమే లక్ష్యంగా...

అండర్–19 ప్రపంచకప్‌లో నేడు జింబాబ్వేతో భారత్ పోరు

మౌంట్ మాంగనీ: వరుస విజయాలతో అండర్–19 ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్‌కు చేరిన భారత యువ జట్టు శుక్రవారం తమ చివరి లీగ్ మ్యాచ్‌లో జింబాబ్వేతో తలపడనుంది. తొలి మ్యాచ్‌లో పటిష్ట ఆస్ట్రేలియాను మట్టి కరిపించిన పృథ్వీ షా బృందం రెండో మ్యాచ్‌లో పసికూన పపువా న్యూ గినియాపై ఘన విజయం సాధించి మంచి ఊపుమీద ఉంది. ఇదే వరుసలో జింబాబ్వేపై గెలుపొంది అజేయంగా నాకౌట్‌కు వెళ్లాలని భారత జట్టు భావిస్తోంది. ఇప్పటికే గ్రూప్ 'బి' నుంచి భారత్, ఆస్ట్రేలియా జట్లు రెండు విజయాలతో క్వార్టర్స్‌కు చేరుకున్నాయి.

ఉదయం 6.30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

బెల్జియం చేతిలో భారత్ ఓటమి

తౌరంగ (న్యూజిలాండ్): నాలుగు దేశాల అంతర్జాతీయ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. బెల్జియంతో గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 0–2తో ఓటమి పాలైంది. భారత్‌కు నాలుగు పెనాల్టీ కార్నర్‌లు వచ్చినా ఫలితం లేకపోయింది. బెల్జియం తరఫున సెబాస్టియన్ డాకీర్ (8వ ని.లో), విక్టర్ వెగ్‌నెజ్ (34వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. భారత్ తమ తదుపరి లీగ్ మ్యాచ్‌లో శనివారం న్యూజిలాండ్‌తో తలపడనుంది.

రెండు రోజుల ముందుగా లంకలో ముక్కోణపు సిరీస్

మార్చి 6 నుంచే ఇండిపెండెన్స్ కప్

న్యూఢిల్లీ: శ్రీలంక 70వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించనున్న 'ఇండిపెండెన్స్ కప్' ముక్కోణపు టి20 సిరీస్ షెడ్యూల్‌ను కాస్త ముందుకు జరిపారు. తొలుత అనుకున్నట్లు మార్చి 8 నుంచి 20వ తేదీ వరకు జరగాల్సిన ఈ సిరీస్‌ను రెండు రోజుల ముందుగా... 6 నుంచి 18 వరకు నిర్వహిస్తారు. ఆతిథ్య లంకతో పాటు భారత్, బంగ్లాదేశ్ జట్లు ఇందులో పాల్గొంటాయి. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో ఒక జట్టు రెండేసి మార్లు ప్రత్యర్థితో తలపడుతుంది. తొలి మ్యాచ్ 6న భారత్, లంకల మధ్య జరుగుతుంది. మ్యాచ్‌లన్నీ కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలోనే నిర్వహిస్తారు. భారత్‌లో టీవీ ప్రసార హక్కుల్ని డిస్కవరీ కమ్యూనికేషన్స్‌కు చెందిన 'డిస్పోర్ట్' చానెల్ చేజిక్కించుకుంది.

ట్రై సిరీస్ షెడ్యూల్

మార్చి 6:	భారత్ x శ్రీలంక
మార్చి 8:	భారత్ x బంగ్లాదేశ్
మార్చి 10:	శ్రీలంక x బంగ్లాదేశ్
మార్చి 12:	భారత్ x శ్రీలంక
మార్చి 14:	భారత్ x బంగ్లాదేశ్
మార్చి 16:	శ్రీలంక x బంగ్లాదేశ్
మార్చి 18:	ఫైనల్



సింహం మళ్లీ గర్జిస్తుంది!

సెంచూరియన్ టెస్టులో పరాజయం తర్వాతి రోజు భారత క్రికెటర్లు అడవిలో సఫారీకి వెళ్లి సేద తీరారు. క్రూగర్స్ నేషనల్ పార్క్‌ను వారు సందర్శించారు. ఈ సందర్భంగా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా సింహం పిల్లలతో ఫొటో దిగి దానికి వ్యాఖ్య కూడా జోడించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. 'జీవితం మనల్ని వెనక్కి లాగినప్పుడు ఎప్పుడూ బాధ పడవద్దు. ఎందుకంటే సింహం కూడా అమాంతం దూకి దాడి చేసే ముందు ఒకడుగు వెనక్కి వేస్తుంది' అంటూ తాము చివరి టెస్టులో కోలుకుంటామన్నట్లు పరోక్షంగా చెప్పాడు!



ముగురుజా

ముగురుజాకు షాక్

రెండో రౌండ్‌లోనే ఓడిన మూడో సీడ్

- మూడో రౌండ్‌లో హలెప్, షరపోవా
- ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ

సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలనాల పరంపర కొనసాగుతోంది. టోర్నీ నాలుగో రోజు గురువారం టాప్–10లోని నలుగురు సీడెడ్ క్రీడాకారులు రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. మహిళల సింగిల్స్‌లో మూడో సీడ్ గార్బిన్ ముగురుజా, తొమ్మిదో సీడ్ జొహనా కొంటా... పురుషుల సింగిల్స్‌లో ఏడో సీడ్ డేవిడ్ గాఫిన్... తొమ్మిదో సీడ్, మాజీ చాంపియన్ స్టానిస్లాస్ వావ్రింకా రెండో రౌండ్‌లోనే ఓటమి చవిచూశారు.

మెల్‌బోర్న్: కెరీర్‌లో మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాలనే లక్ష్యంతో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అడుగుపెట్టిన స్పెయిన్ స్టార్, మూడో సీడ్ గార్బిన్ ముగురుజాకు నిరాశ ఎదురైంది. గతేడాది వింబుల్డన్ టైటిల్‌ను, 2016లో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను నెగ్గిన ముగురుజా సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రెండో రౌండ్‌ను దాటలేకపోయింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 88వ ర్యాంకర్, డబుల్స్ స్పెషలిస్ట్ సెయి సు వె (చైనీస్ తైపీ) అద్భుత ఆటతీరును ప్రదర్శించి 7–6 (7/1), 6–4తో ముగురుజాను బోల్తా కొట్టించి సంచలనం సృష్టించింది. దాదాపు రెండు గంటలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ముగురుజా ఎండ వేడిమికి తట్టుకోలేక తొలి సెట్‌లో మెడికల్ టైమ్ అవుట్ కూడా తీసుకుంది. తొలి సెట్‌లో ఒకదశలో 2–5తో వెనుకబడిన ముగురుజా ఆ తర్వాత తేరుకొని స్కోరును 6–6తో సమం చేసింది. అయితే టైబ్రేక్‌లో సెయి సు వె పైచేయి సాధించి తొలి సెట్‌ను దక్కించుకుంది. రెండో సెట్‌లో సెయి సు వె తన ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసి విజయాన్ని ఖాయం చేసుకుంది. ఇతర మ్యాచ్‌ల్లో బెర్నార్డా పెరా (అమెరికా) 6–4, 7–5తో తొమ్మిదో సీడ్ జొహనా కొంటా (బ్రిటన్)పై... నవోమి ఒసాకా (జపాన్) 7–6 (7/4), 6–2తో 16వ సీడ్ వెస్నినా (రష్యా)పై, మాజీ చాంపియన్ షరపోవా (రష్యా) 6–1, 7–6 (7/4)తో 14వ సీడ్ సెవస్తోవా (లాత్వియా)పై గెలుపొందారు.

మరోవైపు ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ సిమోనా హలెప్ (రొమేనియా), మాజీ చాంపియన్ కెర్బర్ (జర్మనీ), ఆరో సీడ్ ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్), ఎనిమిదో సీడ్ గార్సియా (ఫ్రాన్స్) మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో హలెప్ 6–2, 6–2తో యుజిని బుషార్డ్ (కెనడా)పై, 21వ సీడ్ కెర్బర్ 6–4, 6–1తో వెకిచ్ (క్రొయేషియా)పై, ప్లిస్కోవా 6–1, 6–1తో హదాద్ మైయ (బ్రెజిల్)పై, గార్సియా 6–7 (3/7), 6–2, 8–6తో వంద్రూసోవా (చెక్ రిపబ్లిక్)పై విజయం సాధించారు.

ఫెడరర్ జోరు

పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్, రెండో సీడ్ ఫెడరర్ (స్విట్జర్లాండ్), మాజీ చాంపియన్ జొకోవిచ్ (సెర్బియా), నాలుగో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ), ఐదో సీడ్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా) మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు. ఫెడరర్ 6–4, 6–4, 7–6 (7/4)తో స్ట్రఫ్ (జర్మనీ)పై, జొకోవిచ్ 4–6, 6–3, 6–1, 6–3తో మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్)పై, జ్వెరెవ్ 6–1, 6–3, 4–6, 6–3తో గొజోజిక్ (జర్మనీ)పై, థీమ్ 6–7 (6/8), 3–6, 6–3, 6–2, 6–3తో కుద్లా (అమెరికా)పై గెలుపొందారు. మరోవైపు 2014 చాంపియన్, తొమ్మిదో సీడ్ వావ్రింకా (స్విట్జర్లాండ్) 2–6, 1–6, 4–6తో టెనిస్ సాండ్‌గ్రెన్ (అమెరికా) చేతిలో... ఏడో సీడ్ గాఫిన్ (బెల్జియం) 6–1, 6–7 (5/7), 1–6, 6–7 (4/7) బెనెట్యూ (ఫ్రాన్స్) చేతిలో... 13వ సీడ్ సామ్ క్వెరీ (అమెరికా) 4–6, 6–7 (6/8), 6–4, 2–6తో మార్టన్ ఫక్సోవిక్స్ (హంగేరి) చేతిలో అనూహ్యంగా ఓడిపోయారు.

భారత ఆటగాళ్ల శుభారంభం

పురుషుల డబుల్స్‌లో భారత క్రీడాకారులు లియాండర్ పేస్, రోహన్ బోపన్న, దివిజ్ శరణ్ శుభారంభం చేశారు. తొలి రౌండ్‌లో పేస్–పురవ్ రాజా (భారత్) జంట 6–2, 6–3తో బాసిలాష్విలి (జార్జియా)–హైదర్ (ఆస్ట్రియా) జోడీపై... బోపన్న–వాసెలిన్ (ఫ్రాన్స్) ద్వయం 6–2, 7–6 (7/5)తో పోస్పిసిల్ (కెనడా)–హ్యారిసన్ (అమెరికా) జంటపై... దివిజ్–రాజీవ్ రామ్ (అమెరికా) జోడీ 7–6 (7/5), 6–4తో ట్రయెస్కీ (సెర్బియా)–కోపిల్ (రొమేనియా) ద్వయంపై విజయం సాధించాయి.

భారత జట్టులో శ్రీకృష్ణప్రియ

- ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌కు జట్టు ప్రకటన
- ఫిబ్రవరి 6 నుంచి 11 వరకు మలేసియాలో పోటీలు
- టాప్–4లో నిలిస్తే థామస్, ఉబెర్ కప్ ఫైనల్స్‌కు అర్హత



న్యూఢిల్లీ: కొంతకాలంగా అంతర్జాతీయ జూనియర్ టోర్నమెంట్‌లలో నిలకడగా రాణిస్తోన్న హైదరాబాద్ అమ్మాయి కుదురవల్లి శ్రీకృష్ణప్రియకు తగిన ప్రతిఫలం లభించింది. ప్రతిష్టాత్మక ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత మహిళల సీనియర్ జట్టులో 20 ఏళ్ల శ్రీకృష్ణప్రియ ఎంపికైంది. స్టార్ క్రీడాకారిణులు పీవీ సింధు, సైనా నెహ్వాల్, మరో తెలుగు అమ్మాయి గద్దె రుత్విక శివాని సింగిల్స్ విభాగంలోని ఇతర సభ్యులు. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో శ్రీకృష్ణప్రియ 58వ స్థానంలో ఉంది. డబుల్స్ విభాగంలో సిక్కి రెడ్డి, అశ్విని పొన్నప్పలతోపాటు ప్రాజక్తా సావంత్, సంయోగిత, రితూపర్ణ దాస్, మిథిల బరిలోకి దిగుతారు. భారత పురుషుల జట్టు సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్, హెచ్‌ఎస్ ప్రణయ్, సమీర్ వర్మలకు చోటు లభించింది. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, మనూ అత్రి, సుమీత్ రెడ్డి, శ్లోక్ రామచంద్రన్, ఎం.ఆర్.అర్జున్‌లను ఎంపిక చేశారు.

ఫిబ్రవరి 6 నుంచి 11 వరకు మలేసియాలోని అలోర్ సెటార్ పట్టణంలో ఈ మెగా ఈవెంట్ జరగనుంది. భారత్‌తోపాటు చైనా, మలేసియా, ఇండోనేసియా, దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్, సింగపూర్, చైనీస్ తైపీ, కజకిస్తాన్, మాల్దీవులు, నేపాల్, ఫిలిప్పీన్స్ జట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటాయి. ప్రతి పోటీలో మూడు సింగిల్స్, రెండు డబుల్స్ మ్యాచ్‌లను నిర్వహిస్తారు. పురుషుల, మహిళల టీమ్ విభాగాల్లో సెమీఫైనల్‌కు చేరిన నాలుగు జట్లు మే 20 నుంచి 27 వరకు బ్యాంకాక్‌లో జరిగే థామస్ కప్, ఉబెర్ కప్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

అక్టోబర్‌లో ప్రొ కబడ్డీ ఆరో సీజన్

ముంబై: ఈ ఏడాది ప్రొ కబడ్డీ లీగ్ షెడ్యూల్‌ను నిర్వాహకులు ఖరారు చేశారు. ఆరో సీజన్ పోటీలు ఈ ఏడాది అక్టోబర్ 19 నుంచి జరుగుతాయని నిర్వాహక సంస్థ మషాల్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ తెలిపింది. మొత్తం 13 వారాలపాటు ఈ పోటీలు జరుగుతాయి. గత ఐదో సీజన్‌లో ఫ్రాంచైజీల సంఖ్య 8 నుంచి 12కు పెంచడంతో మ్యాచ్‌ల సంఖ్య, నిర్వహణ సమయం కూడా పెరిగిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఆసియా గేమ్స్ జరుగనున్న నేపథ్యంలో ఆటగాళ్లకు సరైన విరామం ఇవ్వాలనే ఉద్దేశంతో అక్టోబర్‌లో నిర్వహించనున్నట్లు ప్రొ కబడ్డీ కమిషనర్ అనుపమా గోస్వామి తెలిపారు.

PRO KABADDI

ప్రిక్వార్టర్స్‌లో సాయిప్రణీత్ పరాజయం

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సాయిప్రణీత్ 17–21, 8–21తో ప్రపంచ చాంపియన్ అక్సెల్‌సన్ (డెన్మార్క్) చేతిలో ఓడిపోయాడు. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి–అశ్విని జంట 15–21, 15–21తో కామిల్లా–పెడర్సన్ (డెన్మార్క్) ద్వయం చేతిలో ఓటమి పాలైంది.



సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 20+20 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 298

శుక్రవారం 19-1-2018

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR| KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



35,500 తాకిన సెన్సెక్స్

ఎఫ్‌డీఐ పరిమితి పెంపు వార్తలతో బ్యాంక్ షేర్ల జోరు

-15లో



నిప్పు కనిక

- ఫ్యామిలీలో

రిపబ్లిక్ టీవీ–సీ ఓటర్ సర్వే

మళ్లీ మోదీ హవా!



ఎన్డీయేకి 335 సీట్లు.. యూపీఏకు 89

- తెలంగాణలో టీఆర్ఎస్‌కు 11, బీజేపీకి 3, కాంగ్రెస్‌కు 2 ఎంపీ స్థానాలు
- ఏపీలో వైఎస్సార్‌సీపీకే మెజారిటీ సీట్లు
- టీడీపీ–బీజేపీ కూటమికి వ్యతిరేక పవనాలు
- తమిళనాడులో రజనీకాంత్‌కు భారీ మెజారిటీ

- వివరాలు 17లో

‘ఈశాన్యం’లో ఎన్నికల

నగారా




- మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఫిబ్రవరిలో పోలింగ్
- మార్చి 3న ఫలితాలు
- సీఈసీ ఏకే జ్యోతి

- వివరాలు 17లో

29 వస్తువులు, 54 సేవలపై

జీఎస్టీ తగ్గింపు




- ఈనెల 25 నుంచి అమలు.. జీఎస్టీ మండలి భేటీలో నిర్ణయం
- పెట్రోల్‌ను జీఎస్టీలోకి తేవడంపై తదుపరి చర్చిస్తాం: జైట్లీ

- వివరాలు 17లో

‘పద్మావత్’కు

లైన్ క్లియర్



- ఈనెల 25న దేశవ్యాప్తంగా విడుదలకు సుప్రీంకోర్టు అనుమతి
- మళ్లీ రాజుకున్న ఆందోళనలు

- వివరాలు 17లో

మేమే నంబర్ 1

‘ఇండియాటుడే సౌత్ కాంక్లేవ్’లో ముఖ్యమంత్రి కేసీఆర్

ఆర్థికాభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ టాప్

- మాతో ఏపీకి ఎందులోనూ పోలికలేదు.. పోటీ కాదు
- తెలంగాణ తొలి నుంచీ ధనిక రాష్ట్రమే
- ఉమ్మడి పాలనలో హైదరాబాద్‌ను ధ్వంసం చేశారు
- అహింసా మార్గంలో తెలంగాణ ఉద్యమం నడిపాం
- రాష్ట్రాలు బలపడితేనే దేశాభివృద్ధి సాధ్యం
- ఢిల్లీ వెళ్లే యోచన లేదు.. ఇక్కడే ఉండి రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తా
- భవిష్యత్తులో రైతుల ఆత్మహత్యలనేవే ఉండవు
- యూపీఏ, ఎన్డీయే దేనిలోనూ చేరబోం
- దేశానికి రెండో రాజధానిగా హైదరాబాద్‌కు గౌరవమిస్తే స్వాగతిస్తామని వెల్లడి



గురువారం సదస్సులో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో రాజ్‌దీప్ సర్దేశాయ్

సాక్షి, హైదరాబాద్

తెలంగాణను పునర్నిర్మిస్తూనే దేశాభివృద్ధిలో భాగమయ్యామని, ఆర్థికాభివృద్ధిలో ఇదే ఒరవడిని కొనసాగిస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. సంస్కృతి, సంప్రదాయాల విషయంలో ఆంధ్రా, తెలంగాణలకు చాలా తేడా ఉందని, ఇరు ప్రాంతాల ప్రజల జీవన విధానం కూడా వేరని పేర్కొన్నారు. తెలుగు అనే ప్రత్యేక గుర్తింపు

మిగతా 6వ పేజీలో ▶

టీటీడీపీని టీఆర్ఎస్‌లో విలీనం చేయాలి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి

- తెలంగాణలో పార్టీ అంతరించిందనే భావన ఉంది
- ఎన్టీఆర్ వర్ధంతికి బాబు రావాల్సింది
- రాకపోవడం సరికాదన్న టీడీపీ నేత



సాక్షి, హైదరాబాద్

‘‘టీటీడీపీని టీఆర్ఎస్‌లో విలీనం చేయడమే మంచిది’’ అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీటీడీపీని టీఆర్ఎస్‌లో విలీనం చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఏపీ సీఎం చంద్రబాబుకు ఎన్ని పనులున్నా టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతికి హాజరు కావాల్సిందన్నారు. ‘‘ఎన్టీఆర్ ఘాట్ హైదరాబాద్‌లోనే ఉంది. అక్కడికి బాబు రాకపోవడం సరికాదు’’ అని మోత్కుపల్లి అన్నారు. తెలంగాణలో టీడీపీ అంతరించిపోయిందనే వాతావరణం నెలకొందన్నారు. భుజాన ఎత్తుకొని

మిగతా 2వ పేజీలో ▶



సద్దుమణగని

‘సుప్రీం’ సంక్షోభం

- సీజేఐతో నలుగురు సీనియర్ న్యాయమూర్తుల భేటీ
- కేసుల కేటాయింపు సహా పలు అంశాలపై చర్చ

- వివరాలు 17లో

రూ. 2 లక్షల కోట్లు



రూపుదిద్దుకుంటున్న రాష్ట్ర ‘ఎన్నికల బడ్జెట్’!

- ప్రాజెక్టులు, వ్యవసాయం, సంక్షేమానికే పెద్దపీట
- పలు శాఖల నుంచి ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు
- రూ. 2 లక్షల కోట్లు దాటనున్న అంచనా వ్యయం!
- మార్చి 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

సాక్షి, హైదరాబాద్



2018–19 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను అత్యంత కీలకంగా టీఆర్ఎస్ ప్రభుత్వం భావిస్తోంది. సాధారణ ఎన్నికల ముందు ప్రవేశపెడుతున్న ఆఖరి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే కావటంతో ప్రత్యేకంగా కసరత్తు చేస్తోంది. ఎన్నికల ఏడాదికి ముందు వస్తున్న బడ్జెట్ కావడంతో దీనిపై సర్వత్రా ఆసక్తి కూడా నెలకొంది. టీఆర్ఎస్ ప్రభుత్వానికిది నాలుగో బడ్జెట్. వచ్చే ఏడాది ప్రవేశపెట్టే ఐదో బడ్జెట్ ఓట్ ఆన్ అకౌంట్‌కే పరిమితమవనుంది. దాంతో ఎన్నికల ప్రయోజనాల దృష్ట్యా ఈ బడ్జెట్‌ను జనాకర్షకంగా రూపుదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ దిశగా భారీగా అంచనాలు వేసుకుంటోంది. మార్చి 12 నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవనున్నాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్ తయారీ కసరత్తును ఆర్థిక శాఖ వేగవంతం చేసింది. గురువారానికల్లా చాలా శాఖల బడ్జెట్ ప్రతిపాదనలూ ఆర్థిక శాఖకు చేరాయి. పోలీసు విభాగం, పలు శాఖల ప్రతిపాదనలు తుది దశలో ఉన్నందున రెండు రోజుల్లో అంచనా వ్యయం తేలనుంది. ఇది రూ.రెండు లక్షల కోట్లకు చేరవచ్చన్నది

మిగతా 2వ పేజీలో ▶

నేరస్తులు లెక్క.. ఇక పక్కా..

రాష్ట్రంలో నేరస్తులు 2.18 లక్షలు

- సమగ్ర సర్వేతో లెక్కతేల్చిన పోలీసు శాఖ
- గురువారం ఒకే రోజున రాష్ట్రవ్యాప్తంగా సర్వే
- తరచూ నేరాలకు పాల్పడేవారి వివరాల సేకరణ
- వారి నివాసాలు జియో ట్యాగింగ్

5లో



ఇదం జగత్



వెంటనే చేయండి సార్! ఎన్నాళ్లని ఆ ‘ఓటుకు కోట్లు’కు భయపడి ఉండాలి!!

ఐఐటీల్లో బాలికలకు 14 శాతం సీట్లు!

వారికి ప్రత్యేక ప్రవేశాల జాబితా

సాక్షి, హైదరాబాద్



దేశంలోని ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ విద్యా సంస్థలైన ఐఐటీల్లో బాలికలకు 14 శాతం సీట్లను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (ఎంహెచ్ఆర్‌డీ) సూచన మేరకు ఐఐటీల కౌన్సిల్, జాయింట్ అడ్మిషన్ల బోర్డు బాలికలకు ప్రత్యేక సీట్లను కేటాయించాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ఐఐటీల్లో చేరుతున్న వారిలో అత్యధికంగా బాలురే ఉంటున్నారు. బాలికలు 12 శాతం వరకే ఉంటున్నారు. గతేడాది ఐఐటీల్లో ప్రత్యేకంగా 4 శాతం సీట్లు బాలికలకు కేటాయించిన విషయం తెలిసిందే. కాగా జేఈఈ అడ్వాన్స్‌డ్ నుంచి ఎంపికయ్యే విద్యార్థుల్లో బాలికలకు ప్రత్యేక మెరిట్ లిస్ట్ విడుదల చేయాలని సూచించింది. మొత్తంగా 2020 నాటికి బాలికలకు ఐఐటీల్లో 20 శాతం సీట్లు కేటాయించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అయితే ఈ సీట్లను పూర్తిగా సూపర్ న్యూమరీ కింద కేటాయించనుంది. 2014–15 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన బాలికల్లో 8 శాతం మందికే ఐఐటీల్లో సీట్లు లభించాయి. 2015 –16లో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో దాదాపు 4,600 మంది బాలికలు అర్హత సాధించగా, వారిలో 850 మందికే ప్రవేశాలు లభించాయి. 2016–17లోనూ దాదాపు అదే పరిస్థితి. ఇక 2017–18 ప్రవేశాల లెక్కల ప్రకారం ఐఐటీల్లో ప్రతి వంద మంది విద్యార్థుల్లో బాలికలు ఆరుగురే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో 2017–18 విద్యా సంవత్సరంలో బాలికల కోసం ప్రత్యేకంగా 4 శాతం సీట్లు పెంచారు. వచ్చే మూడేళ్ల పాటు కూడా ఇలాగే బాలికలకు సీట్లు పెంచాలని నిర్ణయించినట్లు తెలిసింది.

టీఎస్ఎస్పీడీసీఎల్‌లో 269 పోస్టుల భర్తీ



సాక్షి, హైదరాబాద్: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీఎస్ఎస్పీడీసీఎల్)లో 269 పోస్టుల భర్తీకి ప్రకటన జారీ అయింది. 155 అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ), 114 జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు సంస్థ యాజమాన్యం ప్రకటించింది. పూర్తి వివరాలను ఈ నెల 20న లేదా ఆ తర్వాత www.tssouthernpower.com వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నామని తెలిపింది. 155 ఏఈ పోస్టుల్లో 133 ఏఈ (ఎలక్ట్రికల్), 20 ఏఈ (సివిల్) పోస్టులున్నాయి. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్)లో సైతం 1,843 జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) పోస్టుల భర్తీకి మరో వారంలో ప్రకటన జారీ కానుంది. తెలంగాణ ట్రాన్స్‌కోలో 330 ఏఈ, 174 సబ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్), 1,100 జేఎల్ఎం పోస్టుల భర్తీకి ఇప్పటికే ప్రకటనలు జారీ చేయగా, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జరుగుతోంది.



గురువారం బుక్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్వర్‌రెడ్డి

పుస్తకం..ప్రపంచాన్ని మార్చే ఆయుధం

- మంత్రి జగదీశ్వర్‌రెడ్డి వ్యాఖ్య
- కనులపండువగా హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రారంభం

హైదరాబాద్: సమాజ స్వరూపం మారడానికి అక్షరమే పునాదని మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఎన్‌టీఆర్ స్టేడియంలోని భాగ్యరెడ్డి వర్మ ప్రాంగణంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ కనులపండువగా ప్రారంభమైంది. జగదీశ్వర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. అక్షరం పుట్టిన తర్వాతే అనూహ్యమైన మార్పులు వచ్చాయని, పుస్తకమే ప్రపంచ గమనాన్ని మార్చే ఆయుధమని ఈ సందర్భంగా జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రపంచంలో వస్తున్న సాంకేతిక విజ్ఞానాన్ని ఏ వైరస్ అయినా చిటికెలో మాయం చేస్తుందని, పుస్తకంలోని అక్షరాలను ఏ వైరస్ కూడా అడ్డుకోలేదన్నారు. పుస్తకం లేని జీవితానికి పరిపూర్ణత రాదని ముఖ్యమంత్రి కార్యాలయ అధికారి దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు.

పుస్తకంతోనే ప్రపంచంలో గొప్ప పరిణామాలు చోటుచేసుకున్నాయన్నారు. పుస్తకం మంచి స్నేహితుడని, పుస్తక పఠనం మనిషిని తలెత్తుకొని బతికేలా చేస్తుందని సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. పుస్తకం మనిషికి విలువలతో కూడిన జీవితాన్ని అందిస్తుందని ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అభిప్రాయపడ్డారు. ఈ నెల 28 వరకు జరిగే బుక్ ఫెయిర్ విజయవంతం కావాలని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి ఆకాంక్షించారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, బుక్ ఫెయిర్ కార్యదర్శి కోయ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



65వ రోజు
ప్రజా సంకల్పం పాదయాత్ర డైరీ
18-01-2018, గురువారం
సదాశివపురం క్రాస్,
చిత్తూరు జిల్లా

ఇసుక మాఫియాను మీరే పెంచి పోషిస్తున్నారనడం వాస్తవం కాదా?

ఉదయం శిబిరం నుంచి వెలుపలికి రాగానే ఆరోగ్యశ్రీ సేవలు అందని మరో విషాద గాథ తెలిసింది. కురుకుల్వాక్కు చెందిన నాలుగేళ్ల చిన్నారి శశి ఎత్తుకుని వచ్చారు వాళ్ల అమ్మ, నాన్నలు. పుట్టిన నాటి నుంచీ పెద్ద బాధ. కంటికి సంబంధించిన క్యాన్సర్‌తో ఆ పాప బాధపడుతోందట. ఒక కన్ను పోయిందట. ఇప్పుడు రెండో కంటికి సోకిందని, దానికి సంబంధించిన వైద్యం హైదరాబాద్‌లో మాత్రమే ఉందని చెబితే.. ఆరోగ్యశ్రీ కార్డు పట్టుకుని హైదరాబాద్‌కు వెళితే 'ఇప్పుడు ఇది చెల్లదు.. డబ్బు కడితేనే వైద్యం' అన్నారట. కూలి పనులకు వెళ్తే ఆ దంపతులు లక్షల రూపాయలు ఖర్చు చేయడం సాధ్యమా? తమకంటి వెలుగులాంటి బిడ్డకు కనుచూపు కరువైతే.. ఆ అమ్మానాన్నలు ఎంతగా కుమిలిపోతారో కదా? కళ్ల ముందే ఆ వ్యాధి ముదురుతూ.. ప్రాణాంతక మవుతూ ఉంటే.. ఆ తల్లిదండ్రుల పరిస్థితి వర్ణనాతీతం. హైదరాబాద్‌తో పాటు పొరుగు రాష్ట్రాలలో ఆరోగ్యశ్రీ సేవల ఆవశ్యకతను ఇలాంటి సంఘటనలే తెలియజేస్తున్నాయి.

కాస్త ముందుకు నడవగానే మునగలపాలెం వద్ద రోడ్డు పక్కన ఒక ఎత్తయిన స్తూపం కనిపించింది. చంద్రబాబు అరాచక పాలనకు, తెలుగుదేశం నాయకుల దాష్టీకాలకు సాక్షీభూతం అది. ఇసుక మాఫియాపై పోరాడుతూ, న్యాయం కోసం పోలీసు ఉన్నతాధికారులను అర్థించడానికి ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, లారీ దుర్ఘటనలో అమరులైన 16 మంది ప్రజల స్మృతికి స్మారకం అది. ఆ దుర్ఘటనలో ఎన్నో కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. ఎంతోమంది క్షతగాత్రులయ్యారు. ఏ పనీ చేయలేక, సంపాదనలేక వారి కుటుంబాలు ఛిన్నాభిన్న మయ్యాయి. ఆ విషాద ఘటన తర్వాత బాధిత కుటుంబాలను నేను పరామర్శించే వరకూ ప్రభుత్వం స్పందించలేదంటే, పరిహారం ప్రకటించ లేదంటే, నిందితులపై చర్యలు తీసుకోలేదంటే.. ప్రభుత్వ ఉద్దేశమేంటో ప్రజలందరికీ అవగతమైంది. ఇప్పటికీ ఆ ఇసుక మాఫియా నిందితులు యథేచ్ఛగా బయట తిరుగుతున్నారంటే.. వారికి ప్రభుత్వ అండదండలు ఎంతగా ఉన్నాయో తెలుస్తోంది.

తమ జీవనాధారమైన భూములను విమానాశ్రయం విస్తరణ, పరిశ్రమల ఏర్పాటు కోసం వదులుకున్న నిరుపేదైన రైతులు గ్రామగ్రామానా కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. వారి ఇష్టంతో పనిలేకుండా.. లక్షల రూపాయల విలువచేసే భూములను తీసుకుని, నామమాత్రపు పరిహారం చెల్లించి చేతులు దులుపుకున్నారు. పరిహారం కోసం టీడీపీ నాయకులు అధికారుల సహకారంతో అమాయకులైన పేదల భూముల రికార్డులను తారుమారు చేశారు. పేదల భూములు, మరికొన్ని అసైన్డ్ భూములకు సంబంధించి బినామీల పేర్లతో టీడీపీ నాయకులు కోట్లాది రూపాయల పరిహారాన్ని తీసుకొని, ఇష్టం లేకపోయినా.. బలవంతంగా భూములు లాక్కోవడంతో పేదలు, మరీ ముఖ్యంగా అసైన్డ్ భూముల పేదలు కోర్టును ఆశ్రయించారు.

చివరిగా, ముఖ్యమంత్రి గారికి నాదో ప్రశ్న.. ఇసుక మాఫియా దురాగతాలపై ఎన్నో ఫిర్యాదులొచ్చినా, ఎన్నో ఆందోళనలు జరిగినా.. ఎందుకు స్పందించలేదు? ఒక్కదానిపై కూడా ఎందుకు కఠిన చర్యలు తీసుకోలేదు? తీసుకుని ఉంటే.. ఏర్పేడు లాంటి ఘటనలు జరిగేవి కావు కదా. ఇసుక మాఫియాను అడ్డుకున్న అధికారులపై దౌర్జన్యాలు జరిగినా.. వాటిని తీవ్రంగా పరిగణించకపోయినా... నిందితులనే వెనకేసుకురావడం దేనికి సంకేతం? మీరే ఇసుక మాఫియాను పెంచి పోషిస్తున్నారనడం వాస్తవం కాదా?

వైఎస్. జగన్



శశి తల్లిదండ్రులను ఓదారుస్తున్న వైఎస్ జగన్

రూ.2 లక్షల కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఆర్థిక శాఖ ప్రాథమిక అంచనా.

సాగునీటికి రూ.28 వేల కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సాగునీటి ప్రాజెక్టులకు ఏటా రూ.25 వేల కోట్లు కేటాయిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్‌గత బడ్జెట్ సమావేశాల్లోనే ప్రకటించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో నీటిపారుదల శాఖ రూ.28 వేల కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిసింది. శరవేగంగా పనులు జరుగుతున్న కాళేశ్వరంతో పాటు ఇతర ప్రాజెక్టులను నిర్ణీత గడువులో పూర్తి చేసే లక్ష్యంతో ఈ వ్యయ ప్రణాళికను సిద్ధం చేసింది.

పెట్టుబడి సాయం రూ.12 వేల కోట్లు

సాగునీటితో పాటు వ్యవసాయానికి కూడా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. రైతు రుణమాఫీ పథకం సంపూర్ణం కావడంతో సాగుకు పెట్టుబడి సాయంపై దృష్టి పెట్టింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎకరాకు రూ.8,000 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని సీఎం ఇప్పటికే పలుమార్లు ప్రకటించడం తెలిసిందే. పథకాన్ని పక్కాగా అమలు చేసే లక్ష్యంతో రాష్ట్రమంతటా భూ రికార్డుల ప్రక్షాళన జరిపారు. పెట్టుబడి సాయం పథకానికి ఏటా రూ.12 వేల కోట్లు కావాలని తేలింది. దాంతో వ్యవసాయ శాఖ రూ.15 వేల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

తాగునీటికి రూ.8 వేల కోట్లు

టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే చేసిన సవాలు మేరకు ఇంటింటికీ తాగునీరందించే మిషన్ భగీరథ పథకాన్ని వచ్చే ఎన్నికల్లోగా పూర్తి చేయనుంది. పనులు ఈ ఏడాదిలోనే చివరి దశకు చేరుతాయి. దీంతో భగీరథకు రూ.8,000 కోట్లు కోరుతూ పంచాయతీరాజ్ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి గృహ నిర్మాణ శాఖ తగినన్ని నిధులు కోరుతోంది. కొత్త మున్సిపాలిటీలు, విశ్వనగరంగా హైదరాబాద్ అభివృద్ధి పనుల దృష్ట్యా మున్సిపల్ శాఖ రూ.12 వేల కోట్లకు పైగా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రోడ్లు, భవనాల శాఖ భారీగానే అంచనాలు వేసుకుంది.

విద్యుత్తుకు రూ.10 వేల కోట్లు

రాష్ట్రవ్యాప్తంగా సాగుకు 24 గంటల విద్యుత్ సరఫరా పథకం విజయవంతంగా అమలవుతోంది. మరోవైపు విద్యుత్తు సంస్థలకు సబ్సిడీల భారం వచ్చే ఏడాది నుంచి పెరగనుంది. వచ్చే బడ్జెట్‌లో రూ.5,400 కోట్ల సబ్సిడీ నిధులను విద్యుత్తు శాఖ కోరుతోంది. మొత్తం రూ.10 వేల కోట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వైద్య ఆరోగ్యానికి ఈసారి అత్యంత ప్రాధాన్యమిస్తామన్న సీఎం ప్రకటన, కొత్త వైద్య కాలేజీల నిర్మాణానికి నిధుల ఆవశ్యకత నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ రూ.6500 కోట్లతో ప్రతిపాదనలిచ్చింది.

సంక్షేమానికే రూ.50 వేల కోట్లు

శాఖలవారీగా అందిన ప్రతిపాదనలతో పాటు ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న పథకాలకు వచ్చే ఏడాది కేటాయింపులు భారీగానే పెరగనున్నాయి. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు వచ్చే ఏడాది నుంచి ఆర్థిక సాయం పెంపు పరిశీలనలో ఉంది. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కల్లుగీత, చేనేత, బీడీ కార్మికులు, కళాకారులకు రూ.500 చొప్పున సామాజిక భద్రత పెన్షన్లిచ్చే అవకాశాలనూ ప్రభుత్వం పరిశీలిస్తోంది. దీంతో పెన్షన్లకే దాదాపు రూ.2,500 కోట్లు అదనంగా కావాలని పంచాయతీరాజ్ విభాగం లెక్కలేస్తోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి దాదాపు రూ.50 వేల కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

ఆ రాష్ట్రాలకు చేయూతనివ్వాలి

- మిషన్ భగీరథ, కాకతీయ, కాళేశ్వరం పథకాలకు నిధులివ్వండి
- ప్రీ బడ్జెట్ సమావేశంలో కేంద్రాన్ని కోరిన ఈటల
- పురోగమిస్తున్న రాష్ట్రాలకు ఊతమిచ్చేలా బడ్జెట్ రూపొందించాలని సూచన



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రాల అభివృద్ధిలోనే దేశాభివృద్ధి ముడిపడి ఉందన్న ప్రధాని నరేంద్ర మోదీ మాటలకు నిదర్శనంగా, సహకార సమాఖ్య స్ఫూర్తికి అద్దంపట్టేలా ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం చేయూతనివ్వాలని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ కోరారు. గురువారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన ప్రీ బడ్జెట్, జీఎస్టీ కౌన్సిల్ 25వ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో పాల్గొన్న ఈటల అనంతరం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఇంటింటికీ రక్షిత మంచినీరు సరఫరా చేసేందుకు రూ.40 వేల కోట్ల ఖర్చుతో మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రూ.85 వేల కోట్లు ఖర్చు పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తోందని పేర్కొన్నారు. భగీరథ పథకాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించడమే కాకుండా ఈ పథకానికి రూ.19,205 కోట్ల నిధులు ఇవ్వాలని, చెరువుల పునరుద్ధరణకు ఉద్దేశించిన మిషన్ కాకతీయ పథకానికి రూ.5 వేల కోట్లు ఇవ్వాలని కేంద్రానికి సిఫార్సు చేసిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.10 వేల కోట్లు ఇవ్వాలని కోరామని చెప్పారు. గొప్ప ఆవిష్కరణలతో పురోగతి సాధిస్తున్న రాష్ట్రాలకు సహకారం ఇచ్చేలా కేంద్రం బడ్జెట్ రూపొందించాలని సూచించారు. అలాగే విభజన చట్టంలో ఇచ్చిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐరన్ ఓర్ పరిశ్రమ, గిరిజన, హార్టికల్చర్ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయాలని, తెలంగాణకు ప్రకటించిన ఎయిమ్స్‌కు నిధులు, వ్యవసాయ పెట్టుబడి పథకానికి నిధులివ్వాలని కోరామని వివరించారు.

డ్రిప్ ఇరిగేషన్‌పై పన్ను తగ్గింపు..

జీఎస్టీ కౌన్సిల్ 25వ సమావేశంలో వివిధ వస్తువులపై పన్ను తగ్గింపునకు ఫిట్‌మెంట్ కమిటీ అంగీకరించింది. అందులో ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం కోరుతున్న డ్రిప్ ఇరిగేషన్‌పై గతంలో విధించిన 18 శాతం పన్నును 12 శాతానికి తగ్గించింది. బీడీలపై పన్ను తగ్గింపును మాత్రం ఫిట్‌మెంట్ కమిటీ పట్టించుకోలేదు. ఈవే బిల్లుల విషయంలో పాత విధానాన్ని అమలు చేసుకొనే అధికారం ఇవ్వాలని అన్ని రాష్ట్రాలు కోరాయని ఈటల తెలిపారు. జీఎస్టీ అమల్లోకి వచ్చి ఐదు నెలలు పూర్తయిన నేపథ్యంలో పేద ప్రజలకు భారంగా పరిణమించిన వివిధ వస్తువులపై పన్ను స్లాబ్‌లను పున:సమీక్షించాలని కోరినట్లు చెప్పారు. పన్ను ఎగవేతలకు ఆస్కారం ఇవ్వకుండా మరిన్ని చర్యలు తీసుకోవాలని, అందుకు టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించాలని సూచించామన్నారు. ఇక తెలంగాణకు జీఎస్టీఎన్ (గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ నెట్‌వర్క్)లో కేంద్రం సభ్యత్వం ఇచ్చింది.

అది కామన్‌సెన్స్‌కు సంబంధించిన విషయం..

హైదరాబాద్‌లో పన్ను చెల్లిస్తున్న 40 శాతం మంది ఆంధ్రా ప్రజలే అని నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్ చేసిన వ్యాఖ్యలపై ఈటలను మీడియా ప్రశ్నించింది. దీనిపై ఆయన స్పందిస్తూ.. 'అమెరికాలో ఉన్న వారు అమెరికాలో పన్ను చెల్లిస్తారు. ఢిల్లీలో ఉన్న వారు ఢిల్లీలో కడతారు. హైదరాబాద్‌లో ఉన్న వారు హైదరాబాద్‌లోనే చెల్లిస్తారు. ఆయన వ్యాఖ్యలు కామన్ సెన్స్‌కు సంబంధించినవి. అంత ఉన్నత వ్యక్తి చేసిన వ్యాఖ్యలపై మనం ఏం మాట్లాడతాం'అని వ్యాఖ్యానించారు.

నోరు అదుపులో పెట్టుకోండి!

- బంధువులకు శశికళ ఉత్తరం
- వివాదాస్పద వ్యాఖ్యలు చేయరాదని ఆదేశం

సాక్షి ప్రతినిధి, చెన్నై: అన్నాడీఎంకే అధినేత్రి జయలలిత మరణం, దానికి సంబంధించిన విషయాలను మరింత వివాదాస్పదం చేయడం సరికాదనీ, ఇకపై నోరు అదుపులో పెట్టుకోవాలని ఆ పార్టీ బహిష్కృత నేత శశికళ తన కుటుంబ సభ్యులను హెచ్చరించారు. ఇష్టారాజ్యంగా వ్యాఖ్యలు చేస్తుండటంపై ఆవేదన, ఆగ్రహంతో ఆమె ఉత్తరం రాశారు. 'మన కుటుంబంపై కేంద్రానికి ఇప్పటికే ఓ నివేదిక అందింది. దాని పర్యావసనమే ఐటీ దాడులు. హోంశాఖ తన నివేదికలో పేర్కొన్న అంశాలు నిజమన్నట్లుగా మీరంతా ఇలానే వ్యవహరిస్తే నేను జీవితాంతం జైల్లోనే ఉండాల్సి వస్తుంది'అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జయలలిత చనిపోయిన వెంటనే ఓ కేంద్ర మంత్రి తనకు ప్రీతిపాత్రమైన వారికి సీఎం పదవి కట్టబెట్టేందుకు యత్నించారని దినకరన్ ఇంతకుముందు ఆరోపించారు. దీనిపై విచారణ జరిపిన హోంశాఖ.. వెంకయ్య నాయుడే సదరు వ్యక్తి అని కేంద్రానికి నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది. కాగా శశికళ ఉత్తరం అందుకోవడం వల్లే కొత్త పార్టీ ఏర్పాటుపై దినకరన్ వెనక్కుతగ్గారని తెలుస్తోంది.

టీటీడీపీని టీఆర్ఎస్‌లో విలీనం చేయాలి

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీని కాపాడుకుందామన్నా తనకు సహకరించే వారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ''టీడీపీ అంతరించిపోయిందని, మనుగడే లేదని అనుకోవడం కంటే టీఆర్ఎస్‌లో విలీనం చేయటం మంచిది. టీఆర్ఎస్ కూడా టీడీపీకి చెందిన పార్టీయే. టీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ టీడీపీ నుంచి వెళ్లిన వ్యక్తే. టీఆర్ఎస్‌లో విలీనం చేయడానికి ఇబ్బంది ఏమీ ఉండదు'' అన్నారు. ఇప్పుడున్న పరిస్థితిలో తెలంగాణలో టీడీపీని బలోపేతం చేయడానికి చంద్రబాబు సమయం కేటాయించలేరని మోత్కుపల్లి చెప్పారు. ''సమయం కేటాయించకపోతే పార్టీ బలోపేతం కాదు. క్రమంగా ఉనికి కోల్పోయే పరిస్థితి వస్తోంది. టీడీపీకి తెలంగాణలో గౌరవంగా ఉండాలంటే, పార్టీ కార్యకర్తల కోసం టీఆర్ఎస్‌లో విలీనం చేయడమే మంచిది'' అని మోత్కుపల్లి పునరుద్ఘాటించారు.

రాత్రయితే కార్లకు నిప్పు

- కర్ణాటకలో సైకో వైద్యుడి నిర్వాకం

బెళగావి (సాక్షి, బెంగళూరు): ఆయనో సీనియర్ వైద్య నిపుణుడు. చీకటి పడగానే ఆయనలోని సైకో అవతారం బయటకొస్తుంది. కొద్ది రోజులుగా కార్లకు నిప్పుపెడుతూ కలబురిగి, బెళగావి నగరవాసులకు, పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేశాడు. ఎట్టకేలకు నిందితుడు గురువారం పట్టుబడ్డాడు. కలబురిగికి చెందిన అమిత్ గైక్వాడ్ బెళగావిలోని బిమ్స్ వైద్య కళాశాలలో వైద్యుడిగా, ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. కొద్దిరోజులుగా కలబురిగి, బెళగావి నగరాల్లో ఇళ్ల ముందు నిలిపి ఉంచిన కార్లకు రాత్రి వేళల్లో నిప్పు పెడుతున్నారు. బుధవారం రాత్రి బెళగావి సదాశివనగర్‌లో కారుకు నిప్పు పెట్టడానికి ప్రయత్నిస్తుండగా అనుమానం వచ్చిన స్థానికులు గైక్వాడ్‌ను పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు.

బీమా కోసం స్వచ్ఛందంగానే సమాచారం

ఆధార్‌పై విచారణలో సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: బీమా, మొబైల్ కంపెనీలకు పౌరులు తమ వ్యక్తిగత సమాచారాన్ని స్వచ్ఛందంగానే వెల్లడిస్తున్నారని సుప్రీం కోర్టు పేర్కొంది. ఆధార్ చట్టబద్ధతపై ప్రారంభమైన విచారణ గురువారం కొనసాగింది. పౌరులు వ్యక్తిగత సమాచారం ఇవ్వాలని ప్రభుత్వం ఒత్తిడి చేయరాదన్న సంగతి గురువారం ప్రస్తావనకు వచ్చినప్పుడు అత్యున్నత ధర్మాసనంపై విషయాన్ని గుర్తుచేసింది. ఆధార్ విధానాన్ని సవాలుచేసిన పిటిషనర్ల తరఫు న్యాయవాది శ్యామ్ దివాన్ వాదిస్తూ...పౌరులు వ్యక్తిగత సమాచారాన్ని ప్రైవేట్ సంస్థలకు ఇచ్చేలా ప్రభుత్వం ఒత్తిడి చేయరాదని, అది ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందికే వస్తుందని అన్నారు. దీనికి సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని బెంచ్ స్పందిస్తూ..'మీకు బీమా కావాలంటే ప్రైవేట్ సంస్థ వద్దకే వెళ్లాలి. మొబైల్ కనెక్షన్ కావాలన్నా ప్రైవేట్ కంపెనీలనే ఆశ్రయించి వాటికి మీ సమాచారం ఇవ్వాలి. దీనికోసం ప్రభుత్వం ఎన్నో మార్గాలను అందుబాటులోకి తెచ్చింది. కానీ అదే ప్రభుత్వం మీ చిరునామా, ఇతర వివరాలు ఇవ్వమంటే మాత్రం జంకుతున్నారు' అని పేర్కొంది. దివాన్ బదులిస్తూ.. జనాభా లెక్కల సందర్భంగా సేకరించే సమాచారానికి రక్షణ ఉన్నా ఆధార్ విషయంలో అలాంటి భద్రత కొరవడిందని పేర్కొన్నారు. ఆధార్‌కు నమోదుచేసుకునే సమయంలో వ్యక్తి కొన్ని వివరాలు వెల్లడించడానికి నిరాకరిస్తే రిజిస్ట్రేషన్ తిరస్కరణకు గురవుతోందన్నారు. డిజిటల్ యుగంలో పౌరులతో ప్రభుత్వం మిత్రుడిలా ఉంటూ, వారి గోప్యతా ప్రయోజనాలను పరిరక్షించాలన్నారు. వాదనలు అసంపూర్తిగా ముగియడంతో తదుపరి విచారణ 23న పునఃప్రారంభమవుతుంది.

అద్దె భవనాల్లోనే గురుకుల విద్య

- కొత్త భవన నిర్మాణాలకు అనుమతివ్వని ప్రభుత్వం
- అద్దె భారం ఏటా రూ.65 కోట్లు పైమాటే...

సాక్షి, హైదరాబాద్: కొత్త గురుకుల పాఠశాలలకు అద్దె భవనాలే దిక్కు అయ్యాయి. ప్రైవేటు భవనాల్లో ప్రారంభించి దశలవారీగా శాశ్వత భవనాలు నిర్మిస్తామన్న ప్రభుత్వం మాటలు ఇప్పట్లో కార్యరూపం దాల్చేలా లేవు. 2017–18లో బీసీ సంక్షేమ శాఖ పరిధిలో నియోజకవర్గానికొకటి చొప్పున 119, మైనార్టీ సంక్షేమ శాఖ పరిధిలో 65 గురుకులాలను ప్రైవేటు భవనాల్లో ప్రారంభించింది.

శాశ్వత భవనాలకు రూ.3,680 కోట్లు...

గురుకులాలపై భారీ ప్రణాళికలతో ప్రభుత్వం ప్రకటనలు చేయడంతో వీటి పట్ల విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. కొత్తవాటిలో దాదాపు అన్ని గురుకులాలు హౌస్‌ఫుల్ బోర్డులు పెట్టేశాయి. కనిష్టంగా పది ఎకరాల విస్తీర్ణంలో విశాలమైన భవనాలను నిర్మించాలని సొసైటీలు ప్రణాళికలు రూపొందించాయి. ఒక్కో గురుకుల భవన నిర్మాణానికి రూ.20 కోట్లు, అన్నింటికి కలిపి దాదాపు రూ.3,680 కోట్లు అవసరమవుతాయని అధికారులు తేల్చారు. ప్రతి సంవత్సరం పావువంతు భవనాలు నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో ఏటా రూ. 1,000 కోట్లు కేటాయించాలి. కానీ, ఇంతపెద్దమొత్తంలో నిధులివ్వడం సాధ్యం కాదని తాజాగా ఆర్థిక శాఖ అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. దీంతో కొత్త గురుకులాలకు ఇప్పట్లో శాశ్వత భవనాలు ఏర్పాటయ్యే అవకాశం లేనట్లే. కొత్త గురుకులాలకు అద్దె భారం తడిసిమోపెడవుతోంది. ఒక్కో గురుకులంపై ఏటా రూ.25 లక్షలు, అన్నింటికి కలిపి రూ.65 కోట్ల అద్దె భారం పడుతోంది. ప్రభుత్వం నిర్ణయించిన అద్దెధరలకు చాలాచోట్ల భవనాలు లభించలేదు. దీంతో ఎక్కువ అద్దెలు చెల్లించి భవనాలు తీసుకోవాల్సి రావడంతో అద్దె భారం మరింత పెరిగే అవకాశముంది.





రవీంద్రభారతిలో జరిగిన ఎన్టీఆర్ లలితకళా పురస్కారాల కార్యక్రమంలో రోశయ్య చేతుల మీదుగా అందుకున్న అవార్డులతో చలపతిరావు, సిడ్నీ బుజ్జి, వాసా ప్రభావతి. చిత్రంలో లక్ష్మీపార్వతి, అన్నపూర్ణ తదితరులు

చిరస్మరణీయుడు ఎన్టీఆర్: రోశయ్య

నా జీవితం ఎన్టీఆర్ మలచిన శిల్పం: లక్ష్మీపార్వతి • ఘనంగా ఎన్టీఆర్ పురస్కారాల ప్రదానం

సాక్షి, హైదరాబాద్: ఎన్టీఆర్ చిరస్మరణీయుడని తమిళనాడు మాజీ గవర్నర్ డాక్టర్ కొణిజేటి రోశయ్య అన్నారు. గురువారం రవీంద్రభారతిలో ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ లలితకళా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఎన్టీఆర్ 22వ వర్ధంతి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సినీరంగంలో ఎన్టీఆర్‌ను మించినవారు లేరన్నారు. కొన్ని పాత్రలకైతే ఆయనకు ఆయనే సాటి అని కొనియాడారు. తెనాలిలో తన స్నేహితుడి సినిమా థియేటర్ ప్రారంభోత్సవానికి ఆనాడు ఎన్టీఆర్‌ను ఆహ్వానిస్తే వచ్చారని గుర్తుచేసుకున్నారు. తర్వాతి కాలంలో రాజకీయంగా విభేదించుకోవటం లాంటి విషయాలు జరిగిపోయాయని తెలిపారు.

తెలుగు మహాసభల్లో ప్రస్తావనేదీ?

తెలంగాణ గడ్డపై ఎంతోమంది దళితులను చేరదీసి, వారికి రాజకీయ భవిష్యత్తు కల్పించిన మహామనిషి ఎన్టీఆర్ అని సమాచార హక్కు పూర్వ కమిషనర్ విజయబాబు అన్నారు. కానీ ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొన్నవారు ఎన్టీఆర్ పేరును ప్రస్తావించకపోవడం విషాదకరమన్నారు. అనంతరం ఎన్టీఆర్ లలితకళా పురస్కారాలను సినీనటుడు టి.చలపతిరావు, ప్రముఖ రచయిత్రి డాక్టర్ వాసా ప్రభావతి, ప్రవాసాంధ్రుడు సిడ్నీ బుజ్జికి రోశయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించి, మెమెంటో, నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్టీఆర్ చలనచిత్ర సంగీత విభావరి అలరించింది. కార్యక్రమంలో ప్రముఖ సినీనటి అన్నపూర్ణ, కార్యక్రమ నిర్వాహకుడు వైకే నాగేశ్వరరావు, సినీ దర్శకుడు గీతాకృష్ణ, సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తి ఎన్టీఆర్

ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ.. 'నా జీవితం ఎన్టీఆర్ మలచిన శిల్పం. ఎన్టీఆర్‌తో గడిపిన ప్రతిక్షణం మరచిపోలేను. జనవరి 17 నా జీవితంలో ఎప్పుడూ గుర్తుండిపోతుంది. కన్నీళ్లు వస్తే బయటకు ఏడ్వవద్దు అనేవారు. మన కన్నీళ్లు మనమే తుడుచుకొని పోరాటం చేయాలని నాలో స్ఫూర్తిని నింపేవారు. ఎన్టీఆర్ భార్య అన్న గొప్ప పదవి ఇచ్చి వెళ్లారు. ఎన్ని జన్మలెత్తినా ఆయన రుణం తీర్చుకోలేను. ఆయనకు జరిగిన అన్యాయంపై ఎన్నో విధాలుగా పోరాటం చేశాను. జీవితంలో తుదిశ్వాస వరకు ఆయన ఆశయ సాధన కోసం పోరాటం చేస్తూనే ఉంటాను. ఆయన లేరని నేననుకోవడం లేదు. రాజకీయం నా భర్త ఎన్టీఆర్‌కు శాపం అయింది' అని వాపోయారు.

కాకినాడ-సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు


సాక్షి, హైదరాబాద్: రద్దీ దృష్ట్యా కాకినాడ–సికింద్రాబాద్ మధ్య 2 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎం.ఉమాశంకర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ– సికింద్రాబాద్(07002) ప్రత్యేక రైలు ఈ నెల 20న రాత్రి 8.05కి కాకినాడ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.55కి సికింద్రాబాద్ చేరుకుంటుంది. కాకినాడ– సికింద్రాబాద్ (07004) ప్రత్యేక రైలు ఈ నెల 21న రాత్రి 9.25కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.35కి సికింద్రాబాద్ చేరుకుంటుంది.

పలు రైళ్లకు తాత్కాలిక హాల్టింగ్

సాక్షి, హైదరాబాద్: చేగూరులో జరగనున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరయ్యే ప్రతినిధుల కోసం పలు రైళ్లను వికారాబాద్, షాద్‌నగర్ స్టేషన్లలో తాత్కాలికంగా నిలుపనున్నారు. 19 నుంచి 24వ తేదీ వరకు ఈ సదుపాయం ఉంటుంది. తిరుపతి–సికింద్రాబాద్ సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్, బెంగళూర్–కాచిగూడ, చెన్నై ఎగ్మోర్–కాచిగూడ, ముంబై–భువనేశ్వర్, సికింద్రాబాద్–రాజ్‌కోట్, కాకినాడ–ముంబై, రాజ్‌కోట్–సికింద్రాబాద్, హజ్రత్ నిజాముద్దీన్–యశ్వంత్‌పూర్ రైళ్లకు హాల్టింగ్ సదుపాయం కల్పించారు.

ఆడంబరాలపై ఆంక్షలు

- ముస్లిం పెళ్లిళ్లపై వక్ఫ్ బోర్డు యాక్షన్ ప్లాన్
- అర్ధరాత్రి బరాత్‌లు, హంగామాకు చెక్



సాక్షి, హైదరాబాద్: ముస్లింల పెళ్లంటే ఆడంబరాలతో అర్ధరాత్రి దాటాల్సిందే. హంగూ ఆర్భాటాల బరాత్‌తో పెళ్లికొడుకు ఫంక్షన్ హాల్‌కు చేరాలంటే రాత్రి 11.30 గంటలు కావాల్సిందే. తర్వాత నిఖా(పెళ్లి) ప్రక్రియ ముగిసేసరికి అర్ధరాత్రి 12 గంటలు దాటాల్సిందే. ఇక విందు భోజనాల్లో పలు రకాల బిర్యానీలు, చికెన్, స్వీట్ డిష్‌లు ఉండాల్సిందే. ఇదీ హైదరాబాద్‌లో తాజా పరిస్థితి. దీనిని కట్టడి చేసేందుకు తెలంగాణ వక్ఫ్‌బోర్డు పాలకమండలి ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమైంది. ఇటీవల అర్ధరాత్రి వివాహ వేడుకలు, ఆర్కెస్ట్రాలతో పెద్ద ధ్వనులు, 'బరాత్'ల్లో ప్రమాదాలు, నగరవాసులకు కలుగుతున్న ఇబ్బందులు, ఆడంబరాలకు పోయి అప్పులపాలవుతున్న ఉదంతాలపై వక్ఫ్‌బోర్డు స్పందించింది. నిఖా ప్రక్రియ రాత్రి తొమ్మిది గంటలలోపు పూర్తి చేసేవిధంగా వక్ఫ్‌బోర్డు కార్యాచరణ రూపొందిస్తోంది. నిఖాకు సాయంత్రం ఐదు నుంచి రాత్రి 8 గంటల వరకు సమయపాలన నిర్దేశించనుంది. ఈ మేరకు పెళ్లిళ్లు జరిపించే ఖాజీలకు ఆదేశాలు జారీ చేయాలని యోచిస్తోంది.

బిర్యానీ, స్వీట్‌తో సరి: పెళ్లి విందులో ఆడంబరాలకు వెళ్లకుండా బిర్యానీ, స్వీట్‌తో సరిపెట్టే విధంగా కట్టడి చేయాలని వక్ఫ్‌బోర్డు భావిస్తోంది. పెళ్లి విందంటే లక్షల రూపాయలతో కూడుకున్న ఖర్చు. పలు వెరైటీల బిర్యానీ, మటన్, చికెన్, స్వీట్, సూప్ డిష్‌లు వడ్డించడం సర్వసాధారణమైంది. దీంతో ఆయా కుటుంబాలు అప్పులపాలవుతున్నాయి.

12 గంటలకు ఫంక్షన్‌హాల్ మూసివేత

బెంగళూరు, పుణే, మహారాష్ట్రల్లో పెళ్లి ఫంక్షన్‌హాల్‌లో రాత్రి 11.30 తర్వాత లైట్లు ఆర్పివేస్తారు. హైదరాబాద్‌లో మాత్రం తెల్లవారుజాము వరకు విందుభోజనాలు, ఇతర కార్యక్రమాలు కొనసాగుతూనే ఉంటాయి. ఇటీవల ఒక బరాత్‌లో కాల్పులు, మరో బరాత్‌లో తల్వార్ క్రీడ కారణంగా ఒకరు మృతి చెందారు. రాత్రి 12 దాటితే ఫంక్షన్ హాల్‌ను మూసివేసే విధంగా చర్యలు చేపట్టనుంది. నిఖా జరిపించే ఖాజీలు, మతపెద్దలతోపాటు పోలీసు ఉన్నతాధికారులతో 23న వక్ఫ్ బోర్డు పాలకమండలి సమావేశం కానుంది. పెళ్లి వేడుకల సమయపాలన, వివాహ విందుపై సూచనలు, సలహాలు సేకరించాలని నిర్ణయించింది. ఇప్పటికే వక్ఫ్‌బోర్డు చైర్మన్ సలీం పాతబస్తీలోని పోలీసులతో సమావేశమయ్యారు. బరాత్‌లో కత్తులు, డ్రమ్ముల శబ్దాలను నిషేధించారు.





సాక్షి
శుక్రవారం, జనవరి, 19

విద్యారంగ అవస్థ!

పథకాలు కావొచ్చు, విధానాలు కావొచ్చు... వాటిని అమలు చేసే ప్రభుత్వాలు ఫలితాలెలా ఉంటున్నాయో సరిచూసుకోవాలి. తగిన మార్పులు, చేర్పులు చేసుకోవాలి. ఆ పథకాలు, విధానాలపై నిపుణులేమనుకుంటున్నారో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. వారి సలహాలు, సూచనల్లో సహేతుకమైనవి స్వీకరించి అమలు చేయాలి. మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యమైనప్పుడు ఇవన్నీ వాటంతటవే అమల్లోకి వస్తాయి. కానీ అత్యంత కీలకమైన విద్యా రంగం గురించి ఏటా స్వచ్ఛంద సంస్థ ప్రథమ్ వెలువరిస్తున్న వార్షిక విద్యా స్థితి(అసర్) నివేదికలపై మన పాలకులు అలాంటి దృష్టి పెట్టిన దాఖలాలు లేవు. 2005 నుంచి ప్రతియేటా వెలువడుతున్న ఈ నివేదికలు ప్రభుత్వాల్లో కాస్తయినా కదలికలు తీసుకురాలేకపోతున్నాయని తాజాగా వెలువడిన నివేదిక చూస్తే తెలుస్తుంది. 5–16 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలపై దృష్టి సారిస్తూ వారి విద్యా స్థితిగతులను వెల్లడిస్తూ వస్తున్న ప్రథమ్ ఈసారి 14 నుంచి 18 ఏళ్లలోపు వయసున్న పిల్లలను ఎంపిక చేసుకుంది. 24 రాష్ట్రాల్లోని 28 జిల్లాల్లో గ్రామీణ ప్రాంత బడుల్లో అధ్యయనం చేసింది. మన బడులన్నీ ఎప్పటిలానే పిల్లలకు కనీస పరిజ్ఞానాన్ని అందించలేకపోతున్నాయని ఆ అధ్యయనంలో రుజువైంది. అధికార గణాంకాల ప్రకారం 2004–05లో ప్రాథమిక విద్యారంగంలో కోటి 10 లక్షలమంది పిల్లలుంటే 2014–15 నాటికి అది 2 కోట్ల 20 లక్షలు దాటింది. అంటే రెట్టింపయింది. ఇది ఆహ్వానించదగ్గ పరిణామమే అయినా ఆ పిల్లలు వివిధ నైపుణ్యాల్లో ఎంతో వెనకబడి ఉన్నారని తాజా నివేదిక చెబుతోంది. 14–18 ఏళ్ల మధ్యనున్న పిల్లల్లో 14 శాతంమంది మన దేశ భౌగోళిక పటాన్ని గుర్తుపట్టలేకపోయారు. దేశ రాజధాని ఢిల్లీ అన్న సంగతి 36 శాతంమందికి తెలియదు. 25 శాతంమంది తమ మాతృభాషలో ఉన్న పాఠాన్ని కూడా వేగంగా చదవలేకపోతున్నారు. పాఠశాలల్లో చేరికల వరకూ చూస్తే 14 ఏళ్ల వయసులో బాలబాలికల నిష్పత్తి ఇంచుమించు సమానంగానే ఉంది. కానీ 18 ఏళ్ల వయసు వచ్చేసరికి వ్యత్యాసం బాగా పెరుగుతోంది. ఆడపిల్లలు అధిక సంఖ్యలో చదువు మానుకుంటున్నారు. మగపిల్లల్లో చదువు మానుకుంటున్నవారి సంఖ్య 28 శాతం ఉంటే... ఆడపిల్లల్లో అది 32 శాతం. దేశ జనాభాలో 10 శాతంమంది 14–18 ఏళ్ల మధ్యనున్నవారే. ఈ వయసు పిల్లల్లో బాలికల కంటే బాలురే ప్రతిభను కనబరుస్తున్నారు. వివిధ పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగినప్పుడు బాలికలు బాగా వెనకబడి ఉన్నట్టు తేలింది. కంప్యూటర్ల వంటివి బాలికల కంటే బాలురకే ఎక్కువ అందుబాటులో ఉంటున్నాయని నివేదిక తెలిపింది.

మరికొన్నేళ్లలో ఎక్కడో ఒకచోట ఉపాధి పొందాల్సిన ఈ వయసు పిల్లల్లో చదువు సంధ్యలు సరిగా లేకపోవడం, బాలికల్లో చాలామంది చదువు నుంచి తప్పుకోవడం, చదువుతున్న బాలికలకు సైతం బాలురకు ఉన్న సదుపాయాలు లభించక పోవడం గమనిస్తే ఎవరికైనా ఆందోళన కలుగుతుంది. భవిష్యత్తు భారత నిర్మాణంలో కీలకపాత్ర పోషించాల్సిన తరమొకటి వివక్షల విషవలయంలో చిక్కుకున్నదని... అరకొర పరిజ్ఞానమే దానికి అందుబాటులో ఉన్నదని తెలుసుకున్నప్పుడు గుండె చెరువవుతుంది. దీన్ని చక్కదిద్దకపోతే సంభవించే పరిణామాలు ప్రమాదకరంగా ఉంటాయి. నేరాలు పెరుగుతాయి. అశాంతి రగులుతుంది. ఆ తర్వాతి తరాలు సైతం కనీస మౌలిక సదుపాయాలకు దూరమవుతాయి. ఇతర రంగాలతో పోలిస్తే విద్యారంగం అత్యంత కీలకమైనది. నల్లజాతి సూరీడు నెల్సన్ మండేలా అన్నట్టు ప్రపంచాన్ని మార్చగల అత్యంత శక్తిమంతమైన ఆయుధం విద్య. అది అందరికీ సమానంగా అందుబాటులో ఉన్నప్పుడే ఏ దేశమైనా బహుముఖ రంగాల్లో రాణిస్తుంది. వయసు పెరగడం, తరగతి మారడం తప్ప అదనంగా నేర్చుకుంటున్నదేదీ లేనప్పుడు... ఆ పిల్లలకు తగినంతమంది గురువులు అందుబాటులో లేనప్పుడు, ఉన్నా మెరుగైన విద్యను వారికి అందించలేకపోతున్నప్పుడు... కనీస సదుపాయాలు వారికి లభించనప్పుడు ఎందుకూ కొరగాని తరం అవతరిస్తుంది. మన దేశం అంతరాలకూ, వివక్షలకూ పుట్టిల్లు. సామాజికంగా, ఆర్థికంగా ఉన్న వ్యత్యాసాలకు తోడు చిన్ననాటినుంచే ఆడ, మగ మధ్య వివక్ష చూపే ధోరణి కూడా అధికం. ఇదంతా చిన్న వయసు పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వారికి సరైన, ప్రామాణికమైన విద్య అందకుండా చేస్తున్నది.

ప్రథమ్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో 60 గ్రామాలను ఎంపిక చేసుకుంది. తెలంగాణలో నిజామాబాద్ జిల్లాలోని 60 గ్రామాలు తీసుకుంది. రెండుచోట్లా దాదాపు 950 కుటుంబాల చొప్పున ఎంపిక చేసుకుని 1,000 మందికి పైగా యువతను ప్రశ్నించింది. శ్రీకాకుళంలో అక్షరాస్యత శాతం 67.4 ఉంటే, నిజామాబాద్‌లో అది 66.5 శాతం. రెండుచోట్లా మిగిలిన అంశాల్లో మెరుగైన పరిస్థితులే ఉన్నా వృత్తి విద్యా కోర్సుల్లోనూ, నైపుణ్య శిక్షణలోనూ రెండు జిల్లాలూ వెనకబడే ఉన్నాయి. డిజిటల్ రంగానికొస్తే ఈ రెండుచోట్లా ఇంటర్నెట్ వాడకంలో యువత వెనకబడి ఉంటే బాలికల్లో ఆ వెనకబాటుతనం మరీ ఎక్కువగా ఉంది. బాలికల్లో అత్యధికులకు కంప్యూటర్‌లు అందుబాటులో లేవు. ఒకపక్క ప్రభుత్వాలన్నీ రానున్న యుగం డిజిటల్ యుగమని ఊదరగొడుతుంటే ఉపాధికి చేరువలో ఉన్న యువత డిజిటల్ నిరక్షరాస్యులుగా మిగిలిపోవడం ఆశ్చర్యమనిపిస్తుంది. అటు వృత్తి విద్యా కోర్సులు, నైపుణ్య శిక్షణ... ఇటు కంప్యూటర్‌లు, ఇంటర్నెట్ అందుబాటులో ఉంచేందుకు రెండు ప్రభుత్వాలూ చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రపంచంలో యువ జనాభా అధికంగా ఉన్నది భారత్‌లోనే. అయితే ఆ యువత తగినంత పరిజ్ఞానంతో, నైపుణ్యాలతో ఎదుగుతూ అవకాశాలను అందుకుంటేనే వారి కుటుంబాలు, ఆ కుటుంబాలతోపాటు రాష్ట్రం, దేశం ఎదుగుతాయి. వారి అవసరాలను ప్రభుత్వాలు గుర్తించి సకాలంలో సమకూర్చిననాడే అది సాధ్యపడుతుంది. లేనట్టయితే ఆ యువత పెను భారమవుతుంది. ప్రమాదకరంగా పరిణమిస్తుంది. పాలకులు దీన్ని గమనించుకోవాలి.



విద్య అసలు లక్ష్యం సమాధానాలను అందించడం కాదు.. మరిన్ని ప్రశ్నలను సంధించడం.

– హెలెన్ కెల్లర్
అమెరికన్ రచయిత, ఉపాధ్యాయురాలు

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి శు.విదియ ఉ.10.45 వరకు, తదుపరి తదియ, నక్షత్రం ధనిష్ఠ రా.2.01 వరకు, తదుపరి శతభిషం, వర్జ్యం... లేదు, దుర్ముహూర్తం ఉ.8.48 నుంచి 9.33 వరకు, తదుపరి ప.12.31 నుంచి 1.17 వరకు అమృతఘడియలు... ప.2.47 నుంచి 4.32 వరకు.


సూర్యోదయం : 6.39
సూర్యాస్తమయం : 5.43
రాహుకాలం : ఉ.10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు

నమాజ్ వేళలు

ఫజర్	5.34	మగ్రీబ్	6.04
జొహర్	12.27	ఇషా	7.20
అసర్	4.28		

మతాతీత సంస్కరణలే మేలు

విశ్లేషణ



డాక్టర్ ఏపీ విఠల్

ముస్లిం స్త్రీలకు జరుగుతున్న అన్యాయాన్ని తొలగించేందుకు అని చెప్పి ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంలో నేటి పాలకుల చిత్తశుద్ధి ప్రశ్నార్థకం అయ్యే రీతిలో వ్యవహరిస్తే అది ప్రజల మధ్య విద్వేషాలకు దారితీసి, దేశంలో మతపరమైన అశాంతికి ఆస్కారం ఇచ్చే ప్రమాదం ఉంది. దేశంలో 24 లక్షలమంది భర్తలు వదిలివేసిన స్త్రీలు ఉన్నారు. వీరిలో అత్యధికులు ముస్లిమేతర స్త్రీలే. వారు ఎంతో వ్యథకు, బతుకు బాధలకు గురవుతున్నారు. ఈ సందర్భంగా ఈ మహిళలందరికీ న్యాయం చేసే రీతిలో చట్టం రావాలి.

ఇస్లాం మతం ప్రకారం తలాక్ తలాక్ తలాక్ అని ఒక భర్త మూడు సార్లు ఉచ్చరించినా లేదా ఫోన్‌లో గానీ, వాట్సాప్ వంటి వానిలో గానీ, మెసేజ్ ద్వారా సందేశం పంపినా ఆ భార్యకు భర్తతో విడాకులు జరిగిపోయినట్లేనని ప్రచారం! అందువలన ముస్లిం మహిళలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదనీ, ఈ విషాదస్థితి నుంచి వారిని విముక్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం.. ముస్లిం మహిళలకు సైతం మిగిలిన స్త్రీల వలే సమన్యాయం కలిగించేందుకు చట్టం తీసుకురావాలన్న ఉద్దేశంతో ఒక బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. రాజ్యసభలో ఆ బిల్లు ఆమోదం పొందలేదు. రాజ్యసభలో ప్రతిపక్షాలకు మెజారిటీ ఉంది కనుక ఆ బిల్లును స్టాండింగ్ కమిటీ వివిధ పార్టీల ప్రతినిధుల బృందానికి పంపి ఆసాంతం పరిశీలించిన తర్వాత, ఆ కమిటీ ఆమోదంతోనే బిల్లు ప్రవేశపెట్టాలని ప్రతిపక్షాల వాదన!

మూడుసార్లు తలాక్ అని చెప్పినంత మాత్రానే స్త్రీకి అన్యాయం చేస్తూ విడాకులు పొందే ఇస్లాం మత చట్టాన్ని రద్దు చేస్తే ప్రతిపక్షాలకు వ్యతిరేకత ఎందుకు? ముస్లిం మతతత్వవాదుల కొమ్ముకాయడం తప్ప మరేమిటి? అని మోదీ ప్రభుత్వ పెద్దల అభియోగం. సాధారణ దృష్టితో చూస్తే ఇది సవ్యంగానే తోస్తుంది. అయితే ఆ బిల్లు ప్రకారం అలా విడాకులు పొందిన ముస్లిం భర్తకు, మూడేళ్ల కఠిన కారాగారం విధించే అవకాశం ఉండటమే కాకుండా తాను విడాకులు ఇచ్చిన భార్యకు పోషణ నిమిత్తం కొంత భాగాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. నిజానికి గృహ హింసతో స్త్రీని శారీరకంగా, మానసికంగా హింసిస్తే–ఎలాగూ గృహహింస నిరోధక చట్టం ప్రకారం శిక్ష విధింపవచ్చు. ఇది అన్ని మతాల వారికి సమానమే. అలాంటప్పుడు ఒకే నేరానికి రెండు శిక్షలా అన్న సంగతి అటుంచి, భర్తను జైలులో నిర్బంధిస్తే, విడాకులు పొందిన భార్యకు పోషణ నిమిత్తం భరణం ఇమ్మంటే ఎలా తెచ్చి ఇస్తారు? అని మరో ధర్మసందేహం! ఇవేవీ అధిగమించలేని ఆటంకాలు కావు.

కాలం చెల్లుతున్న తలాక్‌పై ఇంత రభసా..?

పైకి ఏదో స్త్రీ జనోద్ధరణ కార్యంగా ప్రచారం చేసుకునే ఈ బిల్లు ముస్లిం మత వ్యతిరేక దుష్ప్రచారానికి ఆస్కారమిచ్చే రీతిలో ఉంది. ఇలా 3 సార్లు తలాక్ చెప్పి విడాకులు పొందే అవకాశం నేటి ముస్లిం మత ఆచరణలో లేదు. అలా విడాకులు పొందేందుకు ఇస్లాం ప్రకారమే ఆచరణలో మొత్తం 5 నెలల వ్యవధిలో 3 సార్లు అలా తలాక్ అనాల్సి ఉంటుంది. ఈ లోపు భార్యాభర్తలకు చెందిన ఇరుపక్షాల పెద్దలు కూర్చుని, పరస్పర వాదనలు విని వారిని కలిపేందుకు ప్రయత్నించి, అవన్నీ విఫలమైన తర్వాతే తలాక్ అమలవుతుంది. నిజానికి కలహాల కాపురంలో పెద్దల జోక్యంతో పరిష్కారం కోసం జరిగే, సామరస్యపూర్వక యత్నం ఏ మతంలోని భార్యాభర్తల విషయంలోనైనా వాంఛనీయమే కదా. కాదు.. మా మతంలో అల్లా ఆదేశించిన దానిని సవరించే హక్కు పాలకులకు, ప్రభుత్వానికి ఎక్కడిది అని ప్రశ్నించే మత పెద్దలు అన్ని మతాలలో ఉండకపోరు. 4 వర్ణాలు అనే కులవిభజన నేనే చేశాను అని సాక్షాత్తూ శ్రీకృష్ణ పరమాత్మ ప్రకటించాడు. మరి అస్పృశ్యతతో సహా పరమ దుర్మార్గమైన ఈ వర్ణ వ్యవస్థ కొనసాగాల్సిందేనని ఎవరైనా హిందూ మతతత్వవాదులు అంటే అంగీకరించలేం కదా. అదలా ఉంచినా, హిందూమతంలో సతీసహగమనం, బహుభార్యత్వం ఆచారంగా అనుశ్రుతంగా ఉండేవి. అలాంటి దురాచారాలకు వ్యతిరేకంగా తీవ్ర అంతర్మథనం జరిగి వాటిని రద్దు చేయించుకోగలిగింది హిందూ సమాజం. అలాగే ఈ తలాక్ పేరుతో పురుషులు స్త్రీలను భోగవస్తువుగా చూడటం, వారిపట్ల అన్యాయంగా వ్యవహరించడం, కుటుంబ జీవితం అస్తవ్యస్తమై మహిళల పరిస్థితి దారుణ అణచివే



తకు గురవడం వంటివాటిని ముస్లిం ప్రజానీకం, నేతలు మొదట గ్రహించి సంస్కరణలు తీసుకువచ్చారు. ముస్లిం లా లోనూ మార్పులు జరిగాయి. కేంద్ర ప్రభుత్వం చెబుతున్నట్లు 3సార్లు వెనువెంటనే తలాక్ చెప్పడం ఇస్లాం చట్టంలో నేడు ఆచరణలో లేదు. పైగా ఈ తలాక్ వల్ల విడిపోయిన భార్యాభర్తలు ఇతర ఏ మతంతో పోల్చి చూసినా చాలా తక్కువ మందే ఉన్నారు.

ముస్లిం స్త్రీకి ఆదినుంచే విడిపోయే హక్కు

అంతే కాదు, ఇస్లాం చట్టంలో పురుషులకు తలాక్ ఎలా ఉన్నదో, అలాగే ముస్లిం స్త్రీలకు కూడా 'కులా' (విడిపోయే హక్కు) ఉన్నది. ముస్లిం స్త్రీ తన భర్త దుష్ప్రవర్తన వల్ల తానెంత వ్యథ చెందుతున్నదో వారి మతగురువు ముందు వివరించి, తాను కూడా 'కులా' కోరవచ్చు. ఆయన ఇతర పెద్దలతో సంప్రదించి, ఆ హక్కు ఆమెకు మంజూరు చేయనూవచ్చు. అయితే అలాంటి హక్కు ద్వారా విడిపోయిన స్త్రీల సంఖ్య చాలా స్వల్పమే. ఒక ముస్లిం మతంలోనే స్త్రీలకు అన్యాయం జరుగుతున్నదని వాదించడం అసంబద్ధం. నిజానికి ఏ మతంలోనూ లేనట్లుగా ముస్లిం మతంలో చాలా ముందునుంచే స్త్రీకి ఆస్తిలో వాటా హక్కు ఉంది. ఆ మతంలోని మౌఢ్య పార్శ్వాన్ని మాత్రమే ప్రచారం చేస్తున్నారు కానీ.. వైవాహిక బంధంలో పురుషునికెంత గౌరవం, హక్కూ ఉన్నదో స్త్రీకి కూడా అంతే సమానంగా ఉండాలన్నది ఇస్లాం మత సూత్రాలలో ఒకటి.

ముస్లిం స్త్రీలకు జరుగుతున్న అన్యాయాన్ని తొలగించేందుకు అని చెప్పి ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంలో నేటి పాలకుల చిత్తశుద్ధి ప్రశ్నార్థకం అయ్యే రీతిలో వ్యవహరిస్తే అది ప్రజల మధ్య విద్వేషాలకు, దేశంలో మతపరమైన అశాంతికి ఆస్కారం ఇచ్చే ప్రమాదం ఉంది. ఉదా॥ దేశంలో 24 లక్షలమంది భర్తలు వదిలివేసిన స్త్రీలు ఉన్నారు. వీరిలో అత్యధికులు ముస్లిమేతర స్త్రీలే. వారు ఎంతో వ్యథకు, బతుకుబాధలకు గురవుతున్నారు. ఈ సందర్భంగా ఈ మహిళలందరికీ న్యాయం చేసే రీతిలో చట్టం రావాలి. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఈ అంశాన్ని పార్లమెంటులోనే నేరుగా ప్రస్తావించినట్లున్నారు.

అలా భర్తచేత తిరస్కృతులైన ఒంటరి భార్యలందరికీ న్యాయం జరిగే చట్టం చేయడం అవసరం. దాదాపు అంతరించిపోతున్న ప్రస్తుత తలాక్ చట్టంతోపాటు, అదేదో ముస్లిం మతాచారాల పట్ల వ్యతిరేకత అన్న భావనకు తావు లేకుండా ఉండటం కోసమైనా మామూలు చట్టం చేయడం అత్యవసరం. పైగా, బహుభార్యత్వం అనే దురాచారం ముస్లి మతాచారంలోనే కాదు.. హిందూమతంలో సైతం 'ఆరాధనీయంగా' ఉండటం ఆశ్చర్యమేమీ కాదు.

చరిత్ర ప్రకారం మహమ్మద్ ప్రవక్తకు పలువురు భార్యలట. అందులో అనాథలు, వితంతువులు, పతితులు ఉన్నారని చెబుతారు. అలాంటి మహిళలను ఉద్ధరించేందుకోసమే ఆయన అన్ని వివాహాలు చేసుకున్నారని విశ్వసించే వారూ ఉన్నారు. ఇక హిందూ దేవుళ్ల గురించి మనకు తెలిసిందే. మన కలియుగ దైవం వేంకటేశ్వర స్వామినే తీసుకుందాం. 'శ్రీదేవి వంకకు చిలిపిగా చూడకు, అలివేలుమంగకు అలుక రానీయకు' అంటూ ఆ జగత్పతి సైతం ఇద్దరు భార్యలను ఎలా ముద్దుగా చూసుకోవాలో సూచిస్తూ గానం చేస్తాం. ప్రవక్త మాదిరే కృష్ణావతారంలో శ్రీకృష్ణుడు సైతం తాను రామావతారంలో ఉన్నప్పుడు తనను ఆరాధించిన వారందరికీ ఈ అవతారంలో కుదరదు (ఏకపత్నీవ్రత) కనుక వచ్చే కృష్ణావతారంలో మీరందరూ గోపికలుగా జన్మించినప్పుడు మిమ్మల్ని స్వీకరిస్తాను అని వాగ్దానం చేశాడట. అందుకే కృష్ణుడికి పదహారు వేలమంది గోపికలు అని భక్తులు అంటుంటారు.

మౌనం అంగీకారమా? అర్ధాంగీకారమా?

ఎవరి విశ్వాసాలు వారివి కావచ్చు. కానీ మన లౌకిక వ్యవస్థలు అన్ని మతాలను సమానంగా చూడాలి. ప్రభుత్వం మతం విషయంలో ఒక్క మతాన్ని కూడా పక్షపాతంతో చూడరాదు. మతం వేరు, మతతత్వం వేరు. మన లౌకిక వ్యవస్థ మతాన్ని నిషేధించదు. అదే సమయంలో మతతత్వాన్ని సహించదు. దురదృష్టవశాత్తూ బీజేపీ నేతలు, మంత్రులు కూడా పరమత ద్వేషం ప్రవచిస్తున్నప్పుడు, వారిని మోదీవంటివారు కనీసం బహిరంగంగా ఖండించని ఫలితంగానే, మొన్న తలాక్‌పై చర్చ సందర్భంగా, 'హిందూ సంస్కృతిలో కలవని ఇతరులకు, ఈ దేశంలోని ముస్లింలకు స్థానం ఉండదు, తమ ఇష్టం వచ్చిన దేశం వెళ్లిపోవచ్చు'నని ఆ పార్టీ నేతలు నిర్భయంగా ప్రకటిస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో మోదీ పాటించే మౌనవ్రతం అర్ధాంగీకారమేనా?

ఇలా మతమూ, మతతత్వ ప్రాతిపదికన కాకుండా, మహిళలకు ఇంతకంటే గుణాత్మకంగా మెరుగైన జీవనం లభించాలంటే సహేతుకమైన సవరణలతో తలాక్ బిల్లు వంటివాటిని ఆమోదించడం అవసరం. అంతకంటే ముఖ్యంగా చట్టసభలలో కనీసం 33 శాతం స్థానాల్లో రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి. అప్పుడే మహిళలకు వాస్తవికంగా మేలు చేకూర్చే చట్టాలు రూపొందే అవకాశం పెరుగుతుంది. కానీ దశాబ్దాలుగా, మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడం లేదు. ఇప్పుడు బీజేపీకి పార్లమెంటులో సరిపడా మెజారిటీ ఉంది. ఈ తలాక్ బిల్లు సందర్భంగా ఆ పార్టీ నేతలు, ముస్లి మహిళలకు న్యాయం కలిగించాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రతిపక్షాలు సైతం కాస్త సవరణ కోరుతున్నాయే తప్ప గంపగుత్తగా ఈ బిల్లును వ్యతిరేకించడం లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించేందుకు కూడా ఇదే అదును.


త్వరలో పార్లమెంటు ఎన్నికలు రాబోతున్నాయి. ఏ పార్టీ అయినా సరే మహిళా శ్రేయస్సు అటుంచితే, మహిళల ఓట్లను మరవజాలదు. పైగా అన్ని పార్టీలూ తరతమ భేదాలతో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించేవే. చట్టసభలో సాధారణ రిజర్వేషన్ అమలయ్యేందుకు లేని అభ్యంతరం మహిళా రిజర్వేషన్ బిల్లుకు మాత్రం ఎందుకుండాలి? పైగా ప్రస్తుత పరిస్థితిలో ఇది సహేతుకమైన డిమాండే. లేకుంటే ఇప్పుడు చట్టసభలలో అసమానతలు గోచరిస్తున్నాయి. ప్రజలలో నూటికి 20 శాతం గర్భదరిద్రులు కాగా 60 శాతం మంది పేదరికం అనుభవిస్తున్నారు. కానీ పార్లమెంటులో నూటికి 50 శాతం పైగా సభ్యులు కోటీశ్వరులు. వారిలో 10 శాతం మంది మరీ కోటీశ్వరులు. మన ఓటర్లలో దాదాపు 50 శాతం మంది మహిళలు. చట్టసభల్లో నూటికి 10–12 మంది మాత్రమే మహిళలు. ప్రజానీకంలో అగ్రకులాలు, ఆధిపత్య కులాలు 15–20 శాతం ఉంటారు. పార్లమెంటులో మాత్రం వీరు 50 శాతం మించే ఉంటారు. ఇది వాస్తవం. దీన్ని బట్టి చూస్తే పార్లమెంటును నిజమైన ప్రజాప్రాతినిధ్య సంస్థగా మార్చాల్సిన అవసరం ఉంది. మతం, మతతత్వం, దైవం ఇవన్నీ విశ్వాసాలు. అందుకే మార్క్స్ మాటలు గుర్తుంచుకోవాలి. 'తమ కష్టాలకు, కన్నీళ్లకు కారణం తెలియని వ్యక్తి మతం ఒడిలో సేద తీరుతాడు. బాధాతప్త హృదయం విడిచే వేడి నిట్టూర్పు వంటిది మతం'. కనుక కష్టాలకు, కన్నీళ్లకు కారణాలను తెలుసుకుని నివారించుకోగలిగిన మేర వేడి నిట్టూర్పులు, మతం ఒడిలో సేద తీరడాలు ఉండవు. కావలసింది అదే. మన కృషి ఆ దిశగా సాగాలి.

వ్యాసకర్త మార్క్సిస్టు విశ్లేషకులు | మొబైల్ : 98480 69720

అలసిన తెలంగాణ ఆకాంక్షలు

ఎన్నికల్లో గెలిచాక ఇకపై ఉద్యమ పార్టీ కాదు అని తెరాస ప్రకటన వెలువడిన క్షణం నుంచే తెలంగాణ ప్రజల వాంఛలకు వ్యతిరేక దిశలో పాలన మొదలైంది. కలాలు తలవంచాయి. కవులకి తమ ఎండిన పూదండల గుబాళింపులే ముఖ్యమయ్యాయి.

విశ్లేషణ



జయధీర్ తిరుమలరావు

మూడున్నరేళ్ల కాలంలో 'తెలంగాణ' ఎంత వెలిగిందో తేటతెల్లంగా మాట్లాడుకోలేకపోయాం. ఎవరు, ఏది మాట్లాడినా తెలంగాణ వ్యతిరేకులుగా ముద్రవేస్తున్నారు. ప్రతిపక్షం అని నిందించడం మామూలైంది. లేదా ఎవరో ఒకరితో ఖండింపచేయడం ఆనవాయితీగా మారింది. ఉద్యోగాలు, అన్ని రంగాలలో వాటా, తెలంగాణ ఆత్మగౌరవ భావన, విద్య, భాష, సాహిత్య, సాంస్కృతిక, పరిశోధన రంగాలలో జరిగిన అవమానం, అన్యాయం ఉద్యమానికి ముఖ్య కారణాలు. ఐతే రాష్ట్రం వచ్చాక ప్రజల ఆకాంక్షల్ని పక్కన పెట్టి తెరాస అధినాయకుల అభీష్టాల కోసం, ప్రయోజనాల కోసమే పాలన ఆరంభమైంది. నేడూ అదే కొనసాగుతున్నది.

ప్రభుత్వం ఏర్పడిన కొత్తల్లోనే ఇప్పుడిక తెరాస ఉద్యమ పార్టీ కాదు అని ప్రకటించారు. అన్ని బూర్జువా పార్టీలలాగే ఎన్నికల పార్టీ అనే సంకేతం ఇచ్చారు. ఈ ప్రకటన వెలువడినప్పుడే ప్రజల నుంచి, ఉద్యమకారుల నుంచి పెద్ద ఎత్తున ప్రతిస్పందన రావలసింది. అందుకు వ్యతిరేకంగా పోరాటం జరగవలసి ఉంది. మావోయిస్టు ఎజెండా మా ఎజెండా అని ప్రకటించిన అధినాయకుల ప్రకటన ఆంతర్యాన్ని బట్టబయలు చేయవలసి ఉంది. కాని ఎందు చేతనో దాని గురించి ఆలోచించలేదు. అదిగో! అప్పటి నుండే తెలంగాణ ప్రజల వాంఛలకు, బతుకులకు వ్యతిరేక దిశలో పాలన మొదలైంది.

ఇరవై శాతం పాలక వర్గాల ప్రయోజనాల ముందు ఎనభై శాతం ప్రజల మత సాంస్కృతిక సాహిత్య చరిత్రలు దిగదుడుపు అయ్యాయి. ఎక్కడా, ఏ రూపంలోనూ ఆలనలో, పాలనలో తెలంగాణ మాటలేదు. అంతా అధినాయకుల కీర్తనే. తెలంగాణ ఆత్మాభిమానం తాకట్టు పెట్టి వంద కోట్లతో తెలుగుకు తారాజువ్వల వెలుగులు అద్దారు. ఆనాటి ఉద్యమ భావనలకు ఇలాంటి కార్యక్రమాలు విరుద్ధం. ఇప్పుడు 'పులగం పెడుతానన్న దొర సొట్ట గిన్నె కూడ లాక్కుపోయిండన్న' చందంగా మారిపోయింది.

ఇప్పుడు తెలంగాణ ప్రజల మనసులు బాగోలేవు. అందుకే పాత నానుడులు, జాతీయాలు, సామెతల వాడుక మెల్లి మెల్లిగా మొదలైంది. ఒక కొత్త విచారధార వారి పదాల్లో తొంగి చూస్తోంది. మాకు మా అసలు తెలంగాణ, కోరిన తెలంగాణ రాలేదు. వచ్చిన తెలంగాణ ఆత్మరహిత తెలంగాణ. ప్రజల అస్తిత్వం, కాంతి లేని రోల్డు గోల్డు తెలంగాణ వచ్చింది. వచ్చింది పాలకవర్గాల తెలంగాణే. ఇది ప్రజలు ఊహించని పరిణామం. మరోసారి తెలంగాణ ప్రజలు, తెలంగాణ పేర ఏర్పడిన పార్టీ, ప్రభుత్వం చేతిలో ఓడినట్లుగానే లెక్కిస్తున్నారు.

'నాభిల సల్ల పడ్డదు ఇక నవాబుకి జవాబేమిస్తదు' అన్నట్టు కలాలు నిస్సిగ్గుగా తల వంచాయి. వీరు నిజానికి 'నియ్యత్ లేని నిప్పులే' కానీ చెద పట్టిన నిప్పులు అయ్యారని భావిస్తున్నారు. ఎవరు ఏమనుకుంటే ఏమి కవులకి తమ ఎండిన పూదండల గుబాళింపులే ముఖ్యం



అయ్యాయి. 'రోశాల పాటగాడికి వేశాలు మెండు' అనే సామెత నిజం అయ్యిందని జనం బాధపడుతున్నారు. ఆనాడు పాటలు పాడిన, ఆటలు ఆడిన వాళ్ళని చూసి ఎకెసక్కాలాడుతుండ్రు. ప్రజల సాంస్కృతిక చరిత్రలో ఇంత దిగజారుడు తనాన్ని ఏనాడు చూడలేదని ఒకటే బాధ. ఈ కవులను చూశాక పిట్టల దొరలు అంతరించిపోయారు. కాని కొత్త దొరలు ఈ కొత్త పిట్టలదొరలను సృష్టించుకున్నారని అంటున్నారు.

ఇప్పుడు, తెలంగాణ ఆత్మ, నాలుగు కోట్ల ప్రజల గుండెలను తట్టి లేపుతున్నది. ఉమ్మడి పాలనలో 'మిస్' అయిన సన్మానం, ప్రతి శాలువ తనకే కావాలని సర్కారీ కవులు కంకణబద్ధులయ్యారు. ఈ మూడున్నరేళ్ళలో కవుల మతలబు ఏమిటి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 'నాలిక మీద ప్రేమ. నాభి కాడ కోపం' కలిగిన పాలకుల అసలు స్వభావం అర్థం చేసుకున్నారు. 'తొండకు దొరతనమిస్తే ప్రహరీ గోడ మీద సవారి చేసింద'నే నానుడిని, 'ఊసరవెల్లి అసలు రంగు మోసమే' అని తేటతెల్లంగా గ్రహించారు.

తెలంగాణలో జరగవలసినవి తక్కువ జరిగాయి. జరగకూడనివి అతి ఎక్కువగా జరుగుతున్నాయి. వీటి మధ్య సమతౌల్యం లేని కారణంగా తెలంగాణలో అనిశ్చిత వాతావరణం నెలకొంది. అశాంతి గాలులు వీస్తున్నాయి. ఇప్పుడు ఏ పార్టీ, ఏ పంథా అయినా మరోసారి 'తెలంగాణకు సై' అంటుందో వారికే ఇక్కడ భవిష్యత్తు ఉంది. ఎన్నికలు ముఖ్యం కాదు. తెలంగాణ ప్రజల పూర్తి కాని ఆకాంక్షలే ప్రధానం. ఇప్పుడు అధికారం కోసం రాజకీయాలు ఆపి పరిపూర్ణ తెలంగాణ కోసం పోరాడాలి. జైళ్ళ కైనా వారు వెళ్లగలగాలి.

'నూతిలో తుపాకి గుండేసి తూటు చూపియ్యి అన్నాడట' వెనకటికో దొరగారు. ఆనాటికది సామెత! నేడు ప్రజలు తమ గుండెలు విప్పి చూపి అన్నీ తూటులే అని అంటున్నారు. తెలంగాణలో బంగారం అంతా ఎక్కడ ఎక్కువగా కుప్ప కూడుతున్నదో కళ్లు విప్పి చూస్తున్నారు. మొలిచే కొమ్ములను వంచడానికి మార్గం వెదుకుతున్నారు. చల్లబడిన సిద్ధాంతాలను పెనం మీద కాదు, అగ్గి కొలిమిని రాజేసి పరీక్షిస్తున్నారు.

తెలంగాణ ఉద్యమం గతం కాదు. అది రేపులో కదలాడుతున్నది. 'గురిజెత్తు ఆశయం, గురి చూసి కొట్టే అమ్ముల పొది'లా ఉంది పరిస్థితి. తెలంగాణ ఎన్నడూ పాలకులకు సింహస్వప్నమే. అసలు సిసలు తెలంగాణ సాధన కోసం ఉద్యమం కొనసాగింపు దిశగా కదులుతుందా?

వ్యాసకర్త అధ్యక్షులు, తెలంగాణ రచయితల వేదిక
మొబైల్ : 99519 42242

భద్రత సమాచారమూ ఇవ్వరా?

రైళ్ల భద్రత ప్రాజెక్టు ఎవరి వ్యక్తిగత సమాచారం? ఇది ప్రయాణికుల, రైల్వే ఆస్తుల భద్రత. శాస్త్రవేత్తలు పరిశోధించి భద్రతకు సహకరిస్తారని ఎవరైనా అనుకుంటారు కానీ, శాస్త్రజ్ఞులు దీన్ని వ్యక్తిగత విషయం అంటారా?

విశ్లేషణ



మాడభూషి శ్రీధర్

1. రైళ్ల రక్షణ హెచ్చరిక వ్యవస్థ (ట్రైన్ ప్రొటెక్షన్ వార్నింగ్ సిస్టం)ను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (సీఈఎల్) 2013లో ప్రతిపాదించిన పథకానికి మంజూరు చేసిన వ్యయం ఎంత? 2. మంజూరుపత్రం కాపీ ఇవ్వండి. 3. విడుదలైన డబ్బు వినియోగించినట్టు ధృవీకరణ పత్రం నకలు ఇవ్వండి. 4. సీఈఎల్‌కు విడుదల చేసిన నిధుల వివరాలు ఇవ్వండి. 5. సీఈఎల్ పథకాన్ని పూర్తిచేసినట్టు ధృవీకరణ పత్రం నకలు ఇవ్వండి. 6. ప్రాజెక్టు పూర్తికాకపోతే కారణాలు తెలపండి, ఎప్పటికి పూర్తవుతుందో చెప్పండి. 7. మంజూరు చేసిన వ్యయానికి లోబడి ప్రాజెక్టు పూర్తి అయిందా? కాక అదనపు ఖర్చును మంజూరు చేస్తూ జారీ చేసిన పత్రం నకలు ఇవ్వండి. 8. ఈ ప్రాజెక్టు టెక్నికల్ ఎవాల్యుయేషన్ కమిటీ పరిశీలించి ఉంటుంది. వారి నివేదికలో ఆర్థిక సాంకేతిక లోపాల గురించి ప్రస్తావిస్తే ఆ వివరాలు ఇవ్వండని ఎనిమిది అంశాలమీద సమాచారాన్ని అడిగారు అస్తిత్వ అనే వ్యక్తి. శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ కింద పనిచేసే శాస్త్ర పారిశ్రామిక పరిశోధనా శాఖ (డీఎస్ఐఆర్) జవాబు ఇవ్వాలి.

కానీ ఇదంతా వ్యక్తిగతమట. సెక్షన్ 8(1)(జె) కింద ఇవ్వరట. అస్తిత్వ అడిగిన సమాచారం సంక్షిప్తంగానైనా ఇవ్వాలని మొదటి అప్పీలు అధికారి ఆదేశించారు. ప్రాజెక్టు వివరాలను వ్యక్తిగత సమాచారమంటూ తిరస్కరించడం తీవ్రమైన విషయం. రైళ్ల భద్రత ప్రాజెక్టు ఎవరి వ్యక్తిగత సమాచారం? ఇది ప్రయాణికుల, రైల్వే ఆస్తుల భద్రత. శాస్త్రవేత్తలు పరిశోధించి భద్రతకు సహకరిస్తారని ఎవరైనా అనుకుంటారు కానీ, శాస్త్రజ్ఞులు దీన్ని వ్యక్తిగత విషయం అంటారా? పోనీ సీపీఐఓ భావించినట్టు ఇది వ్యక్తిగత సమాచారమని అనుకున్నా, దానికి జనహితం అనే మినహాయింపు ఉంది కదా! ఆ జనహితం కోసమైనా ఈ సమాచారం ఇవ్వవచ్చు కదా?

ఆర్టీఐ దరఖాస్తు 23.5.2017న దాఖలైంది. విమల్ కుమార్ వరుణ్ ఆ దరఖాస్తును జీ– విభాగం శాస్త్రజ్ఞుడు బీఎన్ సర్కార్‌కు పంపారు. సెక్షన్ 5(4) కింద అస్తిత్వగారు కోరిన సమాచారం ఇవ్వాలని కోరుతూ 25.5.2017న లేఖ రాశారు. ఆ లేఖ ప్రతిని సమాచార కమిషన్‌కు వివరణతో పాటు సమర్పించారు. అయినా బీఎన్ సర్కార్ ఇది వ్యక్తిగత సమాచారమనీ, సెక్షన్ 8(1)(జె) కింద ఇవ్వడం చెల్లదనీ జవాబిచ్చారు. మొదటి అప్పీలు అధికారి ఆదేశం తరువాత కూడా పూర్తి సమాచారం రాలేదని అస్తిత్వ కమిషన్‌కు వివరించారు.

సీఈఎల్‌కు పరిశోధన చేయడానికి గాను తమ విభాగం (డీఎస్ఐఆర్) ఆర్థిక సాయం చేస్తుందని,



మార్కెట్ అవసరాలను అనుగుణంగా కొన్ని ఉత్పత్తులు చేయడానికి సహకరించి, ఆ వస్తువులను వాణిజ్యపరంగా వినియోగిస్తుందని వివరించారు. కొన్ని ధృవపత్రాలు కూడా అస్తిత్వకు ఇచ్చామనీ, అయితే పొరబాటున వాటిని ధృవీకరించడం మరిచిపోయామనీ చెప్పారు. అయితే సీఈఎల్ అనేది కంపెనీ కనుక, వాణిజ్య వ్యవహారాలను నడుపుతుంది కనుక అడిగిన సమాచారం మొత్తం ఇస్తే అందులో వాణిజ్య రహస్యాలు ఉంటాయి కనుక ఇవ్వకూడదని సెక్షన్ 8(1)(డి) కింద మినహాయింపు వర్తిస్తుందని భావించామని, కానీ పొరబాటున సెక్షన్ 8(1)(జె) అని రాశామని కూడా సీపీఐఓ తన వివరణలో తెలియజేశారు.

రికార్డు పరిశీలిస్తే డిసెంబర్ 13 (2017)న ఇచ్చిన జవాబుల్లో కూడా డీమ్డ్ పీఐఓ బీఎన్ సర్కార్ 5,6,7,8 అంశాలకు సరైన జవాబు, పూర్తి సమాచారం ఇవ్వలేదని తెలుస్తున్నది. అయిదో అంశంపైన ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదని చెప్పారు. అందుకు కారణాలు చెప్పలేదు. ఎప్పుడు పూర్తయ్యే అవకాశం ఉందో చెప్పలేదు. ఆరో ప్రశ్నకు ఆలస్యంగా 'పరిశీలనలో ఉంది' అని జవాబు ఇచ్చారు. ఏ పరిశీలన? ఎవరి పరిశీలన? ఏడో పాయింట్‌కు నాట్ అప్లికబుల్ అని ఊరుకున్నారు. మొత్తం ప్రాజెక్టు మంజూరైన వ్యయానికి లోబడి ఉందా లేదా అంటే వర్తించదు అని జవాబిస్తారా? ఎనిమిదో పాయింట్‌కు అటువంటి కమిటీ లేదు. కమిటీ ఏ లోపాన్నీ కనిపెట్టలేదని జవాబు. 5 నుంచి 8 వరకు పాయింట్లకు వాణిజ్య రహస్యానికి సంబంధమే లేదు. కనుక 8(1)(డి) కూడా వర్తించదు. బీఎన్ సర్కార్ గారు మళ్లీ మళ్లీ 8(1)(డి)నే వర్తిస్తుందని, పత్రాలను ధృవీకరించనందుకు విచారం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. శాస్త్రజ్ఞులు ఇవ్వాల్సిన జవాబులా ఇవి? విమల్ కుమార్ వరుణ్ సీపీఐఓ ఈ సమాచారం ఇవ్వాలని స్పష్టంగా లేఖ రాశారు. కానీ సమాచారం అధీనంలో ఉన్న శాస్త్రజ్ఞుడైన సర్కార్ నిరాకరించడం వల్ల ఇవ్వలేకపోయారు. అస్తిత్వ ఈ ప్రాజెక్టు నిర్వహణలో అనేకానేక లోపాలను వివరిస్తూ ఆడిట్ ఇచ్చిన ఒక నివేదిక భాగాలను కమిషన్‌కు సమర్పించారు. వీటికి జవాబివ్వాలని కూడా కమిషన్ ఆదేశించింది.

(అస్తిత్వ వర్సెస్ సైన్స్/టెక్నాలజీ మంత్రిత్వ శాఖ CIC/DOSIR/A/2017/159662 కేసులో సీఐసీ 12 జనవరి 2018న ఇచ్చిన ఆదేశం ఆధారంగా).

వ్యాసకర్త కేంద్ర సమాచార కమిషనర్
professorsridhar@gmail.com

నేరస్తుల లెక్క.. ఇక పక్కా!

రాష్ట్రంలో నేరస్తులు 2.18 లక్షలు

- సమగ్ర సర్వేతో లెక్కతేల్చిన పోలీసు శాఖ
- గురువారం ఒకే రోజున రాష్ట్రవ్యాప్తంగా సర్వే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో తరచూ నేరాలకు పాల్పడేవారు 2.18 లక్షల మంది ఉన్నట్లు పోలీసుశాఖ నేరస్తుల సమగ్ర సర్వేలో లెక్కతేల్చింది. రాష్ట్రంలో నేరస్తుల గుర్తింపు, వారి కదలికలు, నిఘా కోసం గురువారం ఒకే రోజున రాష్ట్రవ్యాప్తంగా ఈ సర్వే నిర్వహించింది. డీజీపీ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని స్థాయిల పోలీసు సిబ్బంది ఇందులో పాల్గొన్నారు. పదే పదే నేరాలకు పాల్పడేవారెంత మంది, దొంగలు ఎందరు, దోపిడీలకు పాల్పడేవారెంత మంది, ఈవ్‌టీజింగ్, ఇతర నేరాలకు పాల్పడేవారెంత మంది ఉన్నారనే లెక్కలు తేల్చారు.

పదే పదే నేరాలు చేసే..

దొంగతనాలు, దోపిడీలు, గ్యాంగులు, ముఠాలు, ఈవ్‌టీజర్లు.. ఇలా పలు రకాల నేరాలను పదే పదే చేసేవారిని సమగ్ర సర్వే ద్వారా గుర్తించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో గత పదేళ్లకాలంలో తరచూ నేరాలకు పాల్పడినవారి వివరాలు సేకరించారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 2.18 లక్షల మంది నేరస్తులున్నట్టు గుర్తించారు. వారందరి తాజా ఫొటోలు, నివాసాలు, గుర్తింపు కార్డులు తదితర వివరాలను సేకరించి నమోదు చేశారు. అంతేగాకుండా ఆయా నేరస్తుల్లో మార్పు తీసుకువచ్చేందుకు వారి కుటుంబాలను పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. హైదరాబాద్‌లోని హబీబ్‌నగర్, సైబరాబాద్‌లోని మాదాపూర్, రాచకొండలోని సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన నేరస్తుల సమగ్ర సర్వేలో డీజీపీ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీఎస్ కాప్‌కు అనుసంధానం

సమగ్ర సర్వే ద్వారా గుర్తించిన నేరస్తుల వివరాలను, వారి నివాసాలకు చేసిన జియో ట్యాగింగ్‌ను ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెట్రోలింగ్ వాహనాలు, బ్లూకోల్ట్స్ వాహనాలకు అనుసంధానించారు. అంతేగాకుండా ఈ వివరాలన్నింటినీ టీఎస్ కాప్ యాప్‌కు అనుసంధానం చేయనున్నారు. తద్వారా ఎక్కడైనా దొంగతనం లేదా ఇతర నేరం ఏదైనా జరిగితే.. వెంటనే అనుమానితులను గుర్తించడం, వారి నివాసాలకు వెళ్లి విచారించడం సులభతరం కానుంది. పెట్రోలింగ్‌లో ఉండే సిబ్బంది కూడా నేరస్తులను గుర్తించడంతో పాటు వారి కదలికలను కనిపెట్టడం సులువు అవుతుందని డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు.



బస్తీవాసులతో మాట్లాడుతున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

పకడ్బందీగా నేరాల నియంత్రణ

నేరస్తుల సమగ్ర సర్వే భవిష్యత్తులో నేరాల నియంత్రణకు బాగా తోడ్పడుతుందని డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి చెప్పారు. మూడు పోలీస్‌స్టేషన్లలో నిర్వహించిన సర్వేలో పాల్గొన్న ఆయన.. రాచకొండ కమిషనరేట్ పరిధిలో హబీబ్‌నగర్‌లోని మాన్గార్‌బస్తీకి వెళ్లి పరిశీలించారు. అక్కడ కొందరు నేరస్తులకు కౌన్సెలింగ్ చేశారు. భవిష్యత్తులో ఎలాంటి నేరాలూ చేయవద్దని, పరివర్తన చెందిన వారికి ఉపాధి మార్గాలు చూపిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రమంతటా నేరస్తుల సర్వే చేపట్టామని.. ప్రతిచోట ప్రజల మధ్య జీవిస్తున్న నేరస్తుల వివరాలు వెలుగులోకి వస్తాయని చెప్పారు. నేరస్తుల తాజా ఫొటో, వేలిముద్రలతో పాటు ఆధార్ నంబర్‌ను కూడా సేకరిస్తున్నామని, ఆ వివరాలను సర్వర్‌లో నిక్షిప్తం చేస్తామని తెలిపారు. ఆ వివరాలను పోలీసు సిబ్బందికి అందుబాటులో ఉంచుతామని.. పాత నేరస్తులు ఎలాంటి నేరం చేసినా తప్పించుకోవడానికి ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు. నేరస్తులలో పరివర్తన తీసుకురావడానికి పోలీసుశాఖ చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు.

ఇతర రాష్ట్రాల నేరస్తులపైనా

ప్రస్తుతం రాష్ట్రంలో నేరాలకు పాల్పడుతున్న వారిని సర్వే ద్వారా గుర్తించిన పోలీసులు.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి నేరాలు చేసేవారిపైనా దృష్టి పెట్టారు. దోపిడీలు, దొంగతనాలు చేసే ఆ ముఠాలు, వాటిలోని సభ్యుల సమాచారాన్ని క్రోడీకరించాలని భావిస్తున్నారు. ఆ వివరాలను సంబంధిత రాష్ట్రాల పోలీసులకు పంపించి.. వారి తాజా ఫొటోలు, నివాసం, గుర్తింపు వివరాలను తెప్పించుకోవాలని యోచిస్తున్నారు. జియోట్యాగింగ్ విధానాన్ని ఆయా రాష్ట్రాల పోలీసులకు కూడా వివరించాలని.. తద్వారా ఇతర రాష్ట్రాల నేరస్తులను కట్టడి చేయడం వీలవుతుందని భావిస్తున్నారు.

రూ.3.6 కోట్ల గుట్కా పట్టివేత

నాలుగు గుట్కా తయారీ కేంద్రాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

హైదరాబాద్: గుట్కా తయారీ కేంద్రాలపై దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. రూ.3.6 కోట్ల విలువైన గుట్కా, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌చార్జి కమిషనర్ వి.వి.శ్రీనివాసరావు, దక్షిణ మండలం డీసీపీ సత్యనారాయణ గురువారం ఇక్కడ కేసు వివరాలు వెల్లడించారు. మల్లేపల్లికి చెందిన షుజాత్ అలీ ఖాన్(48), హుమాయున్‌నగర్‌కు చెందిన ఖాజా సలీముద్దీన్(46) డబ్బులు సంపాదించేందుకు గుట్కా తయారీ ప్రారంభించారు. మహారాష్ట్ర ఔరంగాబాద్‌కు చెందిన అలీం, గోఖలే నుంచి గుట్కా ముడిసరుకు కొనుగోలు చేసి బండ్లగూడ ఇస్మాయిల్‌నగర్‌లో 4 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 'ఆదత్', 'పెట్రోల్' బ్రాండ్‌లతో గుట్కా తయారు చేసి ఔరంగాబాద్ కు సరఫరా చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ ఎస్.చైతన్య కుమార్ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ కె.మధుమోహన్‌రెడ్డి, ఎస్సైలు జి.వెంకటరామిరెడ్డి, మహ్మద్ తఖీయుద్దీన్ దాడులు చేసి షుజాత్ అలీఖాన్, సలీముద్దీన్, రహీముద్దీన్‌ను అరెస్ట్ చేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కా మిషన్లు, సామగ్రి

స్వాధీనం చేసుకున్న సామగ్రి: నిందితుల వద్ద నుంచి ఎనిమిది మిషన్లు, ఒక మిక్సింగ్ మిషన్, ఆదత్, పెట్రోల్ బ్రాండ్‌లకు చెందిన 80 సంచుల గుట్కా, నాలుగు సంచుల్లో ఏ–జర్దా బ్రాండ్ గుట్కా, 24/7 బ్రాండ్ గుట్కా, మెగ్నీషియం కార్బొనేట్ పౌడర్, సుపారీ బ్యాగ్‌లు, గులాబ్ జెల్ బాటిళ్లు, పుదీనా క్రిస్టల్స్ కాటన్లు, 100 సంచుల పౌడర్, 50 కిలోల జర్దా, ఆటోట్రాలీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గుట్కారహిత నగరంగా హైదరాబాద్: కమిషనర్

నగర చరిత్రలో మొదటిసారిగా ఇంత పెద్ద మొత్తంలో గుట్కాను పట్టుకున్నట్లు కమిషనర్ తెలిపారు. గుట్కా రహిత నగరం కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. గంజాయి రవాణా కాకుండా చూస్తున్నామని చెప్పారు.

23న నిరుద్యోగ గర్జన

ఆర్. కృష్ణయ్య



హైదరాబాద్: తెలంగాణ వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామంటూ ఊదరగొట్టిన సీఎం కేసీఆర్.. రాష్ట్రం ఏర్పడి 4 ఏళ్లు కావస్తున్నా ఉద్యోగాల మాటెత్తడం లేదని బీసీ సంక్షేమ సంఘం నేత, టీడీపీ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య విమర్శించారు. గురువారం ఇక్కడ జరిగిన నిరుద్యోగుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సీఎం, మంత్రులను ఉద్యోగాల గురించి అడిగితే 6 నెలల్లో భర్తీ చేస్తామంటూ నిరుద్యోగులను మభ్యపెడుతున్నారే తప్ప నోటిఫికేషన్లు ఇవ్వడంలేదన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలన్న డిమాండ్‌తో ఈ నెల 23న నల్లగొండ జిల్లాలో నిరుద్యోగ గర్జన నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, లాల్ కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, మధు, రాంబాబు, సతీష్ చందర్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

సంఘం ప్రధాన కార్యదర్శిగా బీఆర్ కృష్ణ

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బీఆర్ కృష్ణను నియమిస్తూ ఆర్.కృష్ణయ్య నిర్ణయం తీసుకున్నారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో బీసీలకు 25 శాతం రిజర్వేషన్ల కోసం 1980లోనే ఆయన పోరాడి విజయం సాధించారన్నారు.

ఐదంటే ఐదే..!

- వెంచపల్లి అభయారణ్యంలో కృష్ణ జింకలు మాయం
- విచ్చలవిడిగా వేట.. ఐదుకు పడిపోయిన సంఖ్య

సాక్షి, హైదరాబాద్: అంతర్ధాన దశలో ఉన్న కృష్ణ జింకలకు ఆయువు పోసి వందల కొద్దీ జింకలకు గంతులు నేర్పిన అభయారణ్యమది. ప్రాణహిత నది ఒడ్డున చెంగు చెంగున ఎగురుతూ కనువిందు చేసే లేడి పిల్లలకు నెలవైన ప్రాంతమది. గుంపులు గుంపులుగా ఉండే జింకలకు ఆ అడవే మృత్యుపాశమైంది. అటవీ శాఖ నిర్లక్ష్యం కారణంగా వాటి ఉనికి వెతుక్కోవాల్సిన పరిస్థితి దాపురించింది. అటవీ శాఖ మంత్రి జోగు రామన్న సొంత జిల్లా ఉమ్మడి ఆదిలాబాద్‌లోని కోటపల్లి మండలం ప్రాణహిత నది ఒడ్డున ఉన్న వెంచపల్లి జింకల అభయారణ్యం వేటగాళ్లకు అడ్డాగా మారింది. 1980లో మందలకు మందలుగా ఉన్న కృష్ణ జింకలు ఇప్పుడు పదిలోపే ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. త్వరలో అటవీ జంతువుల గణన మొదలవనున్న నేపథ్యంలో వాటి సంఖ్యను ఎలా చూపించాలో తెలియక అటవీ అధికారులు తలపట్టుకున్నారు.



1999లో కృష్ణ జింకల అరణ్యంగా..

మంచిర్యాల జిల్లా కోటపల్లి రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతమే ఈ ప్రాణహిత జింకల అభయారణ్యం. కోటపల్లి, పారుపల్లి, జనగామ, సుపాక, అర్జునగుట్ట, కిన్నారం గ్రామాల పరిధిలోని ప్రాణహిత నది ఒడ్డున ఈ వెంచపల్లి అరణ్యం విస్తరించి ఉంది. 1980లో వైల్డ్ లైఫ్ అభయారణ్యంగా ఉన్న ఈ ప్రాంతంలో కృష్ణ జింకలు ఎక్కువగా ఉండటంతో 1999లో కృష్ణ జింకల అభయారణ్యంగా ప్రకటించారు. కానీ సమీప ప్రాంతంలోనే పంటపొలాలు ఉండటం, జింకలు తరచూ అక్కడికి వస్తుండటంతో వేటగాళ్లు మాటు వేసి హతమార్చుతూ వచ్చారు. వెంచపల్లి ప్రాంతానికెళ్తే కచ్చితంగా జింకలు ఉంటాయని ప్రచారం జరగటంతో వేటగాళ్లకు అడ్డా అయిపోయింది.

అసలున్నాయో లేవో..

ఉచ్చులు, విద్యుత్ తీగలతో గ్రామీణ ప్రాంత వేటగాళ్లు.. జీపులు, ఆధునిక ఆయుధాలతో పట్టణ ప్రాంత హంటర్లు పచ్చిక బయళ్లపై విరుచుకుపడటంతో కృష్ణజింకల ఆనవాళ్లు లేకుండా పోయాయి. అటవీ అధికారులు అడవిని వదిలి పట్టణాల్లో ఉండటం, అక్కడి నుంచి విధులు నిర్వర్తించటంతోనే జంతువులకు రక్షణ కరువైందని స్థానికులు చెబుతున్నారు. అటవీ శాఖ 2007 లెక్కల ప్రకారం ఇక్కడ 40 కృష్ణ జింకలు ఉన్నట్లు తేలింది. 2015లో కిన్నారం గ్రామంలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు తాకి పెద్దపులి చనిపోవడంతో నిద్ర లేచిన ఫారెస్టు అధికారులు ఆ ఏడాది మరోసారి గణన చేయగా.. ఐదు కృష్ణ జింకలే లెక్కకు దొరికాయి. తర్వాత రెండేళ్లలో చేసిన గణనలో కృష్ణ జింకల లెక్కలు అధికారులు బయటపెట్టలేదు.

100కు పైగా ఉన్నాయి

వెంచపల్లి అభయారణ్యంలో 100కు పైగా కృష్ణ జింకలు ఉన్నాయి. ఈ నెలలో కృష్ణ జింకల గణన చేస్తాం. అడవిలో తరచూ పెట్రోలింగ్ చేస్తున్నాం. ప్రాణహిత మార్గంలో రోడ్డు వెంట ప్రమాద సూచికలు ఏర్పాటు చేశాం.

– రవి, ఫారెస్టు రేంజర్

ఐఆర్‌పీలు.. అడ్డగోలు ఫీజులు

- దివాలా పరిష్కారదారుల తీరుపై ఎన్‌సీఎల్‌టీ విస్మయం
- రూ. 4.17 కోట్ల రుణం చెల్లించడంలో విఫలమైన మధుకాన్

సాక్షి, హైదరాబాద్: పావలా కోడికి ముప్పావలా మసాలా చందంగా తయారైంది దివాలా పరిష్కారదారు(ఐఆర్‌పీ)ల తీరు. నిర్దిష్టమైన నిబంధనలు, మార్గదర్శకాలు లేకపోవడంతో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇటీవల మధుకాన్ కంపెనీ దివాలా ప్రక్రియలో ఐఆర్‌పీ కోరుతున్న ఫీజు చెల్లించాల్సిన రుణానికి 3 రెట్లు ఎక్కువగా ఉండటంతో విస్మయం వ్యక్తం చేసిన హైదరాబాద్‌లోని జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ).. ఈ వ్యవహారాన్ని ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డు (ఐబీబీఐ)కు నివేదించింది. సమస్యకు పరిష్కారం చూపి ఫీజు ఎక్కువగా ప్రతిపాదించిన ఐఆర్‌పీపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరింది. ఎన్‌సీఎల్‌టీ సభ్యులు విత్తనాల రాజేశ్వరరావు, రవికుమార్ దురైస్వామిల ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. మధుకాన్ సంస్థ తీసుకున్న రుణం రూ.4.17 కోట్లు చెల్లించడంలో విఫలమైనందుకుగాను దివాలా ప్రక్రియను ప్రారంభించాలంటూ ఎన్‌సీఎల్‌టీలో ముంబైకి చెందిన శ్రీకృష్ణ రైల్ ఇంజనీర్స్ లిమిటెడ్ పిటిషన్ దాఖలు చేసింది. కేసుకు సంబంధించి దివాలా పరిష్కారదారుగా నియమితులైన భావనా సంజయ్ రుయా.. రుణదాతల కమిటీ మొదటి సమావేశం వరకు రూ.5 కోట్లు, తర్వాత నెలకు రూ.1.75 కోట్ల ఫీజు చెల్లించాలని ప్రతిపాదించారు. మధుకాన్ చెల్లించాల్సిన రుణం వడ్డీ సహా రూ.4.17 కోట్లేనని ధర్మాసనం తెలిపింది. మధుకాన్ ఎండీ, సీఈవోల వేతనం ఏడాదికి రూ.60 లక్షలు, పూర్తిస్థాయి డైరెక్టర్ల వేతనం రూ.50 లక్షలు.. వీరి వేతనాలు ఏడాదికి రూ.1.10 కోట్లు అవుతుందని, ఐఆర్‌పీ మాత్రం రూ.14 కోట్లు ఫీజుగా ప్రతిపాదించారని ఆక్షేపించింది. ఐఆర్‌పీ భావనా రుయా పిటిషనర్ తరపు న్యాయవాది సంజయ్ రుయా భార్యని.. సంజయ్ కూడా ఐఆర్‌పీగా రూ.85 లక్షలు ఫీజు ప్రతిపాదించగా రూ.9లక్షలకు తగ్గించినట్లు గుర్తు చేసింది. భావన ప్రతిపాదించిన అసాధారణ ఫీజుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని ఐబీబీఐకి సిఫార్సు చేసింది.

2030 నాటికి పరిశోధనల్లో అగ్రస్థానం

కేంద్ర మంత్రి హర్షవర్ధన్



సాక్షి, హైదరాబాద్: శాస్త్ర పరిశోధనల్లో భారత్‌ను 2030 నాటికి ప్రపంచంలోనే టాప్–3 దేశాల్లో ఒకటిగా నిలిపేందుకు కృషి చేయాలని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి హర్షవర్ధన్ పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్ఐ)ను ఆయన సందర్శించారు. ప్రయోగశాలల్లో జరిగే పరిశోధనలను సమాజానికి ఉపయోగపడేలా మార్చాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. దేశంలోని 100 వెనుకబడిన జిల్లాలతో పాటు ఈశాన్య భారత్ అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ జిల్లాల్లోని ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే పరిశోధనలకు శ్రీకారం చుట్టాలని కోరారు. తాగు, సాగునీటి కొరతపై దృష్టి సారించాలని సూచించారు. ఇటీవల సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలో జరిగిన పరిశోధనలకుగాను సీఎస్ఐఆర్ డైరెక్టర్ వి.ఎం.తివారీ నేతృత్వంలోని యువ శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు.

జూరాల నుంచి భీమాకు నీటి విడుదల

అధికారులతో మంత్రి జూపల్లి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: జూరాల నుండి భీమా రెండో దశకు నీరు విడుదల చేయడానికి సాగునీటి పారుదల శాఖ అధికారులు నిర్ణయించారు. గురువారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. దాదాపు 15వేల ఎకరాల పంటకు ఆఖరు తడికోసం నీటిని ఇవ్వాలన్న మంత్రి జూపల్లి సూచన మేరకు అధికారులు ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. మూడు రోజులపాటు నీటిని విడుదల చేయనున్నారు. సమావేశంలో జూపల్లితో పాటు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, నీటి పారుదలశాఖ ఈఎన్‌సీ మురళీధర్‌రావు, సీఈ ఖదేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా లేకుండానే ఎన్నికలకు ఏర్పాట్లా?

సీఎంను ప్రశ్నించిన మర్రి శశిధర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఓటర్ల జాబితా లేకుండానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఎలా ప్రకటిస్తారని మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి ప్రశ్నించారు. ఓటర్ల జాబితాను వెలువరించిన తర్వాత ఎన్నికల ప్రక్రియకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ముందుగానే ఓటర్ల జాబితా ప్రకటించాలన్నారు. ముఖ్యమంత్రి కుట్రపూరితంగా వ్యవహరిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. టీఆర్ఎస్‌కు అనుకూలంగా లేనివారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించారని ఆరోపించారు.

బీసీలకు నిధులు పెంచుతాం: మంత్రి జోగు



సాక్షి, హైదరాబాద్: వచ్చే బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి నిధులను పెంచనున్నట్లు మంత్రి జోగు రామన్న తెలిపారు. సచివాలయంలో గురువారం జరిగిన బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్–2018 ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడుతూ..బీసీల అభ్యున్నతి కోసం ప్రణాళికలు రూపొందించామని, వీటి అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కొత్త 'ఎత్తిపోతల' అంచనాలు సిద్ధం చేయండి

ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఐడీసీ) పరిధిలో కొత్తగా ప్రతిపాదిస్తున్న ఎత్తిపోతల పథకాలపై సమగ్ర అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించాలని ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆర్మూర్, నిజామాబాద్, ధర్మపురి నియోజకవర్గాల పరిధిలోని కొత్త ఎత్తిపోతల పథకాలకు సంబంధించి రూ.250 కోట్ల అంచనాలకు త్వరగా అనుమతులు పొందాలన్నారు. గురువారం ఐడీసీ ఎండీగా శ్యామ్‌సుందర్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శంకర్‌రెడ్డి పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. ఎత్తిపోతల పథకాల నిర్వహణలో స్థానిక రైతులను భాగస్వాములను చేయాలని ఆయన కోరారు.

జిగ్నేశ్ మేవాని కాంగ్రెస్ ఏజెంట్: పిడమర్తి రవి




సాక్షి, హైదరాబాద్: గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవాని కాంగ్రెస్ ఏజెంట్‌లా మాట్లాడుతున్నారని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి విమర్శించారు. తెలంగాణలో పోలీస్ రాజ్యం నడుస్తోందన్న జిగ్నేష్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో సంపూర్ణ ప్రజాస్వామ్య ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, గుజరాత్‌లో జిగ్నేశ్ దళిత ఉద్యమాన్ని కాంగ్రెస్‌కు తాకట్టు పెట్టారని ఆరోపించారు. తెలంగాణలో దళితులు చైతన్యశీలురని, ఇక్కడి దళిత సంఘాలకు మేవాని పాఠాలు అక్కర్లేదని అన్నారు. మాయావతి వంటి గొప్ప దళిత నాయకురాలిని విమర్శిస్తున్న జిగ్నేశ్ మేవానికి దళితుల మద్దతు లేదని అన్నారు. మంద కృష్ణ అంబేడ్కర్ సిద్ధాంతాన్ని గాలికొదిలి భౌతిక దాడులను నమ్ముకున్నారని, ఆయన జైల్లో ఉన్నా, బయట ఉన్నా మాదిగ ఏబీసీడీ వర్గీకరణ పోరాటం ఆగదని పేర్కొన్నారు.

ఆమెకు అనారోగ్యం...

రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు

- రాష్ట్రంలో 56 శాతం మంది బాధితులే
- గర్భిణుల్లో 49 శాతం మంది
- జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో వెల్లడి
- ప్రభుత్వ పథకాల ప్రభావం నిల్
- పూర్తిగా అందని ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు



రక్తం పంచిచ్చే అమ్మ.. రక్తం పంచుకుని పుట్టే చెల్లెమ్మ.. అదే రక్తం కరువై అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇంటిల్లిపాదికి ఆనందాన్ని పంచే ఆడపిల్ల ఆరోగ్య సమస్యలతో సతమతమవుతోంది. చిన్నారులనూ రక్తహీనత ముప్పతిప్పలు పెడుతోంది. ఇదీ మన దేశ సగటు మహిళ పరిస్థితి. తాజాగా నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో ఇలాంటి చేదు నిజాలెన్నో బయటపడ్డాయి.

సాక్షి, హైదరాబాద్:

పురుషులతో పోల్చితే మహిళలే అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని సర్వేలో తేలింది. చిన్నప్పటి నుంచే మహిళల్లో ఈ సమస్య ఉంటోందని వెల్లడించింది. ఆహారపు అలవాట్లే దీనికి ప్రధాన కారణమని పేర్కొంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో మహిళల్లో రక్తహీనత సమస్య ఉంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఈ విషయాలను తేల్చింది. మన రాష్ట్రంలో 56 శాతం మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల్లో ఎక్కువ మంది రక్తహీనత బాధితులున్నారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రతి 100 మంది మహిళల్లో 58 మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. పట్టణ/నగర ప్రాంతాల్లో ఈ సమస్య ఉన్న వారు 55 శాతం మంది ఉన్నారు.

సంప్రదాయ పద్ధతులే కారణం..!

మన దేశంలోని సంప్రదాయ పద్ధతులే మహిళల్లో రక్తహీనతకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. రక్తహీనత సమస్య మహిళల ఆరోగ్యంపై జీవిత కాలం ప్రతికూల ప్రభావం చూపుతోంది. వయసుకు తగ్గ పొడవు, బరువు పెరగట్లేదు. దీంతో వయసుకు తగ్గట్లు శరీరంలో మార్పులు రావట్లేదు. రక్తహీనత సమస్య ఓసారి వచ్చాక అధిగమించడం కష్టంగా పరిణమిస్తోంది. పౌష్టికాహారం తీసుకోకపోవడంతోనే ఎక్కువగా ఈ సమస్య వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో తీసుకునే ఆహారానికి, చేసే పనికి చాలా తేడా ఉంటోంది. సరిపడా ఆహారం తీసుకోకపోవడంతో పాటు విరామం లేకుండా పని చేయడం వల్లే ఎక్కువ మంది మహిళలను రక్తహీనత వెంటాడుతోంది.

చర్యలు అంతంత మాత్రమే..

మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య అంశాల్లో రక్తహీనత అతిపెద్ద సమస్య. దీని పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు అంతంత మాత్రంగానే ప్రభావం చూపుతున్నాయి. రక్తహీనత సమస్య నివారణకు మన రాష్ట్రంలో ఏటా రూ.20 కోట్ల విలువైన ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేస్తోంది. ఇవి ఎటూ సరిపోవట్లేదనే అభిప్రాయం ఉంది. గర్భిణులకు మాత్రమే ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఈ మాత్రలను పంపిణీ చేస్తోంది. గర్భం దాల్చిన 6 నెలల వరకు, ప్రసవం తర్వాత 6 నెలల వరకు కచ్చితంగా ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో పూర్తిస్థాయిలో ఈ మందులు అందట్లేదు. వైద్య ప్రమాణాలకు అనుగుణంగా ఏడాది పాటు ఈ మందులు తీసుకునే మహిళలు 30 శాతానికి మించట్లేదు. దీంతో రక్తహీనత సమస్య బాధితులు ఎక్కువగా ఉంటోంది.

బాలికల్లోనూ..

భవిష్యత్ తరం ఆరోగ్య పరిస్థితీ ఇలాగే ఉన్నట్లు కనిపిస్తోంది. ఐదేళ్ల లోపు చిన్నారుల్లో అయితే రక్తహీనత సమస్య ఆందోళనకరంగా ఉంది. ప్రతి 100 మంది చిన్నారుల్లో 60 మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. గర్భం దాల్చని మహిళలతో పోల్చితే ప్రసవం జరిగిన మహిళల్లో రక్తహీనత కాస్త ఎక్కువగా ఉందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తేల్చింది.

'సింగూరు'పై పెరుగుతున్న ఒత్తిడి

- ఇప్పటికే వాటా మేర కేటాయింపులు
- తాజాగా 1.42 టీఎంసీలు నిమ్జ్‌కు కేటాయించేలా ప్రతిపాదన
- కాళేశ్వరం నీళ్లొస్తే తగ్గనున్న ఒత్తిడి



సాక్షి, హైదరాబాద్: జంట నగరాలు, ఉమ్మడి మెదక్ జిల్లా తాగు, సాగు అవసరాలను తీరుస్తున్న సింగూరుపై నీటి అవసరాల పరంగా ఒత్తిడి పెరుగుతోంది. ప్రాజెక్టులకు ప్రస్తుతం ఉన్న వాటాలకు మించి అవసరాలు పెరుగుతుండటం కొంత ఆందోళనను కలిగిస్తోంది. జంట నగరాలకు కృష్ణాజలాలు అందని సమయంలో సింగూరు వైపే చూడాల్సి వస్తున్న నేపథ్యంలో కొత్తగా జహీరాబాద్‌లో చేపట్టిన నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ జోన్ (నిమ్జ్)కు కొత్తగా 1.42 టీఎంసీల కేటాయింపులు కోరుతూ ప్రతిపాదనలు రావడం ఒత్తిడిని పెంచేలా ఉంది. నిజానికి సింగూరు ప్రాజెక్టు సామర్థ్యానికి అనుగుణంగా మొత్తంగా 29.91 టీఎంసీల మేర వాటాలున్నాయి. ఇందులో హైదరాబాద్ తాగునీటికి 6.96 టీఎంసీల కేటాయింపు ఉండగా, దిగువన ఉన్న ఘణపురం ఆయకట్టుకు 4, నిజాంసాగర్ ఆయకట్టుకు 8.35 టీఎంసీలు, సింగూరు కాల్వలకు 2 టీఎంసీలు కేటాయింపు ఉండ గా, మిగతా నీటిని ఆవిరి నష్టాలుగా లెక్కగట్టారు. అయితే ఇటీవల వాటా నీటిని పునఃసమీక్షించారు. దాన్ని బట్టి మిషన్ భగీరథకు 5.45 టీఎంసీ, హైదరాబాద్ తాగునీటికి 2.80, ఘణపురం 4.06, నిజాంసాగర్ అవసరాలకు 6.35, సింగూరు కాల్వలకు 4, ఆవిరి నష్టాలు 7.24 టీఎం సీలు కేటాయించారు. వాటా మేరకు కేటాయింపులు పూర్తవగా ప్రస్తుతం భగీరథ అవసరాలను కొత్తగా 5.7 టీఎంసీలుగా లెక్కగట్టారు. దీనికి తోడు నిజాంసాగర్ కింద ఉన్న 2లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటి విడుదలకై ప్రతిసారీ సింగూరుపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ ఏడాది ఏకంగా సింగూరు నుంచి ఎస్సారెస్పీకి నీటి తరలింపు జరిగింది. ఈ నేపథ్యంలో నిమ్జ్‌కు ఏటా 1.42 టీఎంసీల కేటాయించాలని ప్రతిపాదన వచ్చింది. ఇది ఓకే అయితే ఈ నీటిని ఎలా సర్దుతారన్నది ప్రశ్నగా ఉంది.

తెలంగాణ చారిత్రక నేపథ్యంపై సదస్సు

సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి అజ్మీరా చందూలాల్



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 19, 20 తేదీల్లో తెలంగాణ చారిత్రక నేపథ్యం, నాగరికత సంబంధిత విషయాలపై ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సాంస్కృతిక, పర్యాటక మంత్రి అజ్మీరా చందూలాల్ తెలిపారు. తెలంగాణ ప్రాచీన వారసత్వ సంపద, పాలించిన రాజులు, చారిత్రక కట్టడాలు, వాటి ఆధారాలను ప్రపంచానికి తెలపడమే ఈ సదస్సు ఉద్దేశమని వెల్లడించారు. గురువారం సచివాలయంలో చందూలాల్ మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాలకు చెందిన వారితో పాటు అమెరికా, రష్యా, ఇటలీ, గ్రీస్ దేశాలకు చెందిన విశ్లేషకులు సదస్సులో పాల్గొంటారని చెప్పారు. ఆర్కియాలజీ డిపార్టుమెంట్‌ను హెరిటేజ్ తెలంగాణగా మారుస్తున్నామని తెలిపారు. రెండ్రోజుల పాటు జరిగే ఈ సదస్సులో మొత్తం 6 ప్యానెళ్లు ఉంటాయని, ఇందులో 35 మంది పాల్గొంటారన్నారు. ప్రతి ప్యానెల్‌లో అంశంపై ప్రదర్శనతోపాటు చర్చా గోష్ఠి ఉంటుందన్నారు.

'కల్వకుర్తి' కాల్వ సామర్థ్యం పెంపు!

4,800 క్యూసెక్కుల సామర్థ్యానికి అనుగుణంగా కాల్వల పునరుద్ధరణ



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 4 లక్షల ఎకరాలకు సాగు నీరందించే కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో పెరిగిన పంపుల డిశ్చార్జీలకు అనుగుణంగా ప్రధాన కాల్వ సామర్థ్యం పెంచేలా అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతమున్న ప్రధాన కాల్వ సామర్థ్యాన్ని 3,800 నుంచి 4,800 క్యూసెక్కులకు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి 25 టీఎంసీల మిగులు జలాలను తీసుకుంటూ 3.4 లక్షల ఎకరాలకు నీరిచ్చేలా కల్వకుర్తి పథకాన్ని 2005లో చేపట్టారు. ప్రాజెక్టు మొత్తాన్ని 3 స్టేజీలుగా విడగొట్టి కొల్లాపూర్ స్టేజ్–1 కింద 13 వేల ఎకరాలు, జొన్నల బొగడ స్టేజ్–2 కింద 47 వేలు, గుడిపల్లెగట్టు స్టేజ్–3 కింద సుమారు 2.8 లక్షల ఎకరాల ఆయకట్టును అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం కల్వకుర్తికి నీటి కేటాయింపులు 40 టీఎంసీలకు పెంచడంతో పాటు, ఆయకట్టును 4 లక్షలకు పెంచారు.

5 మోటార్లు నడపడం వల్లే..

కల్వకుర్తిలో మొత్తం 5 మోటార్లను ఏర్పాటు చేయగా, ఇందులో ఒక మోటారును స్టాండ్‌బైగా పెట్టారు. దీంతో 4 మోటార్ల నుంచి 800 క్యూసెక్కుల చొప్పున 3,200 క్యూసెక్కుల నీరు తీసుకునేలా ప్రధాన కాల్వలను డిజైన్ చేశారు. ప్రస్తుత అవసరాలకు 5 మోటార్లను నడిపిస్తు న్నారు. దీనికితోడు 20 శాతం అదనపు డిశ్చార్జి లభిస్తుండటంతో మొత్తంగా 4,800 క్యూసెక్కుల నీటిని తీసుకునే అవకాశ ముంది. ప్రస్తుతం ప్రధాన కాల్వకు ఆమేర సామర్థ్యం లేదు. దీంతో నీటిపారుదల శాఖ సాంకేతిక సలహాదారు విజయ్‌ప్రకాశ్, సీడీవో సీఈ నరేందర్‌రెడ్డి, ప్రాజెక్టు సీఈ ఖగేందర్‌తో ప్రభుత్వం నియమించిన కమిటీ ఇటీవల నివేదిక ఇచ్చింది. కాల్వలో రాళ్లను, పూడికను తీసి పునరుద్ధరించాలంది. జొన్నలబొగడ, గుడిపల్లిగట్టుల మధ్య ఉన్న 6.6 కి.మీ. గ్రావిటీ కెనాల్‌లో తొలి కిలోమీటర్ మేర ఉన్న మట్టికట్ట ఎత్తు 2 మీటర్ల మేర పెంచాలంది. అలా అయితేనే డిశ్చార్జి పెరిగినా కాల్వ తెగిపోయే ప్రమాదం ఉండదని తెలిపింది. సర్‌ప్లస్ వియర్‌ను నిర్మించాలని ప్రతిపాదించింది.

మేమే నంబర్ వన్

▶ మొదటి పేజీ తరువాయి

లేదని, భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరుతో ఆంధ్రా – తెలంగాణల విలీనం చారిత్రక తప్పిదమని వ్యాఖ్యానించారు. అది విఫల ప్రయత్నమని రుజువైందన్నారు. తాము రక్తం చిందకుండా తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లామని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని పార్క్‌హయత్ హోటల్‌లో జరిగిన 'ఇండియాటుడే సౌత్ కాంక్లేవ్–2018'కార్యక్రమంలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. ఇందులో ప్రముఖ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ అడిగిన పలు ప్రశ్నలకు కేసీఆర్ సవివరంగా సమాధానమిచ్చారు.

అద్భుతమైన సచివాలయం నిర్మిస్తాం

రాష్ట్రంలో పాత సచివాలయం సరిగా లేదని, రూ.250 కోట్లతో కొత్త సచివాలయం నిర్మిస్తామని కేసీఆర్ చెప్పారు. ఇది వాస్తు సమస్య కాదన్నారు. విదేశీ ప్రతినిధులు వచ్చిన సందర్భంలో మలేసియా మంత్రి ఒకరు.. సచివాలయం స్థలాన్ని అమ్మేసి కొత్తది కట్టొచ్చు కదా అన్నారని చెప్పారు. ధనిక రాష్ట్రానికి తగినట్టుగా అద్భుతమైన సచివాలయం నిర్మిస్తామన్నారు. ఇక ప్రగతిభవన్ కేసీఆర్ సొంత ఇల్లు కాదని, అది తెలంగాణ సీఎం అధికారిక నివాసమని, కనీసం వందేళ్లు ఎందరో సీఎంలు ఉండేదని పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబానికే అన్ని పదవులన్న ఆరోపణ సరికాదని.. కుటుంబ సభ్యులు కూడా ఉద్యమంలో పాల్గొన్నారని, ప్రజలు ఓట్లు వేస్తేనే ఎన్నికయ్యారని చెప్పారు.

అభివృద్ధిలో దూసుకుపోతున్నాం

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని కేసీఆర్ చెప్పారు. కాగ్ కూడా 16 అంశాల్లో పరిశీలన జరిపి తెలంగాణ అభివృద్ధిలో నంబర్‌వన్ రాష్ట్రమని చెప్పిందని గుర్తుచేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1.49 లక్షల కోట్లతో బడ్జెట్ పెట్టామని.. ఇప్పటివరకు రూ.1.25 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. తెలంగాణ చరిత్ర తెలిస్తే సంపద సృష్టించింది ఎవరో తెలుస్తుందని స్పష్టం చేశారు. మార్వాడీలు 300 ఏళ్ల కిందటే హైదరాబాద్‌కు వచ్చారని, ఇక్కడి పాతబస్తీలో గుల్జార్‌హౌస్ ఉందని, నిజాం సమయంలోనే హైదరాబాద్ ఎంతో అభివృద్ధి సాధించిందని చెప్పారు. హైదరాబాద్ విషయంలో ఎన్నో అసత్యాలు ప్రచారం చేశారని, ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు ఇప్పుడే ఎక్కువ మంది వస్తున్నారని తెలిపారు. రాష్ట్రం ఏర్పాటైన ఆరు నెలల్లోనే విద్యుత్ సంక్షోభం నుంచి బయటపడ్డామని, ఇప్పుడు 24 గంటల కరెంట్ ఇచ్చే స్థితికి చేరుకున్నామని పేర్కొన్నారు. తెలంగాణను చిన్న రాష్ట్రమంటే అంగీకరించబోమన్నారు. హైదరాబాద్ చరిత్ర తెలిసిన వారెవరైనా అది తెలంగాణలో అంతర్భాగమేనని అంగీకరిస్తారని.. ఎన్నో మతాల వాళ్లు, ప్రాంతాల వాళ్లు ఇక్కడ కలసి జీవిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా గౌరవమిస్తామంటే స్వాగతిస్తామని పేర్కొన్నారు.

సంపద సృష్టిస్తున్నాం

తెలంగాణకు రోజూ 650 లారీల గొర్రెలు దిగుమతయ్యేవని, తాము రూ. 5 వేల కోట్లు అప్పు తెచ్చి రాష్ట్రంలో 50 లక్షల గొర్రెల పంపిణీ చేపట్టామని కేసీఆర్ చెప్పారు. త్వరలోనే రాష్ట్రం నుంచి దేశ విదేశాలకు మేలైన గొర్రెలు, మాంసాన్ని ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటుందన్నారు. ఇక తెలంగాణ ఏర్పడే నాటికి 6 వేల మెగావాట్ల విద్యుత్ మాత్రమే అందుబాటులో ఉందని, ఇప్పుడు 14 వేల మెగావాట్లకు పెంచామని చెప్పారు. 2020 నాటికి 28 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తామన్నారు. వ్యవసాయ రంగంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలువబోతోందని చెప్పారు. దేశంలోనే గొప్పగా రూ.40 వేల కోట్లతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు.

సామాజిక, ఆర్థిక స్థితిని బట్టి రిజర్వేషన్లు

తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలే 90 శాతం ఉన్నారని, కేవలం 10 శాతమే ఉన్నత కులాల వారు ఉన్నారని కేసీఆర్ పేర్కొన్నారు. ఇలా 90 శాతమున్న వారికి 50 శాతం రిజర్వేషన్ ఎలా సరిపోతుందని, బలహీన వర్గాలకు అన్యాయం చేయలేమని వ్యాఖ్యానించారు. తెలంగాణలో గిరిజనులు 10 శాతముంటే 6 శాతంగా లెక్కగట్టారని, ఇక ముస్లింలు 14 శాతం ఉన్నారని చెప్పారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని, తమిళనాడులో 69శాతం, మహారాష్ట్రలో 52 శాతం రిజర్వేషన్లు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఆయా వర్గాల ఆర్థిక పరిస్థితిని చూడాలని.. సామాజిక, ఆర్థిక వెనుకబాటును బట్టే రిజర్వేషన్లు ఉండాలని స్పష్టం చేశారు. కేంద్రంతో మంచి సంబంధాలనే కోరుకుంటామని, సమాఖ్య స్ఫూర్తితో పనిచేస్తామని తెలిపారు. అవినీతిపరులు ఎవరో దేశమంతా తెలుసంటూ కాంగ్రెస్ నేతల విమర్శలను ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు.





గురువారం పార్క్‌హయత్ హోటల్‌లో జరిగిన 'ఇండియాటుడే సౌత్ కాంక్లేవ్-2018' కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్ ● హాజరైన వివిధ రంగాల ప్రముఖులు

ఎవరితో పొత్తుల్లేవు.. స్వతంత్రంగా ఉంటాం

టీఆర్ఎస్ పార్టీ యూపీఏలోగానీ, ఎన్డీయేలోగానీ చేరదని.. స్వతంత్రంగానే ఉంటుందని కేసీఆర్ చెప్పారు. ఎవరితో వెళ్లాల్సిన పని తమకు లేదని, టీఆర్ఎస్‌తో కలసి రావాలా, లేదా అన్నది ఇతర పార్టీలు తేల్చుకోవాలన్నారు. తనకు ఢిల్లీ వెళ్లే ఆలోచనేదీ లేదని, యావత్ తెలంగాణ తన కుటుంబమని, భావోద్వేగాలు తెలంగాణ చుట్టే ఉంటాయని చెప్పారు. తాను ఇక్కడే ఉండి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశంలో నంబర్‌వన్‌గా నిలుపుతానన్నారు. మనది సహకార సమాఖ్య వ్యవస్థ అన్న ప్రధాని మాటలను సమర్థిస్తున్నానని కేసీఆర్ చెప్పారు. రాష్ట్రాల సంపదే జాతి సంపద అని, రాష్ట్రాలు ఎదిగేందుకు కేంద్రం అవకాశమివ్వాలని కోరారు. రాష్ట్రాలకు అధిక నిధులు, అధికారాలు ఇస్తే.. దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. గల్ఫ్ బాధితులను ఆదుకునేందుకు ఎన్నారై పాలసీని తీసుకువస్తామన్నారు. 1969 తెలంగాణ ఉద్యమకారులను గుర్తించామని, 55 మందికి సాయం చేశామని తెలిపారు. జలదృశ్యం వద్ద అమరవీరుల స్తూపం నిర్మిస్తున్నామని, ఆవిష్కరణ సమయంలో అందరినీ సన్మానించుకుంటామని వెల్లడించారు.

కాగితాలపైనే జలాల కేటాయింపులు

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు కేటాయించిన నీళ్లు కాగితాల్లోనే ఉండేవని, లెక్కల్లో మాత్రమే కనిపించేవని కేసీఆర్ పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణకు 1,350 టీఎంసీలు కేటాయింపులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు ప్రాజెక్టులు చేపట్టామని చెప్పారు. కేంద్ర జల సంఘం కాళేశ్వరం ప్రాజెక్టును ప్రశంసించిందన్నారు. మహబూబ్‌నగర్ నుంచి లక్షలాది మంది వలసపోయేవారని, తాము ప్రాజెక్టుల ద్వారా 6.5 లక్షల ఎకరాలను సాగులోకి తెచ్చి వలసలు నివారించామని పేర్కొన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాల కష్టాలు లేకుండా ఏర్పాటు చేశామన్నారు. కల్తీ ఎరువులు, విత్తనాలు రాకుండా చర్యలు తీసుకున్నామని, పీడీ యాక్టు కింద కేసులు పెడుతున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 71 లక్షల మంది రైతులకు ఏటా ఎకరాకు రూ.8 వేల చొప్పున సాగు పెట్టుబడి అందించనున్నామని చెప్పారు. రైతులకు మద్దతు ధర కల్పించేందుకే రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆంధ్రాతో కలపకముందు కూడా ధనిక రాష్ట్రమేనని, ఏపీతో తెలంగాణను పోల్చవద్దని కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ మిగులు రాష్ట్రమని, ఏపీకంటే చాలా విషయాల్లో ఎంతో ముందుందని, అసలు పోలికే లేదని చెప్పారు. గుజరాత్‌తోనో, అమరావతితోనో పోల్చవద్దన్నారు. భవిష్యత్తులో ఇక్కడ రైతుల ఆత్మహత్యలనేవే ఉండవన్నారు.

హైదరాబాద్‌ను విధ్వంసం చేశారు

ఉమ్మడి రాష్ట్రంలో అందమైన హైదరాబాద్ నగరాన్ని ధ్వంసం చేశారని, హైదరాబాద్‌కు గార్డెన్ సిటీగా పూర్వ వైభవం తీసుకురావడమే తమ లక్ష్యమని కేసీఆర్ వెల్లడించారు. 1915లోనే హైదరాబాద్‌లో విద్యుత్ సరఫరా ఉండేదని, ఆ తర్వాతే మద్రాసుకు కరెంటు వచ్చిందని గుర్తు చేశారు. అప్పట్లోనే ఇక్కడ విమానాశ్రయం, టెలిగ్రాఫ్, ప్రత్యేక రైల్వే వ్యవస్థ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఉండేవన్నారు. కానీ ఉమ్మడి పాలనలో ఇక్కడి భూములు, నాలాలు కబ్జా చేశారని, వెయ్యి దాకా ఉన్న చెరువులు, కుంటలు మాయమయ్యాయని చెప్పారు. తాము రూ.25వేల కోట్లతో హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామన్నారు.



బాహు భళే!
- లోపలి పేజీల్లో



బాహుబలి బెస్ట్ ఫ్రెండ్...
భల్లాలదేవ బ్రదర్
- సినిమా పేజీలో

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం, 19-1-2018

చెట్టు నీడ

జీవనరాగం



పాత సూఫీ కథ ఇది. 'ఓషో' రజనీశ్ తన శిష్యులకు తరచూ చెబుతుండేవారు. నేడు ఆయన వర్ధంతి. కథేమిటంటే.. ఒక ఇంట్లో ఒక సంగీత సాధనం ఉండేది. పూర్వీకుల నుండి అది ఆ ఇంట్లో ఉంటోంది. తరాలు మారుతున్నాయి కానీ అది మారడం లేదు. అలాగని ఏ తరమూ దానిని సాధన చేయడం లేదు! అసలు దానిని ఎలా పలికించాలో కూడా ఎవరికీ తెలీదు. పడేయడానికి మనసొప్పక ఓ మూలన పడేసి ఉంచుతున్నారు. అలా ఏళ్లుగా దానిపై దుమ్ము పేరుకుపోయింది. మళ్లీ ఓ కొత్త తరం వచ్చింది. దుమ్ము దులుపుతుంటే ఆ సంగీత సాధనం బయటపడింది. 'ఎవరికీ పనికిరానిది ఇంట్లో ఎందుకు?' అని బయటికి విసిరిపారేసింది కొత్తతరం.

ఆ సాయంత్రం.. పక్షులు ఇళ్లకు చేరే సమయంలో ఆ కొత్తతరం ఉంటున్న వీధిలో శ్రావ్యమైన సంగీతం వినిపించింది. ఇళ్లలోని వారంతా బయటికి వచ్చి ఆసక్తిగా చూశారు. ఒక యాచకుని చేతిలోని సంగీత వాద్యం అది. అతడి వేళ్లు ఒడుపుగా రాగాలను పలికిస్తున్నాయి! కొత్త తరం కూడా ఇంటి బయటికి వచ్చి చూసింది. యాచకుని చేతిలోని వాద్యాన్నీ చూసింది.

''ఓయ్.. అది మాది, తరతరాలుగా మా ఇంట్లో ఉంటోంది. మాది మాకు ఇచ్చేయ్'' అని అడిగింది. అందులో అంత మధురమైన రాగాలు ఉంటాయని ఆ కొత్త తరం ఊహించలేదు.

యాచకుడు ఇవ్వలేదు! ''తరాలుగా మీ ఇంట్లో ఉన్నా మీరు దీనిని పలికించలేదు కనుక ఇది మీది కాదు. నేను పలికిస్తున్నాను కాబట్టి ఇప్పుడిది నాది'' అని, వాద్యంలోంచి లయబద్ధంగా గీతాలను ఒలికించుకుంటూ ముందుకు వెళ్లిపోయాడు.

జీవితం కూడా అంతే.. సాధన చేసినంతకాలం మనది. జీవన గమకాలు పలికించినంతకాలం మనది. ఊరికే జీవితాన్ని చేత్తో పట్టుకునో, గూట్లో పెట్టుకునో కాలాన్ని గడిపేస్తుంటే ఆ జీవితం మనదవదు.

జీవితంలో కదలిక లేదని, దుమ్ముపట్టిపోయిందనీ మనలో చాలా మందిమి నిస్పృహలో పడిపోతుంటాం. నిజానికి అది మన జీవితానికి పట్టిన దుమ్ము కాదు. మన వేళ్లకు పట్టిన దుమ్ము. ఆ దుమ్మును వదిలించుకుని జీవితాన్ని పలికించుకోవాలి.

– మాధవ్ శింగరాజు

నిప్పు కనిక



దావోస్‌లో జరగనున్న 'వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్'లో పాల్గొనేందుకు కనికకు ప్రత్యేక ఆహ్వానం లభించింది.

ఆరో క్లాసులో అగ్నిపరీక్ష ఒకటి
కనికను, స్నేహితురాళ్లను, కుటుంబాన్ని మసకబార్చింది.
స్కూల్లోని ఒక వేడుకలో అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం సంభవించింది!
కానీ కనికను ఆ అగ్నిపరీక్షే కాదు..
జీవితంలోని ఏ అగ్నిపరీక్షా ఆపలేకపోయింది. బ్రేవ్ గర్ల్.

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఈ నెల 23 నుంచి 26 వరకు జరుగుతున్న 'వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్'లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు అమ్మాయిలు ఎంపికయ్యారు. ఆ ఇద్దరిలో ఒకరైన కనికా కుమార్ (ఇంకొకరు దీపికా ప్రసాద్) ముంబైలోని 'ఇంటెల్‌క్యాప్'కి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సమావేశానికి హాజరవుతున్న సందర్భంలో కనిక పరిచయమిది.

కనికా కుమార్ పుట్టి, పెరిగింది హైదరాబాద్‌లోనే. సెయింట్ ఆన్స్‌లో పాఠశాల విద్య, సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. కనిక ఆరవ తరగతిలో ఉన్నప్పుడు స్కూల్లో అగ్ని ప్రమాదం జరిగింది. అందులో కనికా గాయపడ్డారు. కోలుకోవడానికి దాదాపు నాలుగు నెలలు పట్టింది. ఆ ప్రభావం ఇప్పటికీ మొహం మీద కనిపిస్తుంటుంది.

''బయటవాళ్లు చాలామంది అడుగుతారు ఏమైంది? అని. చెప్పగానే.. 'అయ్యో పెళ్లి ఎలా అవుతుందమ్మా?' అంటూ జాలిపడ్తారు. ఆ మాటలకు మనసులోనే నవ్వుకుంటా. ఎందుకంటే ఇలాంటివి అధిగమించే స్థయిర్యాన్ని నేను ఏనాడో సాధించాను. చిన్నప్పుడు జరిగిన ఆ ప్రమాదం ఒక రకంగా నా ఆత్మవిశ్వాసాన్ని పెంచింది'' అని చెప్తుంది కనికా.

లండన్ స్కూల్

గ్రాడ్యుయేషన్ అయిపోయాక కనికా లండన్ వెళ్లారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో డిప్లొమా కోర్స్ చేశారు. తిరిగొచ్చాక ముంబైలోని ఒక అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలో కొన్నాళ్లు పనిచేశారు. హైదరాబాద్‌లో 'బాలకళాకార్' టీమ్‌లో ఆమె ఓ భాగస్వామి. పేదపిల్లల్లో ఉన్న కళలను వెలికితీసి, వాళ్లను ప్రోత్సహిస్తుంటుంది ఈ సంస్థ. ''ఇప్పటి వరకు 3 వేల మంది పిల్లల్లోని క్రియేటివ్ స్కిల్స్‌కు ఒక దయాస్ కల్పించాం. పెయింటింగ్, డాన్స్, సాంగ్స్ వంటి వాటిల్లో వాళ్లను ప్రోత్సహిస్తున్నాం. ఆ పిల్లలు వేసిన పెయింటింగ్స్‌తో ఎగ్జిబిషన్ కూడా పెట్టాం' అని చెప్తారు కనిక.

ఇంటెల్‌క్యాప్

యాడ్ ఏజెన్సీలో పనిచేశాక ఇంటెల్ క్యాప్‌లో జాయిన్ అయ్యారు కనిక. ప్రస్తుతం అందులోని కార్పొరేట్ స్ట్రాటజీ టీమ్‌ను లీడ్ చేస్తున్నారు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో సోషల్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ కోసం కృషిచేస్తున్నారు. బాధ్యతల్లో భాగంగా ఆఫ్రికాలో కొన్నాళ్లున్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఇనిషియేటివ్ ప్రోగ్రామ్ అయిన ది గ్లోబల్ షేపర్స్ (ముంబై)లో కూడా ఆమె పాలుపంచుకుంటున్నారు. ప్రయాణాలంటే చాలా ఇష్టపడే కనిక తను చూసిన, పనిచేస్తున్న ప్రపంచంలో మహిళలు ఎదుర్కొంటున్న అనేక ఇబ్బందులను దగ్గరగా చూశారు.

''వ్యక్తిగతంగా ఇటు ఇంట్లో, అటు బయట నేనెలాంటి వివక్షనూ ఎదుర్కోకపోయినా.. అలాంటి పరిస్థితినైతే చూశాను. నిజానికి మా ఇంట్లో నాకు సంబంధించి.. అంటే చదువు, జాబ్ ఎవ్రీథింగ్ నా ఇష్టమే. ఆఫీస్‌లో కూడా నేనెలాంటి వివక్షకు లోను కాలేదు. మగవాళ్లకు ఎలాంటి అవకాశాలు వచ్చాయో నాకూ అలాంటి అవకాశాలే వచ్చాయి. వాళ్లు డీల్ చేసిన కఠినతరమైన సవాళ్లను నేనూ డీల్ చేశాను. పదోన్నతులను కూడా అంతే సమానంగా పొందాను. కాని నేను బాగుండగానే నా చుట్టూ ఉన్న ఆడవాళ్లు బాగున్నట్టు కాదు కదా! వివక్షకు గురి అయిన అమ్మాయిలను చాలామందిని చూశాను. బయట పరిస్థితులు ఎలా ఉన్నాయో వాస్తవాలు ఏంటో నాకు తెలుసు. ఆడవాళ్లను చులకనగా చూస్తారు. వ్యాపార రంగంలోకి అడుగుపెట్టాలనుకునే మహిళలకు లోన్స్ కూడా దొరకని స్థితి. ప్రాపర్టీ ఉన్నా ఆమె పేరున ఉండదు. అంతా భర్త అధికారం కిందే, ఆయన అనుమతితోనే సాగాలి. ఈ చాలెంజెస్ అన్నిటినీ తట్టుకొని నిలబడ్డ వాళ్లను చూశాను. ఇవన్నీ గ్రహించాకే మహిళల కోసం ఏమన్నా చేయాలి అనిపించింది. అందుకే మా సంస్థలో 'క్రెడిట్ ట్రీ' ఏర్పాటు చేశాం. ఈ క్రెడిట్ ట్రీ కింద ఒంటరి స్త్రీలకు కూడా లోన్స్ ఇప్పిస్తాం. వ్యాపార, వాణిజ్య రంగాల్లో వాళ్లూ రాణించడానికి హెల్ప్ చేస్తున్నాం' అని వివరించారు కనికా కుమార్.

- సరస్వతి రమ



గర్వంగా ఉంది

ఇంత చిన్న వయసులో మా అమ్మాయి సాధించిన విజయం చూస్తుంటే గర్వంగా అనిపిస్తోంది. పని అంటే ప్యాషన్ ఆమెకు. చేస్తున్న పనిపట్ల నిజాయితీ, నిబద్ధతతో ఉంటుంది. సహాయం, సేవ ఆమె నైజం. తన పనితో సమాజంలో ఒక ఇంపాక్ట్ ఉండాలని తపన పడుతుంది. ఆత్మవిశ్వాసం మెండు. ఇవ్వాళ్టి అమ్మాయిలకు కావల్సింది కూడా అదే. ఫిజికల్ బ్యూటీ కాదు ఇన్నర్ బ్యూటీ చాలా ఇంపార్టెంట్. అదే ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. తల్లిదండ్రులు కూడా ఆ దిశగానే పిల్లల్లో విశ్వాసం పెంపొందింపచేయాలి.

- అనిల్‌కుమార్, సీమా కుమార్
(కనికా కుమార్ తల్లిదండ్రులు)

గుడ్ ఫుడ్

జబ్బులను నివారణకు జామ!

జామపండులో 'విటమిన్–సి'తో పాటు రోగనిరోధకశక్తిని పెంచే గుణం ఉంది. ఇంకా అనేక పోషకాలు ఉన్నాయి. వీటన్నింటి ఫలితంగా జామపండు ఎన్నో జబ్బులను అవి రాక ముందే నిరోధిస్తుందని అనేక అధ్యయనాల్లో తేలింది. ● జామ అనేక రకాల క్యాన్సర్లను నివారిస్తుంది. జామలోని యాంటీ ఆక్సిడెంట్స్ ఇందుకు దోహదం చేస్తాయి. ముఖ్యంగా ప్రోస్టేట్, రొమ్ముక్యాన్సర్ల నివారణకు బాగా ఉపయోగపడుతుంది. ● జామపండు డిమెన్షియా, అల్జైమర్స్ వంటి జబ్బులను నివారించడంలో తోడ్పడుతుంది. ● రక్తంలో కొలెస్ట్రాల్ పాళ్లను జామపండు తగ్గిస్తుంది. అలాగే అధిక రక్తపోటును నివారిస్తుంది. ● జామపండ్లను తినేవారిలో చిగుర్లు, పంటి వ్యాధులు చాలా తక్కువగా కనిపిస్తాయి.



గుడ్ సైన్

ఒంటరి మినిస్టర్!



ట్రేసీ క్రౌచ్

దేశ రక్షణ, విదేశీ వ్యవహారాలు, కార్మికులు, మహిళలు.. ఇలా ఒక్కో శాఖకు ఒక్కో మంత్రి ఉండడం ఏ దేశ క్యాబినెట్‌లోనైనా సహజమే. అయితే ఇప్పుడు బ్రిటన్‌కు ఓ కొత్త మినిస్టర్ వచ్చారు. వారే 'లోన్లీనెస్ మినిస్టర్'! బ్రిటన్‌లో ఒంటరిగా జీవితం గడుపుతున్న వారిని అక్కున చేర్చుకుని వారికి నాలుగు తియ్యని మాటలు చెప్పే.. వాళ్లు చెప్పే కబుర్లను ఆసక్తిగా వినే.. ఆత్మీయ ఆశ్రమాలను ఆ శాఖ నెలకొల్పుతుంది. ఉద్యోగ విరమణ పొంది లేదా విడాకులు తీసుకుని లేదా అయినవాళ్లను పోగొట్టుకుని జీవితాన్ని ఒంటరిగా, నిస్పృహగా గడుపుతున్న వృద్ధుల కోసమే ప్రత్యేకంగా బ్రిటన్ ప్రభుత్వం ఈ శాఖను సృష్టించింది. తొలి 'లోన్లీనెస్' శాఖ మంత్రిగా ట్రేసీ క్రౌచ్ అనే మహిళా ఎంపీని బ్రిటన్ ప్రధాని 'థెరిస్సా మే' నియమించారు.

టేప్ ట్రిక్

కలిపి చుడితే కలదు సుఖం






హై హీల్స్ నడకకు అందాన్నిస్తాయి. కొంచెం నొప్పిగా కూడా అనిపిస్తాయి. ఈ నొప్పి.. హీల్స్ సరిపడకపోవడం వల్ల కాదు. పాదాల్లోని నరాలపై పడే ఒత్తిడి వల్ల! ఇది తెలిసిన విషయమే. తెలుసుకోవలసిన విషయం ఏంటంటే.. చిన్న టెక్నిక్‌తో నొప్పిని తప్పించుకుని హై హీల్స్‌తో ఈ భూమిని ఏలేందుకు అమ్మాయిలు సిద్ధం కావచ్చని! ఈ గొడవంతా ఎందుకు? చక్కగా చెప్పల్స్ లేదా స్లిప్పర్స్ వేసుకుంటే సుఖం కదా అనుకోవచ్చు. సుఖమే.. కానీ హై హీల్స్ హైహీల్సే! ఒక్కసారి వేసుకుని చూడండి. 'చూడండి'.. అంటే మిమ్మల్ని మీరు చూసుకొమ్మని కాదు. హై హీల్స్ వేసుకుని మీరు నడుస్తున్నప్పుడు మిమ్మల్ని చూసేవాళ్లను చూడండి అని. ఎంత ఆరాధన ఆ కళ్లల్లో! ఉండదా మరి? మీరేం తక్కువగా కనిపిస్తారా! ఏ దేశపు యువరాణిగారో మీలోకి ప్రవేశిస్తారు. తన హొయలును మీ కదలికల్లో అనువణువునా ఒలికిస్తారు. కానీ హై హీల్స్‌తో ఆ కాసేపు మీరు పడే బాధ మీకు మాత్రమే తెలుస్తుంది. పాదాలు నొప్పెడతాయి. కొంతమందికైతే నడుము నొప్పి కూడా వస్తుంది. రోజూ హై హీల్స్ వేసుకునేవారికైతే పర్వాలేదు కానీ, కొత్తల్లో కాస్త ఇబ్బందే. ఆ ఇబ్బందిని ఈ స్మాల్ టిప్పుతో భలేగా తప్పించుకోవచ్చు.

ఎలాగంటే... చిన్న టేప్ తీసుకోండి. అడ్హెసివ్ టేప్, స్కాచ్ టేప్, న్యూడ్ కలర్ మెడికల్ టేప్.. ఏదైనా సరే. అవన్నీ లైట్‌గా, ట్రాన్స్‌పరెంట్‌గా ఉంటాయి. అతికించడానికి, అతికించాక తొలగించడానికీ అవి తేలిగ్గా ఉంటాయి. ఆ టేప్‌తో బొటన వేళ్ల పక్కన ఉండే రెండు వేళ్లను కలిపి గట్టిగా చుట్టేయండి. (ఫొటోలో చూపిన విధంగా). తర్వాత మెల్లిగా మీ పాదాలను హై హీల్స్‌లోకి దూర్చేయండి. ఆ తర్వాత నడవండి. వెంటనే మీకు ఆశించినంత సౌఖ్యం కలగకపోవచ్చు. నమ్మండి. కొద్దిరోజుల్లోనే మీ హై హీల్స్ మీకు మంచి ఫ్రెండ్స్ అవుతాయి.

ఏమిటీ మాయ?

మాయ కాదు, మంత్రం కాదు. బొటనవేలి తర్వాతి రెండు, మూడు వేళ్ల మధ్య ఒక నరం ఉంటుంది. హై హీల్స్ వల్ల ఆ నరం నొక్కుకుపోయి, నొప్పికలుగుతుంది. ఆ నొప్పి ఎక్కువైతే నడుము వరకు పాకుతుంది. అలా కాకుండా ఉండేందుకే రెండు వేళ్లకూ కలిపి టేపు చుట్టేయడం! ఇలా చుట్టడం వల్ల ఆ నరం మీద ఒత్తిడి తగ్గి హై హీల్స్ వేసుకుని నడుస్తున్నప్పుడు నొప్పి అనిపించదు.

అయితే హై హీల్స్ వల్ల భవిష్యత్తులో రాగల అవకాశం ఉన్న ఆరోగ్య సమస్యలకు మాత్రం ఈ టేపు టిప్పు ఔషధంలా పనిచేయదు. ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమే. అప్పటికప్పుడు అనుకోకుండా పార్టీకి రెడీ అయినప్పుడు సరదాగా కొద్దిసేపు హై హీల్స్‌తో నొప్పి లేకుండా నడిచేందుకు టేప్ చుట్టుకుని వెళ్లొచ్చు.



● రవితేజ, రాశీఖన్నా

కమింగ్ సూన్

సింహా ప్రొడక్షన్స్ పతాకంపై నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాలో రాశీ ఖన్నా, సీరత్ కపూర్ కథానాయికలు. ఈ సినిమాలో రవితేజ పోలీస్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారని సమాచారం. ''చిరకాల మిత్రుడైన రవితేజతో సినిమా చేయడం ఆనందంగా ఉంది. వక్కంతం వంశీ అందించిన కథను విక్రమ్ బాగా తెరకెక్కించారు. త్వరలో సినిమాను రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. రీసెంట్‌గా విడుదల చేసిన టీజర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ప్రీ–రిలీజ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి ప్రీతమ్ అండ్ జామ్ 8 సంగీతం అందించారు.

టచ్ చేస్తాం. అతి త్వరలో మాంచి మాస్ బొమ్మతో థియేటర్స్‌ను టచ్ చేస్తాం అంటున్నారు 'టచ్ చేసి చూడు' చిత్రబృందం. రవితేజ హీరోగా విక్రమ్ సిరికొండ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'టచ్ చేసి చూడు'. బేబీ భవ్య సమర్పణలో లక్ష్మీ నర



● అల్లు అర్జున్

ఆవేశమే ఆయుధం

కారణం లేని కోపం ప్రమాదం అంటారు. అది శత్రువుకు అవకాశం అని చెబుతారు. కానీ సూర్యాకి ఆవేశమే ఆయుధం. అదెలా అనేది స్క్రీన్‌పై చూడాల్సిందే. అల్లు అర్జున్ హీరోగా వక్కంతం వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'నా పేరు సూర్య... నా ఇల్లు ఇండియా'. ఇందులో అనూ ఇమ్మాన్యుయేల్ కథానాయిక.

ఈ సినిమాలో సూర్య అనే సైనికుడి పాత్రలో అల్లు అర్జున్ కనిపించనున్నారు. ప్రజెంట్ ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఓ భారీ ఫైట్ చిత్రీకరిస్తున్నారు. ఈ ఫైట్ కోసం కోటి రూపాయలతో సెట్ వేయడం విశేషం. ఇంకో విశేషం ఏంటంటే.. డైరెక్టర్ కావాలనుకుంటున్న ఫైట్ మాస్టర్ పీటర్ హెయిన్ ఈ మధ్య ఫైట్ మాస్టర్‌గా సినిమాలు ఒప్పుకోవడం లేదట. కానీ ఈ చిత్రకథ విని, ఒప్పుకున్నారట. ఆయన ఆధ్వర్యంలో ప్రస్తుతం తీస్తున్న ఇంటర్వెల్ ఫైట్ 'అదరహో' అనే విధంగా ఉంటుందట. ఈ సినిమాలో నాలుగు మేజర్ ఫైట్స్ ఉన్నాయని టాక్. మిగిలిన ఫైట్‌ను రామ్–లక్ష్మణ్, రవి వర్మ, బ్యాంకాక్ యాక్షన్ కొరియోగ్రాఫర్ కిచా డిజైన్ చేశారు. బన్నీ కెరీర్‌లో ఇది హై ఓల్టేజ్ యాక్షన్ మూవీగా నిలుస్తుందని టాక్. రిపబ్లిక్ డే సందర్భంగా ఈ చిత్రంలోని 'సైనికా..' అనే పాటను రిలీజ్ చేయాలనుకుంటున్నారు. కె. నాగబాబు సమర్పణలో రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీషా శ్రీధర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'బన్నీ'వాసు సహ నిర్మాత. ఈ సినిమాను ఏప్రిల్‌లో విడుదల చేయాలనుకుంటున్నారు.



● అనుష్క

ఆ నిమిషం



● కె. ప్రసాద్, రాణిశ్రీ

వెంకటేశ్వర మూవీ ఫ్యాక్టరీపై కాలా రాజేష్ దర్శకత్వంలో కె.ప్రసాద్ రెడ్డి నటించి, నిర్మించిన చిత్రం 'ఆ నిమిషం'. ''ఇది ఎమోషనల్ హారర్ మూవీ. భ్రూణ హత్యలు, ఆడపిల్లలపై హింస వంటి అంశాలను ప్రస్తావించాం. 'వంటగదిలోకి ఆడది కావాలి.. పడకగదిలోకి ఆడది కావాలి.. సమాజంలో పరపతికి ఆడది కావాలి.. కానీ నట్టింట్లోకి ఆడపిల్ల వస్తుందంటే ససేమిరా అంటాడు.. వీడు మగాడు.. మొగుడు. వీడు లేకపోతే ఏంటి భయం. అందుకే కసితో కన్నాను.. మరింత కసితో పెంచాను నా కూతుర్ని' వంటి డైలాగులున్నాయి'' అన్నారు దర్శకుడు. ''షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమా టీజర్‌ను త్వరలో రిలీజ్ చేస్తాం'' అన్నారు నిర్మాత. ఈ చిత్రానికి సంగీతం: కున్నీ గుడిపాటి, కెమెరా: యోగి ప్రసాద్.

దర్శక-నిర్మాత కాశీనాథ్ మృతి



● కాశీనాథ్

ప్రముఖ కన్నడ నటుడు, దర్శక–నిర్మాత కాశీనాథ్ (67) ఇకలేరు. కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆయన బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో గురువారం ఉదయం తుది శ్వాస విడిచారు. 1976లో 'అపురూపద అతిథిగళు' చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమైన కాశీనాథ్ ఆ తర్వాత తెరకెక్కించిన 'అపరిచిత' ఘనవిజయం సాధించింది. సస్పెన్స్ థ్రిల్లర్స్ జానర్‌లో ట్రెండ్‌సెట్ చేసిన చిత్రమిది. ఇంకా పలు విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించారు. 'అపరిచిత' సినిమా తెలుగులోనూ విడుదలై, విమర్శకుల ప్రశంసలనూ పొందింది. వినోద ప్రధానంగా ఉండే సినిమాలను రూపొందించిన కాశీనాథ్ వైవిధ్యమైన పాత్రల్ని పోషించి కన్నడ సినీరంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కాశీనాథ్ పలు చిత్రాలకు సంగీతం అందించడం విశేషం. ఎందరో ప్రతిభ ఉన్న నటులను ఆయన ఇండస్ట్రీకి పరిచయం చేశారు. వారిలో కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర కూడా ఒకరు. దర్శకుడు కావాలనుకున్నప్పుడు కాశీనాథ్ దగ్గరే సహాయ దర్శకునిగా చేరారు ఉపేంద్ర. ఆ తర్వాత ఆయన దర్శకుడిగా మారాక తీసిన 'ష్' చిత్రంలో కాశీనాథ్ నటించడం విశేషం. కాశీనాథ్ నటించిన చివరి కన్నడ సినిమా 'చౌక' 2017లో విడుదలైంది. కాశీనాథ్ తనయుడు అభిమన్యు నటుడిగా కొనసాగుతున్నారు. ''దర్శకులు కాశీనాథ్ మరణం కన్నడ చిత్ర పరిశ్రమకు తీరని లోటు' అని నటులు ఉపేంద్ర, పునీత్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. పలువురు కన్నడ సినీ ప్రముఖులు కాశీనాథ్ మృతికి సంతాపం ప్రకటించారు.

అచ్చంగా ఆయనలానే...



ఇక్కడున్న ఫొటో చూశారుగా! తమిళ సినిమాలు ఫాలో అయ్యేవారికి అచ్చంగా ప్రముఖ నటుడు జెమినీ గణేశన్‌లాగా ఉన్నారనిపిస్తుంది కదూ! కానీ మీరు చూస్తున్న ఫొటోలో ఉన్నది మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్. అలనాటి అందాల తార సావిత్రి జీవితం ఆధారంగా 'ఎవడే సుబ్రమణ్యం' ఫేమ్ నాగఅశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'మహానటి'. 'నడిగర్ తిలగమ్' అని తమిళ్‌లో టైటిల్ పెట్టారు. సావిత్రి పాత్రలో హీరోయిన్ కీర్తీ సురేశ్ నటిస్తున్నారు. ఈ సినిమాలో జెమినీ గణేశన్ పాత్రను దుల్కర్ సల్మాన్ పోషిస్తున్నారు. దుల్కర్‌కు సంబంధించిన సీన్స్‌ను బుధవారంతో కంప్లీట్ చేశారు. అందుకని దుల్కర్ సల్మాన్ లేటెస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. వైజయంతీ మూవీస్ పతాకంపై రూపొందుతున్న ఈ సినిమాను స్వప్నా దత్ నిర్మిస్తున్నారు. మోహన్‌బాబు, దర్శకుడు క్రిష్, సమంత, విజయ్ దేవరకొండ, షాలినీ పాండే నటిస్తున్న ఈ సినిమాను మార్చి 29న రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

బాహుబలి బెస్ట్ ఫ్రెండ్... భల్లాలదేవ బ్రదర్

... ఇదిగో ఇలాగే చెప్పారు దేవసేన. అదేనండీ అనుష్క. అదేంటీ? దేవసేన మీద భల్లాలదేవుడు (రానా) పగ సాధించాలనుకున్నాడు కదా! బాహుబలి (ప్రభాస్)తో దేవసేన వివాహం అయ్యింది కదా అంటే.. అవును. అవి రీల్ లైఫ్ క్యారెక్టర్స్ అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కానీ రియల్ లైఫ్‌లో ప్రభాస్, రానా, అనుష్కల బాండింగ్ వేరు. ఆ అనుబంధం గురించి అనుష్క స్వయంగా చెప్పారు. 'పిల్ల జమీందార్' ఫేమ్ అశోక్ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్‌లు నిర్మించిన 'భాగమతి'లో అనుష్క టైటిల్ రోల్ చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 26న ఈ చిత్రం రిలీజ్ కానుంది. చెన్నైలో జరిగిన తమిళ 'భాగమతి' ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొన్న అనుష్క కొన్ని ఆసక్తికర విషయాలను బయటపెట్టారు. ''రానా నన్ను బ్రదర్ అని పిలుస్తాడు. నేనూ తనని అలాగే పిలుస్తాను. ప్రభాస్ నాకు బ్రదర్ కాదు. బెస్ట్ ఫ్రెండ్ మాత్రమే. అయినా అందరూ బ్రదర్స్ అవ్వాలనేం లేదుగా?'' అన్నారామె. పెళ్లి గురించి మాట్లాడుతూ – ''పెళ్లి గురించిన ఆలోచన ప్రస్తుతానికి లేదు. మీకు తెలిసిన అబ్బాయి ఎవరైనా ఉంటే చెప్పండి. (నవ్వుతూ). నా నెక్ట్స్ సినిమా గౌతమ్ మీనన్ దర్శకత్వంలో ఉండొచ్చు. రాజమౌళి దర్శకత్వంలో మరోసారి నటించాలని ఉంది'' అన్నారు అనుష్క. భాగమతి సినిమా గురించి చెబుతూ– ''ఇందులో సంచల అనే ఐఏఎస్ అమ్మాయి క్యారెక్టర్ చేశాను. నిజానికి ఈ కథను నేను 2012లో విన్నా. కానీ లింగా, సైజ్ జీరో, బాహుబలి 1 అండ్ 2 సినిమాలను ముందు కమిట్ అయ్యాను. సో.. మేకర్స్ నాకోసం ఫోర్ ఇయర్స్ వెయిట్ చేశారు. 'భాగమతి' ట్రూ స్టోరీ కాదు. ఫిక్షన్. దర్శకుడు అశోక్ సినిమాను బాగా తీశారు'' అన్నారు.

ఉప్పుతో...

మెదడు పనితీరులోనూ తేడాలు!



ఉప్పు ఎక్కువగా తింటే రక్తపోటు వస్తుందని మనకు తెలుసు. వెయిల్ కార్నెల్ మెడిసిన్ శాస్త్రవేత్తలు తాజాగా ఇంకో విషయాన్ని కనుక్కున్నారు. ఈ రకమైన ఆహారంతో మతిమరుపు మొదలుకొని అనేక మెదడు సంబంధిత కార్యకలాపాల్లో తేడాలు రావచ్చునని ఎలుకలపై జరిపిన పరిశోధనల ద్వారా వీరు గుర్తించారు. మెదడుకు.. మన కడుపు/పేగులకు మధ్య ఇప్పటివరకూ గుర్తించని ఓ సంబంధం వల్ల ఇలా జరుగుతోందన్నది వారి అంచనా. కొన్ని ఎలుకలకు అధిక మోతాదులో ఉప్పు ఉన్న ఆహారాన్ని అందించినప్పుడు వాటి మెదడులోని కార్టెక్స్ ప్రాంతంలో రక్త సరఫరా 25 శాతం వరకూ తగ్గినట్లు తెలిసింది. అలాగే ఎనిమిది వారాల తరువాత హిప్పోకాంపస్‌లోనూ ఇంతే స్థాయి తగ్గుదల నమోదైంది. ఈ ఎలుకలకు కొన్ని పరీక్షలు పెట్టినప్పుడు సాధారణ ఎలుకల కంటే చాలా అధ్వానమైన ఫలితాలు వచ్చాయి. ఆహారంలో ఉప్పు ఎక్కువైనప్పుడు తెల్ల రక్తకణాలు ఒక ప్రొటీన్ ఉత్పత్తిని పెంచడం.. ఫలితంగా ఎండోథీలియల్ కణాల్లో నైట్రిక్ యాక్సైడ్ తగ్గిపోవడం ద్వారా మెదడుపై ప్రభావం పడినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. మందుల ద్వారా ఈ ప్రొటీన్‌ను అందించగా పరిస్థితులు చక్కబడ్డాయి. కీళ్లనొప్పుల వంటి ఆటో ఇమ్యూన్ సమస్యలప్పుడు కూడా ఈ ప్రొటీన్ ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఉప్పు మోతాదును తగ్గించడం ద్వారా ఎలుకలు నాలుగు వారాల్లో సాధారణ స్థితికి వచ్చినట్లు వారు చెప్పారు.

* * *

మంట లేకుండానే వేడి చేస్తుంది...



ఆఫీసుకు క్యారియర్ పట్టుకొచ్చారా? భోజనం వేళకు.. అయ్యో ఆహారం చల్లగా ఉందని బాధపడుతున్నారా? ఇంకొన్ని నెలలు ఆగితే ఈ ఇబ్బందికి సరికొత్త పరిష్కారం అందుబాటులోకి వచ్చేస్తుంది. మైక్రోవేవ్ ఓవెన్, స్టవ్ వంటివి అవసరం లేకుండానే ఆహారాన్ని వెచ్చబెట్టుకునేందుకు సరికొత్త టెక్నాలజీని సిద్ధం చేసింది యాబూల్. ఫొటోలో కనిపిస్తోందే.. అదే యాబూల్ కుక్కర్. సిలికాన్ రబ్బరుతో తయారు చేసిన ఓ బాక్స్.. మూతపై చిన్న వాల్వ్ లాంటివి ఉంటాయి దీంట్లో. వంటెలా వండాలి? అంటున్నారా? చాలా సింపుల్. ఈ కుక్కర్‌తోపాటు మీకు కొన్ని హీటింగ్ ప్యాడ్స్ అవసరమవుతాయి. కవర్‌లోంచి వాటిని తీసి కుక్కర్ అడుగున పెట్టాలి. పైన జిప్ బ్యాగ్‌లో వండాల్సిన ఆహారం ఉంచి.. మూత వేసేయాలి. ఒకవైపు నుంచి మూత కొంచెం మాత్రం తీసి నీళ్లుపోసి.. మళ్లీ మూత పెట్టేయాలి. అంతే. పది నిమిషాల్లో కుక్కర్ నుంచి ఆవిరి రావడాన్ని మీరు గమనించవచ్చు. కొంచెం ఆగి జిప్‌బ్యాగ్‌లో ఉన్న ఆహారాన్ని లాగించేయడమే. హీటింగ్ బ్యాగ్‌లో ఉండే రసాయనాల కారణంగా చుట్టూ ఉన్న నీరు వేడెక్కి కుతకుత ఉడికే స్థాయికి చేరుతుంది. ఈ క్రమంలోనే బ్యాగ్‌లలో ఉంచిన ఆహారం కూడా సిద్ధమవుతుందన్నమాట. ఒక్కో హీటింగ్ ప్యాడ్‌ను ఒక్కసారి మాత్రమే వాడుకోవచ్చు. కొరియాకు చెందిన యాబూల్ ఈ వినూత్నమైన ఐడియాను మార్కెట్‌లోకి తెచ్చేందుకు కిక్‌స్టార్టర్ ద్వారా నిధులు సేకరిస్తోంది. దాదాపు పదివేల డాలర్లు సేకరించాలన్నది లక్ష్యం కాగా.. ఇప్పటికే 23 వేల డాలర్లకుపైగా వచ్చేశాయి. అన్నీ సవ్యంగా సాగితే ఇంకో నెల రోజుల్లో ఈ వినూత్నమైన కుక్కర్ మార్కెట్‌లోకి వచ్చేస్తుంది.

* * *

బిడ్డకు పాలిస్తే..

తల్లికి మధుమేహం దూరం?



నవజాత శిశువుకు తల్లిపాలకు మించిన ఆరోగ్య రక్షణ లేదని అంటారుగానీ.. మధుమేహం విషయంలో ఇది తల్లికీ మేలని అంటున్నారు శాస్త్రవేత్తలు. దాదాపు 30 ఏళ్ల సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా తాము ఈ అంచనాకు వచ్చినట్లు ఉత్తర కాలిఫోర్నియాకు చెందిన కైసర్ పెర్మనెన్‌టే శాస్త్రవేత్తలు తెలిపారు. పాలిచ్చే తల్లులకు రొమ్ము, అండాశయ కేన్సర్ల ముప్పు తక్కువగా ఉంటుందన్నది తెలిసిందే. యువతుల్లో గుండెజబ్బులు వచ్చేందుకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేయడం లక్ష్యంగా 1986లో కైసర్ పెర్మనెన్‌టే శాస్త్రవేత్తలు కొంతమంది మహిళలపై ఒక అధ్యయనం చేపట్టారు. ఇందులో 18 – 30 మధ్య వయస్కులు దాదాపు ఐదే వేల మంది పాల్గొన్నారు. గర్భధారణ సమయంలో వచ్చే మధుమేహాన్ని మినహాయించి తరచూ జరిపిన పరిశోధనల ద్వారా తేలింది ఏమిటీ అంటే.. ఆరునెలల కంటే ఎక్కువ సమయం పిల్లలకు స్తన్యమిచ్చే వారిలో సగం మందిలో మధుమేహ లక్షణాలేవీ కనిపించలేదు. పాలు అస్సలు పట్టని తల్లులతో పోలిస్తే ఆరు నెలల కంటే తక్కువ పాలిచ్చే తల్లుల్లో మధుమేహం ముప్పు 25 శాతం తక్కువని తేలింది. ఈ ఫలితాలు ఇతర పరిశోధనల ఫలితాలకు దగ్గరగా ఉన్నాయని, అన్ని ప్రాంతాల మహిళలు (ఆఫ్రికన్లు, ఇతరులు) ఇదే రకమైన ధోరణి కనపరిచారని ఈ అధ్యయనం నిర్వహించిన డాక్టర్ గుండెర్‌సన్ తెలిపారు.

హైదరాబాద్
శుక్రవారం
19-1-2018
సాక్షి ఫ్యామిలీ

ఫ్యాషన్

బాహుభళీ!



భళి భళి భళిరా భళీ! బంగారు బాహు భళీ!!
జాకెట్లకు వచ్చిందండి.. కనకంతో కళా కేళీ!

పెళ్లికూతురే కాదు పెళ్లికి హాజరయ్యే వారూ వినూత్న బ్లౌజ్ డిజైన్లతో మండపాలకు కళ తీసుకువస్తున్నారు. ఆభరణాలను ధరించడంతో పాటు బ్లౌజ్‌నే ఆభరణంగా మార్చేస్తున్నారు. గ్రాండ్‌గా ఉండే ఈ కళ ఇప్పుడు సంప్రదాయ ఎంబ్రాయిడరీ డిజైన్లలో పెద్ద పీట వేస్తున్నాయి.

కాసులపేరు

మెడనిండుగా బంగారు కాసులతో చేసిన హారం వేసుకుంటు చూసే కళ్లన్నీ కుళ్లుకోవాల్సిందే! మెడలోనే కాసుల పేరు వేసుకుంటే ఎలా? చేతులకు, వీపు భాగాన కాసులు మెరిసిపోవాలి. ముత్యాలతో కలిసి దోస్తీ చేయాలి. డిజైన్‌ని బట్టి కాసుల సంఖ్యను ఎంచుకోవాలి. చుట్టూతా కుందన్స్, జర్దోసీతో అలంకరించాలి. ఖరీదును బట్టి అచ్చమైన బంగారపు కాసులను కూడా బ్లౌజ్ డిజైన్‌కి ఎంచుకోవచ్చు.

పూసల హారాలు

ఇతర బంగారు హారాలు అక్కర్లేదు. ఎంబ్రాయిడరీ వర్క్‌లే నెక్లెసులు అవుతున్నాయి. అదీ బోట్‌నెక్ బ్లౌజ్‌కి స్వరోస్కి, జర్దోసీ మగ్గం వర్క్‌లు కొత్త కొత్త సొగసులను అద్ది చూపరుల మతులను పోగొడుతున్నారు డిజైనర్లు. జువెల్రీ ఎంబ్రాయిడరీ వర్క్‌లో కుందన్స్, పూసలు ప్రధానంగా ఉంటున్నాయి.

కనక మహాలక్ష్మి

నిన్నా మొన్నటి వరకు టెంపుల్ జువెల్రీలో అష్టలక్ష్ముల మూర్తులు దర్శనమిచ్చేవి. నేడు బ్లౌజ్ చేతుల మీదా, వీపు మీదా లక్ష్మీదేవి మూర్తిని పెట్టి, చుట్టూతా పొందికైన డిజైన్‌తో కళ్లకు నిండుతనాన్ని తీసుకువస్తున్నారు. ఎంత గ్రాండ్‌గా ఉంటే అంత బాగు అన్నట్టుగా పెళ్లికి అష్టలక్ష్ములు నడిచి వచ్చినట్టు బ్లౌజ్‌ని అలంకరించేస్తున్నారు. ముఖ్యంగా ఈ డిజైన్ చేతుల మీద కొలువుదీరుతుంది.

ఖరీదును బట్టి ఈ జువెల్రీ డిజైన్లను రూపొందించుకోవచ్చు. అవి అచ్చమైన బంగారమా, ఇమిటేషన్ జువెల్రీతోనా అనేది మీ ఇష్టం.

నెల వంకలు

అమ్మాయిలే నేలమీద నడిచే చంద్రవంకలు. అలాంటి వారి బ్లౌజ్‌ల మీద నెలవంక చుక్కల సంఖ్యను మించిపోయేలా చేరిపోతే ఎంత అందం. ఆ అందాన్ని పోలి ఉండేలా ఆభరణాల ఎంపికతో బ్లౌజ్ మీద ఇలా సింగారించుకోవచ్చు.





నిర్వహణ: ఎన్.ఆర్

న్యూ లుక్

పాత చీర కొత్త డ్రెస్



అమ్మ, అమ్మమ్మల చీరలను లంగ, జాకెట్టులుగా అమ్మాయిలకు రూపొందించడం తెలిసిందే! ఈ కాలం అమ్మాయిల ఆలోచనలకు తగ్గట్టు పాత చీరలను ఇలా లాంగ్ అనార్కలీ, వెస్టర్న్ లాంగ్ ఫ్రాక్‌లుగా రూపొందిస్తే కొత్తగా వెలిగిపోతాయి. ఇలాంటి డ్రెస్సులు సంప్రదాయ వేడుకల్లో స్టైల్‌గా మెరిసిపోతాయి.

ఇందుకు పట్టు, చేనేత చీరలను ఎంచుకోవాలి.

- ఎంచుకున్న శారీని ఏ తరహా డ్రెస్‌గా రూపకల్పన చేసుకుంటే బాగుంటుందో ముందుగా నిర్ణయించుకోవాలి. లాంగ్ అనార్కలీలు, గౌన్లు ఇప్పుడు ఫ్యాషన్‌లో ఉన్నాయి.
- అంచులు, కొంగును చేతులు, ఛాతీ భాగాలకు తీసుకోవాలి. అంచు భాగం ఎక్కువగా ఉండి మిగిలిపోయే అవకాశం ఎక్కువ. ఇలాంటప్పుడు ఫ్రంట్ ఓపెన్ డ్రెస్‌గా మలుచుకొని, అంచు భాగాన్ని జత చేయాలి. ఈ ఫ్రాక్‌కి కాంట్రాస్ట్ లెగ్గింగ్, చుడీని జత చేస్తే చాలు. ఈ కాలానికి తగ్గట్టు పార్టీ వేర్ డ్రెస్ రెడీ!
- కేవలం చీర కొంగును మాత్రమే తీసుకొని, దీంతో స్టైలిష్ వేర్‌ని డిజైన్ చేసుకోవచ్చు. వెస్టర్న్ పార్టీలలో ఇలాంటి డ్రెస్ మరింత ట్రెండీగా వెలిగిపోతుంది.
- రెడ్ కార్పెట్ డ్రెస్‌గా లాంగ్ వెస్టర్న్ గౌన్ సెలబ్రిటీల స్పెషల్‌గా నిలుస్తుంది. ఇలాంటి డ్రెస్ మీ అమ్మాయికి కావాలనుకుంటే అంచు ఉన్న పాత చేనేత చీరను తీసుకొని ఇలా డిజైన్ చేసుకోవచ్చు. సన్నటి అంచు భాగాలను క్రాస్ నెక్, సైడ్స్, కింది భాగాలలో జత చేస్తే మోడ్రన్‌గా వెలిగిపోతుంది.







ప్రొఫెషనల్ కౌన్సెలింగ్

అదేపనిగా కూర్చొనే ఉంటున్నాను... ఆరోగ్యం చెడకుండా సలహా ఇవ్వండి

నేను ఐటీ ప్రొఫెషన్‌లో ఉన్నాను. ఒకసారి ఆఫీసులోకి వచ్చాక నేను నా కంప్యూటర్ ముందు కూర్చున్నానంటే మళ్లీ సాయంత్రం వరకూ లేచే పరిస్థితి ఉండదు. అంతంత సేపు అదేపనిగా కూర్చొనే ఉండటం మంచిది కాదని ఫ్రెండ్స్ అంటున్నారు. వారనేది వైద్యపరంగా కరక్టేనా? నా ప్రొఫెషన్‌ను దృష్టిలో పెట్టుకొని, నా ఆరోగ్యం కాపాడుకోడానికి తగిన సలహాలు ఇవ్వండి.

– సమీర్, హైదరాబాద్



కూర్చొని పనిచేసే వృత్తుల్లో ఉన్నవారు అదేపనిగా కూర్చొనే ఉండటం చాలా ఆరోగ్య సమస్యలకు కారణమవుతుందని అనేక పరిశోధనల్లో వెల్లడయ్యింది. సుదీర్ఘకాలం పాటు కూర్చొనే ఉండటం అన్నది టైప్–2 డయాబెటిస్, ప్రాణాంతకమైన గుండెజబ్బులు, కొన్ని రకాల క్యాన్సర్లకూ కారణమవుతుంది. కూర్చునే వృత్తుల్లో ఉన్నా లేదా ప్రయాణాలు చేసే వృత్తుల్లో ఉన్నవారు అదేపనిగా సీట్లో చాలాసేపు కూర్చోవడం, లేదా టీవీని వదలకుండా చూస్తూ కూర్చోవడం, వృత్తిపరంగా బైక్‌మీద కూర్చొనే చాలాసేపు ప్రయాణం చేస్తూ ఉండటం వంటి అనేక అంశాలు ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతాయి. పొగతాగడం వంటి దురలవాటు ఎంత దుష్ప్రభావం చూపుతుందో, ఇలా కూర్చొనే ఉండటం అన్న అంశం కూడా అంతకంటే ఎక్కువ దుష్ప్రభావమే చూపుతుందని ఎన్నో అధ్యయనాలు వెల్లడించిన వాస్తవం. ప్రతివారు రోజూ కనీసం 30 – 45 నిమిషాల పాటు వాకింగ్ చేయడం అవసరం.

పిల్లలు ఎక్కువగా టీవీ చూడటం, కంప్యూటర్ గేమ్స్‌లో నిమగ్నం కావడం అనే కారణాలతో అదేపనిగా కూర్చొనే ఉంటారు. ఇక పెద్దలు తమ ఆఫీసు పనుల్లో మునిగిపోయి కూర్చొనే ఉంటారు.

కొన్ని సూచనలు :

● మీ బెడ్‌రూమ్స్‌లో టీవీ / కంప్యూటర్ / ల్యాప్‌టాప్ లను ఉపయోగించకండి ● మీరు ఇంట్లో ఉన్నప్పుడు ఒంటికి పని చెప్పే ఏదో పనిని ఎంచుకోండి ●పిల్లలకు మీరు ఇచ్చే బహుమతుల్లో పిల్లలకు శారీరక ఆరోగ్యం చేకూర్చే బంతులు / ఆటవస్తువుల వంటివి ఉండేలా చూసుకోండి ● మీరు ఆఫీసుకు వచ్చే ముందర లోకల్ బస్సుల్లో, లోకల్ ట్రైన్స్‌లో ప్రయాణం చేసేవారైతే ఆ టైమ్‌లో కూర్చుని ప్రయాణం చేయకండి. ● ఎస్కలేటర్ వంటి సౌకర్యం ఉన్నా మెట్లెక్కండి ● రోజూ కనీసం 30 నిమిషాలు నడవాలని నియమం పెట్టుకోండి ● మీ పనిలో కాసేపు కాఫీ లేదా టీ బ్రేక్ తీసుకోండి ● మీకు దగ్గరి కొలీగ్స్‌తో మాట్లాడాల్సి వస్తే మొబైల్ / మెయిల్ ఉపయోగించకండి. వారి వద్దకే నేరుగా వెళ్లి మాట్లాడండి

ఫ్యామిలీ డాక్టర్

నేను దాదాపు రోజుకు 14 గంటలు కూర్చొనే పనిచేస్తుంటాను. రాత్రిపూట సరిగా నిద్రపట్టడం లేదు. ఒళ్లు అలిసేలా వ్యాయామం చేయమనీ, దాంతో బాగా నిద్రపడుతుందని ఫ్రెండ్స్ చెబుతున్నారు. వ్యాయామం చేసేవాళ్లకు అంతగా నిద్రపట్టదని మరికొంతమంది ఫ్రెండ్స్ అంటున్నారు. నేను సందిగ్ధంలో ఉన్నాను. దయచేసి సలహా ఇవ్వండి.

– అనిల్‌కుమార్, విశాఖపట్నం

వ్యాయామంతో నిద్రపడుతుందా... పట్టదా?

మీరు విన్న రెండు అంశాలూ నిజమే. నిద్రకు ఉపక్రమించబోయే మూడు గంటల ముందుగా వ్యాయామం అంత సరికాదు. అలా చేస్తే నిద్రపట్టడం కష్టమే. అయితే రోజూ ఉదయంగానీ లేదా ఎక్సర్‌సైజ్‌కూ, నిద్రకూ చాలా వ్యవధి ఉండేలా గానీ వ్యాయామం చేస్తే మంచి నిద్ర పడుతుంది. ఒళ్లు అలిసేలా వ్యాయామంతో ఒళ్లెరగని నిద్రపడుతుంది. ఉదయం చేసే వ్యాయామంతో ఒత్తిడి నుంచి దూరమవుతారు. అయితే ఉదయం వేళ చేసే వ్యాయామం పగటి వెలుగులో అయితే మరింత ప్రభావపూర్వకంగా ఉంటుంది.

మీరు ఉదయం వేళలో వ్యాయామం చేయలేకపోతే అది సాయంత్రం వేళ అయితే మంచిది. మీ రోజువారీ పనుల వల్ల అప్పటికి మీ శరీర ఉష్ణోగ్రత కూడా కాస్త పెరిగి ఉంటుంది. ఇక నిద్రవేళకు మన శరీర ఉష్ణోగ్రత కాస్త తగ్గుతుంటంది. కానీ వ్యాయామంతో మళ్లీ శరీరాన్ని ఉత్తేజపరచడం జరుగుతుంది. ఇక కార్డియోవాస్క్యులార్ వ్యాయామాల వల్ల గుండె స్పందనల వేగం, రేటు పెరుగుతాయి. శరీర ఉష్ణోగ్రత కూడా పెరుగుతుంది. వీటన్నింటి ఉమ్మడి ప్రభావాల వల్ల నిద్ర తగ్గుతుంది. అంతేకాదు... వ్యాయామం ముగిసిన 20 నిమిషాల తర్వాతగానీ గుండె కండరాల రక్తం పంపింగ్ ప్రక్రియ సాధారణ స్థితికి రాదు. అందుకే వ్యాయామానికీ, నిద్రకూ మధ్య వ్యవధి ఉండేలా చూసుకోవాలన్న మాట. ఇక స్ట్రెచింగ్ వ్యాయామాలు, బలాన్ని పెంచుకనే స్ట్రెంగ్త్ ట్రెయినింగ్ తరహా వ్యాయామాలూ శరీరానికి మేలు చేసినా... అవేవీ కార్డియోవాస్క్యులార్ వ్యాయామాలకు సాటిరావు. యోగా ప్రధానంగా తనువునూ, మనసునూ రిలాక్స్ చేసే ప్రక్రియ. మీ ఫ్రెండ్స్‌లో కొందరు చెప్పినట్లుగా దీర్ఘకాలిక నిద్రలేమికి వ్యాయామం విరుగుడు. అందుకే మరీ తీవ్రంగా (విగరస్‌గా) కాకుండా... మరీ చేసీచెయ్యనట్లు (మైల్డ్)గా కాకుండా... మాడరేట్ ఎక్సర్‌సైజ్ చేయండి. కంటినిండా నిద్రపోండి. వాకింగ్, జాగింగ్, జంపింగ్, స్విమ్మింగ్, టెన్నిస్ ఆడటం, డాన్స్ చేయడం లాంటి ఏ ప్రక్రియ అయినా వ్యాయామానికి మంచిదే. అయితే మీకు గుండెజబ్బులూ, స్థూలకాయం, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు ఉంటే వ్యాయామాలు మొదలుపెట్టే ముందు ఒకసారి డాక్టర్‌ను సంప్రదించి, మీకు తగిన వ్యాయామాలు సూచించమని అడగడం మేలు.



డాక్టర్ సుధీంద్ర ఊటూరి
లైఫ్‌స్టైల్ స్పెషలిస్ట్,
కిమ్స్ హాస్పిటల్స్, సికింద్రాబాద్

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

దరఖాస్తు చేశారా?

- ఐఓసీఎల్‌లో జేఈ, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అనలిస్ట్ తదితర 58 పోస్టులకు చివరి తేదీ: జనవరి 20, వెబ్‌సైట్: www.iocl.com
- బెల్‌లో 35 కాంట్రాక్టు ఇంజనీర్, 'మేనేజర్' పోస్టులకు చివరి తేదీ: జనవరి 20, వెబ్‌సైట్: www.bel-india.com
- ఏఎల్ఐఎంసీవోలో 36 ఆడియోలజిస్ట్ పోస్టులకు చివరి తేదీ: జనవరి 22, వెబ్‌సైట్: www.alimco.in
- ఐఐటీ జమ్మూలో రిజిస్ట్రార్, ఇంజనీర్ తదితర 62 పోస్టులకు చివరి తేదీ: జనవరి 23, వెబ్‌సైట్: www.iitjammu.ac.in

కెరీర్ గైడెన్స్

గ్లోబలైజేషన్ ఫలితంగా.. పలు బహుళ జాతి సంస్థలు తమ ప్రధాన కార్యాలయంతోపాటు పలు దేశాల్లో అనుబంధ కార్యాలయాలు ఏర్పాటు చేసి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. అలాగే మన దేశంలోని కంపెనీలు.. పలు విదేశీ సంస్థలకు ఔట్ సోర్సింగ్ సేవలను.. సంబంధిత క్లయింట్ కంపెనీకి చెందిన మాతృ భాషలో అందిస్తున్నాయి. దీంతో సదరు విదేశీ భాషలు తెలిసిన నిపుణుల అవసరం పెరుగుతోంది. ఇది ఇప్పుడు యువతకు చక్కటి కెరీర్ అవకాశంగా మారుతోంది. ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో .. జర్మన్, స్పానిష్, ఫ్రెంచ్, చైనీస్, జపనీస్ తదితర భాషలపై ప్రావీణ్యం కలిగిన వారికి మంచి డిమాండ్ ఉంది. వివిధ విదేశీ భాషల్లో పలు కోర్సులను అందిస్తున్న ది ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ) ఆయా కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో... విదేశీ భాషలతో ఉపాధి అవకాశాల గురించి తెలుసుకుందాం...



ఫారెన్ లాంగ్వేజెస్.. ఫర్ బెటర్ కెరీర్

స్పానిష్

ప్రపంచంలోని 20 దేశాల్లో అధికారిక భాష..స్పానిష్. యూరోపియన్ యూనియన్, యూఎన్‌వో వంటి ప్రముఖ సంస్థల్లోనూ అధికారిక భాషగా అమలవుతోంది. ఈ భాష లిపి, శైలి, దాదాపు ఇంగ్లిష్‌ను పోలి ఉంటుంది. కాబట్టి ఇంగ్లిష్ లాంగ్వేజ్ నైపుణ్యమున్న విద్యార్థులు సులువుగా స్పానిష్ నేర్చుకోవచ్చు. ఇటీవల కాలంలో భారత్‌కు చెందిన పలు సంస్థలు స్పానిష్ స్పీకింగ్ కంట్రీస్‌గా పేర్కొనే లాటిన్ అమెరికా, అర్జెంటీనా, కొలంబియా తదితర దేశాలలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇది మన దేశ యువతకు అవకాశాలు మెరుగుపరుస్తుందని చెప్పొచ్చు.

జపనీస్

మన దేశంలో విదేశీ భాషల పరంగా డిమాండ్ నెలకొన్న మరో భాష.. జపనీస్. పదుల సంఖ్యలో జపనీస్ కంపెనీలు భారత్‌లో ప్రత్యక్ష, పరోక్ష కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఈ కంపెనీలకు భారీ సంఖ్యలో ఇంటర్‌ప్రిటేటర్స్, ట్రాన్స్‌లేటర్స్ అవసరం ఏర్పడుతోంది. అంతేకాకుండా జైకా(జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ) ద్వారా జపాన్, భారత్‌ల మధ్య అధికారికంగా పలు ద్వైపాక్షిక ఒప్పందాలు జరుగుతున్నాయి. భారత్‌లో జపాన్‌కు చెందిన కంపెనీలు జాయింట్ వెంచర్ విధానంలో కార్యకలాపాలు చేపడుతున్నాయి.

జర్మన్

ఇటీవల కాలంలో డిమాండ్ పెరుగుతున్న మరో విదేశీ భాష.. జర్మన్. ఈ భాషను నేర్చుకోవడం కొంత కష్టమనే అభిప్రాయముంది. జర్మనీలో ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్లాలనుకునే విద్యార్థులకు జర్మన్ భాషలో బేసిక్ ప్రొఫిషియన్సీ ఉండాలి. ఈ మేరకు పలు దేశాల్లోని జర్మన్ ఎంబసీల్లో ప్రత్యేకంగా ట్రైనింగ్ సెంటర్లు ఉన్నాయి. ఈ భాషలో నైపుణ్యం పొందిన వారికి.. వారు పొందిన ప్రొఫిషియన్సీ(లెవల్ ఎ1, ఎ2, బి1, బి2, సి1, సి2) ఆధారంగా ట్రాన్స్‌లేటర్స్, ఇంటర్‌ప్రిటేటర్స్, డాక్యుమెంట్ రైటర్స్‌గా అవకాశాలు లభిస్తాయి.

ఫ్రెంచ్

ఫ్రెంచ్ లాంగ్వేజ్‌ను నేర్చుకున్న వారు ఉపాధి అవకాశాలు అందుకునే వీలుంది. ఈ భాషను నేర్చుకోవడం సులభమే. కారణం.. ఇంగ్లిష్‌లో వాడుకలో ఉన్న 50 శాతం పదాలకు ఫ్రెంచ్ మాతృకగా ఉండటమే. దీంతో ఇంగ్లిష్‌పై పట్టున్న అభ్యర్థులు ఫ్రెంచ్ భాషలోనూ నైపుణ్యాలు సులువుగా సొంతం చేసుకోగలుగుతారు.

చైనీస్


ప్రపంచంలో 20 శాతం మేర జనాభా మాట్లాడుతున్న భాషగా గుర్తింపు పొందింది.. చైనీస్. ముఖ్యంగా చైనా పర్యాటకుల సంఖ్య పెరుగుతుండటంతో ఈ భాష నిపుణులకు డిమాండ్ ఏర్పడుతోంది.

సర్టిఫికెట్ టు పీహెచ్‌డీ



ఫారెన్ లాంగ్వేజెస్ పరంగా ఆయా యూనివర్సిటీలు అందిస్తున్న కోర్సులు మూడు నుంచి ఆరు నెలల వ్యవధిలో ఉండే సర్టిఫికెట్ కోర్సులు మొదలు.. రెండేళ్ల వ్యవధిలోని పీజీ కోర్సుల వరకు అందుబాటులో ఉన్నాయి. ఇక.. ప్రైవేటు ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు మూడు నెలల వ్యవధిలో బేసిక్ లేవల్ కోర్సులను అందిస్తున్నాయి.

ట్రైనర్స్‌గానూ అవకాశాలు



ఫారెన్ లాంగ్వేజెస్‌లో పీజీ, పీహెచ్‌డీ చేసిన వారికి ఇన్‌స్టిట్యూట్‌లు, యూనివర్సిటీల్లో ట్రైనర్స్‌గానూ అవకాశాలు లభిస్తాయి. సదరు లాంగ్వేజ్‌కు మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి నెలకు రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనం లభిస్తుంది.

ఫ్రీలాన్సింగ్



ఫారెన్ లాంగ్వేజెస్‌లో నైపుణ్యాలు పొందిన అభ్యర్థులు ఫ్రీలాన్సింగ్ విధానంలోనూ ఆదాయం పొందొచ్చు. వీరికి ప్రధానంగా ఫార్మాస్యుటికల్ సంస్థలు, టూరిజం సంస్థల్లో అనువాదకులుగా (రిటెన్ అండ్ స్పోకెన్) అవకాశాలు లభిస్తాయి. రిటెన్ ట్రాన్స్‌లేషన్ పరంగా పద పరిమితి ఆధారంగా ఒక్కో పదానికి రూ.రెండు నుంచి మూడు లభిస్తాయి. పని గంటల ఆధారంగా కొన్ని ప్రముఖ టూరిజం సంస్థలు గంటకు రూ. వేయి వరకు అందిస్తున్నాయి.

ప్రధాన ఉపాధి వేదికలు



- హాస్పిటాలిటీ రంగం
- టూరిజం రంగం
- ఫార్మాస్యుటికల్ సంస్థలు
- ఆయా దేశాల రాయబార కార్యాలయాలు
- ఐటీ బీపీఓ సంస్థలు
- ఎక్స్‌పోర్ట్ – ఇంపోర్ట్ హౌసెస్

ఆయా కోర్సులను ఆఫర్ చేసున్న పలు ఇన్‌స్టిట్యూట్స్

- ఇఫ్లూ(ఫ్రెంచ్,జర్మన్, జపనీస్, రష్యన్, స్పానిష్, మొదలైన)
- జేఎన్‌యూ ఢిల్లీ(చైనీస్, ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, స్పానిష్, కొరియన్ తదితర..)
- జవహర్‌లాల్ నెహ్రూ అకాడమీ ఆఫ్ లాంగ్వేజెస్(ఫ్రెంచ్, జపనీస్, స్పానిష్, జర్మన్, చైనీస్, రష్యన్, అరబిక్ మొదలైన..)
- ఉస్మానియా యూనివర్సిటీ (ఫ్రెంచ్, జర్మన్, అరబిక్ మొదలైనవి)
- ఇండియా – చైనా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(చైనీస్)
- ఢిల్లీ యూనివర్సిటీ(ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, ఇటాలియన్, రష్యన్ తదితర కోర్సులు)
- మిరిండా హౌస్, ఢిల్లీ యూనివర్సిటీ(ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్)
- అలియన్స్ ఫ్రాన్సైస్ (ఫ్రెంచ్)
- గొయతీ ఇన్‌స్టిట్యూట్ (జర్మన్)

ఫ్యాక్ట్స్ అండ్ ఫిగర్స్

1 ప్రముఖ అంతర్జాతీయ రీసెర్చ్ సంస్థ ఇ-వాల్యూసర్వ్ అంచనా ప్రకారం- రానున్న మూడేళ్లలో భారత్‌లో 1.5 లక్షల ఫారెన్ లాంగ్వేజ్ ప్రొఫెషనల్స్ అవసరం.

2 టీమ్‌లీజ్ అంచనా ప్రకారం- ఈ ఏడాది ఆయా ఫారెన్ లాంగ్వేజ్ ప్రొఫెషనల్స్‌కు సంబంధించి దాదాపు ఏడు వేల మంది అవసరం.

3 స్పానిష్, జపనీస్, జర్మన్ భాషలకు పెరుగుతున్న డిమాండ్.

4 సకుర్రా ఫౌండేషన్ అంచనా ప్రకారం- ప్రస్తుతం 45వేల మంది జపనీస్ లాంగ్వేజ్ ప్రొఫెషనల్స్ అవసరం ఉంది.

స్టడీ అబ్రాడ్..

విదేశీ వర్సిటీలో ప్రవేశించాలంటే.. ముఖ్యంగా కావలసినవి.. చక్కటి అకడమిక్ రికార్డ్! అద్భుతమైన స్టాండర్డ్ టెస్ట్ స్కోర్స్! ఆర్థిక స్థోమత! ఆకట్టుకునే రీతిలో రెజ్యుమే! స్టడీ అబ్రాడ్ ఔత్సాహికులకు.. గుర్తొచ్చే అంశాలివే!! వీటితోపాటు మరో రెండు ఎంతో కీలకం అంటున్నారు నిపుణులు. అవే... స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ (ఎస్‌వోపీ).. లెటర్ ఆఫ్ రికమండేషన్ (ఎల్‌వోఆర్)!! ఎస్‌వోపీ.. ఎల్‌వోఆర్ గురించి తెలుసుకుందాం..



ఆ రెండు ఎంతో కీలకం!

ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ మొదలు.. విదేశాల్లోని పలు విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాల పరంగా ఆయా వర్సిటీల దృక్పథంలో మార్పు కనిపిస్తోంది. అకడమిక్ రికార్డ్‌లు, స్టాండర్డ్ టెస్ట్ స్కోర్స్‌కే పరిమితం కాకుండా.. విద్యార్థులు అందించే స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ (ఎస్‌వోపీ), లెటర్ ఆఫ్ రికమండేష(ఎల్‌వోఆర్)న్లు ప్రవేశాలు ఖరారులో అత్యంత కీలకంగా మారుతుండటం తాజా పరిణామం. కొన్ని సందర్భాల్లో సర్టిఫికెట్లు, స్కోర్స్ పరంగా ఎంత ముందంజలో ఉన్నా.. ఎస్‌వోపీ, ఎల్‌వోఆర్‌లు సరిగా లేక నిరాశ చెందుతున్న వారెందరో! ఇదే సమయంలో సదరు సర్టిఫికెట్లు, అకడమిక్ రికార్డ్ అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ.. ఎస్‌వోపీ, ఎల్‌వోఆర్‌లతో మెప్పించి ప్రవేశం ఖాయం చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది !!.

భవిష్యత్తు లక్ష్యం ప్రతిబింబించేలా.. ఎస్‌వోపీ

విదేశీ వర్సిటీల్లో ప్రవేశం దిశగా అభ్యర్థులు తమ దరఖాస్తుతోపాటు తప్పనిసరిగా జత చేయాల్సిన పత్రం.. ఎస్‌వోపీ(స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్). ఎస్‌వోపీలో అభ్యర్థులు తమ భవిష్యత్తు లక్ష్యం, సదరు యూనివర్సిటీలో సంబంధిత కోర్సు పూర్తి చేయడం ద్వారా ఆ లక్ష్యాలను చేరుకోవడానికి ఉన్న సానుకూలతలను తెలియజేయాలి. ఇందులో పేర్కొనే అంశాల ఆధారం గా విద్యార్థికి సదరు కోర్సు పట్ల ఉన్న ఆసక్తిని, అంకి తభావాన్ని అడ్మిషన్ల రివ్యూ కమిటీ ఇట్టే పసిగట్టేస్తుం ది. ప్రవేశాలను ఖరారు చేసే క్రమంలో ఎస్ఓపీలకు 30శాతం నుంచి 40 శాతం వరకూ ప్రాధాన్యం లభిస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. జీమ్యాట్, జీఆర్ఈ, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్.. ఇలా స్కోర్లు ఎంట్రీ పాస్‌లుగానే మారుతున్నాయనడంలో సందేహం లేదు. ఎస్ఓపీ ఎంత బెస్ట్‌గా ఉంటే ప్రవేశ అవకాశాల్లో అంత ఫస్ట్‌గా నిలవొచ్చు.

కాపీ పేస్ట్ విధానాన్ని వద్దు

ఎస్‌వోపీలను రూపొందించే క్రమంలో చాలా మంది విద్యార్థులు అప్పటికే ఆయా విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశంపొందిన వారు అందజేసిన వాటిని గుడ్డిగా అనుసరిస్తూ ఉంటారు. దీనివల్ల ప్రతికూల అభిప్రాయం కలుగుతుందని గుర్తించాలి. అకడమిక్ రికార్డ్, స్టాండర్డ్ టెస్ట్ స్కోర్స్‌లో ఉత్తమ ప్రతిభ ఉన్నప్పటికీ.. విద్యార్థికి తనకంటూ స్వీయ అభిప్రాయాలు, లక్ష్యాలు ఉండాలని విదేశీ వర్సిటీలు భావిస్తున్నాయి. ఎస్ఓపీలో ఇతరులను అనుసరించే విద్యార్థులు భవిష్యత్తులో సొంతంగా ఎలా రా ణించ గలరు? అని అడ్మిషన్ కమిటీలు ఆలోచిస్తున్నాయి.

ఎస్‌వోపీల్లో పరిశీలిస్తున్నవివే

- సదరు విద్యార్థి వినియోగించిన పదజాలం(టెర్మినాలజీ).
- భవిష్యత్తు లక్ష్యం.
- ఆ లక్ష్యాన్ని ఎంపిక చేసుకోవడానికి కారణం.
- ఆ దిశగా ఇప్పటికే ఏమైనా సాధించి ఉంటే వాటి వివరాలు.
- సుస్థిర కెరీర్ పరంగా.. ఆ లక్ష్యం చేరుకునేందుకు తమ యూనివర్సిటీ, అందులో ప్రవేశం కోరుకుంటున్న కోర్సు ద్వారా మార్గం సుగమం అయ్యే అవకాశంపై విద్యార్థికున్న నిర్దిష్ట అభిప్రాయం.
- కోర్సు పూర్తయిన తర్వాత ఉన్నత అవకాశాల సాధన దృక్పథం.

సూటిగా.. స్పష్టంగా

చాలామంది విద్యార్థులు ఎస్‌వోపీలో క్లిష్టమైన పదాలను వినియోగిస్తారు. ఇలా చేయడం వల్ల అంతర్జాతీయ స్థాయిలోని నిపుణులను ఆకట్టుకోవచ్చని భావిస్తారు. వాస్తవానికి ఎస్‌వోపీలో రాసే పదజాలం సూటిగా, స్పష్టంగా ఉండాలి. భవిష్యత్తు లక్ష్యం, దానికి కారణాలు, ఆ దిశగా ఇప్పటికే సాధించిన విజయాల పరంగా.. తమకు ఆసక్తి కలిగించిన అంశాలను ప్రస్తావించి.. అవి తన లక్ష్యంగా మార్చిన కారణాలు తెలియజేయడం ఎంతో ఉపకరిస్తుంది. పాఠశాల, హైస్కూల్, కాలేజ్ స్థాయిలో సదరు లక్ష్య సాధనకు ఊతమిచ్చేలా ఏవైనా ఈవెంట్లలో పాల్గొంటే వాటిని ఉదహరించొచ్చు. ఇదంతా సూటిగా, స్పష్టంగా, సరళంగా ఉండాలి. యూనివర్సిటీలు ప్రవేశ దరఖాస్తు నిబంధనల్లోనే ఎస్‌వోపీ ఎన్ని పదాల్లో ఉండాలో నిర్దిష్టంగా పేర్కొంటున్నాయి. మరికొన్ని వర్సిటీలు దరఖాస్తులో ఎస్‌వోపీని ఒక ప్రశ్నగా చేర్చి.. దానికి సమాధానం ఇచ్చేందుకూ పద పరిమితిని నిర్దేశిస్తున్నాయి. ఔత్సాహిక విద్యార్థులు దీనిని పరిగణనలోకి తీసుకొని పద పరిమితి మించకుండా చూసుకోవాలి.

ఎల్‌వోఆర్..ముఖ్యమే

ప్రవేశ ప్రక్రియలో కీలకంగా మారుతున్న మరో సాధనం.. ఎల్‌వోఆర్(లెటర్ ఆఫ్ రికమండేషన్). విద్యార్థికి సదరు కోర్సులో చేరేందుకు ఉన్న అర్హతలు, అప్పటికే దానికి సంబంధించి విద్యార్థి పొందిన నైపుణ్యాలను వివరిస్తూ.. ఆ రంగంలోని ఇద్దరు నిపుణులు 'అభ్యర్థికి అవకాశం కల్పించొచ్చు' అంటూ సిఫార్సు లేఖ రాయడమే... ఎల్‌వోఆర్. కాబట్టి విద్యార్థులు తమ పూర్వ అధ్యాపకులు/ప్రొఫెసర్ల ద్వారా వాటిని పొందడం మేలు చేస్తుంది.

ఇండస్ట్రీ నిపుణులైనా సరే

ఇటీవల కాలంలో కొన్ని యూనివర్సిటీలు ఇండస్ట్రీ నిపుణులు ఇచ్చే ఎల్‌వోఆర్‌లకు ప్రాధాన్యం ఇవ్వడాన్ని గమనించొచ్చు. ముఖ్యంగా అకడమిక్ కోర్సులో భాగంగా ఇంటర్న్‌షిప్ చేసిన విద్యార్థులు.. సదరు సంస్థల్లోని విభాగాధిపతుల నుంచి ఎల్ఓఆర్‌లు పొందొచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకుని విదేశీ విద్య ఔత్సాహికులు తాము ఇంటర్న్ ట్రైనీగా పనిచేసే క్రమంలోనే సంస్థలో చక్కటి పనితీరు కనబరిస్తే.. విదేశీ వర్సిటీకి దరఖాస్తు చేసుకునే సమయంలో ఎల్‌వోఆర్ ఇచ్చేందుకు సదరు సంస్థ ప్రతినిధులు కూడా సానుకూలంగా స్పందించడానికి మార్గం సుగమం అవుతుంది.

సంప్రదిస్తే స్పందించేలా

ఎల్‌వోఆర్‌ల విషయంలో ఇటీవల కాలంలో యూనివర్సిటీలు అనుసరిస్తున్న మరో విధానం.. సదరు ఎల్ఓఆర్‌లను ఇచ్చిన వారిని ఫోన్ లేదా ఈ-మెయిల్ ద్వారా సంప్రదించడం. ఈ విషయాన్ని కూడా విద్యార్థులు ఎల్‌వోఆర్ ఇచ్చిన ప్రొఫెసర్లు లేదా ఇండస్ట్రీ నిపుణులకు ముందుగానే తెలియజేసి సంసిద్ధంగా ఉంచాలి. అకడమిక్‌గా తమ ప్రతిభకు సంబంధించి మంచి అవగాహన ఉన్న ప్రొఫెసర్లు, అదే విధంగా ఇంటర్న్ ట్రైనీ సమయంలో తమ పనితీరు గురించి మూల్యాంకన చేసిన సంస్థల ప్రతినిధుల నుంచి ఎల్‌వోఆర్‌లు పొందడం ప్రయోజనకరం.

ఇలా చేస్తే మేలు

- అకడమిక్‌గా తమ పనితీరు గురించి బాగా తెలిసిన ప్రొఫెసర్ల నుంచ ఎల్ఓఆర్ పొందడం.
- ఇండస్ట్రీ నిపుణుల విషయంలో తాము ఇంటర్న్‌షిప్ చేసిన సంస్థల ప్రతినిధుల నుంచి ఎల్ఓఆర్ తీసుకోవడం.
- వర్సిటీ అధికారులు సంప్రదిస్తే వారు సానుకూలంగా స్పందించేలా ముందుగానే అప్రమత్తం చేయడం.
- ఎల్‌వోఆర్‌లో అకడమిక్స్‌తోపాటు ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌లోనూ చురుగ్గా పాల్గొంటాడని ప్రస్తావించడం.
- ప్రాక్టికల్ ఓరియెంటెడ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యం ఇస్తాడనే రీతిలో ఎల్ఓఆర్‌లో పేర్కొనడం మేలు చేస్తుంది.

బులెటిన్ బోర్డ్

బెల్‌లో 26 ఖాళీలు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్:బెల్).. బెంగళూరులోని నేవల్ సిస్టమ్స్ ఎస్‌బీయూ యూనిట్‌లో 26 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** కాంట్రాక్ట్ ఇంజనీర్.
- **విభాగాల వారీ ఖాళీలు:** ఎలక్ట్రానిక్స్-16; మెకానికల్-10.
- **వేతనం:** రూ.23,000.
- **అర్హతలు:** బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్/టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ మెకానికల్) ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత. కనీసం ఆర్నెల్ల ఉద్యోగానుభవం/ ఏడాది అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్ ఉన్నవారికి ప్రాధాన్యం.
- **వయస్సు:** 2018, ఫిబ్రవరి 1 నాటికి 25 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** జనవరి 26, 2018.
- **వెబ్‌సైట్:** www.bel-india.com

ఎన్ఐటీ కురుక్షేత్రలో 36 బోధన ఖాళీలు

హర్యానాలోని కురుక్షేత్రలో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ).. 36 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** అసోసియేట్ ప్రొఫెసర్.
- **వేతనశ్రేణి:** రూ.37,400-రూ.67,000(గ్రేడ్ పే-రూ.9,500).
- **విభాగాల వారీ ఖాళీలు:** ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-3, మెకానికల్ ఇంజనీరింగ్-1, ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్-1, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్-8, కంప్యూటర్ ఇంజనీరింగ్-5, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-5, ఫిజిక్స్-2, మ్యాథమెటిక్స్-2, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్-1, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్-3, కంప్యూటర్ అప్లికేషన్స్-5.
- **అర్హతలు:** సంబంధిత విభాగాల్లో పీహెచ్‌డీతోపాటు కనీసం ఆరేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. యూజీ, పీజీలో కనీసం 60శాతం మార్కులు పొంది ఉండాలి.
- **దరఖాస్తు రుసుం:** అన్‌రిజర్వ్‌డ్-రూ.1,000; దివ్యాంగ-రూ.500.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 23, 2018.
- **వెబ్‌సైట్:** www.nitkkr.ac.in

ఐటీఐ లిమిటెడ్‌లో 25 ఖాళీలు

బెంగళూరులోని ఐటీఐ (ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్) లిమిటెడ్.. 25 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ)
- **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, టెలికమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి కనీసం 65శాతం(ఎస్సీ/ఎస్టీ-63శాతం) మార్కులతో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత. అలాగే సంబంధిత రంగంలో కనీసం రెండేళ్ల ఉద్యోగానుభవం.
- **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని దరఖాస్తు హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లతో జతచేసి గడువులోగా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 5, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 9, 2018.
- **వెబ్‌సైట్:** www.itiltd-india.com

అంతర్జాతీయ సంస్థలు

జీకే అండ్ కరెంట్ అఫైర్స్

ముఖ్యమైన అంతర్జాతీయ సంస్థలు, వాటి ప్రధాన కార్యాలయాలు, అధిపతుల వివరాలు...

- ఐక్యరాజ్యసమితి (UNO)
  ప్రధాన కార్యాలయం: న్యూయార్క్ (అమెరికా)
  సెక్రటరీ జనరల్: ఆంటోనియో గుటెరస్
- అంతర్జాతీయ న్యాయస్థానం (ICJ)
  ప్రధాన కార్యాలయం: ది హేగ్ (నెదర్లాండ్స్)
  ప్రెసిడెంట్: రోనీ అబ్రహమ్
- ఐక్యరాజ్యసమితి సాధారణ సభ (UNGA)
- ప్రధాన కార్యాలయం: న్యూయార్క్ (అమెరికా)
  అధ్యక్షుడు: మిరోస్లావ్ లాజ్‌కాక్
- ఐక్యరాజ్యసమితి బాలల అత్యవసర నిధి (UNICEF)
  ప్రధాన కార్యాలయం: న్యూయార్క్ (అమెరికా)
  ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్: హెన్రియెట్టా ఫోర్
- యూఎన్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (UNCTAD)



  ప్రధాన కార్యాలయం: జెనీవా (స్విట్జర్లాండ్)
  సెక్రటరీ జనరల్: ముఖిసా కిటుయి
- యూఎన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (UNDP)
  ప్రధాన కార్యాలయం: న్యూయార్క్ (అమెరికా)
  అడ్మినిస్ట్రేటర్: ఎకీమ్ స్టీనర్
- యూఎన్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ (UNEP)
  ప్రధాన కార్యాలయం: నైరోబీ (కెన్యా)
  ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్: ఎరిక్ సోలెమ్
- యూఎన్ హై కమీషనర్ ఫర్ రెఫ్యూజీస్ (UNHCR)
  ప్రధాన కార్యాలయం : జెనీవా (స్విట్జర్లాండ్)
  హెడ్ : ఫిలిప్పో గ్రాండి
- యూఎన్ ఎడ్యుకేషనల్ సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (UNESCO)
  ప్రధాన కార్యాలయం: పారిస్ (ఫ్రాన్స్)
  డైరెక్టర్ జనరల్: ఆడ్రీ అజులే
- ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (FAO)
  ప్రధాన కార్యాలయం: రోమ్ (ఇటలీ)
  డైరెక్టర్ జనరల్: జోస్ గ్రాజియానో డిసిల్వా
- ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO)
  ప్రధాన కార్యాలయం: జెనీవా (స్విట్జర్లాండ్)
  డైరెక్టర్ జనరల్: టెడ్రోస్ అధనోమ్ గెబ్రెసెస్
- అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO)
  ప్రధాన కార్యాలయం: జెనీవా (స్విట్జర్లాండ్)
  డైరెక్టర్ జనరల్: గై రైడర్
- ప్రపంచ బ్యాంక్
  ప్రధాన కార్యాలయం: వాషింగ్టన్ డీసీ (అమెరికా)
  అధ్యక్షుడు: జిమ్ యోంగ్ కిమ్
- అంతర్జాతీయ ద్రవ్యనిధి (IMF)
  ప్రధాన కార్యాలయం: వాషింగ్టన్ డీసీ (అమెరికా)
  మేనేజింగ్ డైరెక్టర్: క్రిస్టీన్ లగార్డే
- న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (NDB)
  ప్రధాన కార్యాలయం: షాంఘై (చైనా)
  ప్రెసిడెంట్: కేవీ కామత్
- ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ADB)
  ప్రధాన కార్యాలయం: మనీలా (ఫిలిప్పీన్స్)
  ప్రెసిడెంట్: తకెహికో నకావ్
- ఆఫ్రికా అభివృద్ధి బ్యాంక్ (AFDB)
  ప్రధాన కార్యాలయం: అబిడ్జాన్ (వెవరీకోస్ట్)
  ప్రెసిడెంట్: అకిన్‌వుమి అడెసినా
- ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (AIIB)
  ప్రధాన కార్యాలయం: బీజింగ్, **ప్రెసిడెంట్:** జిన్ లికున్
- ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO)
  ప్రధాన కార్యాలయం: జెనీవా (స్విట్జర్లాండ్)
  డైరెక్టర్ జనరల్: రాబర్టో అజ్‌వెదో
- ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ (OECD)
  ప్రధాన కార్యాలయం: పారిస్ (ఫ్రాన్స్)
  సెక్రటరీ జనరల్: జోస్ ఏంజెల్ గురియా
- ప్రపంచ ఆర్థిక వేదిక (WEF)
  ప్రధాన కార్యాలయం: కోలొన్గే (స్విట్జర్లాండ్)
  ఎగ్జిక్యూటివ్ చైర్మన్: క్లాస్ ష్వాబ్
- కామన్వెల్త్
  ప్రధాన కార్యాలయం: లండన్ (యూకే)
  సెక్రటరీ జనరల్: పాట్రిషియా స్కాట్లాండ్
- దక్షిణాసియా ప్రాంతీయ సహకార సమాఖ్య (SAARC)
  ప్రధాన కార్యాలయం: ఖాట్మండ్ (నేపాల్)
  సెక్రటరీ జనరల్: అమ్జద్ హుస్సేన్ సియాల్
- నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (NATO)
  ప్రధాన కార్యాలయం: బ్రస్సెల్స్ (బెల్జియం)
  సెక్రటరీ జనరల్: జెన్స్ స్టోల్టెన్‌బర్గ్
- యూరోపియన్ యూనియన్ (EU)
  ప్రధాన కార్యాలయం: బ్రస్సెల్స్ (బెల్జియం)
  యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్: డొనాల్డ్ టస్క్
  యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్: జీన్ క్లాడ్ జంకర్
  యూరోపియన్ పార్లమెంట్ ప్రెసిడెంట్: ఆంటోనియో టజానీ

ఎన్.విజయేందర్‌రెడ్డి
విజయేందర్ అకాడమీ
హైదరాబాద్




కృత్రిమ మేధకు కొత్త రెక్కలు!



త్వరలో స్మార్ట్‌ఫోన్లలోనూ కృత్రిమ మేధ • కొత్త పుంతలు తొక్కుతున్న రోబోలు.. • సీఈఎస్‌లో ఆసక్తి రేపుతున్న పలు ఉత్పత్తులు

కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో (సీఈఎస్) అమెరికాలో ఏటా వారం రోజుల పాటు జరిగే హైటెక్ ప్రదర్శన. టెక్ రంగంలో దిగ్గజాలైన కంపెనీలు తమ పరిశోధనల ఫలితాలను ఇక్కడ ప్రదర్శిస్తాయి. భవిష్యత్తులో రాబోయే వింతలకు ఈ ప్రదర్శనను సూచికగా చూస్తారు. ఈ ఏడాది ఇందులో దాదాపు 4 వేల కంపెనీలు పాల్గొన్నాయి. అందులో ప్రదర్శితమైన కొన్ని సాంకేతికతల వివరాలు మీకోసం. – సాక్షి, హైదరాబాద్

అందరికీ అందుబాటులోకి ఏఐ!



కృత్రిమ మేధను నిన్న మొన్నటివరకూ సంక్లిష్టమైన సమస్యల పరిష్కారానికి వాడటం చూశాం. ఇకపై అలా ఉండదు.. వాచీల్లో, స్మార్ట్‌ఫోన్లలో, టీవీల్లో ఈ టెక్నాలజీ అందుబాటులోకి రానుంది. అమేజాన్ తన అలెక్సా వర్చువల్ అసిస్టెంట్ మొబైల్ కిట్‌ను డెవలపర్లకు అందుబాటులోకి తేనుంది. గూగుల్ కూడా తన గూగుల్ అసిస్టెంట్‌ను ప్రజలకు మరింత దగ్గర చేసే పనులు మొదలుపెట్టింది. ఒకట్రెండేళ్లలో ఇవే టెక్నాలజీలు గొంతును గుర్తించి ఇంటి తాళాలూ తీసిపెట్టొచ్చు.. ఫలానా రోడ్డులో ట్రాఫిక్ ఎక్కువగా ఉందని, ఆఫీసుకు వేరే రోడ్డు ద్వారా వెళదామని మీ స్మార్ట్‌ఫోన్ నుంచే సూచనలు రావొచ్చు.

బాధ అర్థం చేసుకునే రోబోలు..



మీరు కష్టాల్లో ఉంటే.. మీ స్నేహితుడో.. బంధువో ఎలా ఓదారుస్తారో కొత్త రకం రోబోలు కూడా పరిస్థితికి తగ్గట్లు వ్యవహరిస్తూ మీకు సాంత్వన చేకూరుస్తాయి. ఎల్‌జీ కంపెనీ షాపింగ్ మాల్స్‌లో, హోటళ్లలో ఎయిర్‌పోర్టుల్లో ఉద్యోగాలకు ఎసరుపెట్టే స్థాయిలో సేవలందించగలవని అంచనా. టైటాన్–ఏఐ రోబో మన ముఖ కవళికలను గుర్తించడమే కాకుండా అందుకు తగ్గట్లు స్పందిస్తుంది. కోపంగా ఉంటే ఇష్టమైన పాటలు వినిపిస్తుంది.. కామెడీ సీన్స్ చూపిస్తుంది. చెప్పిన పని చేసే రోబోలతో పోలిస్తే.. మనుషుల భావోద్వేగాలను అర్థం చేసుకునే రోబోలను తయారు చేయడం చాలా కష్టమని.. అయినా ఈ దిశగా చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని నిపుణులు అంటున్నారు.

కార్లకూ టెక్ హంగులు..



డ్రైవర్ రహిత కార్ల గురించి తరచూ వింటూనే ఉన్నా.. ఈ ఏడాది సీఈఎస్‌లో మరిన్ని కంపెనీలు ఇలాంటి వాటిని ముందుకు తీసుకొచ్చాయి. చైనీస్ కంపెనీ ‘బైటన్’ఓ ఎలక్ట్రిక్ కారును తీసుకొచ్చింది. హెన్రిక్ ఫిస్కర్ డిజైన్ చేసిన ఈ కారు ఖరీదు దాదాపు రూ.30 లక్షలు. యమహా కంపెనీ డ్రైవర్ అవసరం లేని ఓ మోటర్‌బైక్‌ను ప్రదర్శించగా.. హ్యుందాయ్ ఫ్యుయెల్‌సెల్ టెక్నాలజీతో పనిచేసే నెక్సోను ప్రదర్శనకు పెట్టింది. ప్రజా రవాణాతో పాటు రకరకాల అవసరాల కోసం ఒకే ప్లాట్‌ఫార్మ్ అనే కాన్సెప్ట్‌తో టయోటా ఓ సరికొత్త కాన్సెప్ట్‌ను ప్రదర్శించింది. చక్రాలు, ఛాసిస్ మాత్రమే స్థిరంగా ఉండే ఈ కాన్సెప్ట్‌లో పై భాగం అవసరాన్ని బట్టి మారుతుంటుంది.

వీఆర్‌పై లెనవూ ఫోకస్..



చైనీస్ కంప్యూటర్ తయారీ సంస్థ లెనవూ సీఈఎస్‌లో ప్రదర్శించిన ఉత్పత్తుల్లో అధికం వర్చువల్ రియాలిటీ (వీఆర్), ఆగ్యుమెంటెడ్ రియాలిటీ (ఏఆర్)లకు సంబంధించినవే. మిరేజ్ సోలో, డే డ్రీమ్ పేర్లతో విడుదలైన వ్యవస్థలతో వర్చువల్ కంటెంట్‌ను చాలా తేలికగా సృష్టించొచ్చు. ఫొటోలు, వీడియోల ఆధారంగా డే డ్రీమ్ ఈ కంటెంట్‌ను సృష్టిస్తుంది. పదేళ్ల కిందటి మీ పెళ్లి వీడియోను ఇందులోకి ఎక్కిస్తే.. మీరు అక్కడున్న అనుభూతి పొందుతూ వర్చువల్ రియాల్టీలో చూడొచ్చన్నమాట.

స్మార్ట్‌ఫోనే ల్యాప్‌టాప్..



ప్రాసెసింగ్ స్పీడ్ విషయంలో కంప్యూటర్లకు, స్మార్ట్‌ఫోన్లకు మధ్య అంతరం ఇప్పుడు దాదాపు లేదనే చెప్పాలి. ప్రాజెక్టు లిండా పేరుతో రేజర్ అనే కంపెనీ సీఈఎస్‌లో స్మార్ట్‌ఫోన్‌నే ల్యాప్‌టాప్‌గా ఎలా వాడుకోవచ్చో ప్రదర్శించింది. నిర్దిష్టమైన స్థానంలోకి చేర్చడం ద్వారా స్మార్ట్‌ఫోన్ తాలూకూ ప్రాసెసర్, సాఫ్ట్‌వేర్లతోనే ల్యాప్‌టాప్ తరహాలో పనిచేసుకునేందుకు వీలు కల్పిస్తుంది ఇది.

వైద్య, ఆరోగ్య శాఖకు జాతీయ అవార్డు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖకు మరో జాతీయ అవార్డు దక్కింది. కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎస్ఐ) నిహిలెంట్ ఈ–గవర్నెన్స్ అవార్డు–2017కు రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ బెస్ట్ ఈ–గవర్నెన్స్ స్టేట్–అవార్డు ఆఫ్ రికగ్నేషన్ (హెల్త్ అండ్ వెల్ బీయింగ్) విభాగంలో ఎంపికైంది. ఈ నెల 20న కోల్‌కతాలో జరిగే కార్యక్రమంలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ ఈ అవార్డుని అందుకోనున్నారు. 2002 నుంచి ఈ సంస్థ ఈ –గవర్నెన్స్‌లో ప్రగతి సాధించిన రాష్ట్రాలను ఎంపిక చేసి అవార్డులను అందిస్తోంది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖకు అవార్డు దక్కడం పట్ల ఆ శాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సమాచారాన్ని కంప్యూటరీకరించడం, వైద్య సేవల్లో పారదర్శకతను పెంచడంలో ఐటీ శాఖ కృషిని కొనియాడారు.

తెలంగాణలో ప్లాంట్ పెట్టండి

- సుజుకీ కంపెనీ చైర్మన్‌తో మంత్రి కేటీఆర్ చర్చలు
- రెండో రోజు జపాన్‌లో పలువురితో సమావేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆటోమొబైల్ రంగాన్ని అత్యంత ప్రాధాన్యతా విషయంగా పరిగణిస్తున్నదని, ఈ రంగంలో పెట్టుబడులకు రాష్ట్రంలో అపార అవకాశాలున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు పేర్కొన్నారు. జపాన్ పర్యటనలో భాగంగా రెండోరోజు మంత్రి కేటీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర బృందం గురువారం అక్కడి షిజువుక రాష్ట్రంలో సుజుకీ మోటార్స్ చైర్మన్ ఒసాము సుజుకీతో సమావేశమైంది. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, టీఎస్ ఐపాస్ పనితీరు, సింగిల్ విండో విధానంలో



గురువారం జపాన్‌లో సుజుకీ కార్పొరేషన్ చైర్మన్ ఒసాము సుజుకీతో మంత్రి కేటీఆర్. చిత్రంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్

అనుమతుల తీరును మంత్రి సుజుకీ చైర్మన్‌కు వివరించారు. రాష్ట్రంలో సుజుకీ ప్లాంట్ ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ప్రభుత్వ విధానాల పట్ల ఆకర్షితులైన సుజుకీ ప్రభుత్వాన్ని ప్రశంసించారు. అనంతరం కేటీఆర్ బృందం షిజువుక రాష్ట్ర గవర్నర్ కవాకాస్తు హైటాతో సమావేశమై తెలంగాణ, షిజువుక రాష్ట్రాల మధ్య వ్యాపార సంబంధాలపై చర్చించారు. రాష్ట్రంలో ఉన్న వ్యాపార అవకాశాలను పరిశీలించేందుకు రావాలని గవర్నర్‌ను ఆహ్వానించారు. అనంతరం షిజువుక బ్యాంకు ప్రతినిధులతో మంత్రి సమావేశమై రాష్ట్రంలోని బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాల్లో ఉన్న అవకాశాలను వారికి వివరించారు. ఈ రంగంలో సేవలందించేందుకు అవసరమైన మానవ వనరులు స్థానికంగా అందుబాటులో ఉన్నాయన్నారు. కేటీఆర్ బృందం సకురాయి లిమిటెడ్, స్టాన్లీ ఎలక్ట్రిక్ కంపెనీ, ఏఎస్‌టీఐ కంపెనీల ప్రతినిధులతో సమావేశమై చర్చలు జరిపారు. హైదరాబాద్‌లో ఆటో మొబైల్ రంగ విడిభాగాల ఉత్పత్తికి ముందుకు రావాలని ఏఎస్‌టీఐ కంపెనీని మంత్రి ఆహ్వానించారు.

మెట్రో స్టేషన్లలో ఎలక్ట్రిక్ వాహనాలు

మెట్రో స్టేషన్ల నుంచి ప్రయాణికులను సమీప ప్రాంతాలకు చేరవేసేందుకు సుజుకి ఎలక్ట్రిక్ వాహనాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఆ సంస్థ తయారుచేస్తున్న గ్రాండ్‌ప్యాట్రియాక్ వాహనాలను నగరానికి సరఫరా చేయాలని మంత్రి కేటీఆర్ ఆ కంపెనీని కోరగా, వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను సుజుకీ అధికారులు ఆసక్తిగా వీక్షించారు.

రెండు నెలల్లో రెగ్యులరైజ్ చేయాలి

ఫీల్డ్ ఆపరేటర్ల కేసులో ఓఎన్‌జీసీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ)లో నిర్దిష్ట కాలపరిమితితో 2008లో నియమితులైన ఫీల్డ్ ఆపరేటర్ల సర్వీసులను క్రమబద్ధీకరించాలని హైకోర్టు తీర్పు వెలువరించింది. ప్రస్తుతం వారు పనిచేస్తున్న పోస్టుల్లోనే కొనసాగించాలని 2016లో సింగిల్ జడ్జి చెప్పిన తీర్పును సమర్థించింది. కాకినాడ ఓఎన్‌జీసీలో పని చేస్తున్న తమ సర్వీసుల్ని క్రమబద్ధీకరించాలని తెలుగు రాష్ట్రాల్లోని పలువురు ఔట్‌సోర్సింగ్ ఫీల్డ్ ఆపరేటర్లు పిటిషన్లు దాఖలు చేశారు. వారి సర్వీసుల్ని రెగ్యులరైజ్ చేయాలని సింగిల్ జడ్జి జస్టిస్ ఎం.ఎస్.రామచంద్ర రావు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఓఎన్‌జీసీ అప్పీల్ చేసిన వ్యాజ్యాన్ని ఉమ్మడి హైకోర్టు న్యాయ మూర్తులు జస్టిస్ వి.రామసుబ్రహ్మణియన్, జస్టిస్ ఎం.గంగా రావులతో కూడిన ధర్మాసనం కొట్టేసింది.

బకాయిల చెల్లింపులపై బీమా కోర్టుకు వెళ్లండి

జీహెచ్‌ఎంసీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఈఎస్ఐ చట్టం కింద బకాయిలు చెల్లించాల్సిన అవసరం లేదనే వివాదాన్ని ఉద్యోగుల బీమా కోర్టు (ఎంప్లాయీస్ ఇన్సూరెన్స్ కోర్టు)లో తేల్చుకోవాలని జీహెచ్‌ఎంసీని హైకోర్టు ఆదేశించింది. జీహెచ్‌ఎంసీ ఈఎస్ఐ పరిధిలోకి రాదని.. ఈఎస్ఐ చట్టం కింద బకాయిలు చెల్లించాలని నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ (ఆర్థిక విభాగం) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్ర ఉద్యోగుల బీమా చట్టం–1948 ప్రకారం ఈఎస్ఐ కార్పొరేషన్ జారీ చేసిన ఉత్తర్వులపై అభ్యంతరాలుంటే వాటిని బీమా కోర్టులో తేల్చుకోవాలన్న ఈఎస్ఐ తరపు న్యాయవాది వాదనను న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వి.భట్ సమర్థించారు. ఉద్యోగుల బీమా కోర్టులో ఈ కేసు వేసుకునేందుకు నాలుగు వారాల గడువుని జీహెచ్‌ఎంసీకి ఇచ్చారు.

‘మెట్రో’ రెండో దశకు నిధుల వేట!

ప్రాజెక్టు చేపట్టేందుకు ఎల్‌అండ్‌టీ విముఖత?

- జపాన్ టూర్‌లో వివిధ ఆర్థిక సంస్థలతో మంత్రి కేటీఆర్ భేటీ
- జపాన్‌లోని ఎంఐటీ–ఎస్‌యూఐ ప్రైవేటు రవాణా రంగ సంస్థలతో చర్చలు
- జైకా బ్యాంకుతోనూ సంప్రదింపులు
- మెట్రో రెండో దశపై చిగురిస్తున్న ఆశలు

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్‌లో మెట్రో రెండో దశపై ఆశలు చిగురిస్తున్నాయి. పెట్టుబడుల కోసం దక్షిణ కొరియా, జపాన్ దేశాల్లో మున్సిపల్ మంత్రి కేటీఆర్ బృందం విస్తృతంగా పర్యటిస్తోంది. తాజాగా మెట్రో రెండో దశకు ఆర్థిక సహకారం అందించడంతోపాటు పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టాలని ప్రముఖ ప్రైవేటు రవాణా రంగ సంస్థ ఎంఐటీ–ఎస్‌యూఐతో ఈ బృందం సంప్రదింపులు జరిపినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మరోవైపు ప్రభుత్వ పరంగా చేయాల్సిన వ్యయానికి సంబంధించి నిధుల సమీకరణకు జపనీస్ ఇంటర్నేషనల్ కో–ఆపరేషన్ ఏజెన్సీతోనూ చర్చించినట్లు సమాచారం. రెండో దశ కింద సుమారు ఏడు మార్గాల్లో 81 కి.మీ. మార్గంలో ప్రాజెక్టును చేపట్టాలని గతంలో నిర్ణయించిన విషయం విదితమే. రెండో దశ ప్రాజెక్టు వ్యయం, భూసేకరణకు రూ.20 వేల కోట్లు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. కాగా ప్రస్తుతం మొదటి దశలోని నాగోల్–రాయదుర్గం, ఎల్బీనగర్–మియాపూర్, జేబీఎస్–ఫలక్‌నుమా కారిడార్ల (72 కి.మీ.)లో మెట్రో ప్రాజెక్టును చేపట్టిన విషయం విదితమే. వచ్చే డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థ, ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించాయి.

రెండో దశపై ఎల్‌అండ్‌టీ విముఖత?

మొదటి దశ పనులు చేపట్టిన ఎల్‌అండ్‌టీ రెండోదశ ప్రాజెక్టు చేపట్టేందుకు విముఖత చూపుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే మొదటి దశలో పెరిగిన అంచనా వ్యయం రూ.3 వేల కోట్లను ప్రభుత్వం తమకు చెల్లించాలని ఈ సంస్థ పట్టుబడుతోంది. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన లేకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి తాము మొదటి దశ పనుల పూర్తిపైనే దృష్టి సారించినట్లు ఎల్‌అండ్‌టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.



నిధుల కోసం అన్వేషణ...

మెట్రో రెండో దశనుసైతం పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టేందుకు ఆసక్తిగల సంస్థలను ఆహ్వానించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇదే క్రమంలో పెట్టుబడుల ఆకర్షణ కోసం విదేశాల్లో పర్యటిస్తోన్న కేటీఆర్ బృందం జపనీస్ ఇంటర్నేషనల్ కో–ఆపరేషన్ ఏజెన్సీ (జైకా), ఎంఐటీ–ఎస్‌యూఐతో సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది. అయితే దీనిపై ఆ సంస్థలు ఎలా స్పందించాయన్న అంశంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ జైకా బ్యాంకు రుణ మంజూరుకు అంగీకరిస్తే రాష్ట్ర ఆర్థిక శాఖ ఆ బ్యాంకుకు పూచీకత్తు(కౌంటర్ గ్యారంటీ) ఇవ్వాల్సి ఉంటుంది.

వడివడిగా ప్రతిపాదనలు రెడీ...

ఏడాది క్రితం మెట్రో రెండోదశ ప్రతిపాదిత మార్గాల్లో ఢిల్లీ మెట్రో రైలు కార్పొరేషన్ సహా, నగర మెట్రో ప్రాజెక్టు అధికారుల బృందం పలు మార్గాల్లో సర్వే చేపట్టి ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించింది. ప్రస్తుతమున్న మెట్రో కారిడార్‌ను శంషాబాద్ విమానాశ్రయం వరకు పొడిగించాలని సీఎం కేసీఆర్ స్పష్టం చేసిన నేపథ్యంలో అధికారులు ఆ దిశగా ప్రణాళికలు రూపొందించిన విషయం విదితమే. అయితే ప్రభుత్వ ఆదేశాలు, క్షేత్రస్థాయి పరిశీలన, సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించే క్రమంలో ప్రతిపాదిత మార్గాల్లో మార్పులు, చేర్పులు జరిగే అవకాశాలున్నాయి.

రెండోదశ..

ప్రతిపాదిత రూట్లు: 7	దూరం: 81 కి.మీ.(సుమారు)
అంచనా వ్యయం: సుమారు	రూ. 20 వేల కోట్లు

మార్గాలివే...

1. నాగోల్-ఎల్బీనగర్: 5 కి.మీ.
2. ఎల్బీనగర్-హయత్‌నగర్: 7 కి.మీ.
3. ఎల్బీనగర్-ఫలక్‌నుమా-శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం: 20 కి.మీ.
4. మియాపూర్-పటాన్‌చెరు: 15 కి.మీ.
5. రాయదుర్గం-శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం: 20 కి.మీ.
6. తార్నాక-ఈసీఐఎల్: 7 కి.మీ.
7. జేబీఎస్-మౌలాలి: 7 కి.మీ.



గురువారం పార్టీ ముఖ్యనేతలతో భేటీ అయిన పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో భట్టి విక్రమార్క, జానారెడ్డి, షబ్బీర్ అలీ, మల్లు రవి తదితరులు

‘ప్రత్యక్షం’గానే పంచాయతీ ఎన్నికలు

పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ డిమాండ్

- ఫిరాయింపుల ప్రోత్సాహానికే పరోక్ష ఎన్నికల కుట్ర
- బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు జరపాలి
- పంచాయతీరాజ్ చట్టంపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి
- 23 నుంచి గ్రామస్థాయిలో ఉద్యమం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలోనే నిర్వహించాలని పీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఫిరాయింపులను ప్రోత్సహించడానికే పరోక్ష ఎన్నికలకోసం కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం రూపకల్పన కోసం జరుగుతున్న ప్రయత్నాలపై గురువారం ఉత్తమ్ అధ్యక్షతన టీపీసీసీ కార్యవర్గం సమావేశమైంది. ప్రతిపక్ష నేతలు కె.జానారెడ్డి, షబ్బీర్ అలీ, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టివిక్రమార్క, ఇతర నేతలు వి.హన్మంతరావు, పొన్నాల లక్ష్మయ్య, జి.చిన్నారెడ్డి, టి.జీవన్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాల చైర్మన్లు, డీసీసీల అధ్యక్షులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలను పరోక్ష పద్ధతిలోనే నిర్వహించాలనే ఆలోచన ఉన్నట్టుగా, ఫిబ్రవరిలోనే ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టుగా అధికారపక్షం లీకులు ఇస్తోందన్నారు. అయితే పరోక్ష పద్ధతిలో సర్పంచ్ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తున్నదన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని, రాజకీయ ఫిరాయింపులను ప్రోత్సహించేందుకే పరోక్ష ఎన్నికలకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీలను నిర్వీర్యం చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా పంచాయతీలకు కేటాయించలేదని అన్నారు. పంచాయతీలకు అధికారాలు లేకుండా చేసి సర్పంచ్‌ల వ్యవస్థను ధ్వంసం చేసిన చరిత్ర సీఎం కేసీఆర్‌ది అని విమర్శించారు.

భయంతోనే పరోక్ష ఎన్నికలకు యత్నం

సర్పంచ్‌లకు నేరుగా ఎన్నికలు జరిగితే గ్రామాలలో టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఓట్లు పడతాయనే భయంతోనే సీఎం కేసీఆర్ పరోక్ష ఎన్నికలకు సిద్ధపడుతున్నారని ఉత్తమ్ ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేలను, ఎంపీలను, ఎమ్మెల్సీలను కొనుగోలు చేసినట్టుగానే వార్డు మెంబర్లను కూడా కొనుక్కుని తమ వారిని సర్పంచులుగా గెలిపించుకోవాలని ఈ తరహా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటామని అన్నారు. కేసీఆర్ చర్యలతో గ్రామాలలో ప్రజాస్వామ్యం దెబ్బతింటుందని హెచ్చరించారు. డబ్బులున్న వారే పదవులు పొందుతారని అన్నారు. పేదలకు అధికారం అందకుండా చేసే చర్యలను వ్యతిరేకిస్తామన్నారు. కొత్త పంచాయతీరాజ్ చట్టంలో పొందుపరిచే అంశాలను ముందుగానే అన్ని రాజకీయపార్టీలకు వివరించాలని, దీనికోసం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

23న గ్రామస్థాయిలో సమావేశాలు

పంచాయతీ ఎన్నికలను ప్రత్యక్షంగా నిర్వహించాలని, రిజర్వేషన్లు ఐదేళ్ళకు మాత్రమే ఉండాలన్న డిమాండ్లతో ఈనెల 23న గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ సమావేశాలు నిర్వహిస్తామని ఉత్తమ్ వెల్లడించారు. 27న గ్రామీణ నియోజకవర్గ కేంద్రాలలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు ఇస్తామని చెప్పారు. అలాగే ఈ నెల 30న అన్ని పాత జిల్లా కేంద్రాల్లో పార్టీ సమావేశాలు నిర్వహించి, కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తామని వివరించారు. పంచాయతీ ఎన్నికలను బ్యాలెట్ పేపర్‌తోనే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల నిబంధనావళి ప్రకారం గత డిసెంబర్ 15 నాటికే గ్రామ పంచాయతీల వారీగా ఓటర్ల లిస్టును ప్రకటించాల్సి ఉందని, అయితే ఇప్పటిదాకా ఓటర్ల జాబితాను ప్రకటించలేదని అన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేయాలనే ఆలోచనను స్వాగతిస్తున్నామన్నారు. రైతులకు రుణాలపై వడ్డీమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటిదాకా ఆ హామీని అమలు చేయలేదని అన్నారు.

జర్మనీ దేశస్థుడిపై నిర్భయ కేసు

హైదరాబాద్: జర్మనీ దేశానికి చెందిన ఓ వ్యక్తి తనను వాట్సాప్‌లో వేధిస్తున్నాడంటూ నగరానికి చెందిన యువతి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదుచేసింది. జూబ్లీహిల్స్‌లో నివసించే ఓ యువతి(31)కి కొద్ది కాలం క్రితం ఓ ప్రాజెక్టు విషయంలో అదే ప్రాంతంలో ఉన్న బీడీ అగ్రికల్చరల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ న్యూమన్‌తో పరిచయం ఏర్పడింది. న్యూమన్ తన వాట్సాప్ నంబర్ ద్వారా ఆ యువతికి అసభ్యకర సందేశాలను పంపాడు. దీనిపై ఆమె డిసెంబర్ 19న పోలీసులకు ఫిర్యాదు చేసింది. యువతిని వేధిస్తున్నది జర్మనీకి చెందిన టోర్‌స్టెన్ రీనర్ న్యూమన్(52)గా పోలీసులు గుర్తించారు. అతనిపై ఐపీసీ సెక్షన్ 354ఏ, 354డీ కింద క్రిమినల్ కేసులు నమోదుచేశారు. నిందితుడు కూకట్‌పల్లి సమీపంలోని లోధా టవర్స్‌లో నివసిస్తున్నట్లు గుర్తించారు. న్యూమన్ రెండ్రోజుల క్రితం కోర్టులో లొంగిపోయినట్లు పోలీసులకు సమాచారం అందింది.

పరోక్ష ఎన్నికలకు సీపీఐ వ్యతిరేకం

ధనబలం ఉన్నవారికే అది అనుకూలం

లౌకిక, ప్రజాతంత్ర శక్తులతో త్వరలోనే వేదిక: చాడ



సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌ని పరోక్ష పద్ధతిలో ఎన్నుకునే విధానానికి సీపీఐ పూర్తి వ్యతిరేకమని, కండబలం, ధనబలం ఉన్నవారికే పరోక్ష పద్ధతి మేలు చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి చెప్పారు. రాష్ట్రంలో లౌకిక, ప్రజాతంత్ర వామపక్ష శక్తులతో ఓ వేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని ఆయన తెలిపారు. మఖ్దూమ్ భవన్‌లో గురువారం చాడ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా చెలరేగి పోతోందని, కామారెడ్డిలో వీఆర్వో సాయిలును ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపిన వైనం చూశామని, ఇసుక మాఫియాపై త్వరలో ఓ పుస్తకం రిలీజ్ చేస్తామని చెప్పారు. గ్యాంగ్‌స్టర్ నయీమ్ కేసులో పురోగతి లేదని, పెద్దలను వదిలి చిన్నాచితక వ్యక్తులపై కేసులు పెట్టారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ తక్షణం నయీమ్ డైరీని బయట పెడితే వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయని పేర్కొన్నారు. నయీమ్ గ్యాంగ్ ఆగడాలపై 24న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. పంచాయతీ ఎన్నికలపై హడావుడి చేస్తున్నారని, కొత్త పంచాయతీల కోసం కసరత్తు అంటున్నా నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పడిన ‘బహుజన లెఫ్ట్ ఫ్రంట్’వారిష్టమని, అందులో తాము భాగస్వామ్యం కాలేదన్నారు. తాము ఏర్పాటు చేస్తున్న ఫ్రంట్‌తో కలిసి రావాలని సీపీఎంను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నామని చాడ తెలిపారు.

కత్తి మహేశ్‌పై కోడిగుడ్లతో దాడి




హైదరాబాద్: సినీ విమర్శకుడు కత్తి మహేశ్‌పై హైదరాబాద్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కోడిగుడ్లతో దాడి చేశారు. గురువారం రాత్రి ఓ టీవీ చానెల్‌లో చర్చా కార్యక్రమంలో పాల్గొనేందుకు క్యాబ్‌లో వెళ్తుండగా కొండాపూర్‌లో కోడిగుడ్లతో దాడికి పాల్పడ్డారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు సిగ్నల్ దాటుతుండగా కోడిగుడ్లతో కొట్టారని కత్తి మహేశ్ తెలిపారు. కుడి కన్నుపై కోడిగుడ్డు పడటంతో ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యానని చెప్పారు. ఇది కచ్చితంగా పవన్ కల్యాణ్ అభిమానుల పనేనని ఆరోపించారు. కొద్ది రోజులుగా అభిమానులను అదుపు చేసేందుకు పవన్ కల్యాణ్ ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. ఈ దాడికి పవన్ అభిమానులనే బాధ్యులను చేస్తున్నానన్నారు.

రేపు పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మల దహనం

కత్తి మహేశ్‌పై దాడిని ఓయూ జేఏసీ తీవ్రంగా ఖండించింది. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మలను దహనం చేయనున్నట్లు ఓయూ జేఏసీ ప్రతినిధి వరంగల్ రవి పేర్కొన్నారు. పవన్ కుటుంబానికి ఎక్కువగా దళితులే అభిమానులుగా ఉన్నారని, అలాంటిది ఓ దళితుడైన కత్తి మహేశ్‌పై దాడి చేయడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో పవన్ కల్యాణ్ సినిమాలు ఆడనివ్వబోమని హెచ్చరించారు. కత్తి మహేశ్‌కు అండగా ఉంటామని ప్రకటించారు.

నాలుగేళ్లలో నవ భారతం!

నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజీవ్‌కుమార్



సాక్షి, అమరావతి: దేశాన్ని 2022 నాటికి సరికొత్త భారతావనిగా ఆవిష్కరించి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజీవ్‌కుమార్ పిలుపునిచ్చారు. 2047 నాటికి సర్వ శ్రేష్ఠ భారత్‌ను ఆవిష్కరించాలన్నారు. అవినీతిరహిత, పరిశుభ్ర, ఆరోగ్య, నైపుణ్య, సురక్షిత భారత్ సాకారం కావాలని ఆకాంక్షించారు. టీమ్ ఇండియా మాదిరిగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ క్రతువులో ఆంధ్రప్రదేశ్ ముందుండాలని సూచించారు. సమున్నత లక్ష్యాల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరికొత్త ఆలోచనలతో చావోరేవో తరహాలో పాటుపడాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నివాస సముదాయంలో కొత్తగా నిర్మించిన గ్రీవెన్స్ హాలులో గురువారం ప్రారంభమైన కలెక్టర్ల కాన్ఫరెన్సులో రాజీవ్‌కుమార్ మాట్లాడారు. కాగా దేశంలో అత్యంత వెనుకబడిన 115 జిల్లాల్లో ఆన్‌లైన్ డ్యాష్ బోర్డు అభివృద్ధికి సంబంధించి నీతి ఆయోగ్ – ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. కొత్తగా ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అవసరమైన సహకారం అందిస్తామని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్ చెప్పారు. గురువారం మధ్యాహ్నం వెలగపూడిలోని సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ)ను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అదే విధంగా పోలవరం ప్రాజెక్టు పనులను కూడా ఆయన పరిశీలించారు.

మార్చి తొలి వారంలో బడ్జెట్ సమావేశాలు

రెండో వారంలో బడ్జెట్ ప్రవేశం

సాక్షి, అమరావతి: వచ్చే ఆర్థిక సంవత్సరం (2018–19) బడ్జెట్ సమావేశాలను మార్చి తొలి వారంలో ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. మార్చి రెండో వారంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అయితే ఈసారి కూడా ఊహల్లో తేలియాడేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ద్వారా ప్రజలను మభ్యపెట్టే యత్నాలతో తనకు తానే మోసం చేసుకునే స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలున్నారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఆర్థిక క్రమశిక్షణ ఇంత దారుణంగా దిగజారిపోవడం గతంలో ఎన్నడూ చూడలేదని అధికార వర్గాలే వ్యాఖ్యానించడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ వాస్తవాలకు దగ్గరగా ఉంటుందని ఆర్థిక మంత్రి చెప్పినా, చివరికి కేంద్రం నుంచి ఎన్ని నిధులు వస్తాయో ముందుగానే తెలిసిపోయినప్పటికీ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కేంద్రం నుంచి రాని నిధులను కూడా వస్తాయనే ఊహాజనిత లెక్కలతో బడ్జెట్‌ను రూపొందించామని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఆ ఊహాజనిత లెక్కలు ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దారుణంగా దెబ్బతీయడంతో ఆర్థికంగా రాష్ట్రం పరువుతో పాటు పరపతి కూడా దిగజారిపోతోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా సరే మళ్లీ అవే ఊహాజనిత లెక్కలతో వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.రెండు లక్షల కోట్లకు పైగా వ్యయంతో బడ్జెట్ రూపకల్పనకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలిపారు.

టేకోవర్ ఉద్దేశం ఉందా? లేదా?

అగ్రిగోల్డ్ టేకోవర్‌కు ఎస్సెల్ గ్రూపు నాన్చివేతపై హైకోర్టు ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: అగ్రిగోల్డ్ టేకోవర్ వ్యవహారంలో ఎస్సెల్ గ్రూపు నాన్చివేత ధోరణిపై హైకోర్టు మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇప్పటికే నెలరోజులకుపైగా గడువునిచ్చినప్పటికీ అగ్రిగోల్డ్ ఆస్తులు, అప్పుల మదింపు ప్రక్రియను కొలిక్కి తీసుకురాకపోవడంపై ఎస్సెల్ గ్రూపుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. మదింపు ప్రక్రియ ఇంకా చీకట్లోనే ఉందంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ నెల రోజుల్లో ఎన్ని డాక్యుమెంట్లను పరిశీలించారు? ఇంకెన్ని పరిశీలించాలి? అన్న విషయంపై స్పష్టత నివ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. పని చేయకుండా పదే పదే గడువు కోరడం సమంజసం కాదంది. ఇకపై గడువునిచ్చే ప్రసక్తే లేదని, అసలు టేకోవర్ ఉద్దేశం ఉందో? లేదో? చెప్పాలని ఎస్సెల్ గ్రూపును నిలదీసింది. ఇప్పటి వరకు చేసిన పనికి సంబంధించిన వివరాలతో పూర్తిస్థాయి అఫిడవిట్‌ను తమ ముందుంచాలని ఎస్సెల్ గ్రూపునకు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ ఎస్.వి.భట్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

‘అక్షయ గోల్డ్’పై ఆసక్తి చూపేవారెవరు?

అక్షయగోల్డ్ ఆస్తుల స్వాధీనం విషయంలో ఆసక్తిగా ఉన్న వారి వివరాలను తెలియచేయకుండా, ఆస్తులను స్వాధీనం చేసుకుంటామంటే ఎలా అంటూ ఆ సంస్థ డైరెక్టర్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. ఆస్తుల స్వాధీనానికి సిద్ధంగా ఉన్న కంపెనీలు, వ్యక్తుల చిరునామాలు, వారి ఆర్థిక స్థితికి సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని ఆదేశించింది. ఆ వివరాలను పరిశీలించిన తరువాతే ఆస్తుల స్వాధీనంపై నిర్ణయం తీసుకుంటామని తేల్చి చెప్పింది. మరోసారి గడువువిచ్చే ప్రసక్తే లేదని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను ఫిబ్రవరి 8కి వాయిదా వేసింది.

సీఎం సిగ్గుతో తలదించుకోవాలి

కుప్పం ఘటనపై ధ్వజమెత్తిన వాసిరెడ్డి పద్మ



హైదరాబాద్: ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంలోనే మహిళలకు రక్షణ లేకపోతే.. ఇక రాష్ట్రంలో మహిళల పరిస్థితి ఏంటని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ ఆందోళన వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం గుంజార్లపల్లి గ్రామంలో ఒక మహిళను అమానుషంగా వివస్త్రను చేసి టీడీపీ నేతల అండతో దాడి చేసిన ఘటనపై చంద్రబాబు, ఆయన కుటుంబీకులు రాష్ట్ర మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ ఘటనను టీడీపీ నేతలు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టి పైశాచికానందాన్ని పొందుతున్నారని, దీనిపై ముఖ్యమంత్రితో పాటు అందరూ సిగ్గుతో తలదించుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన ఇద్దరు దంపతులను పక్కన ఉన్న మహిళ దుర్భాషలాడడం, తర్వాత వారిపై దాడి చేయడం వెనుక టీడీపీ ప్రోద్బలం ఉందని స్పష్టంగా తెలుస్తోందన్నారు. మహిళను వివస్త్రను చేసి, రాళ్లతో కొట్టి, నోటితో కొరికి దారుణంగా దాడి చేశారని మండిపడ్డారు.

వివస్త్రకు గురైన మహిళపై నిర్లక్ష్యం

ప్రాథమిక చికిత్సకూ నోచుకోని వైనం

కుప్పం రూరల్ : చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం, గుంజార్లపల్లిలో మహిళపై దాడి, వివస్త్రకు గురైన ఘటన జరిగి 24గంటలు గడిచినా బాధితురాలికి కనీస వైద్య సదుపాయం అందలేదు. ప్రాథమిక చికిత్సకు కూడా నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడుతోంది. గాయాల నుంచి రక్తస్రావం అవుతోంది. ఆస్పత్రి వైద్యులు తమ వద్ద చికిత్సా సామగ్రి లేదని అంటున్నారని బాధితురాలు వాపోయింది. సదుపాయాలు లేనప్పుడు మెరుగైన వైద్యం కోసం సిఫార్సు చేయాల్సిన వైద్యాధికారులు బాధితురాలిపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కాగా, వివస్త్ర చేసి గాయపరచిన ఆరుగురు నిందితుల్లో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

దర్యాప్తు పూర్తి చేశారో లేదో పరిశీలించండి

పుట్టపర్తి సాయిబాబా సోదరుడిపై కేసులో హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: సత్యసాయి కుటుంబ సభ్యుడు గణపతిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుట్టపర్తి శ్రీసత్యసాయిబాబా ట్రస్ట్ సెంట్రల్ సభ్యుడు ఆర్.జె.రత్నాకర్‌పై పోలీసులు నమోదు చేసిన కేసులో దర్యాప్తు పూర్తి చేసి, సంబంధిత కోర్టులో తుది నివేదిక దాఖలు చేశారో లేదో తెలుసుకోవాలని సీఐడీ అదనపు డీజీని హైకోర్టు ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించిన రికార్డులను తెప్పించుకుని, దర్యాప్తు ఇంకా పెండింగ్‌లో ఉందా? తుది నివేదిక దాఖలు చేశారా? తదితర వివరాలన్నింటినీ పరిశీలించాలని స్పష్టంచేసింది. సంబంధిత కోర్టులో తుది నివేదికను దాఖలు చేయాలంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకరరావు ఇటీవల తీర్పునిచ్చారు. అటు పిటిషనర్, ఇటు పోలీసులు దీనిపై స్పష్టతనివ్వలేకపోతున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

‘పెద్దల’ కోసం సర్దుబాటు

రూ. 4,000 కోట్లు!!



సాగునీటి ప్రాజెక్టుల్లో తాజా స్కెచ్

- ఇటీవల చేపట్టిన పనులకూ ‘ధరల సర్దుబాటు’ వర్తింపు
- అధికారులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఒత్తిడి
- అంగీకరించని ఎస్ఎల్ఎస్సీ, ఉన్నతాధికారులు
- ‘బోర్డ్ ఆఫ్ చీఫ్ ఇంజనీర్స్’ నుంచి అనుకూలంగా నివేదిక
- నివేదికకు ఈ నెల 20న కేబినెట్‌లో ఆమోదముద్ర!
- రాష్ట్ర ఖజానాపై రూ.4 వేల కోట్లకు పైగా భారం
- పనులు చేయని కోటరీ కాంట్రాక్టర్లపై సర్కారు మమకారం
- నిబంధనలకు విరుద్ధంగా అదనపు నిధులు కట్టబెట్టే యత్నం

సాక్షి, అమరావతి:

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తయి, రైతుల పొలాల్లోకి నీరు ఎప్పుడు పారుతుందో తెలియదు గానీ, ప్రభుత్వ పెద్ద ల జేబుల్లోకి కమీషన్ల ప్రవాహం మాత్రం ఆగ డం లేదు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో అందినంత మింగేస్తున్నా రు. ఇందుకోసం కొత్తకొత్త వ్యూహాలను తెరపై కి తెస్తున్నారు. 2014 తర్వాత దక్కించుకున్న ప్రాజెక్టుల పనులు చేయకుండా మొండి కేస్తున్న కాంట్రాక్టర్లపై జరిమానా విధించాల్సి న ప్రభుత్వం అందుకు భిన్నంగా అంతులేని మమకారం ప్రదర్శిస్తోంది. ధరల సర్దుబాటు కింద కాంట్రాక్టర్లకు అదనపు నిధులు కట్టబెట్టేందుకు సిద్ధమైంది.

అక్రమం ఇక సక్రమం

తాజాగా చేపట్టిన పనులకు ‘ధరల సర్దుబాటు’ నిబంధనలను వర్తింపజేసి, కాంట్రాక్టర్లకు అదనపు నిధులు ఇచ్చేయాలంటూ జలవనరుల శాఖ అధికారులపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారు. 2013 ఏప్రిల్ 1కి ముందు చేపట్టిన పనులకు మాత్రమే ధరల సర్దుబాటును వర్తింపజేస్తామని.. ఆ తర్వాత చేపట్టిన పనులకు అమలు చేయలేమని అధికారులు తేల్చిచెప్పారు. దాంతో బోర్డ్ ఆఫ్ చీఫ్ ఇంజనీర్స్(బీవోసీఈ)ను రంగంలోకి దించి, తమకు అనుకూలంగా నివేదిక వచ్చేలా చక్రం తిప్పారు. బీవోసీఈ నివేదికను అమలు చేయడానికి వీలుగా శనివారం (20వ తేదీ) నిర్వహించే కేబినెట్ సమావేశానికి ప్రతిపాదనలు పంపాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. కేబినెట్ తీర్మానం ద్వారా అక్రమాన్ని సక్రమం చేసుకుని, కాంట్రాక్టర్లతో కలిసి రూ.4 వేల కోట్లకు పైగా లబ్ధి పొందడానికి వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు.

ఆ రెండు జీవోలతో భారమే

ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో స్టీల్, సిమెంట్, డీజిల్‌తోపాటు లేబర్, మెటీరియల్‌కు ధరల సర్దుబాటును వర్తింపజేస్తూ కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం 2014 ఫిబ్రవరి 7న జారీ చేసిన జీవో 13ను గవర్నర్ నరసింహన్ తాత్కాలికంగా నిలిపివేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే జలవనరులు, ఆర్థిక శాఖల అధికారుల అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ.. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు చేసిన సూచనలను తుంగలో తొక్కుతూ ధరల సర్దుబాటు కింద కాంట్రాక్టర్లకు అదనపు నిధులు కట్టబెడుతూ 2015 మార్చి 22న జీవో 22ను జారీ చేశారు. అంతటితో ఆగకుండా... పనుల పరిమాణాల ఆధారంగా అదనపు బిల్లులు చెల్లించేలా 2015 జూన్ 12న జీవో 63ను జారీ చేశారు. ఈ రెండు జీవోల వల్ల రాష్ట్ర ఖజానాపై రూ.20 వేల కోట్లకు పైగా భారం పడింది. ఆ సొమ్మంతా ప్రభుత్వ పెద్దలు, కాంట్రాక్టర్ల పాలైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కోటరీ కాంట్రాక్టర్లతో ప్రతిపాదన

ధరల సర్దుబాటు నిబంధనలు 2013 ఏప్రిల్ 1కి ముందు చేపట్టిన పనులకే వర్తిస్తాయి. రాష్ట్రంలో 2014 జూన్ 8 తర్వాత చేపట్టిన పనులకు వర్తించవు. తాజా ధరల ప్రకారం చేపట్టిన పనులను పూర్తి చేయలేకపోతే ఈపీసీ లేదా ఎల్ఎస్–ఓపెన్ విధానాల్లోని నిబంధనల ప్రకారం సంబంధిత కాంట్రాక్టర్‌కు జరిమానా విధించవచ్చు. కానీ, తాజాగా చేపట్టిన పనులకు కూడా ధరల సర్దుబాటు నిబంధనలను వర్తింపజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోటరీలోని రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్, కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి చెందిన కాంట్రాక్టు సంస్థలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాయి. హంద్రీ–నీవా రెండో దశలో భాగంగా కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో చేసిన పనులకు అదనంగా రూ.169.71 కోట్లు ఇవ్వాలని కోరాయి. 2015–16 ధరల ఆధారంగా కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు టెండర్లు పిలిచామని, వాటికి జీవో 22, జీవో 63లను వర్తింపజేయలేమని రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ(ఎస్ఎల్ఎస్సీ) పలుమార్లు తేల్చిచెప్పింది. చంద్రబాబు ఒత్తిళ్లకు ఎస్ఎల్ఎస్సీ లొంగకపోవడంతో వ్యూహం మార్చారు. తాజాగా చేపట్టిన పనులకూ ధరల సర్దుబాటు నిబంధనను వర్తింపజేసే ప్రతిపాదనపై నివేదిక ఇవ్వాలంటూ బీవోసీఈని ఆదేశించారు. ఒత్తిళ్లకు తలొగ్గిన బీవోసీఈ.. 2013 ఏప్రిల్ 1 తర్వాత ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) విధానంలో చేపట్టిన పనుల్లో.. అంతర్గత అంచనా విలువ(ఐబీఎం) కంటే 25 శాతం ఎక్కువ పనులు చేసి ఉంటే ధరల సర్దుబాటు నిబంధనను వర్తింపజేయవచ్చని 2017 నవంబర్ 29న నివేదిక ఇచ్చింది. ఐబీఎంలో పేర్కొన్న మట్టి లేదా కాంక్రీట్ పనుల కంటే 50 శాతం ఎక్కువ చేసి ఉన్నా అదనపు నిధులు ఇవ్వొచ్చని ఆ నివేదికలో పేర్కొంది. ఈ నివేదికను అమలు చేయాలంటూ సీఎం చంద్రబాబు నెల రోజులుగా ఒత్తిడి తెస్తున్నారని జలవనరుల శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

కేబినెట్‌లో ఆమోద ముద్ర

తాజా ధరలతో చేపట్టిన పనులకు ధరల సర్దుబాటు నిబంధనను వర్తింపజేయలేమని జలవనరులు, ఆర్థిక శాఖల అధికారులు తేల్చి చెప్పారు. 2015–16, 2016–17, 2017–18 ధరల్లో పెద్దగా మార్పు లేదని చెప్పిన జలవనరుల శాఖ ఉన్నతాధికారులపై సీఎం చంద్రబాబు మండిపడినట్లు తెలిసింది. బీవోసీఈ నివేదికను అమలు చేసేలా ఈ నెల 20న నిర్వహించే కేబినెట్ సమావేశానికి ప్రతిపాదనలు పంపాలని ఆయన ఆదేశించారు. యథావిధిగా ఆ నివేదికపై కేబినెట్‌లో ఆమోదముద్ర వేసి.. కాంట్రాక్టర్లకు అదనపు నిధులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. 2014 జూన్ 8 తర్వాత చేపట్టిన పనులకు జీవో 22, జీవో 63లను వర్తింపజేస్తే ఖజానాపై రూ.4 వేల కోట్లకుపైగా భారం పడుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఇందులో సింహభాగం టీడీపీ ఎంపీ సీఎం రమేశ్, కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడి వియ్యంకుడు భాగస్వామిగా ఉన్న హెచ్ఈఎస్–పీఎస్‌కే, నవయుగ వంటి సంస్థలకే దక్కనుంది.

అ‘ధనం’ ఇవ్వాల్సిందేనట!

➠ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హంద్రీ–నీవా, గాలేరు–నగరి, వంశధార, చింతలపూడి తదితర ప్రాజెక్టుల్లో పాత కాంట్రాక్టర్లపై వేటు వేశారు. ఆ పనుల అంచనా వ్యయాన్ని భారీగా పెంచేసి.. టెండర్ నిబంధనలను అడ్డం పెట్టుకుని కోటరీ కాంట్రాక్టర్లకు అప్పగించారు. తాజాగా ఆ పనులకే ధరల సర్దుబాటును వర్తింపజేసి అదనపు నిధులు కట్టబెట్టడానికి పావులు కదుపుతున్నారు.

➠ హంద్రీ–నీవా రెండో దశలో కుప్పం బ్రాంచ్ కెనాల్ పనుల అంచనా విలువ తొలుత రూ.207 కోట్లే. కానీ, అంచనా వ్యయాన్ని పెంచి.. రూ.430.26 కోట్లకు రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్, కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిల సంస్థలకు కట్టబెట్టారు. ఒప్పందం ప్రకారం తొమ్మిది నెలల్లోగా ఈ పనులు పూర్తి కావాలి. కానీ, కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయలేకపోయారు. గడువు పెంచాలంటూ కాంట్రాక్టర్లు పంపిన ప్రతిపాదనపై ఉన్నతస్థాయి ఒత్తిడి మేరకు ఎస్ఎస్ఎల్‌సీ ఆమోదముద్ర వేసింది. తాజాగా పెంచిన గడువు కూడా పూర్తయింది. మట్టి పనులు పూర్తయ్యాయి. కానీ 66,139 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు మిగిలిపోయాయి. ఒప్పందంలో పేర్కొన్న దాని కంటే అధికంగా పనులు చేశామని, రూ.169.71 కోట్లు అదనంగా ఇవ్వాలని వారు ఇప్పటికే ప్రతిపాదనలు పంపారు.

➠ వంశధార ప్రాజెక్టు రెండో దశలో 87 ప్యాకేజీ పనులు చేస్తున్న సీఎం రమేశ్, 88 ప్యాకేజీ పనులు చేస్తున్న చంద్రబాబు కోటరీలోని సంస్థ ఇప్పటికే అదనపు నిధులు ఇవ్వాలంటూ సర్కార్‌కు ప్రతిపాదనలు పంపించాయి.

➠ హంద్రీ–నీవా ప్రధాన కాలువ వెడల్పు పనులను 2016–17 ధరలతో చేపట్టారు. గతేడాది చేపట్టిన ఈ పనులకు సైతం ధరల సర్దుబాటు కింద అదనపు నిధులు ఇవ్వాలంటూ సీఎం రమేశ్, చంద్రబాబు కోటరీలోని కాంట్రాక్టర్లు ప్రతిపాదనలు పంపారు.

➠ గడువులోగా పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం..నిబంధనలకు విరుద్ధంగా భారీగా ప్రయోజనం చేకూర్చడానికి రంగం సిద్ధం చేయడం గమనార్హం.

సీఏ ఫైనల్‌లో మెరిసిన తెలుగుతేజం

- దక్షిణ భారతదేశంలో ఫస్ట్ ర్యాంక్, ఆలిండియా 4వ ర్యాంకు సాధించిన విజయవాడ విద్యార్థి
- ఈ ఏడాది పెరిగిన ఉత్తీర్ణత శాతం



ఫణీష్‌రెడ్డి (ఆలిండియా 4వ ర్యాంక్)

లబ్బీపేట (విజయవాడ తూర్పు)/గుంటూరు ఎడ్యుకేషన్: గత ఏడాది నవంబర్‌లో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) నిర్వహించిన సీఏ ఫైనల్ పరీక్షా ఫలితాల్లో తెలుగుతేజం మాదాటి ఫణీష్‌రెడ్డి సత్తాచాటాడు. విజయవాడ కృష్ణలంకకు చెందిన ఫణీష్‌రెడ్డి దక్షిణ భారతదేశంలో ఫస్ట్ ర్యాంక్, జాతీయ స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించాడు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఫణీష్‌రెడ్డి ఆడిటర్ తుమ్మల రామ్మోహనరావు వద్ద ఆర్టికల్స్ చేస్తూ స్వతంత్రంగా పరీక్షకు సన్నద్ధమయ్యి ఈ ర్యాంకు అందుకున్నాడు. ఈ సందర్భంగా ఫణీష్‌రెడ్డికి ఆడిటర్ అభినందనలు తెలిపారు.

పెరిగిన ఉత్తీర్ణత..

ఒక గ్రూపుతో లేదా రెండు గ్రూపుల్లోనూ పరీక్షలకు హాజరైన 30,054 మంది విద్యార్థులకు గాను, 6,841 మంది ఉత్తీర్ణులై 22.76 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఐసీఏఐ చరిత్రలోనే ఇది రికార్డుగా నిలిచింది. కాగా, సీఏ గ్రూప్–1, గ్రూప్–2 విభాగాలను కలుపుకొని దేశ వ్యాప్తంగా 9,479 మంది సీఏ కోర్సు పూర్తి చేశారు. గ్రూప్–1 విభాగంలో దేశవ్యాప్తంగా 39,328 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, వారిలో 6,257 మంది ఉత్తీర్ణులై 15.91 శాతం, గ్రూప్–2 విభాగంలో 39,753 మంది పరీక్షలు రాయగా వారిలో 6,006 ఉత్తీర్ణులు కాగా 15.11 శాతంగా నమోదైంది. గతేడాది జనవరిలో విడుదలైన సీఏ ఫైనల్ ఫలితాల్లో 11.57 శాతం ఉత్తీర్ణత నమోదవగా, ప్రస్తుతం దాదాపు రెట్టింపు శాతం నమోదైంది. జీఎస్టీ ప్రభావంతో దేశవ్యాప్తంగా సీఏలకు డిమాండ్ నెలకొన్న పరిస్థితుల్లో తాజా ఫలితాలు విద్యార్థులను సీఏ కోర్సు వైపు ఆకర్షితులను చేసే విధంగా ఉన్నాయని స్థానిక ఆడిటర్లతో పాటు శిక్షణ సంస్థలు చెబుతున్నాయి.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే...

‘‘నేను ఆలిండియా స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించేందుకు నా తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంది. నాన్న శ్రీనివాసరెడ్డి ప్రైవేట్ ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా చేస్తారు. అమ్మ శోభారాణి గృహిణి. నేను పదవ తరగతి చదువుతున్న సమయంలో సీఏ చేయాలనే నిర్ణయించుకున్నాను. ఈ విషయాన్ని అమ్మానాన్నలకు చెప్పగా, వారు ఎంతో ప్రోత్సహించారు. ఐపీసీసీలో 71 శాతం, సీఏ సీపీటీలో 91 శాతం మార్కులు సాధించాను. ప్రస్తుతం ఆలిండియా స్థాయిలో ర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉంది. సీపీటీ, ఐపీసీసీకి ఓ విద్యాసంస్థలో శిక్షణ తీసుకున్నా. సీఏ ఫైనల్స్ విషయంలో ఆర్టికల్స్ చేస్తూ సొంతంగా ప్రిపేర్ అయ్యాను’’.
– ఫణీష్ రెడ్డి

కలెక్టర్లకు త్రైమాసిక పరీక్షలు!

కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: పరీక్షలు రాసిన విద్యార్థులు ఫలితాల కోసం ఎదురు చూస్తున్న మాదిరిగానే ప్రతి మూడు నెలలకోమారు అధికారులు కూడా పనితీరును, ఫలితాలను సమీక్షించుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. సీఎం నివాస సముదాయంలో కొత్తగా నిర్మించిన గ్రీవెన్స్ హాలులో గురువారం ప్రారంభమైన కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం ప్రసంగించారు. ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేలా కలెక్టర్లు కృషి చేయాలని సీఎం ఆదేశించారు. అటవీ సంపదను మార్కెటింగ్ చేయడం ద్వారా వృద్ధి సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అనంతరామును ఆదేశించారు.

అవసరమైతే సస్పెండ్ చేయండి...

కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను సకాలంలో ఖర్చు చేయలేకపోవడం, వినియోగ పత్రాలు సమర్పించకపోవడం పట్ల ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు వచ్చిన కేంద్ర నిధులను 15 నెలలైనా ఖర్చు చేయకపోవడం దారుణం. అవసరమైతే బాధ్యులను సస్పెండ్ చేయండి. ఎవరి కోసమో రాష్ట్రం నష్టపోతుంటే చూస్తూ ఉంటున్నారా?..’ అని కొందరు విభాగాధిపతులను ఉద్దేశించి సీఎం తీవ్ర స్వరంతో వ్యాఖ్యానించారు. కేంద్రనిధులు పొందేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని, ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్‌తో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిధుల వినియోగ పత్రాలు పెండింగ్‌లో పెట్టవద్దన్నారు.

మూడంచెల వ్యవస్థ రావాలి: సీఎం

రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థ వల్ల ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదని సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. మూడంచెల వ్యవస్థను తెచ్చేందుకు చొరవ చూపాలని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్‌ను కోరారు.

అడుగడుగునా దీన గాథలే..

ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోతున్న జనం

చంద్రబాబును నమ్మి మోసపోయామని ఆగ్రహం

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

ఒక్కొక్కరిదీ ఒక్కో దీన గాథ.. అందరూ సర్కారు బాధితులే.. తమ బిడ్డకు మాటలు రావడం లేదని, మూగ, చెవుడుతో బాధ పడుతున్నా ఆరోగ్యశ్రీ వర్తించడం లేదని కొందరు.. క్యాన్సర్‌తో బాధపడుతున్నా పట్టించుకోవడం లేదని మరికొందరు.. అన్ని అర్హతలున్నా పింఛన్లు రావడం లేదని ఇంకొందరు.. ప్రజాసంకల్ప యాత్రలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. ఇంటి కోసం ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా ఫలితం లేదని ఎస్సీ, ఎస్టీలు.. రేషన్ కార్డులు తొలగిస్తున్నారని బలహీన వర్గాల వారు ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబుకు ఓట్లేసి గెలిపించినందుకు చింతిస్తున్నామని, పేదల ఓట్లతో సీఎం అయ్యాక పేదల్నే రాచిరంపాన పెడుతున్నారని మండిపడ్డారు. ‘మా ఆశలన్నీ మీపైనే.. మీరొస్తేనే న్యాయం జరుగుతుంది.. మేమంతా మీ వెంటే’ అంటూ మద్దతు పలికారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రకు చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పాదయాత్ర 65వ రోజు గురువారం శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలంలో సాగింది. అడుగడుగునా వివిధ వర్గాల ప్రజలు తమ గోడు వెళ్లబోసుకుంటూ తమను ఆదుకోవాలని కోరారు. అందర్నీ పలకరిస్తూ, ఓదార్చుతూ వినమ్రంగా ముందుకు సాగిన జగన్.. సమస్యల తక్షణ పరిష్కారానికి తమ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పెన్షన్లు, రేషన్ కార్డులు ఎందుకు ఇవ్వడం లేదో కనుక్కోవాలని, కలెక్టర్‌కు లేఖలు రాయాలని చెప్పారు. ‘ఈ ప్రభుత్వం పోతేనే జన సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.. మన ప్రభుత్వం వచ్చాక అన్నీ చక్కబడతాయి’ అని హామీ ఇస్తూ జననేత ముందుకు సాగారు.



రాజులవారి కండ్రిగలో చెంగల్రాయుడు అనే బాధితుని దీన గాథ వింటున్న జగన్



దివ్యశ్రీది కదిలించే వేదన..

మూలకండ్రిగ గ్రామానికి చెందిన పదేళ్ల దివ్యశ్రీది గుండె కదిలించే దీన గాథ. చిన్నతనంలో సోకిన ఓ వ్యాధి కారణంగా ఆమె అచేతన స్థితికి చేరింది. లేచి నిలబడలేని స్థితి. తల్లిదండ్రులు తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రి మొదలు చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లోని పెద్దాస్పత్రుల చుట్టూ తిరిగారు. 4, 5 లక్షల రూపాయల వరకు ఖర్చు చేసినా ఫలితం లేకపోయింది. ఇప్పుడా చిన్నారికి వైద్యం అందించడం తల్లిదండ్రులకు తలకు మించిన భారమైంది. ఈ వ్యాధి ఆరోగ్యశ్రీ జాబితాలో ఉన్నట్టయితే ఆ కుటుంబం చితికిపోయే పరిస్థితి వచ్చేది కాదు. అందుకే ఇటువంటి వ్యాధులన్నింటికీ అయ్యే ఖర్చును ప్రభుత్వమే బరాయించేలా చూస్తానని జగన్ భరోసా ఇచ్చారు.

కనికరం లేని ప్రభుత్వం

రాజులవారి కండ్రిగకు చెందిన చెంగల్రాయుడు కూర్చోలేడు, లేవ లేడు. తన బాధనూ చెప్పుకోలేని దయనీయ పరిస్థితి. మానసికంగా దివ్యాంగుడు. అటువంటి వ్యక్తికి కూడా కనీసం నెలనెలా ఇచ్చే బియ్యం ఇవ్వడం లేదని చెప్పి ఆయన తల్లి లక్ష్మమ్మ బావురుమంది. చలించిన జగన్.. ఈ ప్రభుత్వానికి కనికరం కూడా లేదనడానికి ఇంతకన్నా సాక్ష్యం ఏమి కావాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఎందుకు ఇవ్వడం లేదో కనుక్కోవాలని తన సిబ్బందికి చెబుతూ కలెక్టర్‌కు తక్షణమే లేఖ రాయండని ఆదేశించారు. చేతి వేలి ముద్రలు పడడం లేదన్న సాకుతో ఈ దివ్యాంగుడిని అంత్యోదయ కార్డుదారుల జాబితా నుంచి ప్రభుత్వం పక్కనపెట్టింది. ఇతని దీనస్థితి చూసిన వారందరూ ‘అయ్యో ఇతనికి బియ్యం ఇవ్వడం లేదా? ఇతన్ని చూస్తే జాలి కలగదా? ఇదేం రాజకీయం.. జన్మభూమి కమిటీల మాయకాకపోతే మరేమిటి?’ అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మరిన్ని ఫొటోలు టాబ్లాయిడ్‌లో

పల్లెలకు ఆధునిక వైద్యం

టెలీ మెడిసిన్ విధానంతో సేవలు

- పీహెచ్‌సీల వరకు అనుసంధానం
- ప్రతిరోజూ వైద్య నిపుణుల సలహాలు



సాక్షి, హైదరాబాద్: గ్రామీణ ప్రభుత్వ వైద్య సేవలకు ఆధునిక సాంకేతికతను జోడించే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రభుత్వ వైద్యసేవలలో టెలీ మెడిసిన్ విధానం అమలుకు అడుగులు పడుతున్నాయి. బోధన, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) వరకు త్రీజీ ఇంటర్నెట్‌తో అనుసంధానం చేసి ఈ సేవలను అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహారాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న టెలీమెడిసిన్ పద్ధతిని అధికారులు అధ్యయనం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య సేవలలో పూర్తి స్థాయిలో టెలీ మెడిసిన్ అమలుకు రూ.100 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రాణాంతక జబ్బులకు పీహెచ్‌సీ స్థాయిలోనే వైద్యం అందించేందుకు ఈ విధానంతో వీలవుతుందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వేగంగా వైద్యం అందడంతోపాటు రవాణా, ఇతర ఖర్చులు ఆదా అవుతాయని చెబుతున్నారు. అన్ని పీహెచ్‌సీల్లో ల్యాప్‌టాప్‌లు ఉన్నందున సాంకేతికంగా అనుసంధానం చేస్తే కొత్త విధానంలో ఉత్తమ సేవలు అందించవచ్చని చెబుతున్నారు. టెలీమెడిసిన్ విధానానికి న్యాయపరమైన అనుమతులు ఉన్నాయని, దీన్ని అమలు చేస్తే పేదలకు ఆధునిక వైద్యం అందుతుందని అంటున్నారు.

చికిత్స, మందులు.. అంతా ఆన్‌లైన్..

ఈ విధానంలో అన్ని రకాల వైద్య సేవలు, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న పెద్దాసుపత్రి (సూపర్ స్పెషాలిటీ)ని, కిందిస్థాయిలోని జిల్లా ఆసుపత్రులను, ఏరియా ఆసుపత్రులను, గ్రామాల్లోని పీహెచ్‌సీలను ఇంటర్నెట్‌తో అనుసంధానం చేస్తారు. అన్ని చోట్ల వీడియో కాలింగ్ సదుపాయం కల్పిస్తారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని వైద్య నిపుణుడు ఆన్‌లైన్‌తో అనుసంధానంగా ఉండే కిందిస్థాయి ఆస్పత్రిలోని వైద్యులతో ప్రత్యక్షంగా వీడియో వైద్య సేవలపై సలహాలు, సూచనలను ఇస్తారు. రోగితోనూ నేరుగా వీడియో కాన్ఫరెన్స్ పద్ధతిలో మాట్లాడతాడు. రోగి వైద్యపరీక్షల నివేదికను ఈ-మెయిల్‌లో తెప్పించుకుని, పరిశీలించి అవసరమైన ఔషధాల జాబితాను ఆన్‌లైన్‌లోనే పంపిస్తారు. అభివృద్ధి చెందిన దేశాలలో ఇప్పటికే ఈ విధానం అమలవుతోంది. గ్రామీణులు ఇబ్బందిపడుతూ నగరాలకు రాకుండానే టెలీ మెడిసిన్‌తో వైద్యం పొందే అవకాశం ఉంటుంది.

రాష్ట్రంలోని పీహెచ్‌సీలు, కమ్యూనిటీ ఆస్పత్రులు ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు అన్నింట్లోనూ వైద్య సేవలు ఉన్నప్పటికీ, నగరాల్లోని బోధన ఆస్పత్రుల్లోనే అన్ని రకాల సేవలు అందుతున్నాయి. ప్రాణాంతక, దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడుతున్న గ్రామీణ ప్రాంత రోగులు ప్రైవేటు ఆస్పత్రులనే ఆశ్రయించాల్సి వస్తోంది. పీహెచ్‌సీలకు వెళ్తే అక్కడ ఒక స్థాయి వరకే వైద్యం అందుతోంది. రవాణా ఖర్చులు భరించలేక, దూర ప్రయాణాలు చేసే ఓపిక లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. టెలీ మెడిసిన్ విధానంతో ఈ పరిస్థితిని మార్చవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం నిమ్స్ ఆసుపత్రి నుంచి సింగరేణి కాలరీస్ కంపెనీ పరిధిలోని ఆసుపత్రులకు టెలీ మెడిసిన్ సదుపాయం ఉంది. కొన్ని వైద్యసేవలను ఈ విధానంలో నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు వీటిని విస్తరించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు చేపడుతోంది.

తెలంగాణలో ప్రభుత్వ ఆస్పత్రులు, పడకల సంఖ్య...

బోధన ఆస్పత్రులు	20	8,465
జిల్లా ఆస్పత్రులు	7	1,500
ఏరియా ఆస్పత్రులు	32	3,200
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	119	3,950
మాతాశిశు ఆస్పత్రులు	3	150
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	683	4,098
సబ్ సెంటర్లు	4797	--

అగ్ని-5 పరీక్ష విజయవంతం

అత్యాధునిక సాంకేతికతతో తయారీ

- 5వేల కిలోమీటర్లు దూసుకుపోయే సామర్థ్యం
- అబ్దుల్ కలాం దీవి నుంచి పరీక్ష



బాలాసోర్/చెన్నై: భారత్ మరో విజయం సాధించింది. అణ్వాయుధాలను మోసుకెళ్లే సామర్థ్యమున్న బాలిస్టిక్ క్షిపణి అగ్ని-5 పరీక్ష విజయవంతమైంది. ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే ఈ క్షిపణి 5 వేల కిలోమీటర్ల దూరానికి పైగా ఉన్న లక్ష్యాన్ని ఛేదించగలదు. ఎన్నో అత్యాధునిక సాంకేతికతలున్న ఈ క్షిపణి ప్రయోగంవిజయవంతం కావడంతో క్షిపణి తయారీలో దేశీయ సాంకేతికతకు నూతనోత్సాహం వచ్చింది. అన్ని రాడార్లు, ట్రాకింగ్ వ్యవస్థలు క్షిపణి పనితీరును పరిశీలించినట్లు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. పరీక్ష పూర్తిగా విజయవంతమైందని, 19 నిమిషాల పాటు ప్రయాణించిన క్షిపణి 4,900 కిలోమీటర్లు దూసుకెళ్లిందని వెల్లడించాయి. ఒడిశా తీరంలోని అబ్దుల్ కలాం దీవి నుంచి కానిస్టర్ ద్వారా గురువారం ఈ క్షిపణిని పరీక్షించారు. అగ్ని శ్రేణిలో 'అగ్ని-5'మరింత ఆధునికమైంది. కొత్త సాంకేతికతలతో అభివృద్ధిచేశారు. విస్తారమైన నావిగేషన్ వ్యవస్థ (ఆర్ఐఎన్ఎస్), అత్యాధునికమైన మైక్రో నావిగేషన్ వ్యవస్థ (ఎంఐఎన్ఎస్)లు ఉండటం వల్ల ఈ క్షిపణి చాలా కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించగలదు.

తమిళనాడు పాత్ర కీలకం..: అగ్ని-5 క్షిపణి పరీక్ష విజయవంతం కావడంలో తమిళనాడు పాత్ర మరువలేనిదని రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. బాలిస్టిక్ క్షిపణిలో అవసరమయ్యే ముఖ్యమైన పరికరాలు తమిళనాడు పరిశ్రమల నుంచే వచ్చాయని చెప్పారు. గురువారం చెన్నైలో జరిగిన రక్షణ పరిశ్రమల అభివృద్ధి సదస్సులో ఆమె పాల్గొన్నారు.

అగ్ని శ్రేణిలో క్షిపణులు..

- క్షిపణి లక్ష్యాన్ని ఛేధించగలిగే సామర్థ్యం,
- అగ్ని-1,700 కి.మీ.,
- అగ్ని-2, 2000 కి.మీ.,
- అగ్ని-3, 42,500 నుంచి 3,500 కి.మీ.,
- అగ్ని-5 5,000 కి.మీ.

సేకరణపై చేతులెత్తేసిన కేంద్రం

వరి, పత్తి మినహా మిగిలిన ఉత్పత్తుల సేకరణ బాధ్యత రాష్ట్రాలదే!

- విభేదించిన తెలంగాణ... పలు సూచనలు చేయాలని నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: పంట ఉత్పత్తుల సేకరణ బాధ్యత నుంచి కేంద్రం తప్పుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. వరి, పత్తి మినహా కంది, పెసర, సోయాబీన్, మొక్కజొన్న తదితర ఉత్పత్తులను రాష్ట్రాలే కొనుగోలు చేసేలా కొత్త పథకానికి కేంద్రం శ్రీకారం చుట్టనుంది. దీంతో బీజేపీయేతర రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతోంది. తెలంగాణ ప్రభుత్వం కూడా కొత్త పథకంపై విభేదిస్తూ పలు సూచనలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ కేంద్రానికి లేఖ రాయాలని భావిస్తోంది. సేకరణ నుంచి కేంద్రం తప్పుకుంటే దాని ప్రభావం రాష్ట్రాలపై పడుతుందని, రైతులు ఇబ్బంది పడే అవకాశముందని వ్యవసాయాధికారులు అంటున్నారు.

పథకం ఉద్దేశమేంటంటే...

కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) కూడా లభించక నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు ఓ పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు కేంద్రం ప్రకటించింది. వచ్చే బడ్జెట్‌లో దీన్ని వెల్లడించే అవకాశముంది. ఎఫ్‌సీఐ లేదా ఇతర సంస్థల ద్వారా వరి, గోధుమ ఉత్పత్తులను మాత్రమే మద్దతు ధరకు కొనుగోలు చేసే విధానముంది. అయితే, సోయాబీన్, కంది, మినుము, పెసర, వేరుశెనగ, నువ్వులు, మొక్కజొన్న తదితర పంటలకు మద్దతుధర అమలు కావడంలేదు. ఆయా రాష్ట్రాల్లో పంటల దిగుబడిలో 30 శాతం వరకు మాత్రమే కేంద్రం కొనుగోలు చేస్తుంది. ఇది సరికాదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. కేంద్ర ఆధ్వర్యంలోని మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్ తదితర సంస్థలే మద్దతుధరకు కొనుగోలు చేస్తున్నాయి. విక్రయించేటప్పుడు ఆ సంస్థలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతోంది. ఆ నష్టంలో కేవలం 40 శాతమే భరిస్తానని కేంద్రం చెబుతుండగా దానిని 55 శాతానికి పెంచాలని తెలంగాణ కోరుతోంది. పంట ఉత్పత్తుల సేకరణకు అవసరమైన నిధులను కేంద్రం సమకూర్చాలని తెలంగాణ సూచిస్తోంది. కనీసం 50 శాతం రివాల్వింగ్ ఫండ్ సమకూర్చాలని విన్నవిస్తోంది.

55 శాతం భరించాలి:

పార్థసారథి, కార్యదర్శి, వ్యవసాయశాఖ

పంట ఉత్పత్తుల కొనుగోళ్లలో రాష్ట్రాల్లోని ఆయా సంస్థలకు నష్టం వాటిల్లితే 40 శాతమే భరిస్తానని కొత్త పథకంలో కేంద్రం చెబుతోంది. దాన్ని 55 శాతానికి పెంచాలని కోరుతున్నాం. 50 శాతం రివాల్వింగ్ ఫండ్ ఇవ్వాలని, కేంద్ర సంస్థలు, నాఫెడ్ చేదోడు వాదోడుగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

డోక్లాంలో యథాతథ స్థితి: భారత్

న్యూఢిల్లీ: డోక్లాం వద్ద యథాతథ స్థితి కొనసాగుతోందని భారత్ స్పష్టం చేసింది. వివాదాస్పద డోక్లాం వద్ద చైనా ఇటీవల కొన్ని నిర్మాణాలను చేపట్టిందంటూ మీడియాలో వస్తున్న కథనాలపై విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీశ్‌కుమార్ స్పందించారు. గత ఏడాది దాదాపు రెండు నెలల పాటు డోక్లాం వద్ద భారత్, చైనా బలగాల మోహరింపుతో ఉద్రిక్తత ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో రెండు దేశాల మధ్య చర్చలు జరిగాయని.. ఇరువర్గాల అంగీకారంతో వివాదాస్పదం ప్రాంతం నుంచి రెండు దేశాలు సైన్యాలను ఉపసంహరించుకున్నాయని తెలిపారు. అప్పటి నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోందని, చైనా ఎలాంటి నిర్మాణాలను చేపట్టలేదన్నారు. దీనిపై ఎలాంటి సందేహాలకు తావులేదని స్పష్టం చేశారు.

18 మంది బాలలకు సాహస అవార్డులు



న్యూఢిల్లీ: గ్యాంబ్లింగ్, బెట్టింగ్ దందా నడుపుతున్న ముఠాను పట్టుకోవటంలో పోలీసులకు సహకరించిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన నజియా(18)తోపాటు 18 మంది బాలలు ఈ ఏడాది సాహస అవార్డులకు ఎంపికయ్యారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ చైల్డ్ వెల్ఫేర్(ఐసీసీడబ్ల్యూ) ఇచ్చే ఈ అవార్డులకు ఐదు విభాగాల కింద బాలలను ఎంపిక చేస్తారు. వీటిలో అత్యున్నతమైన 'భారత్ అవార్డు'కు నజియా ఎంపికైంది. ఈమెకు దుండగుల నుంచి ఎన్నో బెదిరింపులు వచ్చాయి. అయినా లక్ష్యపెట్టకుండా తమ ప్రాంతంలోని గ్యాంబ్లింగ్, బెట్టింగ్ ముఠా ఆటకట్టించగలిగింది. కర్ణాటకకు చెందిన నేత్రావతి ఎం.చవాన్ నీటిలో మునిగిపోతున్న ఇద్దరు బాలురను రక్షించే క్రమంలో నీట మునిగి చనిపోయింది. ఈమెకు మరణానంతరం ఈ అవార్డు ప్రకటించారు. కాల్వలో పడి పోయిన స్కూల్ బస్సు నుంచి 15 మంది బాలలను కాపాడిన అదే బస్సులో ఉన్న పంజాబ్‌నకు చెందిన విద్యార్థి కరణ్‌బీర్ సింగ్(17) కూడా ఎంపికయ్యాడు. ఈనెల 24వ తేదీన ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో వీరంతా ప్రధాని చేతుల మీదుగా పతకాలు అందుకోనున్నారు. జనవరి 26వ తేదీన రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న అనంతరం వీరందరికీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ విందు ఇవ్వనున్నారు.

కోర్టు చొరవతో కాపురం నిలిచింది!

బిర్భూమ్: న్యాయస్థానాలు కేవలం దోషుల్ని శిక్షించడమే కాదు మానవత్వంతోనూ వ్యవహరిస్తాయని మరోసారి రుజువైంది. పశ్చిమబెంగాల్‌లో విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించిన ఓ జంట విషయంలో న్యాయమూర్తి వ్యవహరించిన తీరు ప్రశంసలు అందుకుంది. బెంగాల్‌లోని బిర్భూమ్‌కు చెందిన గౌతమ్ దాస్, అహనాలకు ఇటీవల వివాహమైంది. అత్తామామల వేధింపులు ఎక్కువకావడంతో దంపతులిద్దరూ విడిపోవాలని నిర్ణయించుకుని జనవరి 16న సూరీలోని జిల్లా కోర్టును ఆశ్రయించారు. అయితే కుటుంబ సభ్యులతో కాకుండా విడిగా ఓ హోటల్‌లో కొద్దిరోజులు గడపాలనీ, సమస్యను పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి పార్థసారథి సేన్ వీరికి సూచించారు. హోటల్‌లో ఉండేందుకు తన వద్ద తగిన నగదు లేదని గౌతమ్ కోర్టుకు చెప్పడంతో హోటల్ బిల్లు మొత్తం కోర్టు నిధుల నుంచి చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఈ మొత్తాన్ని తానే భరిస్తానని ప్రభుత్వ న్యాయవాది రంజిత్ గంగూలీ ముందుకొచ్చారు. దీనికి కోర్టు అంగీకరించడంతో ఆ జంటకు గంగూలీ బిర్భూమ్‌లోని ఓ హోటల్‌లో సూట్ బుక్ చేశారు. ప్రస్తుతం వీరు విడిపోవాలనుకోవడం లేదని గంగూలీ మీడియాకు తెలిపారు.

పరిశోధనల్లో పూర్!

పక్క రాష్ట్రాలతో పోల్చితే అట్టడుగున తెలంగాణ

- పీహెచ్‌డీ విద్యార్థుల సంఖ్యలో 12వ స్థానం
- ఎంఫిల్ కోర్సుల్లోనూ ఇదే పరిస్థితి
- 28,684 మందితో పీహెచ్‌డీల్లో తమిళనాడు టాప్
- తర్వాతి స్థానాల్లో ఉత్తరప్రదేశ్, కర్ణాటక



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పరిశోధనలకు ప్రాధాన్యం తగ్గుతోంది. యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ల కొరత, ఇతర వివాదాలతో ప్రవేశాలు సజావుగా జరగడం లేదు. రాష్ట్రంలోని వర్సిటీల్లో ఆరేళ్లుగా ప్రొఫెసర్ల నియామకాలు తగ్గడంతో ఎక్కువగా ప్రవేశాలు చేపట్టే పరిస్థితి లేకుండా పోయింది. సమాజానికి ఉపయోగపడే పీహెచ్‌డీలు ఎన్ని ఉన్నాయో పక్కనబెడితే.. మార్గదర్శనం చేసే ప్రొఫెసర్లు లేక రాష్ట్రంలో పరిశోధనలు తగ్గుతున్నాయని విద్యావేత్తలు ఆందోళన చెందుతున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతో పోల్చితే పీహెచ్‌డీలు చేస్తున్న విద్యార్థుల సంఖ్యలో తెలంగాణ 12వ స్థానంలో ఉన్నా.. పక్క రాష్ట్రాలతో పోల్చుకుంటే అట్టడుగున ఉండిపోయింది.

తమిళనాడులో 28,684 మంది..


2016-17 విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా పీహెచ్‌డీలు, ఎంఫిల్, పీజీలు చదువుతున్న విద్యార్థుల సంఖ్యపై కేంద్రం లెక్కలు తేల్చింది. ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ పేరుతో ఇటీవల గణాంకాలు విడుదల చేసింది. ఆ ప్రకారం దేశవ్యాప్తంగా పరిశోధనలు చేస్తున్న విద్యార్థుల్లో తమిళనాడు మొదటి స్థానంలో నిలిచింది. అక్కడ 28,684 మంది విద్యార్థులు పీహెచ్‌డీలు చేస్తున్నారు. 13,227 మంది విద్యార్థులతో ఉత్తరప్రదేశ్, 10,841 మంది విద్యార్థులతో కర్ణాటక రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఢిల్లీ, మహారాష్ట్ర, రాజస్తాన్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో 5 వేల మంది చొప్పున పీహెచ్‌డీ విద్యార్థులున్నారు. 4 వేల నుంచి 5 వేలలోపు పీహెచ్‌డీ విద్యార్థులతో గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అస్సాం రాష్ట్రాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 10 రాష్ట్రాల్లో పీహెచ్‌డీలు చేస్తున్న వారి సంఖ్య 1,000కి మించనేలేదు.

కేరళలో 58.82 శాతం మహిళలు

దేశవ్యాప్తంగా 1,41,037 మంది విద్యార్థులు పీహెచ్‌డీ చేస్తుండగా.. అందులో 59,242 (42.01 శాతం) మంది మహిళలే ఉన్నారు. 58.82 శాతం మంది మహిళలతో కేరళ తొలి స్థానంలో నిలిచింది. పంజాబ్‌లో 53.95 శాతం మంది, హర్యానాలో 49.54 శాతం, తమిళనాడులో 42.95, రాజస్తాన్‌లో 47.61, ఢిల్లీలో 46.39, మహారాష్ట్రలో 41.79, గుజరాత్‌లో 39.15, కర్ణాటకలో 38.84, అస్సాంలో 38.19, ఆంధ్రప్రదేశ్‌లో 37.24, తెలంగాణలో 34.28% మంది మహిళలు పీహెచ్‌డీ చేస్తున్నారు.

పీజీ కోర్సుల్లో సీన్ రివర్స్..

పీహెచ్‌డీలతోపాటు మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ (ఎం.ఫిల్.) ప్రవేశాల్లోనూ రాష్ట్రంలో అదే పరిస్థితి నెలకొంది. కానీ పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) కోర్సుల్లో మాత్రం రెండు రాష్ట్రాలు మినహా మిగతా రాష్ట్రాల్లో సీన్ రివర్స్ అయింది. పీజీ కోర్సులు చదువుతున్న వారు ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువగా (5,40,138 మంది) ఉండగా, మహారాష్ట్రలో 3,18,077 మంది ఉన్నారు. తమిళనాడులో 2,63,450 మంది, మధ్యప్రదేశ్‌లో 1,71,801, కర్ణాటకలో 1,69,889, తెలంగాణలో 1,66,186, ఆంధ్రప్రదేశ్‌లో 1,85,672 మంది విద్యార్థులు పీజీ చదువుతున్నట్లు కేంద్రం లెక్కలు తేల్చింది.



రైతు కార్పొరేషన్ రెడీ!?

ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్న ప్రభుత్వం

- త్వరలో ఎంపీ గుత్తాకు చైర్మన్ పగ్గాలు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రైతు కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందా..? ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి చైర్మన్‌గా త్వరలో రాష్ట్ర రైతు సమితి ఏర్పాటు కానుందా..? పరిస్థితులు అందుకు అవుననే సమాధానం చెబుతున్నాయి. 'రైతులకు పెట్టుబడి పథకం'అమలుతీరుపై ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘం.. జిల్లా సమన్వయ సమితులను త్వరగా ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్‌కు ఇటీవల అందజేసిన నివేదికలో సిఫార్సు చేసింది. దీంతో జిల్లా సమితులతోపాటు రాష్ట్ర రైతు కార్పొరేషన్ కూడా ఏర్పాటయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో రైతు కార్పొరేషన్ చైర్మన్ చాంబర్‌నూ సిద్ధం చేయడం ఇందుకు ఊతమిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకే ఇదంతా జరిగినట్లు తెలిసింది. ఎంపీ గుత్తా సూచనల మేరకు వాస్తు ప్రకారంగా చాంబర్‌ను తీర్చిదిద్దారని.. ఆయన అనుచరుల కనుసన్నల్లోనే చాంబర్, మీటింగ్ హాలు సిద్ధమైందని వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. దీంతో త్వరలోనే గుత్తాకు చైర్మన్ పగ్గాలు అప్పగిస్తారని ప్రచారం ఊపందుకుంది.

కార్పొరేషన్ పర్యవేక్షణలో..: పెట్టుబడి పథకం కింద రైతులకు ఎకరాకు రూ. 4 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. వచ్చే మే 15 నాటికి చెక్కుల రూపంలో ఈ సొమ్మును సర్కారు అందించనుంది. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సమన్వయ సమితుల పర్యవేక్షణలో ఈ ప్రక్రియను చేపడతారని సమాచారం. అంతేకాదు కార్పొరేషన్ ఏర్పాటు చేసి దాని పర్యవేక్షణలోనే పథకం అమలయ్యే అవకాశముందన్న ప్రచారమూ జరుగుతోంది. గ్రామ, మండల రైతు సమన్వయ సమితుల ఏర్పాటు ఇప్పటికే పూర్తయింది. లక్షన్నర మందికిపైగా రైతులు ఇందులో సభ్యులుగా ఉన్నారు. రాష్ట్ర స్థాయి సమితులను ఏర్పాటు చేయా ల్సి ఉంది. వీటిని ముఖ్యమంత్రే స్వయంగా పరిశీలించే అవకాశముంది. రాష్ట్రస్థాయి సమితిని కార్పొరేషన్‌గా ఏర్పాటు చేశాక దానికి చైర్మన్‌ను నియమిస్తారు. కార్పొరేషన్ పరిధిలోకి కిందిస్థాయి సమితులను ఎలా తీసుకురావాలని తర్జనభర్జన జరుగుతోంది.

విత్తనం మొదలు గిట్టుబాటు వరకు..: రాష్ట్రస్థాయి సమితి మూలధనం రూ. 500 కోట్లని గతంలో సీఎం పేర్కొన్న నేపథ్యంలో కార్పొరేషన్‌కు విస్తృత అధికారాలే ఉండే అవకాశం ఉంది. కార్పొరేషన్‌కు సంబంధించి మార్గదర్శకాలు రూపొందించడంపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. కార్పొరేషన్‌ను కంపెనీ యాక్టు కిందే ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు. విత్తనం మొదలు పంటకు మార్కెట్లో గిట్టుబాటు ధర వచ్చే వరకూ రైతులకు అండగా ఉండాలన్నదే కార్పొరేషన్ ముఖ్య ఉద్దేశం. పంటకు గిట్టుబాటు ధర రాకుంటే కార్పొరేషనే కొనుగోలు చేస్తుంది. అందుకు అవసరమైన నిధులు కంపెనీ యాక్టు ద్వారానే వస్తాయంటున్నారు. కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రత్యేకంగా చట్టం తీసుకురావాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ ఉత్తర్వు సరిపోతుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

కేసీఆర్ ప్రభుత్వాన్ని పొగుడుతారేంటి?

కేంద్ర మంత్రుల తీరుపై తెలంగాణ బీజేపీ నేతల మండిపాటు

- మేం తిడుతుంటే వారు కితాబిస్తున్నారంటూ అమిత్‌షా వద్ద నిరసన
- కేంద్ర మంత్రుల వ్యాఖ్యలపై పార్టీ వాకబు
- చాలా వరకు వక్రీకరణలు, అసంపూర్తి సమాచారమేనని గుర్తింపు
- వాస్తవాలు తెలుసుకున్నాకే మాట్లాడాలని సూచనలు
- ఫిబ్రవరిలో హైదరాబాద్‌కు అమిత్‌షా..
- మూడు రోజులు ఇక్కడే మకాం
- రాష్ట్ర ప్రభుత్వంపై పోరు బాటకు ప్రణాళిక
- నెలాఖరు నుంచి వరుసగా కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్

'కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పగా ఉంది.. దాన్ని చూసేందుకు వస్తా': కేంద్ర మంత్రి గడ్కరీ

'హరితహారం ఆలోచన అమోఘం.. మిగతా రాష్ట్రాలూ అనుసరించాలి': కేంద్ర మంత్రి మహేశ్‌శర్మ

.. ఇటీవల తరచూ కేంద్ర మంత్రులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పథకాలను, సీఎం కేసీఆర్‌ను అభినందిస్తూ ప్రకటనలు చేస్తుండడం తెలంగాణ బీజేపీ నేతలకు తలనొప్పిగా మారింది. కేసీఆర్‌ది ప్రజావ్యతిరేక పాలన అంటూ తాము పోరుబాట చేపట్టిన సమయంలో కేంద్ర మంత్రులు ఇలా చేస్తుండటాన్ని వారు నేరుగా బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారు. ఏయే కేంద్ర మంత్రులు కేసీఆర్ ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడారనే వివరాలతో సహా ఫిర్యాదు చేశారు. అయితే ఆయా కేంద్ర మంత్రులను వాకబు చేసిన పార్టీ... మూడొంతుల ప్రకటనలు వాస్తవ విరుద్ధంగా వచ్చాయని గుర్తించినట్టు తెలిసింది. మిగతా ప్రకటనలకు కూడా అసంపూర్తి సమాచారమే కారణమని తేల్చినట్లు సమాచారం. కేంద్ర మంత్రులు తెలంగాణలోని ఏదైనా పథకం గురించి మాట్లాడాల్సి వస్తే.. వాటి వాస్తవ పరిస్థితులను తమ నుంచి తెలుసుకున్నాకే మాట్లాడితే బాగుంటుందని రాష్ట్ర నేతలు అమిత్‌షా దృష్టికి తెచ్చినట్లు తెలిసింది.

ఎదురుదాడి చేయాల్సిందే!

ఇంతకాలం రాష్ట్ర ప్రభుత్వ తీరును కేంద్ర మంత్రులు మెచ్చుకున్నట్టు వెలువడిన వార్తలు అబద్ధపు ప్రచారమని... కొందరు రాష్ట్ర మంత్రులే అలాంటివి లీకుల ద్వారా ఇప్పించి మీడియాలో ప్రముఖంగా వచ్చేలా చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర నేతలు ఎదురుదాడి మొదలుపెట్టారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలసి బయటికి వచ్చాక.. కేంద్ర మంత్రులు రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై సానుకూల ప్రకటనలు చేసినట్టుగా చెబుతున్నారని అంటున్నారు. అలాంటి సమయంలో వెంటనే మీడియా ద్వారా వాస్తవాలు తెలపాలని కేంద్ర నాయకత్వాన్ని కోరినట్టు తెలిసింది. అంతేగాకుండా కేంద్ర మంత్రుల ప్రశంసల వ్యాఖ్యలతో రాష్ట్రంలో టీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని.. అందువల్ల జాగ్రత్తగా ఉండాలనే బీజేపీ కేంద్ర నాయకత్వంతో చర్చల్లో నిర్ణయించారు. దీనికి సంబంధించి త్వరలో కచ్చితమైన విధానాన్ని కూడా అవలంబించాలని నిర్ణయానికి వచ్చారు.

నెలాఖరు నుంచి..

రాష్ట్ర ప్రభుత్వ తీరును బీజేపీ పూర్తిగా వ్యతిరేకిస్తోందనే అంశాన్ని జనంలోకి బలంగా తీసుకెళితేనే పార్టీకి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని రాష్ట్ర నేతలు కేంద్ర నాయకత్వానికి వివరించారు. ఇందుకోసం తాము సిద్ధం చేసుకున్న షెడ్యూల్‌ను కూడా అందజేశారు. జనవరి నెలాఖరు నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు పార్టీ విభాగాల వారీగా నిర్వహించే కార్యక్రమాలను అందులో వివరించారు. దీనికి కేంద్ర నాయకత్వం కూడా ఆమోదం తెలపడంతో.. ఆయా కార్యక్రమాలను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

ఫిబ్రవరిలో రాష్ట్రానికి అమిత్‌షా

వచ్చే ఎన్నికల కోసం వ్యూహ రచనకు సిద్ధమయ్యేందుకు బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా వచ్చే నెల (ఫిబ్రవరి)లో హైదరాబాద్‌కు వస్తున్నారు. గత పర్యటనలకు భిన్నంగా ఈ సారి కేవలం రాష్ట్ర పార్టీ తీరును సమీక్షించి తగిన వ్యూహాన్ని ఖరారు చేసేందుకే సమయం వెచ్చించనున్నారు. బహిరంగ సభలు, కార్యకర్తల సమావేశాలు లేకుండా.. అమిత్‌షా కేవలం 19 పార్టీ సంస్థాగత విభాగాలతో సమీక్షలకే పరిమితమవుతారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో అమిత్‌షా తెలంగాణ పర్యటన సమయంలో చేసిన విమర్శలకు సీఎం కేసీఆర్ వెంటనే కౌంటర్లు వేశారు. అమిత్‌షా రాష్ట్రంలో ఉండగానే ఆయన మాటలను తిప్పికొడుతూ విమర్శలు చేశారు. దానిని దృష్టిలో ఉంచుకున్న అమిత్‌షా.. పక్కా వ్యూహంతో జనంలోకి వెళ్లేలా పార్టీని సిద్ధం చేయాలని ఇప్పటికే రాష్ట్ర నాయకత్వానికి సూచించారు. ఈ క్రమంలోనే పోరు బాట కార్యక్రమానికి రంగం సిద్ధమైంది. రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వం పొందిన వారి సంఖ్య 20 లక్షలకు చేరుకుంది. వారు ఒక్కొక్కరు కనీసం నాలుగైదు ఓట్లు వేయించేలా చేయాలనేది అమిత్‌షా దిశానిర్దేశం. వెరసి కోటి ఓట్లు పార్టీ గుప్పిట్లో ఉన్నట్టవుందని, అందుకోసం సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరి ఫోన్ నంబర్ సేకరించాలని ఆయన ఆదేశించారు. ఫిబ్రవరి పర్యటనలో దీనిపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనున్నట్లు సమాచారం.

విస్తృతంగా ప్రజా పోరుబాట..

రాష్ట్ర బీజేపీ సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఈ నెల 24న దళిత అదాలత్‌ను నిర్వహించనుంది. అనంతరం రాష్ట్రంలో ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలన్నింటిలో వివిధ తేదీల్లో ఈ సదస్సులు నిర్వహిస్తారు. ఇక ఈ నెల 23న బీసీ ఆత్మగౌరవ సదస్సు, తర్వాత రైతు పోరు సదస్సులు మొదలవుతాయి. మహబూబ్‌నగర్‌లో పెద్ద ఎత్తున సభ నిర్వహించి రైతు పోరును మొదలు పెట్టనున్నారు. తర్వాత గిరిజన గర్జన చేపడతారు. పార్టీలోని అన్ని విభాగాల ఆధ్వర్యంలో ప్రజా పోరుబాట జరపబోతున్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం 19-1-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
178 ▲	29 ▲
35,260	10,817

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	7,287	▽	10
డోజోన్స్	26,001	▽	114
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,700	▽	24
డాక్స్	13,281	▲	97
షాంఘై	3,476	▲	31
నికాయ్	23,763	▽	105

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		• కొనుగోలు	• అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.65	64.78
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	89.70	89.88
€	యూరో	ఎస్‌బీఐ	79.03	79.19
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	58.32	58.44
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.72	51.82
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	48.98	49.08
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.45	18.32
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.82	18.50
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.02	11.38

భారత మార్కెట్లోకి థాయ్ రిటైల్ సంస్థ

- రూ. 1,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్న సియామ్ మాక్రో
- ఢిల్లీలో ఈ ఏడాది రెండు హోల్‌సేల్ స్టోర్ల ఏర్పాటు!



న్యూఢిల్లీ: థాయ్‌లాండ్‌కి చెందిన రిటైలింగ్ సంస్థ సియామ్ మాక్రో పీసీఎల్... తాజాగా భారత హోల్‌సేల్ మార్కెట్‌లోకి అడుగుపెట్టింది. వచ్చే అయిదేళ్లలో భారత క్యాష్ అండ్ క్యారీ విభాగంలో రూ.1,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు సంస్థ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సిరిపోర్న్ డెక్‌సింఘా తెలిపారు. లాట్స్ హోల్‌సేల్ సొల్యూషన్స్ పేరిట ఈ స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారామె. ఈ ఏడాది ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో తొలుత రెండు స్టోర్లు ఏర్పాటు చేస్తామని, ప్రధానంగా ఉత్తరాదిపై దృష్టి సారించి వచ్చే మూడేళ్లలో 15 హోల్‌సేల్ స్టోర్లను ఏర్పాటు చేస్తామని డెక్‌సింఘా తెలిపారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 5,000 పైచిలుకు ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఆమె తెలియజేశారు. భారత మార్కెట్ తమకు చాలా కీలకమన్నారు. 50 బిలియన్ డాలర్ల భారీ దిగ్గజం కెరోయిన్ పాక్ ఫండ్ (సీపీ) గ్రూప్‌లో సియామ్ మాక్రో పీసీఎల్ భాగంగా ఉంది. 100% ఆటోమేటిక్ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) విధానంలో సియామ్ మాక్రో భారత్‌లో ఇన్వెస్ట్ చేస్తోంది. థాయ్‌లాండ్‌తో పాటు కంబోడియాలో కూడా ఈ సంస్థ కార్యకలాపాలు సాగిస్తోంది. బ్యాంకాక్ కేంద్రంగా పనిచేస్తున్న సీపీ గ్రూప్‌నకు అగ్రి బిజినెస్, టెలికం, ప్లాస్టిక్స్, ఆటోమోటివ్, ఫార్మాస్యూటికల్ తదితర వ్యాపారాలు కూడా ఉన్నాయి.

తమ స్టోర్స్ కోసం ప్రధానంగా స్థానిక మార్కెట్ల నుంచే సోర్సింగ్ (కొనుగోళ్లు) జరపనున్నట్లు లాట్స్ హోల్‌సేల్ సొల్యూషన్స్ ఎండీ తనిత్ చెరవనంత్ తెలిపారు. కిరాణా షాపులు, వ్యాపార సంస్థల కోసం ఆన్‌లైన్‌లో కూడ విక్రయించనున్నట్లు, షాపు దగ్గరికే డెలివరీ సర్వీసులు కూడా అందించనున్నట్లు చెప్పారు. కిరాణా షాపులకు రుణ సదుపాయంతో ఉత్పత్తులు అందించేలా ఆర్థిక సంస్థలతో చర్చలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

మార్కెట్లోకి ఆడి ఎస్‌యూవీ క్యూ5 కొత్త వెర్షన్

ధర రూ. 57.6 లక్షలు



న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీ దిగ్గజం ఆడి తాజాగా ప్రీమియం స్పోర్ట్స్ యుటిలిటీ వాహనం (ఎస్‌యూవీ) క్యూ5లో కొత్త వెర్షన్‌ను భారత మార్కెట్లో ప్రవేశపెట్టింది. దీని ధర రూ.57.6 లక్షలు (ఢిల్లీ ఎక్స్ షోరూం). లీటరుకు 17 కి.మీ. మైలేజీ ఇచ్చే ఈ ఎస్‌యూవీ గరిష్ఠంగా గంటకు 218 కి.మీ. వేగంతో ప్రయాణించగలదు. ఆఫ్‌రోడ్ ప్రయాణాలకు కూడా అనుకూలంగా ఉండే ఈ కారులో 8 ఎయిర్‌బ్యాగ్‌లు తదితర ఫీచర్లు ఉన్నాయి. తేలికపాటి బాడీతో ఇంధనాన్ని మరింత ఆదా చేసేలా దీన్ని తీర్చిదిద్దినట్లు ఆడి ఇండియా హెడ్ రాహిల్ అన్సారీ తెలిపారు. అంతర్జాతీయంగా ఇప్పటిదాకా ఈ మోడల్ ఎస్‌యూవీలను 16లక్షలకు పైగా విక్రయించినట్లు ఆయన వివరించారు. అంతర్జాతీయంగా 2020 నాటికి మూడు ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) ప్రవేశపెట్టనున్నట్లు అన్సారీ తెలిపారు. ఆ తర్వాత నుంచి ఏటా ఒక ఈవీ మోడల్‌ను ఆవిష్కరించాలని యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. చార్జింగ్‌పరమైన మౌలిక సదుపాయాలు మెరుగుపడిన పక్షంలో భారత్‌లో 2019–20 నాటికల్లా ఈవీ ప్రవేశపెట్టగలమని ఆయన చెప్పారు. 2025 నాటికి తమ అమ్మకాల్లో 30 శాతం వాటా ఎలక్ట్రిక్ వాహనాల నుంచే ఉండగలదని ఆశిస్తున్నట్లు అన్సారీ పేర్కొన్నారు.

‘ఇన్‌పుట్’ లాభం అందదెందుకు?

ఫ్లాట్ల కొనుగోలుదారులకు దక్కని ప్రయోజనం

- పెరుగుతున్న ధర; డెవలపర్‌కు అదనపు లాభం
- ఐటీసీ లెక్కిస్తున్నది నిర్మాణ వ్యయం మీదే...
- లాభాన్ని కలిపి లెక్కిస్తే మాత్రం కస్టమర్‌కు భారమే
- ప్రాజెక్ట్ పూర్తయ్యాకే ఐటీసీ తెలిసేది: డెవలపర్లు
- కాదు.. నిర్మాణ దశలోనే తెలుస్తుంది: జీఎస్‌టీ నిపుణులు
- గందరగోళం మధ్య కస్టమర్లకు రూ. లక్షల్లో నష్టం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో

శ్రీనివాస్.. ఓ మధ్యతరగతి వాసి. ఓ ప్రభుత్వ సంస్థలో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. ఫ్లాట్ కోసం పైసా పైసా కూడబెట్టాడు. ఈ మధ్య ఉప్పల్‌లోని ఓ నిర్మాణ సంస్థను సంప్రదించాడు. 12 శాతం జీఎస్‌టీతో కలిసి రూ.60 లక్షలకు బేరం కుదిరింది. సరేనని.. బుకింగ్ కోసం 10 శాతం సొమ్ము చెల్లించేశాడు. ఇంటికొచ్చి తెలిసిన బంధువుతో ఈ విషయం చెప్పాడు. బంధువేమో జీఎస్‌టీ కన్సల్టెంటు. ‘‘జీఎస్‌టీ 12 శాతమే కానీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) బదిలీ చేస్తే ధర తగ్గాలిగా’’ అని అడిగాడు! షాక్‌కు గురైన శ్రీనివాస్.. వెంటనే సదరు బిల్డర్‌కు ఫోన్ చేశాడు. అవునండి.. ఐటీసీ పోనూ మిగిలిందే ప్రాపర్టీ ధర అని నింపాదిగా చెప్పాడు. ఇదే విషయాన్ని జీఎస్‌టీ కన్సల్టెంటుకు చెబితే తానూ షాక్! అదెలా కుదురుతుంది? అసలు ఐటీసీ ఎలా లెక్కగట్టారు? ఏ కస్టమర్‌కు ఎంతెంత బదిలీ చేశారు? అనడిగితే.. ‘‘అవన్నీ మాకు తెలియదు కావాలంటే తీసుకోండి! లేకపోతే లేదు అంతే!’’ అంటూ ఫోన్ పెట్టేశాడు యజమాని. చేసేదేం లేక గమ్మునుండిపోయాడు శ్రీనివాస్!

ఇక్కడ గమనించాల్సినదేమంటే... ఐటీసీ బదిలీ చేయకపోవటంతో శ్రీనివాస్ నష్టపోయాడని! అతనే కాదు జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక చాలా మంది ఫ్లాట్ కొనుగోలుదారులు నష్టపోతూనే ఉన్నారు. పన్ను ఎక్కువ చెల్లిస్తున్నారు కానీ... ఐటీసీ ప్రయోజనం మాత్రం అందటం లేదు. దీనికి ప్రధాన కారణం ఎలా అడగాలనే అవగాహన కొనుగోలుదారులకు... ఎలా బదిలీ చేయాలనేది డెవలపర్లకు తెలియకపోవటమే!! అదీ కథ.

ఐటీసీ అంటే?

ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) ప్రధాన ఉద్దేశం.. తయారీదారు లేదా వ్యాపారస్తుడిపై ద్వంద్వ పన్ను భారం నుంచి విముక్తం చేయడమే. పరోక్ష పన్ను వ్యవస్థలో ప్రభుత్వానికి పన్ను చెల్లించేది వ్యాపారస్తుడే. కానీ దాని అంతిమ భారం మోసేది వినియోగదారుడే. అందుకే జీఎస్‌టీలో ఐటీసీని తెచ్చారు. దీంతో వ్యాపారస్తుడికి కొంత పన్ను భారం తగ్గుతుంది. ఈ తగ్గిన పన్ను భారాన్ని వినియోగదారుకు బదిలీ చేయాలి. అంటే అంతిమంగా ఉత్పత్తుల ధరలు తగ్గాలన్నమాట. కానీ రియల్టీలో అది జరగటం లేదు.

అపార్ట్‌మెంట్లకు 12 శాతం జీఎస్‌టీ..

గతంలో అపార్ట్‌మెంట్లకు 4.5% సర్వీస్ ట్యాక్స్, 1.25% వ్యాట్ ఉండేది. అంటే మొత్తంగా దాదాపు 6% పన్ను ఉండేది. కానీ, జీఎస్‌టీలో అపార్ట్‌మెంట్లను 12% శ్లాబ్‌లోకి తెచ్చారు. అంటే గతంతో పోలిస్తే అపార్ట్‌మెంట్లకు 6% పన్ను అదనమన్నమాట. కానీ, ఇది నిజంగా పెరిగినట్లు కాదు. ఎందుకంటే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రూపంలో నిర్మాణ సామగ్రికి చెల్లించిన పన్నులన్నీ తిరిగి బిల్డర్ చేతికొస్తాయి. వాటిని తను కొనుగోలుదారుకు బదలాయిస్తే.. వాస్తవంగా మునుపటికన్నా పన్ను తక్కువే అవుతుంది.

ప్రాజెక్ట్ పూర్తయ్యాకే ఐటీసీ..: ఇతర రంగాల్లాగా రియల్టీలో ఐటీసీ ఎంతొస్తుందో ముందే ఊహించలేమన్నది బిల్డర్ల మాట. ప్రాజెక్ట్ పూర్తయ్యాకే ఐటీసీ ఎంతొస్తుంది? దాన్ని ప్రాజెక్ట్‌లోని కస్టమర్లందరికీ ఎంతెంత బదిలీ చేయాలనేది తెలుస్తుందని పంజగుట్టకు చెందిన ఓ డెవలపర్ చెప్పారు. ‘‘కానీ ఐటీసీ అనేది నిర్మాణ వ్యయానికే వర్తిస్తుంది. నిర్మాణంలో చాలా వరకు వ్యయం అసంఘటిత రంగంతోనే ముడిపడి ఉంటుంది. ఎర్ర ఇటుకలు, ఇసుక, కంకర, రాళ్లు, కూలీలు, సెంట్రింగ్, ప్లంబర్ వంటివన్నీ అలాంటివే. వీటిలో దేనికీ బిల్లులుండవు. వాటికెలా ఐటీసీ క్లెయిమ్ చెయ్యాలి?’’ అని ఆయన ఎదురు ప్రశ్నించారు. ఈ వ్యయ భారం నుంచి తప్పించుకోవటానికి కొనుగోలుదారుల నుంచి నగదు రూపంలో లావాదేవీలు జరిపి.. వాటిని ఇతరత్రా ఖర్చులకు వాడుతున్నామని చెప్పారాయన.



కాదు.. కాదు నిర్మాణ దశలోనే..

ఏ నిర్మాణ సంస్థకైనా ఒక్కో ఫ్లాట్‌కు ఎంతమేర సిమెంట్, ఇనుము, రంగులు, ఎలక్ట్రికల్ ఉపకరణాలు, టైల్స్, శానిటరీ వంటి నిర్మాణ సామగ్రి అవసరముంటుందో ముందే అవగాహన ఉంటుంది. వీటి కొనుగోలుకయ్యే వ్యయాన్ని లెక్కించాకే ఫ్లాట్ ధరను నిర్ణయిస్తారు కూడా. ఎప్పుడైతే ఇన్‌పుట్ వ్యయం తెలుస్తుందో దానికి సంబంధించిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ లెక్కించటం సమస్య కాదు. ఈ మొత్తాన్ని ఫ్లాట్‌కయ్యే ఖర్చు నుంచి తగ్గించుకుంటే వినియోగదారుడికి ఐటీసీని బదిలీ చేసినట్లవుతుంది. నిర్మాణ వ్యయం మీదే జీఎస్‌టీని వసూలు చేయాలి. కానీ, డెవలపర్లు లాభం కలపగా వచ్చిన మొత్తంపై కొనుగోలుదారుల నుంచి జీఎస్‌టీని వసూలు చేస్తుండటం గమనార్హం.

జీఎస్‌టీకి ముందు కొంత, తర్వాత కొంత విక్రయాలు చేస్తే..

దేశంలో 2017, జూలై 1న జీఎస్‌టీ అమల్లోకి వచ్చింది కనక ఆ తర్వాత ప్రారంభమైన ప్రాజెక్ట్‌ల్లో కొనే ఫ్లాట్లకే జీఎస్‌టీ వర్తిస్తుందని చాలా మంది అనుకుంటారు. కానీ అది తప్పు. ప్రాజెక్ట్ ఎప్పుడు మొదలైనా... జూన్ 30 తర్వాత కొన్న ప్రతి ప్రాపర్టీకీ జీఎస్‌టీ చెల్లించాలి. కాకపోతే సదరు ప్రాజెక్ట్‌కు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) వచ్చి ఉంటే... ఆ ప్రాజెక్ట్‌లో కొనే ఫ్లాట్లకు జీఎస్‌టీ వర్తించదు. డెవలపర్ కూడా ఐటీసీ క్లెయిమ్ చేసుకోవటానికి వీలుండదు. ఒకవేళ అప్పటికే డెవలపర్ సంబంధిత ప్రాజెక్ట్‌కు ఐటీసీ పొంది ఉంటే నిబంధనల మేరకు డెవలపర్ దాన్ని తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేయాల్సి ఉంటుంది.

బదలాయించకపోవటమే అసలు సమస్య

రియల్టీకి సంబంధించి ఔట్‌పుట్ అంటే నిర్మాణం పూర్తయిన ఫ్లాట్. ఇన్‌పుట్ అంటే నిర్మాణ సామగ్రి. ఫ్లాట్‌పై జీఎస్‌టీ చెల్లిస్తున్నారు కనక నిర్మాణ సామగ్రికి చెల్లించిన పన్నులు ఇన్‌పుట్ క్రెడిట్ రూపంలో తిరిగి బిల్డర్ చేతికొస్తాయి. మొత్తం జీఎస్టీని (12%) ఫ్లాట్ కొనుగోలుదారుడే కడుతున్నాడు కనక ఈ ఇన్‌పుట్ క్రెడిట్ లాభాన్ని తనకు బదలాయించాలి. బిల్డర్లు అలా చేయకపోవటంతో కొనుగోలుదారులకిది మరింత భారంగా మారుతోంది.



– రాంబాబు గొండేల
సెంట్రల్ ట్యాక్స్ సూపరింటెండెంట్

ఐటీసీలో ధరలెలా తగ్గుతాయంటే?

ఉదాహరణకు ఒక అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ ధర రూ.50 లక్షలనుకుందాం. నిర్మాణ సంస్థ లాభం 10% కలిపితే ఫ్లాట్ ఖరీదు రూ.55 లక్షలు. జీఎస్‌టీ అమల్లోకి రాకముందైతే 6 శాతం పన్ను (వ్యాట్+సర్వీస్ ట్యాక్స్) కలిపి కస్టమర్ రూ.58,30,000 చెల్లించాల్సి వచ్చేది. జీఎస్టీ వచ్చాక ఇదే ఫ్లాట్ విషయంలో.. కస్టమర్ 12% జీఎస్‌టీ కలిపి 61,60,000 చెల్లించాల్సి వస్తోంది.

నిజానికి ఫ్లాట్ ఖరీదు రూ.50 లక్షలనుకుంటే... దీనికి వాడే నిర్మాణ సామగ్రిపై బిల్డర్‌కు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ చేతికందుతుంది. ఇది ధరలో 6% వరకూ ఉంటుంది. అంటే రూ.3 లక్షలన్న మాట. దీని ప్రకారం ఫ్లాట్ నిర్మాణ వ్యయం రూ.47 లక్షలే. దీనికి నిర్మాణ సంస్థ లాభం కలిపితే 52 లక్షలవుతుంది. 12% జీఎస్‌టీ (6.24 లక్షలు) కలిపితే 58.24 లక్షలవుతుంది. ఈ లెక్కన జీఎస్టీ వల్ల కొనుగోలుదారులకు కొంత కలిసి వచ్చినట్లే. కానీ బిల్డర్లు జీఎస్టీ పేరు చెప్పి 12% వసూలు చేస్తుండటం.. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ఊసెత్తకపోవటం.. దానిపై కొనుగోలుదారులకూ అవగాహన లేకపోవటంతో అధిక ధర చెల్లించాలివస్తోంది. చివరికి దీన్ని ‘జీఎస్‌టీ ఎఫెక్ట్’ అని సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

కాల్ డ్రాప్స్‌కి సాకులు చెప్పొద్దు

టెల్కోలకు డాట్ హెచ్చరిక



న్యూఢిల్లీ: కాల్ డ్రాప్స్ సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాల్సిందేనని టెల్కోలకు కేంద్రం స్పష్టంచేసింది. మొబైల్ టవర్ల ఏర్పాటులో ఇబ్బందులున్నాయనో లేదా మరొకటో సాకులు చెప్పొద్దని తెగేసి చెప్పింది. కాల్స్ నాణ్యత విషయంపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెడుతోందని టెలికం శాఖ (డాట్) కార్యదర్శి అరుణ సుందరరాజన్ తెలిపారు. డ్రాప్స్ సమస్య యథాప్రకారం కొనసాగడానికి వీల్లేదని.. దిద్దుబాటు చర్యలు తీసుకోక తప్పదని పరిశ్రమకు స్పష్టం చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. కాల్ డ్రాప్ ఫార్ములా ఆధారిత మొబైల్ సేవల నాణ్యతపై జనవరి 21న టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ నివేదిక అందగానే పరిశ్రమ వర్గాలతో డాట్ భేటీ కానున్నట్లు అరుణ వెల్లడించారు. ప్రజల వ్యతిరేకత కారణంగా మొబైల్ ఆపరేటర్లు కొన్ని చోట్ల టవర్ల ఏర్పాటులో సమస్యలు ఎదుర్కోవటం నిజమే అయినా... కాల్ డ్రాప్స్‌కు దాన్ని సాకుగా చూపరాదని అరుణ స్పష్టంచేశారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ని మెరుగుపర్చుకోవడానికి టెల్కోలు పెట్టుబడులు పెట్టాల్సిందేనన్నారు. మొబైల్ కాల్స్ అంతరాయాలను నిరోధించేలా ట్రాయ్ తెచ్చిన నిబంధనలు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఆ తర్వాత తొలిసారిగా డిసెంబర్ త్రైమాసిక పరిణామాలపై ట్రాయ్ త్వరలో నివేదిక ఇవ్వనుంది. కొత్త నిబంధనల ప్రకారం మొబైల్ టవర్ల స్థాయిలో కాల్స్ నాణ్యతను పరిశీలించనున్నారు. ప్రమాణాలు పాటించకపోతే టెల్కోలపై గరిష్ఠంగా రూ.10 లక్షల దాకా జరిమానా విధించవచ్చు.

కేంద్రానికి రాష్ట్ర ఆర్థిక మంత్రుల

‘బడ్జెట్’ సూచనలు

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ గురువారం నాడు రాష్ట్రాల ఆర్థికమంత్రులతో బడ్జెట్ ముందస్తు సంప్రతింపులు జరిపారు. వివిధ ఆర్థిక అంశాలు, బడ్జెట్ విధానాలపై ఈ సందర్భంగా వారు కేంద్రానికి పలు సూచనలు చేశారు. కేంద్ర బడ్జెట్‌కు ముందు రాష్ట్రాల ఆర్థికమంత్రులతో కేంద్ర ఆర్థికమంత్రి సమావేశం జరిపి, వారి నుంచి సూచనలు, సలహాలు తీసుకోవడం సంప్రదాయకంగా కొనసాగుతోంది. ఫిబ్రవరి 1వ తేదీన ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంటులో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న సంగతి తెలిసిందే. సమావేశం సందర్భంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్థికమంత్రులు ఒక మెమోరాండం సమర్పించినట్లు సమాచారం. దీనిని క్షుణ్నంగా అధ్యయనం చేసి, అవసరమైన అన్ని ప్రతిపాదలనూ సమాఖ్య సహకార స్ఫూర్తికి అనుగుణంగా 2018–19 బడ్జెట్ ప్రతిపాదనల్లో చేర్చడం జరుగుతుందని జైట్లీ ఈ సందర్భంగా పేర్కొన్నట్లు ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. హిమాచల్‌ప్రదేశ్, పుదుచ్చేరి ముఖ్యమంత్రులు, బిహార్, ఢిల్లీ, గుజరాత్, మణిపూర్, తమిళనాడు ఉపముఖ్యమంత్రులు, 14 రాష్ట్రాల ఆర్థికమంత్రులు, మంత్రులు తమ తమ రాష్ట్రాల ఆర్థికమంత్రిత్వ శాఖలకు నేతృత్వం వహిస్తూ సమావేశంలో పాల్గొన్నారు.



వ్యాపారుల కోసం ‘వాట్సాప్ బిజినెస్ యాప్’

న్యూఢిల్లీ: చిన్న వ్యాపార సంస్థల సౌకర్యం కోసం ‘వాట్సాప్ బిజినెస్’ పేరుతో ఉచిత ఆండ్రాయిడ్ యాప్ విడుదల అయింది. కంపెనీలు తమ కస్టమర్లతో కనెక్ట్ అయ్యేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని సంస్థ తెలిపింది. 130 కోట్ల వాట్సాప్ యూజర్లు వ్యాపార సంస్థలతో చాట్ చేయడం ఇకపై మరింత సులువు అవుతుందని కంపెనీ పేర్కొంది. ప్రజల కోసం రూపొందించిన వాట్సాప్‌ను వ్యాపార అవసరాలకూ ఉపయోపడేలా మెరుగుపరచాలనుకుంటున్నట్టు తెలిపింది. ‘‘భారత్, బ్రెజిల్‌లో 80 శాతం చిన్న వ్యాపార సంస్థలు తమ వ్యాపారాల వృద్ధికి, కస్టమర్లతో అనుసంధానం అయ్యేందుకు వాట్సాప్ సాయపడుతుందని చెబుతున్నాయి. ‘వాట్సాప్ బిజినెస్’ అన్నది మరింత సులభంగా, వేగంగా వారితో కనెక్ట్ అయ్యేందుకు తోడ్పడుతుంది’’ అని వాట్సాప్ వివరించింది.



ఎయిర్‌టెల్ లాభం 39% డౌన్

డిసెంబర్ క్వార్టర్ లాభం రూ.306 కోట్లే

- ఆదాయం సైతం 13 శాతం క్షీణత

న్యూఢిల్లీ: దేశీయ టెలికం రంగంలో పోటీ, అనిశ్చిత పరిస్థితుల ప్రభావం భారతీ ఎయిర్‌టెల్ డిసెంబర్ త్రైమాసికం ఫలితాలపైనా కొనసాగింది. కన్సాలిడేటెడ్ లాభం 39 శాతం మేర తగ్గి రూ.306 కోట్లకు పరిమితమైంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో వచ్చిన లాభం రూ.504 కోట్లు కావడం గమనార్హం. ఆదాయం రూ.20,319 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో వచ్చిన రూ.23,336 కోట్ల ఆదాయంతో పోల్చి చూస్తే 13 శాతం తగ్గిపోయింది.

దేశీయ ఇంటర్ కనెక్షన్ వినియోగ చార్జీలను తగ్గిస్తూ ట్రాయ్ ఇచ్చిన ఆదేశాలతో సగటున ఓ వినియోగదారుడి నుంచి వచ్చే ఆదాయం మరింత తగ్గిపోయినట్టు భారతీ ఎయిర్‌టెల్ ఎండీ, సీఈవో (భారత్, దక్షిణాఫ్రికా) గోపాల్ విట్టల్ తెలిపారు. అంతర్జాతీయ టెర్మినేషన్ చార్జీలను తగ్గించాలన్న ఇటీవలి నిర్ణయం ఈ ఆదాయ క్షీణతను ఇంకా తీవ్రం చేస్తుందన్నారు. దీనివల్ల విదేశీ ఆపరేటర్లకే తప్ప వినియోగదారులకు మేలు జరగదని చెప్పారాయన. అయితే, కంపెనీ కస్టమర్ల సంఖ్య పెరగడం కాస్తంత ఆశాజనక విషయం. డిసెంబర్ క్వార్టర్ నాటికి 16 దేశాల్లో మొత్తం కస్టమర్ల సంఖ్య 39.42 కోట్లకు వృద్ధి చెందింది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో కస్టమర్ల సంఖ్య కంటే 9.2 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. మొత్తం ఆదాయాల్లో దేశీయ ఆదాయాలు రూ.15,294 కోట్లుగా ఉన్నాయి. వార్షిక ప్రాతిపదికన చూస్తే 11.3 శాతం క్షీణించినట్టు. ఆఫ్రికా ఆదాయాలు మాత్రం 5.3 శాతం పెరిగాయి. కన్సాలిడేటెడ్‌గా చూస్తే కంపెనీ రుణాలు రూ.91,714 కోట్లుగా ఉన్నాయి. 2016 డిసెంబర్ క్వార్టర్‌లో ఉన్న రూ.91,480 కోట్ల కంటే అతి స్వల్పంగా పెరిగినట్టు తెలుస్తోంది. అనుబంధ కంపెనీల నుంచి డివిడెండ్ రూపేణా వచ్చిన ఆదాయాన్ని వాటాదారులకు అందించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు నిర్ణయించింది. ఒక్కో షేరుకు రూ.2.84 చొప్పున మధ్యంతర డివిడెండ్‌కు సిఫారసు చేసింది. మార్కెట్లు ముగిసిన తర్వాత ఈ ఫలితాలు వెల్లడయ్యాయి. కాగా, బీఎస్‌ఈలో భారతీ ఎయిర్‌టెల్ స్టాక్ 1.17 శాతం నష్టపోయి గురువారం రూ.494.50 వద్ద క్లోజయింది.



యస్ బ్యాంక్ లాభం రూ.1,077 కోట్లు

22 శాతం వృద్ధి

- మొత్తం ఆదాయం రూ.6,493 కోట్లకు

ముంబై: ప్రైవేట్ రంగంలోని యస్ బ్యాంక్ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో 22 శాతం పెరిగింది. గత క్యూ3లో రూ.883 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.1,077 కోట్లకు పెరిగినట్లు యస్ బ్యాంక్ తెలిపింది. మొండి బకాయిలకు కేటాయింపులు ఐదింతలైనా, మొండి బకాయిల నిష్పత్తి రెట్టింపైనా, వడ్డీ, ఇతర, నిర్వహణ ఆదాయాలు బాగా పెరగడంతో ఈ స్థాయిలో నికర లాభంలో వృద్ధి సాధించామని యస్ బ్యాంక్ ఎండీ, సీఈఓ రాణా కపూర్ వివరించారు.

నికర వడ్డీ ఆదాయం 27 శాతం అప్...

నికర వడ్డీ ఆదాయం 27 శాతం వృద్ధితో రూ.1,889 కోట్లకు పెరిగిందని కపూర్ పేర్కొన్నారు. ఇతర ఆదాయం 40 శాతం వృద్ధితో రూ.1,422 కోట్లకు, నిర్వహణ లాభం 38 శాతం వృద్ధితో రూ.2,002 కోట్లకు పెరిగాయని తెలిపారు. మొత్తం ఆదాయం రూ.5,230 కోట్ల నుంచి రూ.6,493 కోట్లకు ఎగసిందని చెప్పారు. స్థూల మొండి బకాయిలు 0.93% నుంచి 1.72%కి, నికర మొండి బకాయిలు 0.29% నుంచి 0.93%కి పెరిగాయని తెలియజేశారు. అయితే క్వార్టర్ ఆన్ క్వార్టర్ పరంగా చూస్తే రుణ నాణ్యత మెరుగుపడిందని చెప్పారాయన. ఈ క్యూ2లో స్థూల మొండి బకాయిలు 1.82%గా, నికర మొండి బకాయిలు 1.04%గా ఉన్నాయని వెల్లడించారు. గత క్యూ3లో రూ.115 కోట్లుగా ఉన్న కేటాయింపులు 5 రెట్లు పెరిగి రూ,.421 కోట్లకు ఎగిశాయని తెలిపారు.



నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

సరుకు	ధర
పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	రూ.4,675 (కనిష్ఠం) రూ.5,110 (గరిష్ఠం)
మిర్చి (వరంగల్, తేజ)	రూ.4,500 (కనిష్ఠం) రూ.9,350 (గరిష్ఠం)
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	రూ.4,228 (కనిష్ఠం) రూ.7,471 (గరిష్ఠం)
ఉల్లి (కర్నూలు)	రూ.1,700 (కనిష్ఠం) రూ.3,330 (గరిష్ఠం)
చక్కెర (చెన్నై)	రూ.3,550
బియ్యం (కరీంనగర్)	3,800 (హెచ్ఎంటీ)
కందిపప్పు (చెన్నై)	రూ.7,200
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	--

సైయంట్ నికర లాభం 15 శాతం వృద్ధి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసిక కాలంలో ఐటీ సేవల సంస్థ సైయంట్ నికర లాభం 15.5 శాతం వృద్ధితో రూ.108.8 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయానికిది రూ.94.2 కోట్లు. ప్యూర్టోరికో హరికేన్స్ కారణంగా క్యూ3లో సైయంట్‌కు రూ.20.4 కోట్ల నిర్వహణ నష్టం, అనుబంధ సంస్థ ఉపసంహరణ కారణంగా రూ.5 కోట్ల నష్టం వాటిల్లిందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆదాయం 7.2 శాతం వృద్ధితో రూ.983.4 కోట్లకు చేరింది.

విశాఖ ఉక్కు కాంట్రాక్టు పూర్తి: రాస్టెక్

న్యూఢిల్లీ: ఉక్కు దిగ్గజాలు వైజాగ్ స్టీల్, సెయిల్ నుంచి తీసుకున్న రెండు ప్రాజెక్టులు పూర్తి చేసినట్లు రష్యాకి చెందిన రాస్టెక్ స్టేట్ కార్పొరేషన్ తెలిపింది. ఈ కాంట్రాక్టుల విలువ 37 మిలియన్ డాలర్లు. కాంట్రాక్టు కింద వైజాగ్ స్టీల్ కోసం భారీ యంత్రాలను ఏర్పాటు చేయడంతో పాటు సెయిల్ బొకారో స్టీల్ ప్లాంటులో 1970ల నాటి యంత్రపరికరాలను అప్‌గ్రేడ్ చేయాలి. విశాఖలోని వైజాగ్ స్టీల్ ప్లాంటు కోసం 3.6 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం ఉండే కొత్త సింటరింగ్ మెషీన్‌ని ఏర్పాటు చేసినట్లు రాస్టెక్ తెలిపింది.

35,500 తాకిన సెన్సెక్స్

ఎఫ్‌డీఏ పరిమితి పెంపు వార్తలతో బ్యాంక్ షేర్ల జోరు

- రెండో రోజు కొనసాగిన రికార్డులు
- 178 పాయింట్ల లాభంతో 35,260కు సెన్సెక్స్
- 28 పాయింట్లు పెరిగి 10,817కు నిఫ్టీ

స్టాక్ సూచీల రికార్డ్‌ల పరంపర వరుసగా రెండో రోజూ కొనసాగింది. గురువారం స్టాక్ సూచీలు ఇంట్రాడేలోనూ, ముగింపులోనూ కొత్త రికార్డ్‌లకు చేరాయి. బ్యాంకుల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)పరిమితిని కేంద్రం పెంచే అవకాశాలున్నాయన్న వార్తల నేపథ్యంలో బ్యాంక్ షేర్లు దూసుకుపోయాయి. సానుకూల అంతర్జాతీయ సంకేతాలు కూడా తోడవడంతో ఇంట్రాడేలో బీఎస్ఈ సెన్సెక్స్ 35,500 పాయింట్లు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 10,850 పాయింట్లపైకి ఎగబాకాయి. స్టాక్ మార్కెట్ శిఖర స్థాయిలకు చేరిన కారణంగా ట్రేడింగ్ చివరలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడం, లోహ, ఫార్మా, రియల్టీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కారణంగా లాభాలు పరిమితమయ్యాయి. సెన్సెక్స్ 178 పాయింట్ల లాభంతో 35,260 పాయింట్ల వద్ద, నిఫ్టీ 28 పాయింట్ల లాభంతో 10,817 పాయింట్ల వద్ద ముగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 426 పాయింట్ల లాభంతో 35,507 పాయింట్లను, నిఫ్టీ 99 పాయింట్ల లాభంతో 10,889 పాయింట్లను తాకాయి.ఇంట్రాడేలో సెన్సెక్స్ పాయింట్ల లాభంతో 35,507 పాయింట్లు, నిఫ్టీ పాయింట్ల లాభంతో 10,888 పాయింట్ల గరిష్ట స్థాయిలను తాకాయి. ఇవి రెండూ ఆయా సూచీలకు జీవిత కాల గరిష్ట స్థాయిలు. బ్యాంక్ నిఫ్టీ కూడా ఆల్‌టైమ్ హైకి చేరింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ క్యాప్ @ రూ.5 లక్షల కోట్లు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ జీవిత కాల గరిష్ట స్థాయి, రూ.1,954ను తాకింది. చివరకు 2 శాతం లాభంతో రూ.1,932 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5 లక్షల కోట్లను దాటేసింది. ఈ స్థాయి మార్కెట్ క్యాప్ సాధించిన మూడో భారత కంపెనీ ఇది. రూ.5 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ సాధించిన తొలి బ్యాంక్ కూడా ఇదే.



రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్ కంపెనీలు రూ. 5 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌ను అధిగమించాయి. ఈ ఏడాది ఇప్పటివరకూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ 4 శాతం పెరగడం విశేషం. నేడు(శుక్రవారం) ఈ బ్యాంక్ క్యూ3 ఫలితాలను వెల్లడించనున్నది. ఫలితాలు బాగా ఉంటే ఈ షేర్ రూ.2,000 మార్క్‌ను దాటేయవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.


సూచీల ఆల్‌టైమ్ హై...

సూచీ	ఇంట్రాడే	ముగింపు
సెన్సెక్స్	35,507	35,260
నిఫ్టీ	10,889	10,817

న్యూజెన్ ఐపీవోకు 8 రెట్ల అధిక స్పందన

న్యూఢిల్లీ: ఐటీ సేవల సంస్థ న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ ఐపీవోకు ఇన్వెస్టర్ల నుంచి చెప్పుకోతగ్గ స్పందనే లభించింది. మంగళవారం ప్రారంభమైన ఈ ఇష్యూ గురువారం ముగియగా, 8.22 రెట్లు ఓవర్ సబ్‌స్క్రయిబ్ అయింది. రూ.425 కోట్ల సమీకరణ లక్ష్యంతో వచ్చిన ఈ ఐపీవోలో 1,22,12,821 షేర్లను ఆఫర్ చేయగా, 10,03,90,323 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కేటగిరీలో 15.62 రెట్లు అధికంగా బిడ్లు వచ్చాయి. నాన్ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల విభాగం 5.52 రెట్లు అధిక స్పందన అందుకుంది. రిటైల్ ఇన్వెస్టర్ల కోటాలో 5 రెట్లు అధికంగా బిడ్లు వచ్చాయి. ఐపీవోకు ఒకరోజు ముందే కంపెనీ యాంకర్ ఇన్వెస్టర్లకు షేర్ల కేటాయింపు ద్వారా రూ.127 కోట్లను సమీకరించింది. ఐపీవోలో భాగంగా రూ.95 కోట్ల విలువ మేర తాజా షేర్లను జారీ చేయగా, ఆఫర్ ఫర్ సేల్ మార్గంలో 1,34,53,932 షేర్లను విక్రయానికి ఉంచింది. అంటే ఈ ఐపీవోలో భాగంగా సమీకరించే నిధుల్లో సింహ భాగం కంపెనీలోని ప్రస్తుత ఇన్వెస్టర్ల జేబుల్లోకే వెళ్లనున్నాయి.

అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లాభం 20% అప్



న్యూఢిల్లీ: అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ (స్పెషల్ ఎకనామిక్ జోన్) లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో 20 శాతం పెరిగింది. గత క్యూ3లో రూ.838 కోట్లుగా ఉన్న నికర లాభం (కన్సాలిడేటెడ్) ఈ క్యూ3లో రూ.1,001 కోట్లకు పెరిగినట్లు అదానీ గ్రూప్‌కు చెందిన ఈ లాజిస్టిక్స్ కంపెనీ తెలిపింది. ఆదాయం రూ.2,209 కోట్ల నుంచి 22 శాతం వృద్ధితో రూ.2,689 కోట్లకు పెరిగిందని కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కరన్ అదానీ చెప్పారు. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఈ షేర్ 4 శాతం నష్టంతో రూ.414 వద్ద ముగిసింది.

కమోడిటీ డెరివేటివ్స్‌లోకి యాక్సిస్



ముంబై: యాక్సిస్ బ్యాంకు అనుబంధ బ్రోకింగ్ సేవల సంస్థ యాక్సిస్ సెక్యూరిటీస్ ఎంసీఎక్స్ కమోడిటీ డెరివేటివ్‌ల సభ్యత్వం తీసుకుంది. బ్యాంకులను కమోడిటీ డెరివేటివ్‌ల బ్రోకింగ్ సేవలు అందించేందుకు రిజర్వ్ బ్యాంకు ఆమోదం తెలిపిన తర్వాత ఈ దిశగా అడుగేసిన తొలి సంస్థ ఇదే. బ్యాంకుల మద్దతు కలిగిన ఈ తరహా సంస్థల ప్రవేశం కమోడిటీ మార్కెట్ల అభివృద్ధికి దోహదపడగలదని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఐడియా మ్యాజిక్

హైదరాబాద్: టెలికం సంస్థ ఐడియా మ్యాజిక్ క్యాష్ బ్యాక్ పేరిట వినూత్న ఆఫర్‌ను ప్రకటించింది. రూ.398, ఆపైన రీచార్జ్ చేసిన వారు రూ.50 విలువ చేసే 8 డిస్కౌంట్ ఓచర్లు పొందుతారు. వీటిని ఏడాది కాలపరిమితిలో రూ.300, ఆపైన రీచార్జ్ కోసం వాడుకోవచ్చు. అలాగే రూ.2,700 విలువ గల షాపింగ్ కూపన్స్ వస్తాయని, వీటిని ఐడియా ఒప్పంద సంస్థల వద్ద వినియోగించవచ్చని సంస్థ తెలియజేసింది. ఈ రెండింటితో పాటు రూ.200 క్యాష్ బ్యాక్ కూడా కస్టమర్‌కు అందుతుంది.

దేశీ కొనుగోలుదారుల కోసం కొత్త ఫీచర్స్

4వేల ఉద్యోగాల కల్పనకు తోడ్పాటు: యాపిల్

వాషింగ్టన్: భారతీయ కొనుగోలుదారుల కోసం మ్యాప్స్, ప్రాంతీయ భాషల్లో కీబోర్డు తదితర కొంగొత్త ఫీచర్స్‌ను రూపొందిస్తున్నట్లు 'ఐఫోన్' తయారీ సంస్థ యాపిల్ తెలిపింది. దీంతో దాదాపు 4,000 పైచిలుకు ఉద్యోగాలు రావొచ్చని సంస్థ వర్గాలు చెప్పాయి. భారతీయ యాప్ డెవలపర్లు గతేడాది యాప్ స్టోర్ కోసం 1,00,000 పైచిలుకు అప్లికేషన్స్ రూపొందించారని, 2016తో పోలిస్తే ఇది 57 శాతం అధికమని ఆ వర్గాలు పేర్కొన్నాయి. హైదరాబాద్‌లోని తమ టీమ్ ప్రధానంగా యాపిల్ ఉత్పత్తుల కోసం మ్యాప్స్‌ను రూపొందించే పనిలో ఉన్నట్లు తెలిపాయి.

హిందుస్తాన్ జింక్ లాభం రూ.2,230 కోట్లు



న్యూఢిల్లీ: హిందుస్తాన్ జింక్ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.2,230 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో సాధించిన నికర లాభం (రూ.2,320 కోట్లు)తో పోల్చితే 4 శాతం క్షీణత నమోదైందని హిందుస్తాన్ జింక్ తెలిపింది. మొత్తం ఆదాయం మాత్రం రూ.5,975 కోట్ల నుంచి రూ.6,220 కోట్లకు పెరిగిందని కంపెనీ చైర్మన్ అగ్నివేశ్ అగర్వాల్ చెప్పారు. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో హిందుస్తాన్ జింక్ షేర్ 4.4 శాతం తగ్గి రూ.309 వద్ద ముగిసింది.

ఇండియన్ టుబాకో అసోసియేషన్ అధ్యక్షునిగా మిట్టపల్లి ఉమామహేశ్వరరావు

ఏకగ్రీవంగా మూడోసారి ఎన్నిక

సాక్షి,అమరావతి బ్యూరో: ది ఇండియన్ టుబాకో అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా మిట్టపల్లి ఉమామహేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరులోని ఐటీఏ కన్వెన్షన్ హాలులో జరిగిన అసోసియేషన్ కార్యవర్గ సమావేశం గురువారం రాత్రి జరిగింది. సమావేశంలో 2018, 2019 సంవత్సరాలకు అధ్యక్షునిగా మిట్టపల్లి ఉమామహేశ్వరరావును మూడోసారి అధ్యక్షునిగా ఎన్నుకోవడం విశేషం. ఈ ఎన్నిక ప్రతి రెండేళ్లకొకసారి జరుగుతుంది. సమావేశంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫాతోపాటు గద్దె మంగయ్య, పాలిశెట్టి వెంకటేశన్, తాడిశెట్టి మురళి, కేబీఎంఎం కృష్ణలను ఉపాధ్యక్షులుగా ఎన్నుకొన్నారు.



ఎన్నికైన అనంతరం మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

గౌరవ కార్యదర్శిగా కె.శాంతి భూషణ్, కోశాధికారిగా ఆర్.అయ్యావారయ్య, జాయింట్ సెక్రటరీలుగా లంక రామకృష్ణ ప్రసాద్, ఎస్.నాగేశ్వరరావు, రాయపాటి జగదీశ్, పి.కోటేశ్వరరావు, చుండూరి రవిబాబు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షునిగా ఎన్నికైన మిట్టపల్లి ఉమమహేశ్వరరావు కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యక్షునిగా ఎన్నికైన తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ కార్యవర్గం తీసుకొనే నిర్ణయాలు, రైతులకు మేలు చేసేవిధంగా ఉండాలని సూచించారు.

డీబీ కార్ప్ లాభం రూ.78 కోట్లు

న్యూఢిల్లీ: మీడియా కంపెనీ డీబీ కార్ప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్– డిసెంబర్ క్వార్టర్లో రూ.78 కోట్ల నికర లాభాన్ని సాధించింది. గత క్యూ3లో వచ్చిన రూ.118 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది ఏకంగా రూ.40 కోట్లు తక్కువ. గత క్యూ3 ఫలితాల్లో ఒక ప్రైవేట్ ఒప్పందం, పండుగ బిల్లింగ్ తదితర అంశాలు ఉన్నాయని, అందుకని గత క్యూ3 ఫలితాలను, ఈ క్యూ3 ఫలితాలతో పోల్చడానికి లేదని కంపెనీ వివరించింది. మొత్తం ఆదాయం ఈ క్యూ3లో రూ.602 కోట్లుగా, గత క్యూ3లో రూ.631 కోట్లుగా ఉన్నాయని పేర్కొంది. ప్రకటనల ఆదాయం ఈ క్యూ3లో రూ.426 కోట్లుగా, గత క్యూ3లో రూ.453 కోట్లుగా ఉన్నాయని తెలిపింది. ఈ క్యూ3లో మొత్తం వ్యయాలు రూ.483 కోట్లని వివరించింది. ఈ నేపథ్యంలో బీఎస్ఈలో డీబీ కార్ప్ షేర్ 4 శాతం నష్టంతో రూ.353 వద్ద ముగిసింది.

బోర్డ్ మీటింగ్స్

రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఐడీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్, పీసీ జ్యుయలర్, టాటా ఎలెక్సి, వీఎస్‌టీ ఇండస్ట్రీస్, చెన్నై పెట్రోలియమ్ కార్పొ, అతుల్, బ్లిస్, జీవీఎస్ ఫార్మా..

బులియన్ రూ.లలో

	ధర	మార్పు
ముంబై		
బంగారం (99.9, 10గ్రా)	30,055	▼ 170
బంగారం (99.5, 10గ్రా)	29,905	▼ 170
వెండి (కిలో)	38,890	▼ 330
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)		
బంగారం (22 క్యారెట్లు)	28,610	▼ 180
వెండి (కిలో)	42,000	▼ 400
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	30,600	▼ 220
బంగారం (22 క్యారెట్లు)	28,620	▼ 200
వెండి(కిలో)	42,000	▼ 300
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	30,600	▼ 150
బంగారం (22 క్యారెట్లు)	28,410	▼ 150
వెండి(కిలో)	40,000	▼ 200
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	31,220	▲ 50
బంగారం (22 క్యారెట్లు)	28,620	▼ 470
వెండి(కిలో)	38,500	
విజయవాడ		
బంగారం (24 క్యారెట్లు)	30,900	▼ 300
బంగారం (22 క్యారెట్లు)	28,600	▼ 200
వెండి(కిలో)	40,000	▼ 200
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	30,930	▼ 200
బంగారం (22 క్యారెట్లు)	28,610	▼ 180
వెండి(కిలో)	40,000	▼ 400

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	బుధవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	63.95	$63.97
బ్రెంట్	69.35	$69.38

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 19-1-2018

విశాఖ	412–00
చిత్తూరు	403–00
వరంగల్	404–00
ముంబై	447–00
చెన్నై	410–00
విజయవాడ	412–00
గోదావరి	412–00
నమక్కల్	395–00
18–1–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	402–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.60
బెంగళూరు	405–00
ఢిల్లీ	425–00
కోల్‌కతా	464–00

24 నుంచి పాతగుట్ట బ్రహ్మోత్సవాలు

యాదగిరికొండ: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని పాతగుట్ట దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఈ నెల 24 నుంచి 31 వరకు జరగనున్నాయి. 24న అంకురార్పణ, 26న స్వామివారి ఎదుర్కోలు, 27న తిరుకల్యాణ మహోత్సవం, 28న దివ్య విమాన రథోత్సవం ఉంటాయని ఈవో గీతారెడ్డి తెలిపారు. ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. రంగులు, సున్నాలు, చలువ పందిళ్లు వేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు.

చంద్ర గ్రహణం సందర్భంగా ఆలయం మూసివేత

ఈ నెల 31న చంద్ర గ్రహణం సందర్భంగా ఆలయాన్ని మూసివేయనున్నామని ఈవో వెల్లడించారు. ఆలయాన్ని ఉదయం 10:30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మూసివేస్తున్నట్లు చెప్పారు.

✦ ఘనంగా నాగోబా జాతర పూజలు



పుట్టను తవ్వుతున్న మెస్రం అల్లుళ్లు

ఇంద్రవెల్లి (ఖానాపూర్): ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో జాతర వైభవంగా సాగుతోంది. గురువారం మెస్రం వంశీయులు నాగోబా ఆలయం వెనుక భాన్‌దేవత, పెర్సపేన్ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెస్రం వంశం అల్లుళ్లు, ఆడపడుచులు, మెస్రం వంశం కోడళ్లు మర్రి చెట్టు వద్ద ఉన్న కోనేరు నుంచి పవిత్ర జలం తీసుకొచ్చి భాన్‌దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. మెస్రం వంశీయులు కుల పెద్ద దేవత పెర్సపేన్ పూజలను ఘనంగా నిర్వహించారు. కటోడ మెస్రం హనుమంత్‌రావ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుకున్నారు. తెలంగాణ జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి నాగోబాను దర్శించుకుంటున్నారు. నాగోబా యూత్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆదివాసీ సంస్కృతి క్రీడలను కలెక్టర్ దివ్యదేవరాజన్ ప్రారంభించారు.

✦ అమెరికాలో 'వసంత పంచమి'

ఆలయ అనుమతి లేదంటున్న అధికారులు

నిర్మల్/బాసర: బాసర క్షేత్రం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. అమెరికాలోని ఫిలడెల్ఫియాలో ఈ ఏడాది వసంత పంచమి వేడుకలకు ఏర్పాటు చేయటం.. ఇక్కడి నుంచి పూజసామగ్రి.. పూజారులను తరలించే యత్నం చేశారు. ఇప్పటికే పంపిణీ చేసిన కరపత్రం.. ఇక్కడి నుంచి పూజారులను, పూజా సామగ్రిని తరలించే యత్నం వంటి చర్యలన్నీ అధికారిక కార్యక్రమాన్ని తలపిస్తుండగా.. ఆలయ అధికారులు మాత్రం తమకు సంబంధం లేదనడం చర్చనీయాంశంగా మారింది. బాసర దేవస్థానం పేరిట ఈనెల 20న అమెరికాలోని గ్రేటర్ ఫిలడెల్ఫియాలో నిర్వహించనున్నట్లు ఇప్పటికే అక్కడ కరపత్రాలు పంపిణీ చేశారు. పూజాసామగ్రి కూడా దేవస్థానమే అందిస్తోందని కరపత్రాల్లో పేర్కొన్నారు. అయితే, అమెరికాలో పూజా కార్యక్రమాలకు ఇక్కడి ఆలయం నుంచి విగ్రహాలు, ఎలాంటి పూజాసామగ్రి, అర్చకులు వెళ్లడం లేదని ఈవో సోమయ్య పేర్కొన్నారు. ఆలయ రిటైర్డ్ ఈవో వెనకుండి ఈ కార్యక్ర మాన్ని జరిపిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సదరు కరపత్రంలో అతని పేరు ఇప్పటికీ ఈవోగానే ఉండటం గమనార్హం. అంతేకాకుండా ఈ కార్యక్రమానికి ఆలయానికి చెందిన ఇద్దరు అర్చకులు, ఇద్దరు ఉద్యోగులను తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే, వారి వీసాలు రద్దు కావటంతో పక్క జిల్లాకు చెందిన అర్చకులను తీసుకెళ్తున్నట్లు సమాచారం.

✦ బాండ్ రాసిస్తేనే బడిలోకి..

గురుకులాల్లో వింత నిబంధన

ఖమ్మం మయూరి సెంటర్: సంక్రాంతి సెలవులకు ఇళ్లకు వెళ్లిన ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఒకరోజు ఆలస్యంగా వచ్చారని ఖమ్మం జిల్లాలో బాండ్ పేపర్లపై సంతకాలు చేయించిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఈ నెల 16 వరకు ఎస్సీ గురుకులాలకు సంక్రాంతి సెలవులు ఇవ్వగా, ఒకరోజు ఆలస్యంగా 18న (గురువారం) విద్యార్థులు తిరిగి వచ్చారు. మరోసారి ఇలా ఆలస్యం జరగనీయమని రూ. 20 స్టాంప్ పేపర్‌పై వివరణ రాసి, తల్లిదండ్రుల చేత సంతకాలు చేసి సమర్పించాలని హుకుం జారీ చేశారు. ఖమ్మం ఆర్‌సీవో పుల్లయ్య నుంచి అనుమతి తీసుకురావాలని వెనక్కి పంపించడంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ఎస్సీ గురుకులాల విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ఆర్‌సీవో కూడా అందుబాటులో లేకపోవడంతో.. ఆందోళన చేశారు. పీడీఎస్‌యూ నాయకులు మద్దతుగా నిలిచారు. దీంతో అధికారులు స్పందించి.. ఎలాంటి బాండ్లు లేకుండానే రెసిడెన్షియల్‌లోకి అనుమతించాలని ఆదేశించారు.

✦ రూ.10 వేలకు చేరువలో మిర్చి ధర

ఖమ్మం వ్యవసాయం: మిర్చి ధర రూ.10 వేలకు చేరువలో ఉంది. గురువారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో తేజా రకం మిర్చి ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ. 9,900 పలికింది. సంక్రాంతికి ముందు 11వ తేదీ ధరతో పోలిస్తే క్వింటాల్‌కు రూ.900 పెరిగింది. రూ.9,018 ఉన్న మిర్చి ధర ఏకంగా రూ.9,900 చేరింది. బుధవారం మిర్చి ధర క్వింటాల్‌కు రూ. 9,100 పలికింది. గురువారానికి ఆ ధర మరో రూ.800 పెరిగింది. సాగు దిగుబడులు తగ్గటం, అంతర్జాతీయంగా మిర్చికి డిమాండ్ పెరుగుతుండటంతో మిర్చి ధరకు రెక్కలొచ్చాయి. ఈ ధర మరికొద్ది రోజుల్లో మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నట్లు వ్యాపార వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

✦ సైనిక సంక్షేమ నిధికి రూ.50 కోట్లు

సాక్షి, హైదరాబాద్: సైనిక కుటుంబాల సంక్షేమ నిధికి తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ తరపున రూ.50 కోట్లు అందజేయాలని ఉద్యోగ సంఘాల జేఏసీ నిర్ణయించింది. భాగస్వామ్య సంఘాలకు చెందిన ఉద్యోగుల ఒక రోజు బేసిక్ వేతనాన్ని ఆ నిధికి త్వరలోనే అందజేయనుంది. గురువారం జరిగిన జేఏసీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. కొత్త పీఆర్‌సీ ఏర్పాటులో ఆలస్యమైతే మధ్యంతర భృతి ఇవ్వాలని అడిగే అంశంపైనా చర్చించినట్లు తెలిసింది.

✦ వేరుశనగకు మార్కెట్ ఫీజు మినహాయింపు

సాక్షి, హైదరాబాద్: గత ఏడాది ఖరీఫ్‌లో రాష్ట్ర నూనెగింజల అభివృద్ధి సమాఖ్య (ఆయిల్‌ఫెడ్) కొనుగోలు చేసిన వేరుశనగకు మార్కెట్ ఫీజును మినహాయిస్తూ వ్యవసాయ శాఖ కార్యదర్శి సి.పార్థసారథి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

✦ భూ పరిహారం అందక మనస్తాపం

గుండెపోటుతో వృద్ధురాలి మృతి



అశిలమ్మ (ఫైల్)

నవాబుపేట (జడ్చర్ల): భూపరిహారం అందకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ వృద్ధురాలు గుండెపోటుతో మృతి చెందింది. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం కారుకొండ గ్రామపంచాయతీ పరిధిలోని శామగడ్డ తండాలో ఈ ఘటన చోటు చేసుకుంది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నవాబుపేట మండల సమీపంలో నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్‌లో నాలుగు గ్రామాల రైతుల భూములు ముంపునకు గురవుతున్నాయి. ఇందులో పూర్తిగా ముంపునకు గురవుతున్న శామగడ్డ తండాకు చెందిన ఆశిలమ్మ (76)కు సర్వే నంబర్ 97లో 2.10 ఎకరాల భూమి ఉంది. నలభై ఏళ్లకు పైగా ఆమె కాస్తులో ఉన్నట్లు రికార్డులు చెబుతున్నా.. పట్టా మాత్రం మహబూబ్‌నగర్ మండలం ఫత్తేపూర్‌కు చెందిన జహంగీర్ పేరిట ఉంది. దీంతో కారుకొండ గ్రామ రెవెన్యూ కార్యదర్శి వెంకట్‌రెడ్డి ఖాస్తుదారును విస్మరించి ఆమెకు తెలియకుండా పట్టాదారు పేరుతో దాదాపుగా రూ.13.80 లక్షల పరిహారం చెక్కు సిద్ధం చేశాడు. ఏళ్ల తరబడి సాగు చేస్తున్న భూమి ముంపునకు గురవుతుండగా పరిహారం అందుతుందని ఎదురు చేస్తున్న ఆశిలమ్మకు.. అసలు విషయం తెలియడంతో ఆందోళనకు గురైంది.

చెక్కులు పెండింగ్‌లో పెట్టాం: తహసీల్దార్

అశిలమ్మ కాస్తులో ఉన్నా పట్టా మాత్రం జహంగీర్ పేరిట ఉంది. కాస్తుదారులు అప్పుడే పట్టా చేయించుకోవాల్సి ఉండేది. తాజాగా ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో పూర్తి విచారణ కోసం చెక్కులను పెండింగ్‌లో పెట్టాం.

మ్యాచ్ సిడ్నీలో.. బెట్టింగ్ సిటీలో

వ్యవస్థీకృతంగా వివిధ చోట్ల క్రికెట్ బెట్టింగ్ నిర్వహణ

- సబ్–బుకీలను ఏర్పాటు చేసుకున్న ప్రధాన బుకీ విశాల్
- స్టేడియం నుంచే నేరుగా అందుతున్న మ్యాచ్ వివరాలు
- మ్యాచ్ విశ్లేషణలందించే వెబ్‌సైట్లతోనూ మిలాఖత్
- 11 మంది నిందితుల అరెస్టు, రూ.44.3 లక్షలు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: గోవాను అడ్డాగా చేసుకుని హైదరాబాద్ కేంద్రంగా వ్యవస్థీకృత పంథాలో క్రికెట్ బెట్టింగ్స్ నిర్వహిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. గురువారం ఏక కాలంలో మూడు చోట్ల దాడులు చేసిన ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ టీమ్స్ 11 మంది సబ్–బుకీలు, ఏజెంట్లను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.44.3 లక్షల నగదు, హాట్‌లైన్ బాక్స్ తదితరాలను స్వాధీనం చేసుకున్నట్లు నగర ఇన్‌చార్జ్ కొత్వాల్ వీవీ శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ ముఠానే నగరంలో 70 శాతం బెట్టింగ్స్ నిర్వహిస్తున్న ట్లు గుర్తించామన్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ పి.రాధాకిషన్ రావుతో కలసి వివరాలు వెల్లడించారు.

దేశవ్యాప్త నెట్‌వర్క్‌లో భాగంగా...

దేశంలోని వివిధ ప్రాంతాల్లో నెట్‌వర్క్స్ ఏర్పాటు చేసుకుంటున్న బెట్టింగ్ గ్యాంగ్స్ ఎక్కడికక్కడ బడా బుకీల్ని ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇలాంటి ప్రధాన బుకీల్లో బేగం బజార్‌కు చెందిన విశాల్ లోథియా ఒకరు. ఇతడు గోవాను అడ్డాగా చేసుకుని బెట్టింగ్ దందా నడిపిస్తున్నాడు. అబిడ్స్ ప్రాంతంలో మనోజ్‌కుమార్ అగర్వాల్, బంజారాహిల్స్‌లో చిన్ని రాజేందర్, నారాయణగూడలో ముఖేశ్ కుమార్... ఇతడికి సబ్–బుకీలుగా వ్యవహరిస్తున్నారు. ప్రతి సబ్–బుకీ కొందరు ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నాడు.

పంటర్ల వాయిస్ రికార్డులు సైతం...

బెట్టింగ్ కాసే వ్యక్తి (పంటర్) నుంచి ఫోన్‌ను సబ్–బుకీ హాట్‌లైన్ బాక్సుకు మళ్లిస్తాడు. ఈ ఫోన్‌కాల్ అక్కడ రికార్డు అవుతుంది. పందెం ఓడిపోయిన తర్వాత తాను అలా బెట్టింగ్ కాయలేదని చెప్పకుండా ఇలా చేస్తుంటారు. మరోపక్క ప్రత్యేక పుస్తకాలు ఏర్పాటు చేసే సబ్–బుకీలు ప్రతి పంటర్‌కు ఓ పేజీ కేటాయిస్తూ డబ్బు చెల్లించాలా? వసూలు చేయాలా? అనేది అక్కడ నమోదు చేస్తుంటారు. ఈ వివరాలన్నీ ఎప్పటికప్పుడు ప్రధాన బుకీకి చేరవేస్తూ ఉంటారు. ఒక్కో మ్యాచ్‌కు ఒక్కో సబ్–బుకీ రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు పందాలు అంగీకరిస్తుంటాడు.



గురువారం హైదరాబాద్‌లో పట్టుబడిన నిందితులు, జప్తు చేసిన నగదు, సెల్‌ఫోన్లను మీడియాకు చూపుతున్న సిటీ పోలీస్ కమిషనర్ వీవీ శ్రీనివాసరావు

ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరుగుతున్న బిగ్ బాష్ లీగ్ టీ–20 మ్యాచ్ నేపథ్యంలో విశాల్.. సబ్–బుకీలైన మనోజ్, రాజేందర్, ముఖేశ్‌లతో బెట్టింగ్స్ అంగీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వర్‌రావు నేతృత్వంలో ఎస్సైలు బి.శ్రవణ్‌కుమార్, పి.చంద్రశేఖర్‌రెడ్డి, కేఎస్ రవి, కె.శ్రీకాంత్ తమ బృందాలతో అబిడ్స్, బంజారాహిల్స్, నారాయణగూడల్లోని స్థావరాలపై గురువారం ఏకకాలంలో దాడులు చేశారు.

ఏకకాలంలో మూడు చోట్ల దాడులు

ముగ్గురు సబ్–బుకీలు, ఎనిమిది మంది ఏజెంట్లను పట్టుకున్నారు. ప్రధాన బుకీ విశాల్ కోసం గాలిస్తున్నామని, అతడిని విచారిస్తే భారీ నెట్‌వర్క్ గుట్టురట్టవుతుందని వీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

అంతా హాట్‌లైన్ ద్వారానే...

బెట్టింగ్‌ల కోసం విశాల్ హాట్‌లైన్ బాక్సులు ఏర్పాటు చేసుకున్నాడు. ఒక్కో బాక్సుకు 36 ఫోన్లను కనెక్ట్ చేసే అవకాశముంటుంది. సబ్–బుకీ నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌ను తొలుత హోల్డ్‌లో పెడతాడు. ఇదే బాక్సుకి అనుసంధానించి ఓ బ్రాడ్ కాస్టింగ్ ఫోన్ కూడా ఉంటుంది. మ్యాచ్‌కు, టీవీలైవ్‌కు మధ్య కొంత సమయముంటుంది. దీన్ని ఆసరాగా చేసుకోవడానికి ఓ ముఠా సభ్యుడు గ్రౌండ్‌లోనే ఉంటాడు. ఫోర్లు, సిక్స్‌లు కొట్టినప్పుడు, వికెట్ పడినప్పుడు వెంటనే బ్రాడ్‌కాస్టింగ్ ఫోన్ ద్వారా వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రధానబుకీలకు ఏకకాలంలో సమాచారం ఇస్తాడు. అతడు దీని ఆధారంగా హోల్డ్‌లో ఉన్న కాల్స్ నుంచి అనువైనవి ఎంపిక చేసుకుని లాభాలు పొందుతాడు.

క్రెడిట్ దాటితే బ్లాక్‌లిస్ట్...

ఈ వ్యవహారంలో నేరుగా డబ్బు తీసుకువచ్చి పందాలు కాయరు. ప్రతి పంటర్‌కు కొంత క్రెడిట్ లిమిట్ ఉంటుంది. అది దాటితే మాత్రం ఏజెంట్లను పంటర్ల వద్దకు పంపి నగదు వసూలు చేయిస్తుంటారు. ఎవరైనా పంటర్ పందెం కాసిన సొమ్ము చెల్లించకపోతే అతడిని బ్లాక్ లిస్ట్‌లో పెడతారు. సాధారణంగా పంటర్లు కొన్ని వెబ్‌సైట్లలో వచ్చే విశ్లేషణల ఆధారంగా పందాలు కాస్తుంటారు. దీంతో ప్రధాన బుకీలు వెబ్‌సైట్లతోనూ మిలాఖత్ అయి తమకు అనుకూలంగా విశ్లేషణలు చేయిస్తున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ఓ రికార్డు

యుద్ధంలా ప్రాజెక్టు పనులు: మంత్రి హరీశ్‌రావు

- 95 శాతానికి పైగా టన్నెల్ పనులు పూర్తి
- జూలై చివరి నాటికి సిద్దిపేటకు గోదావరి జలాలు
- దశలవారీగా తెలంగాణలో సగభాగానికి సాగునీరు
- కాళేశ్వరం సొరంగం పనులు పరిశీలించిన మంత్రి

సాక్షి, సిద్దిపేట: గోదావరి జలాలను తెలంగాణలోని బీడు భూములకు మళ్లించేందుకు నిర్మించే కాళేశ్వరం ప్రాజెక్టు పనులు యుద్ధంగా భావించి చేపడుతున్నామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లాలోని చంద్లాపూర్‌లో నిర్మిస్తున్న రంగనాయక సాగర్ రిజర్వాయర్ పనులను, సొరంగ మార్గంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. టన్నెల్ ద్వారా సొరంగం తొలియడం, కాల్వల నిర్మాణ పనులను మంత్రి నేరుగా చూశారు. భూ అంతర్భాగంలో నిర్మించే కాల్వలు, సర్జిబుల్ సంప్ నిర్మాణాలు, అక్కడి నుంచి రిజర్వాయర్లకు నీరు మళ్లించడం మొదలైన అంశాలపై నీటి పారుదల శాఖ ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ పైభాగానికి సగటున 100 మీటర్ల లోతులో భూమిని తొలిచి సొరంగ మార్గం ద్వారా కాల్వల నిర్మాణాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇలాంటి పనులు ఇప్పటి వరకు దేశంలో ఎక్కడా చేపట్టలేదని ఇది ఒక రికార్డుగా మంత్రి అభివర్ణించారు. ప్రతీ పాయింట్ వద్ద మూడు షిఫ్టుల పని జరుగుతుందని, ప్రతిచోట షిఫ్టుకు 2 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని మంత్రి వివరించారు. 95 శాతానికి పైగా టన్నెల్ పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. జూలై చివరి నాటికి సిద్దిపేటకు.. అనంతరం దశలవారీగా తెలంగాణలో సగభాగానికి గోదావరి జలాలు పారిస్తామన్నారు. నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్ మాట్లాడుతూ.. రూ.80 వేల కోట్లతో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందని చెప్పారు. ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరు వరకు 49.15 కిలోమీటర్లు సొరంగ మార్గంలో ఇప్పటి వరకు 46 కిలోమీటర్ల పని జరిగిందని చెప్పారు. మిడ్‌మానేరు నుంచి 32 కిలోమీటర్ల సొరంగ మార్గం కాలువ పనులకు గాను ఇప్పటి వరకు 31 కిలోమీటర్ల పని పూర్తి చేసి ఫినిషింగ్ వర్క్ జరుగుతోందని వివరించారు. ఇందుకోసం ఇప్పటి వరకు రూ.22 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. జూలై చివరి నాటికి ఎల్లంపల్లి నుంచి కొండ పోచమ్మ సాగర్ వరకు గోదావరి నీటిని పారిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్ వరకు 600 మీటర్ల ఎత్తుకు గోదావరి జలాలు తీసుకెళ్లేందుకు అధునాతన పరిజ్ఞానంతో పంప్‌హౌస్‌లు, మోటార్లు బిగిస్తున్నామని, వీటిని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని ఆయన వివరించారు.



గురువారం సొరంగం పనులను పరిశీలించి వస్తున్న మంత్రి హరీశ్‌రావు

స్కూళ్లలో ఎన్జీవోలు, కలెక్టర్ల జోక్యాన్ని నివారించండి

ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా కలెక్టర్లు, ఎన్జీవోలు తమ సొంత పద్ధతులను అమలు చేయాలని ఆదేశించడం వల్ల టీచర్లపై పనిభారం పెరుగుతోందని, విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆరోపించింది. ఎన్జీవోలు, కలెక్టర్ల అనుచిత జోక్యాన్ని నివారించాలని కమిటీ నేతలు గురువారం విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్యను కలసి విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయుల ఆకస్మిక సెలవు మంజూరు అధికారం ప్రధానోపాధ్యాయులకే ఉంచాలన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంల ద్వారా ఎంఈవోలకు పంపడం ఆచరణ సాధ్యం కాదని పేర్కొన్నారు. ఆ ఉత్తర్వులను రద్దు చేయాలనే డిమాండ్‌తో శుక్ర, శనివారాల్లో(19, 20న) అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రంజీవ్ ఆర్ ఆచార్యను కలిసిన వారిలో పోరాట కమిటీ నేతలు సీహెచ్.రాములు, చావ రవి, బి.కొండల్‌రెడ్డి, ఎం.రఘుశంకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నిధులు రాకపోతే కేంద్రంపై నిందలా?: కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కేంద్ర పథకాల కింద వచ్చే నిధులను తమ ఘనతగా చెప్పుకుంటున్న టీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఏవైనా కారణాలతో నిధులు ఆగిపోతే నిందలు వేస్తోందని బీజేపీ శాసనసభాపక్ష నేత కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం ఆయన సచివాలయం మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీల మేరకు కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు పలు యూనివర్సిటీలు మం జూరు చేసిందని, తెలంగాణకు రావాల్సిన నిధులు, వాటాలు ఇస్తోందని అన్నారు. అంతకు ముందు ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను కలసి రైతులకు పూర్తిస్థాయిలో రుణాలు ఇవ్వాలని కోరారు.

కేంద్రంలో ప్రశంసలు.. ఇక్కడేమో విమర్శలా?

- రాష్ట్ర బీజేపీ నేతలపై కడియం మండిపాటు
- మోత్కుపల్లి వ్యాఖ్యలను స్వాగతిస్తున్నా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో అమలుచేస్తున్న పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రశంసించి, మిగతా రాష్ట్రాల్లో అమలు చేయాలని సూచిస్తుంటే, రాష్ట్ర బీజేపీ నేతలు మాత్రం విమర్శిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. సచివాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో స్కూళ్లను మూసివేయడంగానీ, విలీనం చేయడంగానీ లేదన్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత తాము చేపట్టిన చర్యల వల్ల డ్రాపవుట్స్‌లో జాతీయ సగటుకంటే తెలంగాణ సగటు తక్కువ ఉందని చెప్పారు. 40 వేల ఉపాధ్యాయుల ఖాళీలు ఎక్కడ ఉన్నాయో విమర్శిస్తున్నవాళ్లే చూపాలన్నారు. టీడీపీని, టీఆర్‌ఎస్‌లో విలీనం చేయాలన్న టీటీడీపీ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు వ్యాఖ్యలను స్వాగతిస్తున్నానన్నారు.

విద్యాశాఖపై జవదేకర్ ప్రశంసలు

ఇటీవల ఢిల్లీలో జరిగిన సెంట్రల్ అడ్వయిజరీ బోర్డ్ ఆన్ ఎడ్యుకేషన్ (కేబ్) సమావేశంలో రాష్ట్ర విద్యా కార్యక్రమాలపై ప్రజెంటేషన్ ఇచ్చానని కడియం తెలిపారు. వాటిని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ ప్రశంసించడమే కాకుండా, అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని విద్యాశాఖ మంత్రుల సమావేశంలో సూచించారన్నారు. గురుకుల పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ బాలికలకు డిగ్రీ రెసిడెన్షియల్ కాలేజీలు, బాలికలకు ప్రత్యేకంగా హెల్త్ అండ్ హైజీన్ కిట్స్, గురుకులాల్లో అమలు చేస్తున్న మెనూ, ఉన్నత విద్యలో బోగస్ అడ్మిషన్లు అరికట్టేందుకు తెచ్చిన దోస్త్, బయో మెట్రిక్ మిషన్ల ద్వారా అటెండెన్స్ తీసుకోవడం, విద్యార్థుల అడ్మిషన్లను ఆధార్‌కార్డుతో అనుసంధానించడం వంటివి అందులో ఉన్నాయని పేర్కొన్నారు. కొత్త జిల్లా కేంద్రాల్లో కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఐఐఎం, ట్రిపుల్ ఐటీ, ట్రైబల్ యూనివర్సిటీ, రీజినల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ కూడా తెలంగాణకు ఇవ్వాలని కేసీఆర్ ప్రధానమంత్రికి లేఖ రాసినా స్పందన లేదని, కేంద్రం తెలంగాణపట్ల చిన్న చూపు చూస్తోందని కేబ్ సమావేశంలోనే చెప్పానన్నారు. తెలంగాణ వచ్చాక వచ్చిన కొత్త సంస్థలేమిటో బీజేపీ నేతలే చెప్పాలని ప్రశ్నించారు. కేంద్రానికి తామిచ్చిన వినతి పత్రాల ప్రతులను లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, దత్తాత్రేయకు పంపుతున్నామని, వారి పలుకుబడి ఉపయోగించి ఆ సంస్థలు తెలంగాణకు తీసుకొస్తే మంచిదన్నారు. విద్యాశాఖలో కేవలం 13 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, చెప్పారు. ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణపై ప్రభుత్వం వివక్ష చూపుతోందా? అని విలేకరులు ప్రశ్నించగా, ప్రభుత్వానికి ఎవరిపైనా కక్షలేదని పేర్కొన్నారు.

24 గంటలా? 9 గంటలా?

రోజంతా విద్యుత్ సరఫరాపై రైతుల అభిప్రాయ సేకరణ

- సర్వే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న డిస్కంలు
- రైతుల నుంచి వ్యతిరేకత నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
- మార్చి వరకు కొనసాగిస్తే భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం
- పంటలు ఎండిపోతాయనే భయాందోళనల్లో రైతాంగం

'సార్.. కొత్తగూడెం సబ్ స్టేషన్ నుంచి లక్ష్మీపురం ఫీడర్‌కు విద్యుత్ సరఫరా చేసే లైన్లను గుర్తు తెలియని వ్యక్తులు మూడు రోజులుగా బ్రేక్‌డౌన్ అయ్యేలా చేస్తున్నారు. రోజూ సాయంత్రం బ్రేక్‌డౌన్ అవుతున్నట్లు లైన్‌మన్ తెలిపారు. వెళ్లి చూడగా 24 గంటల కరెంట్ వల్ల మూడు రోజులుగా బోర్లలో నీరు ఊరడం లేదని.. పాత కండక్టర్ ముక్కను పోల్‌కు తగిలేట్టుగా లైన్ మీద వేసి బ్రేక్‌డౌన్ అయ్యేలా చేస్తున్నారు'

– విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు వాట్సాప్‌లో మిర్యాలగూడ రూరల్ ఏఈ ఇటీవల పంపిన సందేశమిది.

సాక్షి, హైదరాబాద్

వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచనలో పడింది. క్షేత్రస్థాయిలో రైతాంగం నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో 24 గంటల సరఫరా కొనసాగింపుపై పునఃసమీక్షించేందుకు సిద్ధమైంది. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఆ తర్వాత ఓ నిర్ణయాన్ని ప్రకటించే అవకాశముంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరాపై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు సర్వే నిర్వహించనున్నాయి. 24 గంటల విద్యుత్ కొనసాగించాలా, లేక గతంలో మాదిరి పగటి పూటే 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తే సరిపోతుందా అనే అంశంపై రైతుల అభిప్రాయాన్ని తీసుకోనున్నాయి. 24 గంటల సరఫరాతో సమస్యలు ఎదురవుతున్నాయా అనే అంశంపైనా రైతుల నుంచి ఆరా తీయనున్నాయి.

ప్రత్యేక నమూనాలో సర్వే..

అభిప్రాయ సేకరణను పకడ్బందీగా నిర్వహించేందుకు డిస్కంలు ఓ ప్రత్యేక నమూనాలో సర్వే ఫారాన్ని సిద్ధం చేశాయి. సర్వేలో భాగంగా 24 గంటల విద్యుత్‌పై అభిప్రాయం తెలిపే రైతు పేరు, ఫోన్ నంబర్, పొలం సర్వే నంబర్, విస్తీర్ణం, ఏ రకం పంట తదితర వివరాలను సేకరించనున్నారు. ఈ సర్వేలో అత్యధిక శాతం మంది రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఓ నిర్ణయం ప్రకటించే అవకాశాలున్నాయి. అసెంబ్లీ సమావేశా ల్లో కూడా 24 గంటల విద్యుత్ సరఫరాపై ఎమ్మెల్యేల అభిప్రాయాన్ని కోరాలని భావిస్తోంది.



'రబీ'ఎండిపోయే ప్రమాదం

ఇటీవలి కాలంలో రైతులు గరిష్టంగా 600 అడుగుల లోతు వరకు బోరు బావులను తవ్వుతున్నారు. ఏళ్ల కిందటి బోర్లు 100–200 అడుగుల లోతులోనే ఉండటంతో కొత్త బోర్ల దెబ్బకి అవి ఎండిపోతున్నాయి. అధిక సామర్థ్యం ఉన్న మోటార్లతో పెద్ద రైతులు భూగర్భ జలాలను తోడుతుండటంతో చుట్టుపక్కల ప్రాంతాల్లోని చిన్న రైతుల బోర్లకు నీళ్లు అందక అడుగంటిపోతున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో వచ్చే మార్చి వరకు 24 గంటల విద్యుత్‌ను కొనసాగిస్తే భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయి రబీ పంటలు ఎండిపోతాయని రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల భూగర్భ జలాల సమస్య ఏర్పడిందని రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. 24 గంటల విద్యుత్ వద్దని కొన్ని చోట్ల రైతులు స్థానిక విద్యుత్ అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. వరుసగా మూడు, నాలుగు రోజులపాటు కొన్నిచోట్ల బోర్లలో నీళ్లు ఊరడం లేదు. దీంతో రైతులు విద్యుత్ సరఫరా వైర్లపై కండక్టర్ వైరు ముక్కలు విసిరేసి విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగిస్తున్నారని క్షేత్రస్థాయి అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు.

ప్రతిష్టాత్మకంగా ప్రారంభం.. వ్యతిరేకత

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని జనవరి 1 నుంచి సాగుకు 24 గంటల విద్యుత్ సరఫరాను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఎన్నో నెలల ముందు నుంచి ప్రభుత్వం దీనికి ఏర్పాట్లు చేసింది. రూ.24 వేల కోట్లను వెచ్చించి రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరాకు వీలుగా రాష్ట్రంలో విద్యుత్ ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచింది. కేసీఆర్ సైతం ముందస్తు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించి పలుసార్లు సమీక్షలు జరిపారు. దీంతో ఒక్కసారిగా యావత్ దేశం దృష్టి రాష్ట్రంపై పడింది. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ కేసీఆర్‌కు లేఖ రాశారు. గుజరాత్, యూపీ, పంజాబ్ తదితర రాష్ట్రాల అధికారులు రాష్ట్ర అధికారులకు ఫోన్ చేసి ఆరా తీశారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రతిష్ట పెరిగిందని భావిస్తున్న తరుణంలో క్షేత్రస్థాయిలో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో ప్రభుత్వం పునరాలోచన జరపాల్సిన పరిస్థితి నెలకొంది.



ముంబై దాడిలో తల్లిదండ్రులను కోల్పోయిన మోషెను ముద్దాడుతున్న నెతన్యాహు

మన బంధం స్వర్గంలోనే నిశ్చయం

భారత్‌–ఇజ్రాయెల్‌ బంధంపై ఇజ్రాయెల్‌ ప్రధాని నెతన్యాహు

ముంబై: భారత–ఇజ్రాయెల్‌ బంధం స్వర్గంలోనే నిశ్చయమైందని ఇజ్రాయెల్‌ ప్రధాని నెతన్యాహు పేర్కొన్నారు. మానవత్వం, ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్య విలువలపై ఈ బంధం ఆధారపడి ఉందన్నారు. భారత పర్యటనకు వచ్చిన నెతన్యాహు గురువారం ముంబైలో ఏర్పాటుచేసిన భారత్‌–ఇజ్రాయెల్‌ వ్యాపారవేత్తల సదస్సులో మాట్లాడారు. ఇజ్రాయెల్‌ క్లిష్టపరిస్థితులనుంచి పైకెదిగి తన దిశను మార్చుకుని ప్రయాణిస్తున్నట్లే.. భారత్‌ మోదీ నాయకత్వంలో ఇదే విధంగా ముందుకెళ్తోందన్నారు. ఇరుదేశాల మధ్య లోతైన వ్యక్తిగత స్నేహముందన్నారు. భారత సంస్కృతి సాంప్రదాయాలంటే తనకు ఎనలేని గౌరవమని వెల్లడించారు. 'ప్రపంచంలోని పురాతన సంస్కృతులున్న ప్రజాస్వామ్య దేశాలు మనవి. మనం స్వాతంత్ర్యాన్ని, మానవత్వాన్ని పంచుకున్నాం. మనం అసలైన భాగస్వాములం. అందుకే ఈ బంధం స్వర్గంలోనే నిర్ణయమైంది' అని నెతన్యాహు వ్యాఖ్యానించారు. 2008 ముంబై దాడులతో రక్తమోడిన ఛబాద్‌ భవనాన్ని నెతన్యాహు సందర్శించారు. నారీమన్‌ హౌజ్‌ వద్ద ఆనాటి మృతులకు ఆయన నివాళులర్పించారు. ముంబై దాడుల్లో తల్లిదండ్రులను కోల్పోయిన 11 ఏళ్ల మోషే హోల్ట్‌జ్‌బర్గ్‌ను కలిసి మాట్లాడారు.

రజనీతో జట్టు కట్టను: కమల్‌



సాక్షి ప్రతినిధి, చెన్నై: ఆధ్యాత్మిక భావాలు, సిద్ధాంతాలతో నటుడు రజనీకాంత్‌ ప్రారంభించబోయే రాజకీయ పార్టీతో తాను కలసి పనిచేసే అవకాశం లేదని నటుడు కమల్‌ హసన్‌ చెప్పారు. దివంగత రాష్ట్రపతి కలాం ఈ దేశం గురించి ఎన్నో కలలు కనేవారని, తనకూ అలాంటి కలలే ఉన్నాయని చెప్పారు. గతంలో ఒకసారి విమానంలో కలాంతో కలసి ప్రయాణం చేసే అవకాశం వచ్చిందని, ఆ సందర్భంగా అనేక అంశాలపై తాము మాట్లాడుకున్నామని తెలిపారు. ద్రవిడ సిద్ధాంతం తమిళనాడుకు మాత్రమే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా వ్యాపించి ఉందని వ్యాఖ్యానించారు. కమల్‌ తన రాజకీయ ప్రస్థానాన్ని రామేశ్వరంలోని దివంగత కలాం ఇంటి నుంచి ప్రారంభించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

మైక్రోవేవ్‌ ఓవెన్‌.. ఓ కాలుష్య బాంబు

లండన్‌: వంటింట్లో వాడుతున్న మైక్రోవేవ్‌ ఓవెన్‌ కాలుష్యాన్ని వెదజల్లే బాంబు అని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కారు నుంచి వెలువడే కార్బన్‌ డయాక్సైడ్‌ కన్నా ఓవెన్‌ల నుంచి వెలువడే కార్బన్‌ డయాక్సైడే అధికమని తాజా పరిశోధనలో తేలింది. యూరప్‌లో ఒక్క ఏడాది కాలంలో ఓవెన్ల నుంచి 7.7 మిలియన్ల టన్నుల కార్బన్‌ డయాక్సైడ్‌ వెలువడుతుంది. ఇది ఒక ఏడాదిలో 68 లక్షల కార్ల నుంచి వెలువడే కార్బన్‌ డయాక్సైడ్‌తో సమానం. అక్కడ గంటకు 9.4 టెరావాట్ల విద్యుత్‌ను ఓవెన్లు వాడేస్తున్నాయి. ఇది ఏడాది కాలంలో 3 పెద్ద గ్యాస్‌ విద్యుత్‌ ప్లాంట్లు ఉత్పత్తి చేసే విద్యుత్‌తో సమానం. ఓవెన్ల తయారీ దశ నుంచి వ్యర్థాలుగా మారే దశ వరకు పర్యావరణంపై చూపే దుష్ప్రభావాన్ని అంచనా వేసేందుకు బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్‌ మాంచెస్టర్‌కు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనాన్ని చేపట్టారు.

బస్సు ప్రమాదంలో 52 మంది సజీవ దహనం



ఆస్తానా: కజకిస్తాన్‌లో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో 52 మంది సజీవ దహనమయ్యారు. గురువారం జరిగిన ఈ దారుణ ఘటనలో మృతులంతా ఉజ్బెకిస్తాన్‌కు చెందిన వారే. కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌ నుంచి రష్యాలోని సమారాకు వీరంతా ఉపాధి కోసం వెళ్తున్నారు. ఘటన జరిగిన సమయంలో బస్సులో మొత్తం 55 మంది ప్రయాణికులతోపాటు ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. కిక్కిరిసి ఉన్న బస్సులో ఒక్కసారిగా మంటలు వ్యాపించటంతో బయటపడే క్రమంలో తొక్కిసలాట జరిగిందని, దీంతో చాలామంది లోపలే ఇరుక్కుని ప్రాణాలు కోల్పోయారని కజకిస్తాన్‌ పేర్కొంది.

మన్మోహన్‌ మౌనాన్ని ప్రశ్నించిన రాజా

న్యూఢిల్లీ: 2జీ స్పెక్ట్రం కుంభకోణంలో అప్పటి టెలికం పాలసీని సమర్థించకుండా మాజీ ప్రధాని మన్మోహన్‌ ఉద్దేశపూర్వక మౌనం వహించడాన్ని టెలికం మాజీ మంత్రి ఏ.రాజా ప్రశ్నించారు. 2జీ కుంభకోణం వాస్తవాల పేరిట ఆయన రాసిన పుస్తకం '2జీ సాగా అన్‌ఫోల్డ్స్‌'లో పలు కీలక విషయాల్ని ప్రస్తావించారు. కేసు విచారణ సమయంలో రాసిన ఈ పుస్తకంలో అప్పటి కాగ్‌ వినోద్‌ రాయ్‌ వ్యవహార శైలిని తప్పుపట్టారు. ఈ పుస్తకం విడుదల కావాల్సి ఉంది. స్పెక్ట్రం కేటాయింపులపై సీబీఐ దాడులకు సంబంధించి మన్మోహన్‌కు కూడా ఎలాంటి సమాచారం లేదని రాజా తెలిపారు. కంప్ట్రోలర్‌ అండ్‌ ఆడిటర్‌ జనరల్‌ కార్యాలయం వినోద్‌ రాయ్‌తో రాజీపడి పనిచేసిందని, స్పెక్ట్రం కేటాయింపుల ఖాతాల తనిఖీ సందర్భంగా వేరే ఉద్దేశాలు పెట్టుకుని రాజ్యాంగ విధుల నిర్వహణలో రాయ్‌ అతిగా వ్యవహరించారని రాజా ఆరోపించారు. కొత్త వారికి లైసెన్స్‌లివ్వడం టెలికం లాబీలకు ఇష్టం లేదని తెలిపారు.

పాక్‌ కాల్పుల్లో బీఎస్‌ఎఫ్‌ జవాన్‌ మృతి



జమ్మూ/సాక్షి, చెన్నై: భారత్‌తో సరిహద్దు వెంట పాకిస్తాన్‌ జరిపిన కాల్పుల్లో ఒక బీఎస్‌ఎఫ్‌ జవాను, మరో యువతి ప్రాణాలు కోల్పోయారు. కశ్మీర్‌లోని సరిహద్దు వెంట ఆర్‌ఎస్‌ పురా, ఆర్నియా, రామ్‌గఢ్‌ సెక్టార్లలోని భారత ఔట్‌ పోస్టులపై బుధవారం రాత్రి నుంచి పాక్‌ కాల్పులు ప్రారంభించిందని బీఎస్‌ఎఫ్‌ అధికారి ఒకరు తెలిపారు. ఈ కాల్పుల్లో బీఎస్‌ఎఫ్‌ 78వ బెటాలియన్‌కు చెందిన తమిళనాడు వాసి, హెడ్‌కానిస్టేబుల్‌ ఎ.సురేశ్‌ చనిపోయారు. ఇంకా సరిహద్దులో కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు.

మళ్లీ మోదీయే బాద్‌షా!

రిపబ్లిక్‌, సీ–వోటర్‌ సర్వేలో వెల్లడి

- ఎన్డీయే కూటమికి 335 సీట్లు.. యూపీఏకు 89
- ఏపీలో వైఎస్సార్‌సీపీకే మెజారిటీ సీట్లు
- టీడీపీ–బీజేపీ కూటమికి వ్యతిరేక పవనాలు
- తెలంగాణలో టీఆర్‌ఎస్‌కు 11, బీజేపీకి 3, కాంగ్రెస్‌ 2 సీట్లు
- తమిళనాడులో రజనీకాంత్‌కు భారీ మెజారిటీ





న్యూఢిల్లీ: ఇప్పటికిప్పుడు దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరిగితే మళ్లీ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి అధికారాన్ని నిలబెట్టుకుంటుందని రిపబ్లిక్‌ టీవీ, సీ–వోటర్‌ సర్వే పేర్కొంది. మొత్తం 543 స్థానాల్లో 335 సీట్లను ఈ కూటమి చేజిక్కించుకుంటుందని వెల్లడించింది. అటు కాంగ్రెస్‌ పార్టీ నేతృత్వంలోని యూపీఏ 89 చోట్ల విజయం సాధిస్తుందని సర్వే అభిప్రాయపడింది. ఇటు, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమికి, అధికార టీడీపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయనీ సర్వే తెలిపింది. రాజకీయ వాతావరణం ప్రతిపక్ష వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీకి అనుకూలంగా మారుతోందని పేర్కొంది. ఏపీలోని 25 ఎంపీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ 13 చోట్ల విజయం సాధిస్తుందని.. టీడీపీ భాగస్వామిగా ఉన్న ఎన్డీయే 12 స్థానాలకే పరిమితమవుతుందని తెలిపింది. గతంలో కంటే వైఎస్సార్‌సీపీ అదనంగా ఐదు స్థానాలు గెలుచుకోనుందని పేర్కొంది. ఇటు తెలంగాణ (17 స్థానాలు)లో టీఆర్‌ఎస్‌ 11 స్థానాల్లో, బీజేపీ 3, కాంగ్రెస్‌ రెండు చోట్ల, ఎంఐఎం ఒక స్థానంలో విజయం సాధిస్తాయని వెల్లడించింది.

తమిళనాట రజనీమాట... అమ్మలేని లోటు స్పష్టంగా కనబడుతున్న తమిళనాడు రాజకీయాలను ఇకపై రజనీకాంత్‌ శాసిస్తారని సర్వే అభిప్రాయపడింది. ఈ రాష్ట్రంలోని 39 ఎంపీ స్థానాల్లో రజనీకాంత్‌ పార్టీకి 23 సీట్లు వస్తాయని పేర్కొంది. ద్రవిడ రాజకీయాలను కాదని అన్నాడీఎంకే, డీఎంకే వంటి పక్షాలను పక్కనపెట్టి 33 శాతం తమిళ ఓటర్లు రజనీకి పట్టంగడతారని తెలిపింది. అటు డీఎంకే 14 సీట్లతో రెండో స్థానంలో అన్నాడీఎంకే రెండు చోట్ల విజయం సాధిస్తుందని అంచనా వేసింది. ఒకవేళ రజనీ సార్వత్రిక ఎన్నికల రంగంలోకి దిగని పక్షంలో డీఎంకే 32 సీట్లను గెలుచుకుంటుందని.. అప్పుడు అన్నాడీఎంకే 6 సీట్లు, బీజేపీ ఒకచోట విజయం సాధిస్తాయని పేర్కొంది.

మోదీకే పగ్గాలు

కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని సర్వే వెల్లడించింది. ప్రధాని మోదీ చరిష్మా కారణంగా 41.4 శాతం ఓట్లతో ఎన్డీయేకి 335 సీట్లు వస్తాయని పేర్కొంది. యూపీఏ 27.7 శాతం ఓట్లతో 89 సీట్లు సాధిస్తుందని పేర్కొంది. అయితే బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్‌, రాజస్తాన్‌, ఛత్తీస్‌గఢ్‌, మధ్యప్రదేశ్‌, జార్ఖండ్‌ రాష్ట్రాల్లో బీజేపీ ఓట్ల శాతంతోపాటు సీట్లలోనూ స్వల్ప తగ్గుదల కనబడుతోంది. ఇక్కడ కాంగ్రెస్‌, బీజేపీయేతర ఇతర పార్టీలు స్వల్ప ఆధిక్యాన్ని పొందే అవకాశముందని సర్వే పేర్కొంది. మిగిలిన ప్రాంతాల్లో బీజేపీ దూసుకుపోతుండటంతో ఇక్కడ కోల్పోయిన స్థానాలను మిగిలిన ప్రాంతాల్లో గెలుచుకునే అవకాశం ఉందని తెలిపింది. అటు ప్రధాని పీఠంపై ఎవరు కూర్చోవాలన్న విషయంలో మోదీకి 62.7 శాతం మంది ఓటేయగా.. రాహుల్‌ 12.6 శాతం మంది అభిమానాన్ని పొందగలిగారు.

కన్నడ, మరాఠీ రాష్ట్రాల్లోనూ..

పొరుగున ఉన్న కర్ణాటకలోనూ బీజేపీ స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరచనుందని అంచనా. మొత్తం 28 సీట్లలో బీజేపీ 22 చోట్ల, యూపీఏ 5, జేడీఎస్‌ ఒక స్థానంలో గెలుస్తుందని సర్వే పేర్కొంది. మహారాష్ట్రలో మాత్రం ఎన్డీయేకు సర్వే భారీ మెజారిటీని కట్టబెట్టింది. మొత్తం 48 సీట్లలో ఎన్డీయేకే 44 స్థానాలొస్తాయని పేర్కొంది. ఇక్కడ కాంగ్రెస్‌కు 2, ఎన్సీపీకి రెండు సీట్లు దక్కుతాయని తెలిపింది. అయితే కాంగ్రెస్‌, ఎన్సీపీ కలిసి పోటీచేస్తే ఎన్డీయేకే 35 సీట్లే రావొచ్చని అభిప్రాయపడింది. దీనికితోడు ఎన్డీయే భాగస్వామ్యపక్షమైన శివసేన నిత్యం కత్తులు నూరుతున్న నేపథ్యంలో బీజేపీ, శివసేన వేర్వేరుగా పోటీ చేస్తే.. మరిన్ని తక్కువ సీట్లు రావొచ్చని అభిప్రాయపడింది. ఈశాన్యరాష్ట్రాలు, ఉత్తరాఖండ్‌, హిమాచల్‌ ప్రదేశ్‌లలో బీజేపీ దాదాపుగా అన్ని సీట్లను గెలుచుకుంటుందని సర్వే పేర్కొంది. అయితే ఐఎన్‌ఎల్‌డీ, ఎన్సీపీ, జార్ఖండ్‌ ముక్తిమోర్చా, తృణమూల్‌ కాంగ్రెస్‌, జేడీఎస్‌ వంటి ప్రాంతీయ పార్టీలతో ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌ పొత్తుపెట్టుకుంటే యూపీఏ సీట్లలో పెరుగుదల కనబడుతుందని సర్వే పేర్కొంది.

ప్రత్యర్థుల కోటల్లో కమలవికాసం

ఇన్నాళ్లుగా బీజేపీ విస్తరించేందుకు ఇబ్బందికరంగా ఉన్న ప్రాంతాల్లో 2019 ఎన్నికల్లో ఈ పార్టీ గణనీయమైన సీట్లు సాధించేందుకు వీలున్నట్లు అర్థమవుతోంది. గత ఎన్నికల్లో ఒడిశాలో ఒక సీటు మాత్రమే గెలిచిన బీజేపీ ఈసారి 13 చోట్ల విజయం సాధిస్తుందని.. అధికారంలో ఉన్న నవీన్‌ పట్నాయక్‌ (బీజేడీ) పార్టీ సీట్లలో నుంచి బీజేపీ భారీగా లాభం పొందుతుందని సర్వే తెలిపింది. అటు పశ్చిమ బెంగాల్‌ (42)లో బీజేపీ 12 సీట్లు గెలుచుకునే అవకాశం ఉండగా.. అధికార తృణమూల్‌ 29 సీట్లలో గెలుస్తుందని అంచనా వేసింది. అత్యధిక ఎంపీ సీట్లున్న యూపీలో ఈ సారి బీజేపీ ఆధిపత్యానికి యూపీఏ గండికొట్టనుంది. మొత్తం 80 సీట్లలో బీజేపీ 60 స్థానాలను గెలుచుకోనుండగా యూపీఏ 18 చోట్ల, ఇతరులు రెండుచోట్ల గెలుస్తారని సీ–వోటర్‌, రిపబ్లిక్‌ సర్వే వెల్లడించింది. మొత్తంమీద ఒక్క పంజాబ్‌లోనే ఎన్డీయే కన్నా యూపీఏ ఎక్కువ స్థానాలు గెలుచుకోనున్నట్లు సమాచారం.

29 వస్తువులపై పన్నుకోత

- 54 సేవలపై పన్ను తగ్గింపు
- వ్యాపారుల రిటర్నుల సరళీకరణపై చర్చ
- జీఎస్టీ పరిధిలోకి పెట్రోల్‌పై తదుపరి భేటీలో చర్చిస్తాం: జైట్లీ



మీడియాతో మాట్లాడుతున్న జైట్లీ

న్యూఢిల్లీ: సామాన్యులకు మరింత ఊరటనిచ్చేలా జీఎస్టీ (వస్తు, సేవల పన్ను) మండలి మరోసారి పన్ను రేట్లను తగ్గించింది. తాజాగా 29 వస్తువులు, 54 సేవలపై పన్ను రేటును తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. సవరించిన పన్ను రేట్లు ఈ నెల 25 నుంచే అమల్లోకి రానున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ నేతృత్వంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన జీఎస్టీ మండలి 25వ సమావేశం గురువారం ఢిల్లీలో జరిగింది.

రిటర్నుల సరళీకరణపై చర్చ

వ్యాపారులు నెలకు ఒకటే రిటర్నును దాఖలు చేసేలా జీఎస్టీ రిటర్నుల విధానాన్ని సరళీకృతం చేయడంపై జీఎస్టీ మండలి చర్చించింది. జీఎస్టీ రిటర్నులను సరళతరం చేయడంపై ఇన్ఫోసిస్‌ నాన్‌–ఎగ్జిక్యూటివ్‌ చైర్మన్‌ నీలేకని జీఎస్టీ మండలికి ఓ ప్రజెంటేషన్‌ ఇచ్చారు. ప్రస్తుతం వాణిజ్య సంస్థలు జీఎస్టీఆర్‌–3బీ, జీఎస్టీఆర్‌–1 అంటూ రెండు రిటర్నులను దాఖలు చేస్తుండగా, ఇకపై 3బీతోపాటు ఇన్‌వాయిస్‌లు కూడా సమర్పిస్తే సరిపోతుందా అన్నదానిపై ఆలోచిస్తున్నామని జైట్లీ చెప్పారు. ముడి చమురు, పెట్రోల్‌, డీజిల్‌, సహజ వాయువు, విమాన ఇంధనం తదితరాలను కూడా జీఎస్టీ పరిధిలోకి తెచ్చే అంశంపై తదుపరి జీఎస్టీ మండలిలో చర్చించే అవకాశం ఉందని చెప్పారు. అంతర్రాష్ట్ర సరుకు రవాణా కోసం ఎలక్ట్రానిక్‌ వే బిల్లు విధానం ఫిబ్రవరి 1 నుంచి అమలవుతుందనీ, 15 రాష్ట్రాలు తమ తమ రాష్ట్రాల్లో సరుకు రవాణాకు సైతం ఈ–వే బిల్లును ఆ రోజు నుంచే అమలు చేస్తామని చెప్పాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం కేవలం వాణిజ్య సంస్థలు ఇస్తున్న సమాచారం ఆధారంగానే జీఎస్టీ వసూలవుతోందనీ, పన్ను ఎగవేతదారులను నిరోధించేలా చర్యలు తీసుకుంటే ఆదాయం పెరుగుతుందని అన్నారు. కాగా, వజ్రాలు, విలువైన రాళ్లపై పన్నును 3 నుంచి 0.25 శాతానికి తగ్గించారు. అలాగే థీమ్‌ పార్క్‌ టికెట్లు, దర్జీ సేవలపై కూడా పన్ను రేట్లు తగ్గాయి.

28 నుంచి 18 శాతానికి తగ్గినవి

- సెకండ్‌ హ్యాండ్‌లో కొనే పెద్ద, మధ్యస్థాయి కార్లు, ఎస్‌యూవీలు (మిగతా అన్ని రకాల సెకండ్‌ హ్యాండ్‌ మోటార్‌ వాహనాలపై పన్నును 28 నుంచి 12 శాతానికి తగ్గించారు) • జీవ ఇంధనాలతో నడిచే, ప్రజా రవాణాకు ఉపయోగించే బస్సులు.

18 నుంచి 12 శాతానికి తగ్గినవి

- చక్కెర ఉండే స్వీట్లు, చాక్లెట్లు, 20 లీటర్ల తాగునీటి సీసాలు, ఎరువుగా ఉపయోగించే ఫాస్ఫరిక్‌ యాసిడ్‌, బయో డీజిల్‌, వేప ఆధారిత పురుగు మందులు, కొన్ని రకాల జీవ–పురుగుమందులు, డ్రిప్‌ల వంటి నీటిపారుదల పరికరాలు, స్ప్రింక్లర్లు, స్ప్రేయర్లు.

18 నుంచి 5 శాతానికి తగ్గినవి

- చింతగింజల పొడి, మెహందీ కోన్లు, ప్రైవేటు డిస్ట్రిబ్యూటర్లు సరఫరా చేసే ఎల్‌పీజీ సిలిండర్లు.

12 నుంచి 5 శాతానికి తగ్గినవి

వెదురు/ఎండుగడ్డితో తయారైన బుట్టలు తదితర వస్తువులు, అల్లికతో తయారైన వస్తువులు, వెల్వెట్‌ వస్త్రాలు

సున్నా శాతానికి తగ్గిన వస్తువులు

విబూది, వినికిడి పరికరాల విడి భాగాలు, తవుడు

'ఫేక్‌ న్యూస్‌' అవార్డుల్ని ప్రకటించిన ట్రంప్‌

న్యూయార్క్‌ టైమ్స్‌ కథనానికి మొదటి స్థానం

వాషింగ్టన్‌: తనకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నాయని ఆరోపిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ కొన్ని మీడియా సంస్థలకు 'ఫేక్‌ న్యూస్‌ అవార్డుల్ని' ప్రకటించారు. ఈ ఫేక్‌ న్యూస్‌ అవార్డుల జాబితాలో ద న్యూయార్క్‌ టైమ్స్‌ మొదటి స్థానం దక్కించుకోగా.. ఏబీసీ న్యూస్‌, సీఎన్‌ఎన్‌, టైమ్‌ మ్యాగజైన్‌, వాషింగ్టన్‌ పోస్టులు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. 'అత్యంత అవినీతి, నిజాయతీ లేని' మీడియా కథనాలకు వీటిని అందజేస్తున్నామని ఆయన ట్వీటర్‌లో అన్నారు. 2016 అధ్యక్ష ఎన్నికల్ని ప్రభావితం చేసేలా రష్యాతో ట్రంప్‌ వర్గం కుమ్మక్కైందా? అన్న అంశంపై వెలువడ్డ కథనాలకే ఈ జాబితాలో ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. ఈ అవార్డుల్ని రిపబ్లికన్‌ పార్టీ నేషనల్‌ కమిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అవార్డుల్ని ప్రకటించగానే ఆ వైబ్‌సైట్‌ నిలిచిపోయింది. తన నాయకత్వంలోని అభివృద్ధి గురించి వాస్తవాల్ని మీడియా వెల్లడించడం లేదని ట్విటర్‌లో ట్రంప్‌ ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్‌ విజయం సాధించాక.. 'ఇక దేశ ఆర్థిక వ్యవస్థ ఎన్నటికీ కోలుకోదు' అని న్యూయార్క్‌టైమ్స్‌ పత్రిక వెలువరించిన కథనానికి మొదటి బహుమతి ప్రకటించారు.

సెలవు కోసం హత్యచేయబోయింది!

యూపీలో బాలిక నిర్వాకం

లక్నో: లక్నోలో బ్రైట్‌లాండ్‌ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న ఓ బాలిక(11) సెలవు దొరుకుతుందని అదే పాఠశాలలో చదువుతున్న రితిక్‌(6) అనే చిన్నారిపై జనవరి 16న హత్యాయత్నం చేసింది. పాఠశాల వాష్‌రూమ్‌లో పదునైన కత్తితో రితిక్‌ కడుపు, ఛాతీపై పొడిచింది. రక్తపుమడుగులో ఉన్న రితిక్‌ను పాఠశాల సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆధారాలను దాచిపెట్టినందుకు ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌ మానస్‌ను పోలీసులు గురువారం అరెస్ట్‌ చేశారు. బాలికను త్వరలో జువనైల్‌ బోర్డు ముందు హాజరుపరుస్తారు. 'నీపై దాడిచేసి గాయపరిస్తేనే పాఠశాలకు సెలవు ప్రకటిస్తారు' అని దాడికి ముందు బాలిక రితిక్‌తో వ్యాఖ్యానించిందన్నారు. 'ఓ అక్క నన్ను వాష్‌రూమ్‌కు తీసుకెళ్లి వైపర్‌తో కొట్టి ఆతర్వాత కత్తితో దాడిచేసింది' అని వాంగ్మూలం ఇచ్చినట్లు పేర్కొన్నారు. నిందితురాలి ఫొటోను చూడగానే తనపై దాడిచేసింది ఆ అమ్మాయేనని రితిక్‌ తెలిపాడన్నారు. బ్లూవేల్‌ తరహా ఆటకు బానిసయ్యే ఈ దారుణానికి పాల్పడినట్లు బాలిక తమ విచారణలో అంగీకరించిందని తెలిపారు. గతేడాది ఈ బాలిక రెండు సార్లు ఇంట్లో నుంచి పారిపోయిందనీ, ఓసారి రూ.లక్ష నగదును ఎత్తుకెళ్లిందని వెల్లడించారు. రితిక్‌ ఆరోగ్యపరిస్థితిని సీఎం యోగి ఆస్పత్రికి వెళ్లి తెల్సుకున్నారు.

ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికల నగారా



సాక్షి, న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రాలైన మేఘాలయ, నాగాలాండ్‌, త్రిపురల్లో శాసనసభ ఎన్నికలకు షెడ్యూల్‌ విడుదలైంది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌ ఏకే జోతి గురువారం ఢిల్లీలో ఈ షెడ్యూల్‌ను ప్రకటించారు. త్రిపురలో ఫిబ్రవరి 18న, మేఘాలయ, నాగాలాండ్‌ల్లో ఫిబ్రవరి 27న పోలింగ్‌ ఉంటుంది. మూడు రాష్ట్రాల ఫలితాలను మార్చి 3న వెల్లడిస్తారు. ఈ మూడింటిలో ప్రతి రాష్ట్రంలోనూ 60 శాసనసభ స్థానాలే ఉండటం విశేషం. ప్రస్తుతం మేఘాలయలో కాంగ్రెస్‌, త్రిపురలో సీపీఎం, నాగాలాండ్‌లో నాగా పీపుల్స్‌ ఫ్రంట్‌ అధికారంలో ఉన్నాయి. రానున్న ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లోనూ అధికారాన్ని చేజిక్కించుకోవాలని బీజేపీ ఉవ్విళ్లూరుతుండగా, మేఘాలయలో కాంగ్రెస్‌ అంతర్గత తిరుగుబాటుతో సతమతవుతోంది. అసోంలో ఓడిపోయిన కాంగ్రెస్‌, మేఘాలయలోనైనా అధికారాన్ని తిరిగి నెలబెట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. కేరళ తర్వాత దేశంలో వామపక్షాలు అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం త్రిపుర మాత్రమే. వరుసగా గత ఐదుసార్లు ఇక్కడ సీపీఎం గెలిచింది.

'ముందస్తు'తో చౌక ప్రయాణం



న్యూఢిల్లీ: ముందుగా టికెట్లు బుక్‌ చేసుకున్న రైలు ప్రయాణికులు విమాన ప్రయాణికుల మాదిరిగా రాయితీలు పొందే అవకాశాలున్నాయి. టికెట్‌ ధరల సమీక్షపై ఏర్పాటు చేసిన కమిటీ పలు కీలక సూచనలతో ఇటీవల తన నివేదికను రైల్వే బోర్డుకు సమర్పించింది. కమిటీ ప్రతిపాదించిన వాటిలో ముఖ్యమైనవి..

- నెలరోజుల ముందుగా సీట్లు బుక్‌ చేసుకునే వారికి అప్పటికి ఖాళీగా ఉన్న సీట్ల సంఖ్యను బట్టి టికెట్‌ ధరలో 50 శాతం నుంచి 20 శాతం వరకు రాయితీ.
- రైలు ప్రయాణానికి రెండు రోజుల నుంచి రెండు గంటల ముందు వరకు బుక్‌ చేసుకున్న టికెట్లపైనా స్లాట్‌ ప్రకారం తగ్గింపు.
- ప్రయాణానికి రెండు రోజుల ముందు నుంచి రెండు గంటల ముందు వరకు బుక్‌ చేసుకున్న వారికి రాయితీ.
- దివ్యాంగులు, గర్భిణులు, వృద్ధులకు మాత్రం ఎలాంటి అదనపు చార్జీ లేకుండానే లోయర్‌ బెర్తు.
- అర్ధరాత్రి నుంచి వేకువజాము 4 గంటల మధ్య, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటలకు మధ్య కాకుండా సౌకర్యంగా ఉండే ఉదయం వేళల్లో గమ్య స్థానానికి చేరుకునే రైలు ప్రయాణికులపై అదనపు చార్జీ.
- ప్రయాణికుల డిమాండ్‌, రైళ్లను బట్టి జోనల్‌ స్థాయిలో టికెట్‌ ధర నిర్ణయం.
- రద్దీ ఉండే పండుగ రోజులు, సెలవు దినాల్లో ఎక్కువ ఛార్జీలు. అంతగా రద్దీ ఉండని సమయాల్లో టికెట్‌ ధరపై తగ్గింపు.
- ప్రీమియం రైళ్లు, ప్యాంట్రీకార్‌ ఉండే రైళ్లలో టికెట్‌ ధర 50 శాతం వరకు పెంపు.

సద్దుమణగని 'సుప్రీం' సంక్షోభం

సీజేఐతో నలుగురు సీనియర్‌ జడ్జీల భేటీ



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై అసమ్మతి గళం వినిపించిన నలుగురు సీనియరు న్యాయమూర్తులు గురువారం సీజేఐ జస్టిస్‌ దీపక్‌ మిశ్రాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కీలక కేసుల కేటాయింపులతో పాటు ఇతర అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. గత నాలుగు రోజుల్లో సీజేఐ, నలుగురు సీనియర్‌ న్యాయమూర్తులు సమావేశం కావడం ఇది రెండోసారి. జనవరి 12 నాటి మీడియా సమావేశంలో సీజేఐ తీరుపై నలుగురు న్యాయమూర్తులు ఫిర్యాదు చేశాక.. తొలిసారి మంగళవారం వారు భేటీ అయిన సంగతి తెలిసిందే. సీజేఐ జస్టిస్‌ మిశ్రాతో నలుగురు న్యాయమూర్తులు జస్టిస్‌ జే చలమేశ్వర్‌, జస్టిస్‌ గొగొయ్‌, జస్టిస్‌ మదన్‌ లోకూర్‌, జస్టిస్‌ జోసఫ్‌లు దాదాపు 15 నిమిషాలు చర్చించినట్లు తెలుస్తోంది. నలుగురు జడ్జీలు లేవనెత్తిన డిమాండ్లు తనకు తెలుసని ఈ భేటీలో సీజేఐ చెప్పారని సుప్రీం వర్గాల సమాచారం. వారు లేవనెత్తిన అంశాలు, సలహాల్ని పరిగణనలోకి తీసుకుంటానని సీజేఐ హామీ ఇచ్చిన నేపథ్యంలో వివాద పరిష్కారంలో కొంత పురోగతి కనిపించిందని సుప్రీం వర్గాలు తెలిపాయి. తదుపరి చర్చల్లో జస్టిస్‌ ఏకే సిక్రి, జస్టిస్‌ ఎన్‌వీ రమణ, జస్టిస్‌ యుయు లలిత్‌, జస్టిస్‌ డీవై చంద్రచూడ్‌లు కూడా పాల్గొని సంక్షోభ పరిష్కారానికి ప్రయత్నించనున్నట్లు సమాచారం. మరోవైపు ముందుగా నిర్ణయించిన కార్యక్రమం ప్రకారం జస్టిస్‌ జే చలమేశ్వర్‌ చెన్నై బయల్దేరి వెళ్లారు.

మీడియాను అడ్డుకోవాలన్న పిటిషన్‌ తిరస్కరణ

జనవరి 12 నాటి ప్రెస్‌ కాన్ఫరెన్స్‌లో నలుగురు సీనియర్‌ న్యాయమూర్తుల లేవనెత్తి అంశాల్ని మీడియాలో ప్రచురించకుండా, చర్చించకుండా అడ్డుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకునేందుకు సుప్రీం కోర్టు తిరస్కరించింది. సుప్రీం రిజిస్ట్రార్‌ పిటిషన్‌ను పరిశీలించి.. విచారణ సమయం కేటాయించిన అనంతరం ఆ అంశాన్ని పరిశీలిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ దీపక్‌ మిశ్రా ధర్మాసనం పేర్కొంది.

'పద్మావత్‌'కు లైన్‌ క్లియర్‌

- సినిమా విడుదలపై నిషేధాన్ని ఎత్తివేసిన సుప్రీంకోర్టు
- మళ్లీ రాజుకున్న ఆందోళనలు



న్యూఢిల్లీ: వివాదాస్పద బాలీవుడ్‌ చిత్రం పద్మావత్‌ ఈ నెల 25న దేశవ్యాప్తంగా విడుదలవడానికి మార్గం సుగమమైంది. ఈ చిత్ర ప్రదర్శనపై నాలుగు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో(రాజస్తాన్‌, గుజరాత్‌, హరియాణా, మధ్యప్రదేశ్‌) విధించిన నిషేధాన్ని సుప్రీంకోర్టు ఎత్తివేసింది. ఇతర రాష్ట్రాలు పద్మావత్‌పై నిషేధం విధించకుండా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ మిశ్రా నేతృత్వంలోని బెంచ్‌ ఆదేశాలిచ్చింది. పద్మావత్‌ విడుదలైన తరువాత శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత రాష్ట్రాలదే అని స్పష్టం చేసింది. తదుపరి విచారణను మార్చికి వాయిదా వేసింది. చిత్ర నిర్మాతల తరఫున విచారణకు హాజరైన సీనియర్‌ న్యాయవాదులు హరీశ్‌ సాల్వే, ముకుల్‌ రోహత్గీ వాదిస్తూ చిత్రం విడుదలకు సెన్సార్‌ బోర్డు అనుమతి ఇచ్చిన తరువాత నిషేధం విధించే అధికారం రాష్ట్రాలకు లేదని అన్నారు. గుజరాత్‌, హరియాణా, రాజస్తాన్‌ ప్రభుత్వాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అదనపు సొలిసిటర్‌ జనరల్‌ తుషార్‌ మెహతా స్పందిస్తూ.. పద్మావత్‌ విడుదలైతే ఆ రాష్ట్రాల్లో శాంతి భద్రతల సమస్యలు నెలకొంటాయని నిఘా వర్గాల సమాచారం ఉందని, సెన్సార్‌ బోర్డు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోకుండానే విడుదలకు అనుమతిచ్చిందని తెలిపారు. రాష్ట్రాలు 'సూపర్‌ సెన్సార్‌ బోర్డు'లా వ్యవహరించరాదని రోహత్గీ అభిప్రాయపడ్డారు.

పద్మావత్‌ను ఆడనీయం: కర్ణిసేన

సుప్రీంకోర్టు ఉత్తర్వులు వెలువడిన వెంటనే రాజ్‌పుత్‌ కర్ణిసేన కార్యకర్తలు, హిందూ అతివాదులు విధ్వంసానికి దిగారు. బిహార్‌లోని ముజఫర్‌పూర్‌లో కర్ణిసేన కార్యకర్తలు ఓ సినిమా థియేటర్‌పై దాడికి పాల్పడి, పద్మావత్‌ పోస్టర్లను చించేశారని పోలీసులు తెలిపారు. పద్మావత్‌ ప్రదర్శనను మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న రాజ్‌పుత్‌ వర్గం కర్ణిసేన ఈ చిత్ర విడుదలను అడ్డుకుంటామని పునరుద్ఘాటించింది. దేశవ్యాప్తంగా ఈ చిత్ర ప్రదర్శనను అడ్డుకునేలా సహకరించాలని సంస్థ నాయకుడు స్వచ్ఛంద సంస్థలను కోరారు.



సింహమంటే అడవంతటికీ భయం..
మరి సింహానికి ఎవరంటే భయం???
దానికి జవాబు ఈ చిత్రమే!!

టాంజానియాలోని సెరెంగిటి నేషనల్ పార్కులో తీసినదీ చిత్రం.. దీన్ని కెనడాకు చెందిన వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ జార్జ్ హార్ట్ తీశారు. 'ఇలాంటి అరుదైన చిత్రాన్ని క్లిక్‌మనిపించడం నా అదృష్టమే. ఈ జంటను నేను ముందు నుంచీ గమనిస్తూ ఉన్నాను. ఏదో విషయంపై సింహం సివంగిపై గర్జించింది. అంతే.. వెంటనే సివంగి ఇదిగో ఇలా రివర్స్ అటాక్ ఇచ్చింది. దీంతో ఆ తీవ్రతను తట్టుకోలేక చివరికి సింహం తన ముఖాన్ని చేతుల్లో దాచుకోవాల్సి వచ్చింది. సింహం అడవికి రాజు అయిండొచ్చు. కానీ ఇంట్లో బాస్ ఎవరన్నది ఈ ఫొటో తెలుపుతోంది. ఈ చిత్రాన్ని చూసినవారి ముఖాలపై నవ్వులే నవ్వులు'అని జార్జ్ చెప్పారు.

ఎయిర్‌పోర్టులో రూ.1.5 కోట్ల విదేశీ కరెన్సీ పట్టివేత



హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడి వద్ద భారీ మొత్తంలో విదేశీ కరెన్సీ పట్టుబడింది. గురువారం నగరానికి చెందిన వ్యక్తి దుబాయ్ వెళ్లేందుకు చెక్‌ఇన్ పూర్తి చేసుకుని విమానాశ్రయంలో వేచి ఉన్నాడు. ముందస్తు సమాచారం అందుకున్న డీఆర్ఐ (డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు కస్టమ్స్ అధికారులను అప్రమత్తం చేయడంతో అతడి లగేజీని తనిఖీ చేశారు. దీంతో అతడి వద్ద రూ.1.5 కోట్ల విలువైన ఒమన్, సౌదీ దేశాలకు చెందిన కరెన్సీ లభించింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వచ్చే నెల 1లోగా
డీఎడ్ ఫీజు

ఆలస్య రుసుముతో 8వ తేదీ వరకు

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది మే లో నిర్వహించే డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎడ్) మొదటి సంవత్సరం పరీక్షలకు ఫిబ్రవరి 1లోగా ఫీజు చెల్లించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం ఓ ప్రకటనలో తెలిపింది. రూ. 50 ఆలస్య రుసుముతో వచ్చే నెల 8 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొంది. 4 అంతకంటే ఎక్కువ పేపర్లకు రూ.150, 3 సబ్జెక్టులకు రూ.140, 2 సబ్జెక్టులకు రూ.120, ఒక సబ్జెక్టుకు రూ.100 ఫీజుగా నిర్ణయించినట్లు వెల్లడించింది.

ఇన్‌చార్జీలతో ఇంకెంత కాలం?

- వైద్య శాఖలో గాడితప్పిన పాలన.. కుంటుపడుతున్న సేవలు
- కుటుంబ సంక్షేమ కమిషనర్ సహా 4 కీలకపోస్టులకూ ఒక్కరే ఇన్‌చార్జి
- ఆరోగ్యశ్రీ ట్రస్టు, యోగాధ్యయన పరిషత్ తీరూ అదే



సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య శాఖ కీలక పోస్టుల్లో పూర్తిస్థాయి అధికారుల్లేక పాలన కుంటుపడింది. ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారిసహా ఇతర ముఖ్య పోస్టుల్లోనూ ఒక్కరే ఇన్‌చార్జిగా ఉన్నారు. దీంతో వైద్య సేవల నిర్వహణపై పూర్తిస్థాయి పర్యవేక్షణ కొరవడుతోంది. వైద్య, ఆరోగ్య పథకాలు, కార్యక్రమాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణను ప్రభుత్వం ఇటీవల భూపరిపాలన డైరెక్టర్‌గా బదిలీ చేసింది. దీంతో ఆ స్థానంలో పూర్తిస్థాయి అధికారిని ఇంకా నియమించలేదు. కరుణకే ఈ బాధ్యతను అదనంగా అప్పగించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని వైద్యసేవలను పర్యవేక్షించే వైద్య విధాన పరిషత్‌కు కూడా పూర్తిస్థాయి అధికారి లేరు. ఇప్పటి దాకా కరుణ అదనంగా ఈ బాధ్యతలు నిర్వర్తించారు. జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) తెలంగాణ విభాగం మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తిస్థాయి అధికారి లేరు. ఈ బాధ్యతలను కూడా కరుణ ఇప్పటి దాకా అదనంగా నిర్వర్తించారు. వైద్య, ఆరోగ్య శాఖలోని ఉద్యోగులకు, సిబ్బందికి ఎప్పటికప్పుడు శిక్షణ ప్రక్రియ నిర్వహించే భారత కుటుంబ సంక్షేమ శిక్షణ సంస్థ డైరెక్టర్‌గానూ కరుణ వ్యవహరించారు.

- రాష్ట్రంలోని అన్ని వర్గాలకు వైద్య సేవలను అందించే కీలకమైన ఆరోగ్యశ్రీ వైద్య సహాయ ట్రస్టుకు పూర్తిస్థాయి ఉన్నతాధికారి లేరు. నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) డైరెక్టర్ కె.మనోహర్‌కు ఆరోగ్యశ్రీ సీఈవో పోస్టును అదనంగా కేటాయించారు. ఈ రెండూ పెద్ద సంస్థలే కావడంతో పర్యవేక్షణ కొరవడి వాటిల్లో పరిపాలన గాడితప్పుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
- వైద్య, ఆరోగ్య శాఖ విధాన నిర్ణయాల్లో కీలకమైన అదనపు కార్యదర్శి పోస్టులోనూ ఇన్‌చార్జే ఉన్నారు. తెలంగాణ ఔషధ, సుగంధ మొక్కల సంస్థ సీఈవో సోనిబాలదేవికి అదనపు కార్యదర్శి బాధ్యతను అదనంగా కేటాయించారు.
- యోగాధ్యయన పరిషత్ ఉన్నతాధికారి పోస్టు(కార్యదర్శి)లోనూ మరో విభాగం ఉన్నతాధికారి అదనంగా బాధ్యతలు చూస్తున్నారు. ఆయుర్వేద, యోగా, ప్రాకృతిక, యునానీ, హోమియోపతి(ఆయుష్) కమిషనర్ డాక్టర్ ఎ.రాజేందర్‌రెడ్డికి యోగాధ్యయన పరిషత్ కార్యదర్శి పోస్టును అదనంగా కేటాయించారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District. Editor: V. Murali, Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.